


# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్



సంచిక: 10 & 11 తెలుగు & ఇంగ్లీష్ డిసెంబర్ 2015 విరాళం: 20/–ISSN 2278-3423

# మీడియా


- సంపాదకీయం

**మీడియా ఆర్థిక రాజకీయాలు**

- తెలుగు ప్రాంతంలో టి.వి వార్తా ప్రసార పరిశ్రమ : దాని రాజకీయ, ఆర్థిక నేపథ్యం *పంతుకాల శ్రీనివాస్*
- తెలుగు ప్రసార మాధ్యమాల్లో స్ట్రింగర్లు *పి.పూర్ణచందర్*
- నెట్ తటస్థతకై పోరాటం : ఆర్థిక, రాజకీయ విధానపరమైన అంశాలు *కె.జి.సుజిత్*
- ప్రపంచీకరణ గురించిన వ్యాసాల సంపుటి *లెఖనర్, బోలి*
- తెలుగు మీడియాపై కార్పొరేట్ యాజమాన్యాల అడ్డగోలు ఆధిపత్యం *పంతుకాల శ్రీనివాస్*

**మీడియా దృష్టిలో ఇస్లాం-ముస్లింలు**

- పుస్తక సమీక్ష : ఎడ్వర్డ్ సయీద్, *కవరింగ్ ఇస్లాం* (లండన్ : వింటేజ్ బుక్స్ 1997) *అయేషా ఫరూకీ*
- పరమత ద్వేషంలో జాగ్రత్త : వాక్ స్వేచ్ఛ, జాపిరో కార్టూన్లు *మహమూద్ మమ్‌దాని*
- జాతి సమస్య, మారణహోమానికి పాల్పడే హంతకులు, ప్రసార మాధ్యమాలు *ఫరియా అతర్*
- ఇస్లామో ఫోబియో ఇస్లామ్ మరియు జిహాద్ నుండి *ఏ జి నూరాని*
- తెలుగు ప్రసార మాధ్యమాలు : ముస్లింల సమస్యలు *మధుమితా సిన్హా, ఎమ్.ఏ.మోయిద్*
- హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ పత్రిక *మహమ్మద్ అష్రఫ్*

**కనిపించని దళితులు**

- కనిపిం(చని)చే దళితులు : కులహింసా స్థావరమైన పాత్రికేయ రంగం *రంజిత్ తంకప్పన్*
- ఒక దళిత పాత్రికేయుని అన్వేషణలో *బి.ఎన్.ఉనియాల్*
- అణగదొక్కబడిన భారతీయుడు *కాన్షీరాం*
- విషపుకాటు-అంటరాని ప్రజలు *రవికుమార్*
- కొప్పుల నాగరాజు - అంటకుండా చేద్దామంటే ఐకనయ్యింది *గోగు శ్యామల*
- నల్ల జాతీయులను చేర్చుకున్న అమెరికన్ మీడియా; దళితులను వెలివేసిన భారతీయ మీడియా *చంద్రభాన్ ప్రసాద్*







**ప్రింటింగ్:** రౌష్ని గ్రాఫిక్స్, ఉప్పల్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు-13. సెల్: 9246172133


**మహిళా పోరాటం**

- సారావ్యతిరేక ఉద్యమం, మద్య నిషేధం: 'ఈనాడు' పత్రిక వ్యూహాత్మక సమర్థన, మౌనం *ఉమ భృగుబండ*
- మహిళా ఉద్యోగినులు సమ్మెలో కూర్చుంటే.... సురేష్ పి థామస్
- ఒక పాత్రికేయురాలి కష్ట సుఖాలు *ఆర్ అఖిలేశ్వరి*

**సవాల్ విసురుతున్న గొంతులు**

- మసబారుతున్న స్వప్నం : భారతదేశంలో అభివృద్ధిపరమైన సమాచార స్రవంతి, కమ్యూనిటి రేడియోలు *వినోద్ పావరాల*
- నలుపు పత్రిక: ప్రయాణం *కె.సజయ*
- రౌండ్ టేబుల్ ఇండియా: కుఫిర్‌తో ఇంటర్వ్యూ *పంతుకాల శ్రీనివాస్, పృథ్వీ రాజ్ దుడ్డు*

**మీడియా మరియు మార్పు జ్ఞాపకాలు : భద్రపరచటం**

- ఆర్కైవ్ మ్యూజింగ్స్ కుష్ *బధ్వార్*
- అస్తిత్వ పరిరక్షణ: ఎవరికి ఎవరు? *శుభాంగి సింగ్*
- సమకాలీన మీడియా సినిమా దృక్కోణం: రెండు డాక్యుమెంటరీ అనుభవాలు కుష్ *బధ్వార్*


*ప్రత్యేక సంపాదకులు:* *పంతుకాల శ్రీనివాస్, రంజిత్ తంకప్పన్*

*సంపాదకులు:* *ఏ.సునీత, ఎం.ఏ.మోయిద్, ఆర్.శ్రీవత్సన్*

*అడ్వయిజరీ బోర్డ్ :* *అయేషా ఫరూకీ, అస్మా రషీద్, గీతా రామస్వామి, కనీజ్ ఫాతిమా, కె.లలిత, మధుమితా సిన్హా, రమా మెల్కొటే, కె.సజయ, శీలా ప్రసాద్, స్వాతీ మార్గరెట్, గోగు శ్యామల, బి.శ్యామసుందరి, సూశీ థారు, డి.వసంత, వీణా శత్రుఘ్న, ఎన్.వసుధ, ఉమ భృగుబండ*

*ప్రొడక్షన్ :* *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

*ప్రచురణ సంస్థ :* **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/2/A, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి



# సంపాదకీయం

**వార్తా ప్రసార** మాధ్యమాలు సమాజంలో ముఖ్యమైన భాగం కాబట్టి వాటి సామాజిక బాధ్యత మిగిలిన వ్యవస్థలతో పోల్చుకుంటే ఎక్కువే. భారతీయ ప్రసార మాధ్యమాలు కీలక దశకి చేరుకున్న పరిస్థితుల్లో, పౌర సమాజం పాత్రికేయ రంగ నిబద్ధత, ప్రాతినిధ్యం, మీడియా యాజమాన్యరీతులు, క్రమబద్ధీకరణ, స్వయం నియంత్రణ వంటి విషయాల గురించి విమర్శనాత్మక ప్రశ్నలని లేవనెత్తుతోంది. తమ జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ప్రసార మాధ్యమాలతో దైనందిన సంఘర్షణ గురించి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అభిప్రాయం ఉంటుంది. సంపాదక వర్గాల్లో దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, మతపరమైన మైనారిటీల భాగస్వామ్యం, సామాజిక విషయాలకి వార్తా పత్రికల్లో తగ్గిపోతున్న పాత్ర, ఆధిపత్య కులాల, వర్గాల యాజమాన్యంలో ఉండటం వల్ల చేసే కార్యక్రమాల్లో కనిపించని సామాజిక వైవిధ్యం గురించి ఉద్వేగభరిత చర్చలు అంతటా నడుస్తున్నాయి. అయితే భారతీయ ప్రసార మాధ్యమాల సంస్కృతి, వాటి రాజకీయాలు, ఆర్థిక అంశాలని అర్థం చేసుకోవటానికి వీలుపడే రచనలని కలిపి ఒకే దగ్గరకు తీసుకువచ్చే ప్రయత్నాలు తక్కువగానే జరిగాయని చెప్పుకోవాలి.

తెలుగు ప్రాంతాల స్థానిక రాజకీయాలు, చరిత్రల నేపథ్యంలో సమకాలీన భారత ప్రసార మాధ్యమాల పద్ధతులపై దృష్టిసారిస్తూ *బ్రాడ్‌షీట్* ఈ ప్రత్యేక సంచికని తీసుకురావటం చాలా సంతోషదాయకమైన విషయం. భారతీయ మీడియాని రాజకీయ ఆర్థిక దృక్కోణం నుండి, ప్రాతినిధ్య రాజకీయాల దృష్టి కోణం నుండి, పౌర భాగస్వామ్యంతో కూడిన సమాచార పద్ధతుల కోణం నుండి, కుల, జండర్ అసమానతల దృక్కోణం నుండి, మీడియా అనుభవాలకు సంబంధించిన ఇతర కోణాల నుండి పరిశీలించే వ్యాసాలను ఈ బ్రాడ్‌షీట్‌లో ఒక దగ్గరికి తీసుకొచ్చే ప్రయత్నం చేసాం. మామూలుగా వినిపించని గొంతులకు, అభివృద్ధికి సంబంధించిన అంశాలకు తగిన స్థానం ఇచ్చే రీతిలో దీన్ని రూపొందించటం జరిగింది.

ప్రసార మాధ్యమాల నిర్మాణం వేగంగా, పలు విధాలుగా మారుతోంది. పాత్రికేయ రంగమిప్పుడు ఒక ధర్మంగా కాక, వృత్తిగా మారిపోయి, దాని లక్ష్యాలు కూడా దానికి అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి. ప్రసార మాధ్యమ సంస్థలన్నీ ఇప్పుడు కార్పొరేటీకరణకు గురయ్యాయి. అంతేకాక యాజమాన్యాలు కూడా మారాయి. ముఖ్యంగా విదేశీ పెట్టుబడుల వాటా 25% నుండి 49% కి, నెమ్మదిగా 75% కి చేరుకున్నాయి. గ్లోబల్ సమాచార యంత్రాంగాల ప్రవేశం భారతీయ ప్రసార మాధ్యమాలలో ఇప్పుడు స్పష్టంగా కనపడుతోంది. ప్రసార మాధ్యమాలలో గుత్తాధిపత్యం, అడ్డగోలు మీడియా యాజమాన్యం రెండూ సామాన్య పౌరుల సమాచార హక్కుని, విద్యావకాశాలని, ప్రజాభిప్రాయ ఆపేక్షని తీవ్రంగా భంగపరుస్తున్నాయి.

నయా ఉదారవాద ప్రపంచాన్ని పూర్తిగా ఆవహించిన ఇస్లామో ఫోబియో మన సమాచార ప్రపంచంలో అదే తీవ్రతతో దర్శనమిస్తోంది, పునరుద్ఘాటింప బడుతోంది. బ్రాడ్‌షీట్‌లో 'ఇస్లాం, ముస్లింలు, మీడియా' భాగం గ్లోబల్ సమాచార వ్యవస్థలో భాగమయిపోయిన ఈ విద్వేష రాజకీయాలని చర్చిస్తూ, పరిగణనలోనికి రాని ఇతర పాత్రికేయ సంస్కృతుల చరిత్రలపై దృష్టి సారిస్తుంది. హైదరాబాదు రాజ్యంలో ఉర్దూ పత్రికల చరిత్ర, వాటి పద్ధతులు ఇతర సంస్కృతులని స్వీకరించిన తీరు వ్యవస్థీకృత పాత్రికేయ రంగం ఇస్లాంకి సంబంధించి తీసుకోని దారులని ఎత్తి చూపుతుంది.

ప్రసార మాధ్యమాలలో దళితుల ప్రాతినిధ్య చరిత్ర దీర్ఘకాల వెలివేత చరిత్ర. జాతీయవాద, కార్పొరేట్ ప్రసార మాధ్యమాలు దళితులని వెలికి గురిచేయటమే కాక, దళితుల గురించి రాసే పద్ధతిలోనే వారిని అనేక అవమానాలకు గురి చేస్తాయి. దళిత జర్నలిస్టు నాగరాజు విషాద మరణం వార్తా పత్రికల యాజమాన్యాలు, పాత్రికేయ రంగ నిర్లక్ష్యాన్ని బహిర్గతపరచటమే కాక, ఉదార ప్రసార మాధ్యమాల అంతర్లీన కుల నిర్మాణాలని, వాటి హింసని గురించి మనం ఆలోచించే అవసరాన్ని ముందుంచింది. దళితులు, ప్రసార మాధ్యమాల గురించి ఇదివరకే వచ్చిన వ్యాసాలని ఇప్పటి పాఠకులకి బ్రాడ్‌షీట్‌లో అందించటమే కాక, సమకాలీన ప్రసార మాధ్యమాల గురించిన వ్యాసాలని కూడా పొందుపరుస్తుంది.

ఈ సంచిక ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాల ధోరణులని, వాటి భావజాలాలను, పద్ధతులను వ్యతిరేకించిన స్వరాలతో ఇంటర్వ్యూలు, వారి గురించిన వ్యాసాలని కూడా అందిస్తుంది. 'నలుపు' పత్రిక నడిపిన బృందం సభ్యులు బొజ్జా తారకంతోనూ, 'రౌండ్ టేబుల్ ఇండియా' వెబ్‌సైట్ వ్యవస్థాపకులతో ఒకరైన కుఫిర్‌తో ఇంటర్వ్యూలు ఇటువంటి విరుద్ధ సంస్కృతి రాజకీయాల అరుదైన పార్శ్వాలని మనకు చూపిస్తాయి. మా ఉద్దేశం ఈ ప్రయత్నాలని కొనియాడటం అయినప్పటికీ, అవి భవిష్యత్తులో కొత్త ప్రయత్నాలకి కూడా స్ఫూర్తినిస్తాయని మా ఆశ.

బ్రాడ్‌షీట్‌లో కాన్షీరామ్ మొదటి సంపాదకీయం 'అణగారిన భారతీయుడు', ఎడ్వర్డ్ సయీద్ 'కవరింగ్ ఇస్లాం'లోని భాగాల వంటి పాత వ్యాసాలు ఉన్నప్పటికీ అటువంటి 'పాత వ్యాసాలు' లేదా ఆర్కైవ్ గురించి లోతుగా ఆలోచించాల్సిన ఆవశ్యకతని ఈ సంచిక ముందుంచుతుంది. ఒక వ్యాసం ఆర్కైవ్ సిద్ధాంతాల గురించిన పర్యాలోచిస్తే, రెండో వ్యాసం వరంగల్‌లో ఆర్కైవ్ నిర్మాణ ప్రయత్నాల గురించి పునరాలోచిస్తుంది. ప్రత్యేక సంఘటనలకు, జ్ఞాపకాలకు సంబంధించిన ఆర్కైవ్ ఆధారపడి తీసే సినిమాలు ఎదుర్కొనే సమస్యలకు సంబంధించిన ఒక ఇంటర్వ్యూ కూడా బ్రాడ్‌షీట్‌లోని ఈ భాగంలో చదవచ్చు.

ఇంకో పక్క ప్రసార మాధ్యమాలను భవిష్యత్తులోకి బలంగా లాక్కెళ్తున్న వెబ్ సైట్లు, బ్లాగ్‌లు, సోషల్ మీడియా, నెట్ తటస్థతకి సంబంధించిన వ్యాసాలని కూడా చదవచ్చు.

ఈ బ్రాడ్‌షీట్ కొత్త రూపంలో దర్శన మివ్వటానికి ప్రధాన కారకులు – కుష్ బధ్వార్ మరియు శుభాంగి సింగ్. వాళ్ళు ప్రత్యేక అంశాలకి సంబంధించిన చిత్రాలను వెయ్యటమే కాక బ్రాడ్‌షీట్ మధ్య పేజీలో వాటినన్నిటినీ కలిపి ఒక కొల్లాజ్ (వివిధ రకాల చిత్రాల కూర్పు) కూడా రూపొందించారు.

ఈ సంచిక మీడియా వృత్తిలో ఉన్నవారికి, నిపుణులకి, విద్యార్థులకి ఆసక్తిదాయకంగా, విజ్ఞానదాయకంగా, విమర్శనాత్మక దృష్టికోణాలను అందించేదిగా ఉంటుందని మా అభిప్రాయం.

**అనువాదం: ఏ.సునీత**

# తెలుగు ప్రాంతంలో టి.వి. వార్తా ప్రసార పరిశ్రమ : దాని రాజకీయ, ఆర్థిక నేపథ్యం

■ పంతుకాల శ్రీనివాస్

ఈ నోట్ ఆంధ్రప్రదేశ్‌లో మాస్ మీడియా ఆవిర్భావంలోని చారిత్రక మరియు సాంస్కృతిక నేపథ్యాన్ని వివరిస్తుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో హరిత విప్లవం యొక్క మూలాలు, వ్యవసాయం పరిశ్రమగా రూపొందటం; సినిమా పరిశ్రమ అభివృద్ధి, ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం, సామాజిక ఉద్యమాలు మరియు రాజకీయాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి శ్రేణులకు ప్రాధాన్యం పెరగటం, సెజ్‌లపై రాజకీయ నిర్ణయాలు, రియల్ ఎస్టేట్ మరియు అభివృద్ధి పేరుతో నయా పెట్టుబడిదారులకు సహాయపడటం గురించి చర్చిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ శాటిలైట్ టెలివిజన్ న్యూస్ చానెళ్ళ చరిత్ర 24 గంటల టివి వార్తలు మరియు సాంస్కృతిక మార్పుల ప్రభావం గురించి కూడా ఈ పేపర్ చర్చిస్తుంది.

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలు ఎక్కువగా ఉండటం వల్ల టెలివిజన్ 1975 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చింది. ఇది దేశంలోని ఆరు రాష్ట్రాల్లో శాటిలైట్ సూచనా టెలివిజన్ ప్రయోగాలు (సైట్) లో భాగంగా ప్రారంభించబడింది. విద్య మరియు అభివృద్ధి కోసం ఉపగ్రహ సాంకేతికత ఉపయోగం సమాజాన్ని మార్చి వెయ్యగలదో లేదో చూడటానికి ఈ ప్రయోగం ఉద్దేశించబడింది. ఈ ప్రయోగం,1 ఆగస్టు 1975 నుండి 31 జూలై 1976 వరకు కొనసాగింది. తర్వాత మరొక పది సంవత్సరాల పాటు హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం అభివృద్ధి మరియు విద్య కోసం కార్యక్రమాలు రూపొందించే బ్రాడ్‌కాస్టర్‌గా కొనసాగింది. అదే సమయంలో (80లో) స్పాన్సర్డ్ సీరియల్స్ దూరదర్శన్లో అంగీకరించడం మొదలైంది. 1986 నాటికి, సైట్ కార్యక్రమాలు లేదా ఢిల్లీ నుండి జాతీయ కార్యక్రమాలను ప్రసారం చేయడానికి బదులు రాష్ట్రంలోని ట్రాన్స్‌మీటర్ల ద్వారా హైదరాబాద్ దూరదర్శన్ తెలుగులో రూపొందించిన సాధారణ వినోద వార్తా కార్యక్రమాలు ప్రసారం చేయటానికి ఏర్పాట్లు చేశారు.

కేంద్ర ప్రభుత్వం వార్తా ప్రసారాలపై రాజ్యాంగ గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. ఆ అధికరణను ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వం 1990 వరకు ప్రైవేటు ప్రసారాలను అనుమతించలేదు. 1991లో భారతదేశంలో సరళీకృత ఆర్థిక విధానం ప్రారంభమైంది. ప్రభుత్వం సరళీకరణ పట్ల తన నిబద్ధతను రుజువు చేసుకోవడం కోసం 'ప్రసార విధానాన్ని' ఒక ఉదాహరణగా చూపదలుచుకుంది. మార్క్సిస్టు దృక్పథం నుండి చూస్తే జాతీయ మరియు ప్రాంతీయ నయా పెట్టుబడిదారుల బలం పెరిగినట్లు కనిపిస్తుంది. 1980 నుండి ప్రాంతీయ పార్టీలు వెలుగులోకి రావడం, వాటి ప్రభావం జాతీయ రాజకీయాలపై పడటం, అవి జాతీయ రాజకీయ పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడటం జరిగింది. 1970లలో భారత దేశంలో హరిత విప్లవం, 1980లలో ప్రపంచీకరణ మరియు సాంకేతిక అభివృద్ధి మొదలైంది. ఈ సందర్భంలో వ్యవసాయం నుండి వచ్చే మిగులు వ్యవసాయ వ్యాపారాన్ని బలోపేతం చేసి, సినిమా పరిశ్రమను కూడా బలోపేతం చేసింది. 80లలో ఉత్పత్తి మిగులు మరియు ప్రపంచీకరణలు మాస్ మీడియా పరిశ్రమ కోసం కొత్త దారులను తెరిచాయి. మీడియా రంగం 1990లలో భారీ మార్పులకు లోనయ్యింది. దాని తరువాత ప్రైవేటు మరియు ప్రభుత్వ మీడియాగా విభజింపబడింది.

**స్వాతంత్ర్యం తర్వాత కుల సంస్కృతి, వ్యవసాయం, మీడియా**

1950లలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రబలి ఉండిన ఆదర్శాలకు విరుద్ధంగా తెలుగు సమాజం శక్తివంతమైన కుల సమూహాల ఆధిపత్యానికి లోనైంది. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా (1950) విశ్లేషించినట్లు తెలుగు సమాజం బ్రాహ్మణులు, క్షత్రియుల రాజకీయ ప్రాబల్యం నుండి రెడ్లు, కమ్మ కులాల ఆధిపత్యంలోకి ప్రయాణించింది. అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలు సెలిగ్ హారిసన్ మరియు కెరోలిన్ ఎమ్.ఎలియట్ విశ్లేషణ ప్రకారం 1950, 1960లలో తెలుగు సమాజంలో కులం ఒక ప్రబలమైన శక్తి, అన్ని రాజకీయ పార్టీల బలానికి భూమిక. తెలంగాణా, ఎ.పిలలో యాభై సంవత్సరాల తర్వాత కూడా ఇవే కులాలు మరియు కుల సమూహాలు (రెడ్డి, కమ్మ, వెలమ, కాపు) రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక రంగాలలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

రెడ్డి కమ్యూనిటీలో మెజారిటీ ప్రజలు రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలకు చెందినవారు. ఈ ప్రాంతాలలో రాతి నేల మరియు నీటిపారుదల తక్కువగా ఉండటంవల్ల వర్షాధారిత వ్యవసాయమే ప్రధానంగా జరిగింది. వారు హరిత విప్లవం నుండి లాభం పొందలేదు కానీ వందల ఎకరాల వ్యవసాయ భూములు కలిగిన భూస్వాములు కావడంతో కమ్మ కులస్తులు రాజకీయ అధికారంలోకి రాకముందు వారే ఆంధ్రప్రదేశ్‌ని పాలించారు. ఇటు వెలమలు తెలంగాణలో, అటు కాపులు కోస్తా తీర ప్రాంతంలో భూస్వాములే అయినప్పటికీ కూడా రాజకీయాల్లో ఇటీవల వరకు వారికీ వాటా లేదు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వెలమలు మరియు ప్రజారాజ్యం పార్టీ సందర్భంలో కాపులు రాజకీయాలలోకి ప్రవేశించారు. అయితే, రాజకీయ అధికారాన్ని చేపట్టడంలో విఫలమవడంతో వారు కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు.

సమాజం మరియు మీడియా యొక్క 'కుల పరిమితులు' అర్థం చేసుకోవడానికి ఎ.పి రాజకీయ చిత్రపటంలో కుల సమూహాలు ఆడే 'నెంబర్ గేమ్'ను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. రెడ్డి, కమ్మ, కాపు, మాదిగ మరియు మాల కమ్యూనిటీలు అసెంబ్లీలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

కె.చంద్రశేఖరరావు 2001లో (తె.రా.స) తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవ కాంక్షను చాటడానికి మరియు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటును డిమాండ్ చేయడానికి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రారంభించారు. ఇది రెండవ దశ తెలంగాణ ఉద్యమాన్ని (మొదటిదశ 1969లో జరిగింది) ప్రారంభించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజకీయ శక్తి ద్వారా తెలంగాణాను భారత యూనియన్లో ఒక ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించేలా చేసింది. ఈ ప్రక్రియలో టిఆర్ఎస్ తెలంగాణ ప్రజలను సమీకరించి 2004, 2009 మరియు 2014 ఎన్నికలలో పోటీ చేసింది. వారు 2014లో ప్రత్యేక రాష్ట్ర లక్ష్యాన్ని సాధించిన తర్వాత సాంస్కృతిక పరిశ్రమలోకి ప్రవేశించారు. రాష్ట్ర జనాభాలో 2 శాతం జనాభా ఉన్న వెలమలు టిఆర్ఎస్ రాజకీయ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ పాలన, మరియు తెలంగాణ వార్తల ఛానెల్‌తో తమ కమ్యూనిటీ నాయకత్వాన్నే ప్రోత్సహించడాన్ని గమనించడం అవసరం.

ప్రస్తుతం ప్రధాన స్రవంతి మీడియా మరియు చిత్ర పరిశ్రమ ఎక్కువగా బ్రాహ్మణులు, వైశ్యులు, కమ్మ మరియు రెడ్ల చేతిలో ఉన్నాయి. వీరు సాంస్కృతిక పరిశ్రమలో ఒక భాగం.

**మీడియా పరిశ్రమ పెరుగుదల, పరిణామం**

ఈ సాంఘిక ఆర్థిక అభివృద్ధి వల్ల 1980–90లో కమ్యూనికేషన్ ప్రక్రియ ప్రత్యక్ష సమాచార ప్రసారం నుండి కేంద్రీకృత సమాచార ప్రసార ప్రక్రియగా మారింది. వార్తలు ప్రభుత్వ దృష్టి కోణం నుండి కాక సామూహిక (మాస్) ధోరణిని సంతరించుకున్నాయి.

సామూహిక రాజకీయాలు, సమాజం యొక్క ఆవిర్భావం జరిగింది. ప్రపంచీకరణ వల్ల ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా పరిస్థితులు మారడం వల్ల ప్రైవేట్ పెట్టుబడితో మీడియా పరిశ్రమలను ప్రారంభించారు. దీనితో దూరదర్శన్ ఛానళ్ళు మరియు రేడియో స్టేషన్లను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. రెండవది, యాజమాన్యపరంగా, టెలివిజన్ మరియు ప్రింట్ మీడియా సాధారణ రిపోర్టింగ్ నుంచి ప్రభుత్వంతో లాబీయింగ్ చేసే స్థాయికి ఎదిగింది. మీడియా యజమానులు అధికార పార్టీలను, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిగా కాకుండా (మనందరం ఫోర్త్ ఎస్టేట్ అని పిలుచుకొనే వారం) అధికార పార్టీలకు వత్తాసు పలికే వారిగా మారిపోయారు.

పారిశ్రామిక అవసరాల కొరకు మరియు ఇతర అవసరాల కొరకు వార్తాపత్రికలు నడపడం ఒక ఆవశ్యకత. మీడియా అనేది ఎప్పుడూ కూడా ప్రభుత్వాన్ని లాబీయింగ్ ద్వారా ప్రభావితం చేసి ప్రభుత్వేతర పరిశ్రమలను కాపాడటానికి, ప్రోత్సహించడానికి మరియు వారి ప్రయోజనాలను కాపాడడానికి ఒక పరికరం. ఎ.పి.లో ఈనాడు పత్రికకూ తెలుగుదేశం పార్టీకి మధ్య ఉన్న సంబంధాలే ఇటువంటి రాజకీయాలకు ఉదాహరణ. కానీ 'ఈనాడు' కేవలం ప్రభుత్వానికి దగ్గరగా ఉండటమే కాక పార్టీనీ నియంత్రించడం ప్రారంభించింది. 'ఈనాడు' యాజమాన్యం టిడిపి ఆవిర్భావంలో ఒక కీలక పాత్ర పోషించింది. ఈనాడు టిడిపి రాజకీయాలను నియంత్రించే ఒక స్పష్టమైన ఆలోచనతో నడిచింది.

80-90లలో పరిశ్రమగా మొదలయిన మీడియా కొన్ని సంస్థలు, వాటి ఉత్పత్తులు లేదా వారి ప్రయోజనాలను ప్రోత్సహించే సాధనంగా, ముఖ్యంగా మరింత లాభాల్ని ఉత్పత్తి చేసే యంత్రంగా మారింది. 90లలో ప్రైవేటు ఛానళ్లు రాజకీయాలకు దగ్గరగా ఉండి లాబీయింగ్ చేయడం ద్వారా లాభాలను గడించే ఒక పరిశ్రమగా అవతరించాయి. రాను రాను మీడియా మరింత అభివృద్ధి చెంది, పారిశ్రామిక రంగంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్నది. సాంస్కృతిక రూపాలు వినోదం కూడా ఒక పరిశ్రమగా మారాయి. 80లు మరియు 90లలో సంస్కృతిని వ్యాపార సరుకుగా మార్చే క్రమం ప్రారంభమయింది.

**సామాజిక ఉద్యమాలు; రాజకీయాలలో ఎస్సీ, ఎస్టీ, బిసి స్వరాలు**

సారా వ్యతిరేక ఉద్యమానికి 'ఈనాడు' మద్దతు ఇచ్చింది. ఈనాడు అధినేత రామోజీరావు రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి మద్దతు నిచ్చారు. మొదటిసారి సారా వ్యతిరేక ఉద్యమం మీడియా అధినేతలకు మీడియా సంస్థల యొక్క మనుగడ ఎలా సాగించాలి అనే దానిపై పాఠాలు నేర్పింది. ఈ పరిస్థితులను నయా పెట్టుబడిదారులు (మద్యం సిండికేట్ నిర్వహణ, రాజకీయ పార్టీలకు ఫండ్, ఎన్నికల ప్రచారంలో ఆర్థిక సహాయం చేయడం) నడిపే రాజకీయ పార్టీలు గమనించాయి. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ కూడా మద్యనిషేధం వాగ్దానం చేసింది కానీ నయా పెట్టుబడిదారుల నుండి ఒత్తిడితో మద్య నిషేధం ఎత్తివేసింది. టిడిపి, కాంగ్రెస్ పార్టీలు రెండూ మద్యం వ్యాపారం ద్వారా లబ్ది పొందాయి. ఈ లాభాలలో మీడియా కూడా వాటాను పొందడమూ జరిగింది. ఈ విధంగా మీడియా ఎ.పిలో సామాజిక ఉద్యమాలను అణచివేసి బలమయిన వర్గాల ఆర్థిక మరియు రాజకీయ ప్రయోజనాలను కాపాడుతుంది.

ఆధునిక ఆంధ్రప్రదేశ్ పెరిగే పరిణామ క్రమంలో  కుల అణచివేతను బాగా చవిచూసింది. మొదటి సంఘటన 1968లో కృష్ణా జిల్లాలో కంచికచెర్ల కోటేశును హతమార్చడంతో మొదలైంది. ఈ రకమయిన అణచివేతకు వ్యతిరేకంగా దళితులు, అణగద్రొక్కబడినవారు దళిత ఉద్యమాన్ని మొదలెట్టారు. దీని తర్వాత జూలై 17, 1985న ప్రకాశం జిల్లా కారంచేడులో ఆరుగురు దళితులను హతమార్చారు. ఈ ఘోరమయిన సంఘటన తర్వాత నీరుకొండ, చుండూరు, తిమ్మ సముద్రం, చిలకుర్తి, వేంపెంటలలో కూడా ఇటువంటి ఘటనలు పునరావృతం అయినాయి. అలాగే చుండూరులో దళితులను కమ్మ సముదాయం వారు ఊచకోత కోశారు (హరగోపాల్, 2006). ఈ సంఘటనలు దళితులను తమ హక్కుల కోసం అగ్ర కులాల నుండి రక్షణ కోసం పోరాటం చేయడానికి ఏకం చేసింది. ఈ ఉద్యమం ఎ.పి రాజకీయాల్లో దళితుల ప్రాతినిధ్యం పెరగటానికి అవకాశం ఇచ్చింది. ఈ అమానుష చర్యలలో మీడియా మిశ్రమ పాత్రవహించింది. తమకున్న పొత్తులు, రాజకీయ వాతావరణం బట్టి వారు బాధితులకు న్యాయం గురించి, ఊచకోతల గురించి కపట వేర్వేరు ధోరణులు అవలంబించారు.

**ప్రత్యేక ఆర్థిక మండలాలు, రియల్ ఎస్టేట్ బూమ్ మరియు నయా పెట్టుబడిదారులు**

మీడియాలో పెట్టుబడులు రియల్ ఎస్టేట్, రాజకీయాలు మరియు ఐటి రంగాల నుండి వస్తున్నాయి. పెట్టుబడులలో ఎక్కువ భాగం భూమి లావాదేవీలు, కొత్త రాజకీయ మరియు ఆర్థిక సమీకరణలు, కూటముల నుండి వచ్చినవే. 1970, 80లలో ఆంధ్రభూమి, ఆంధ్రపత్రిక మరియు కృష్ణ పత్రిక (1931-41) వ్యాపారవేత్తల బృందాల నుండే ఆవిర్భవించాయి. చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు డబ్బుతో రాష్ట్ర అభివృద్ధిని ముడిపెట్టినప్పుడు పెట్టుబడులు పెరిగాయి. చంద్రబాబు నాయుడు కంటే ముందు ఎన్టీ రామారావు కూడా ప్రపంచ బ్యాంకుతో 1983-84లో చేసిన చర్చల వల్ల కూడా పెట్టుబడులకోసం డబ్బు లభ్యత పెరిగింది. ఈ డబ్బు వల్ల కొత్త మౌలిక సదుపాయాలు, కొత్త పరిశ్రమలు మరియు మరింత భూమి కూడా వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా ఉద్భవించిన రియల్ ఎస్టేట్ బూమ్ అనేక వందల కోట్ల మేరకు విస్తరించింది. ఈ డబ్బులో కొంత భాగం మీడియా రంగంలో పెట్టుబడిగా పెట్టారు. అనేక ప్రదేశాలలో సెజ్‌లను స్థాపించడం వల్ల పేదలు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, జాలరులు తమ జీవనాధారమయిన భూములను కోల్పోవడమే కాకుండా ఇతర ప్రదేశాలకు వలస వెళ్ళవలసి వచ్చింది. ఇది కాక, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు, తోలు, ఇనుము ధాతువు, థర్మల్ విద్యుత్ ఆధారిత సెజ్‌లు క్రమంగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో మొదలవుతున్నాయి. ఇటువంటి 'కాలుష్యమైన పరిశ్రమలు' ఆరోగ్యం మరియు పర్యావరణంపై ప్రభావం చూపిస్తున్నాయి. ఈ అంశంపై ప్రధాన స్రవంతి మీడియాలో (ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా) ఏ విధమయిన చర్చ కూడా జరగటం లేదు. ఎపిఐఐసి యొక్క అధికారిక గణాంకాల ప్రకారం జనవరి 2009లో రాష్ట్ర వ్యాప్తంగా 100 సెజ్‌లకు పొందిన మొత్తం భూమి 33,296 ఎకరాలు. ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం ఎ.పిలో వివిధ సెజ్‌ల కోసం 75,000 ఎకరాలను సేకరించారు (ఆంధ్రజ్యోతి, జనవరి 27, 2009). సెజ్‌ల కోసం భూములను బలవంతంగా లాక్కోవడం వల్ల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ప్రజల నుండి తీవ్ర నిరసనలు ఎదురౌతున్నాయి. సెజ్ వ్యతిరేక పోరాటం వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలలో కొనసాగుతుంది. అనంతపురం, కడప, రంగారెడ్డి జిల్లాలలో స్వచ్ఛంద పోరాటాలు మొదలుకొని కాకినాడ, పోలేపల్లి సెజ్‌లలో నిరంతర పోరాటం కొనసాగుతోంది. ఈ పోరాటాలు సెజ్ అభివృద్ధి నమూనాను సవాలు చేస్తాయి. టి.వి మీడియా ఈ పరిణామాలను వార్తలుగా ప్రసారం చేసింది, కానీ తెరపై చర్చ చేయడానికి ఆసక్తి చూపలేదు ఎందుకంటే మీడియా యజమానులు కొన్ని సెజ్‌లలో వాటాదారులు.

**ముగింపు**

మీడియా ఆధిపత్య కుల/వర్గ సమూహాలు మరియు వారితో ముడిపడిన పరిశ్రమలతో పాటు సహజసిద్ధంగా పెరుగుతోంది. గణతంత్ర వ్యవస్థకు సంరక్షకులుగా ఉండవలసిన ప్రసార మాధ్యమాలు మొదట గ్రూపుల ప్రయోజనాలు కాపాడే వ్యవస్థగా, క్రమంగా లాభార్జన కోసం కృషి చేసే పరిశ్రమగా మారిపోయాయి.

**అనువాదం : ఎలిగెడి రాజ్‌కుమార్**

రచయిత ఇఫ్లూలో అధ్యాపకులు

# తెలుగు ప్రసార మాధ్యమాల్లో స్ట్రింగర్లు

■ పి.పూర్ణచందర్

*'మేము లేకపోతే న్యూస్ పేపర్ జిల్లా స్పెషల్ పేజీలు కనుమరుగవుతాయి'*
*(రవి, స్ట్రింగర్ నిజామాబాద్)*

**పరిచయం**

కరస్పాండెంటులు, రిపోర్టర్‌లు పత్రికా సంస్థలలో రెగ్యులర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ, సమాచారం సేకరించి దాన్ని కథనంగా మలిచి, వార్తా ప్రచురణలో తోడ్పడుతుంటారు. వీరి సంఖ్య చాలా తక్కువ. వీరికి పత్రికా సంస్థల్లో గుర్తింపు ఉంటుంది. వీరి వార్తలకు ప్రాధాన్యత కూడా ఉంటుంది. రిపోర్టర్లు, కరస్పాండెంటులు వార్తను మీడియా సంస్థకు చేరవేసే పని చేస్తారు. అవసరాన్ని బట్టి భిన్న ప్రదేశాల నుండి భిన్న విధాల వార్తలను పోగుచేసి పత్రికా సంస్థకు పంపేది రిపోర్టర్స్. నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట విషయ సేకరణ కోసం పని చేసేది కరస్పాండెంటులు.

వీరిద్దరే కాకుండా పత్రికా సంస్థకి వార్తలు చేరవేసే మూడవ వ్యక్తి "స్ట్రింగర్". వీళ్ళు క్రమ వేతనం లేకుండా పనులు చేస్తారు. తాము పంపిన వార్త పత్రికలో ప్రచురితమైన తర్వాత స్వల్ప పారితోషికం పొందుతారు. ఇది వార్త యొక్క కాలమ్ కొలతపై ఆధారితమై ఉంటుంది. దీనిని లైన్ అకౌంట్ అంటారు. నిర్దిష్టమైన ప్రాంతం నుండి వార్తలను పత్రికా సంస్థకు చేరవేసే ప్రధానమైన వ్యక్తి స్ట్రింగర్. పత్రికా సంస్థ వీరిని న్యూస్ ఏజెన్సీ క్రింద రిక్రూట్ చేసుకుంటుంది. సంస్థ నుండి వీరికి గుర్తింపు ఉండదు. వీరు సేకరించే వార్తలకు ప్రాధాన్యత ఇవ్వని సందర్భాలుంటాయి. 1980 తర్వాత స్ట్రింగర్ వ్యవస్థ ప్రారంభమైంది. స్థానిక వార్తలకి ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎడిషన్స్ ఏర్పాటు జరిగింది. స్ట్రింగర్స్ స్థానికులు అయినందున లోకల్ వార్తలను సులభంగా చేరవేస్తున్నారు.

**స్ట్రింగర్స్ అర్హతలు**

ప్రధాన వార్తా పత్రికలలో చేరదలుచుకున్న స్ట్రింగర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. పైకి ఎవరూ చెప్పకపోయినా కెమెరా, టూవీలర్, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇంటర్నెట్ సౌకర్యాలతో, పెన్ డ్రైవ్, సీడీలు కలిగి ఉండాలి. పత్రికా సంస్థలు ఇవన్నీ ఉండాలని అనకున్నా వృత్తి రీత్యా ఖచ్చితంగా వారి వెంట ఉండాల్సిందే, తమ ప్రాంతంలో ఆఫీసును ఏర్పాటు చేసుకోగలగాలి. సంస్థ విధానాలకి ఎల్లప్పుడూ అనుకూలంగా, నియమబద్ధులై ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సంఘటనా స్థలానికి వెళ్ళగలగాలి. వారు రాసే వార్తలలో అవసరమైన అన్ని వివరాలు ఉండాలి. ఇక చిన్న పత్రికలలో పది, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినా పర్వాలేదు. అయితే ఇక్కడ కూడా వీరి వెంట సెల్‌ఫోన్, కెమెరా, టూవీలర్ ఉండాల్సిందే. ఈ పత్రికలలో కూడా స్ట్రింగర్ పత్రికా విధానాలకి అనుగుణంగా నడుచుకోవాలి. వార్తలు సేకరించడమే కాకుండా వ్యాపార ప్రకటనలు తెచ్చే సత్తాకు అధిక ప్రాధాన్యత ఉంటుంది.

ముఖ్యంగా ఈ వృత్తిలోకి నిరుద్యోగ సమస్య వల్ల, తక్కువ విద్యార్హతలు కలిగి, పై చదువులు చదువలేని వారు, తమ ప్రాంత సామాజిక సమస్యలు వెలుగులోకి తీసుకురావాలి అనుకునేవారు, సమస్యల పట్ల ప్రజలను చైతన్యపరుస్తూ వాటిని అధికారుల, పాలకుల దృష్టికి తీసుకురావాలనే వారు వస్తున్నారు.

**స్ట్రింగర్స్ ప్రాధాన్యత**

స్ట్రింగర్స్ స్థానికులు కాబట్టి తమ ప్రాంతంలోని ప్రజలతో చాలా సులభంగా సంబంధాలను ఏర్పర్చుకుంటారు. అక్కడ పలువురిచే ప్రాధాన్యత సంతరించుకుంటారు. రాజకీయ నాయకులకు, అధికారులకు, సామాజిక వేత్తలకు మరియు ఇతర ప్రధాన వ్యక్తులకు సుపరిచితుడైపోతారు. ఆ ప్రాంతం ప్రాముఖ్యత, పలు సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలు కూలంకషంగా తెలిసి ఉంటారు. ఇంకా అరుదుగా జరిగే దోపిడీలు, నేరాలకు మరియు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి వివరాలు కూడా తెల్సి ఉంటారు.

వీరు స్థానిక వార్తలకు ప్రాధాన్యత కల్పిస్తూ చాలా సులువైన భాషలో రాస్తారు. వాటిలో మంచినీటి సమస్య, రోడ్లు, మురికి కాలువలు, వీధి లైట్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, నేర సంబంధిత వార్తలు మొదలైనవి ఉంటాయి. జిల్లా న్యూస్ పేపర్‌లోని ప్రత్యేక పేజీలలో సాధారణంగా ఇవే వార్తలు నిండి ఉంటాయి.

కొంత మంది సాధారణ ప్రజలు వ్యక్తిగత సమస్యలు రేషన్ కార్డు, వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్లు, ప్రభుత్వ పథకాల వివరాలు వీరిని అడిగి తెల్సుకుంటారు. ఆ విధంగా వీరు తమ చుట్టూ ఉండే ప్రజలకు ఏదో విధంగా సహాయపడుతుంటారు. రోజూ ఏ ఒక్కరికైనా ఏదోరకంగా సహాయపడటం వల్ల వీరి ప్రాధాన్యత క్రమంగా పెరిగి స్థానిక సమాజంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు.



**పత్రికా సంస్థల్లో స్ట్రింగర్స్ చేసే లెక్కకు రాని పనులు**

"మా వద్ద ఉన్న న్యూస్ సోర్స్‌ని జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ వారి పేరుతో స్టోరీలు రాస్తారు. దీని వల్ల మా కృషికి క్రెడిట్ స్టాఫర్‌కి పోతుంది మరియు లైన్ అకౌంట్‌ని కూడా కోల్పోతున్నాము." (రాజు, స్ట్రింగర్, హైదరాబాద్)

ప్రధాన పత్రికా సంస్థలలో వీరి విధులు వార్తలు సేకరించడం, వారానికి 3-4 స్టోరీలు రాయడం, వృత్తిలో భాగంగా సర్వేలు నిర్వహించడం, వీటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో ఎంత మంది లబ్దిపొందారో తెలియజేసే కథనాలు రాయడం, అదే విధంగా వ్యక్తుల గురించి, సంస్థల గురించి ప్రభుత్వ పథకాల గురించి కేస్ స్టడీలు చేయడం ఉంటాయి. ఇలా ఏ కారణాల వల్ల ప్రభుత్వ స్కీమ్స్ విఫలమవుతున్నాయో వివరణలతో స్టోరీ రాస్తారు.

ప్రధాన పత్రికలలో వ్యాపార ప్రకటనలు, పంపిణి విధులకై ప్రత్యేక వ్యక్తులు ఉంటారు. కాని అత్యధిక పత్రికా సంస్థలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. దీని గురించి అవగాహన లేని చాలా మంది స్ట్రింగర్స్ ప్రధాన విధి "వార్తల సేకరణ" అని మాత్రమే అనుకుంటారు. కాని వీరు వార్తా సంస్థలలో రకరకాల పనులు చేస్తారు. అవి: వార్తల సేకరణ మరియు కథనాలు, ఫీచర్స్ రాయడం; వ్యాపార ప్రకటనలు తేవడం; బిల్ కలెక్షన్స్; సర్వేలు; కేస్ స్టడీలు; తమ వార్తా సంస్థకున్న టెలివిజన్ ఛానెల్‌కి న్యూస్ మెసేజ్‌లు పంపడం, ఇలా ఎన్నో పనులతో "ఇన్‌ఫార్మల్ లేబర్" గా పని చేస్తున్నారు.

ఈ వార్తా సంస్థలలో ప్రతి స్ట్రింగర్‌కి వ్యాపార ప్రకటనల టార్గెట్ సంవత్సరానికి సుమారు లక్ష రూపాయల నుండి రెండు లక్షల రూపాయల వరకు ఉంటుంది. దీనికి తోడు దసరా, దీపావళి, కొత్త సంవత్సరం, ఎన్నికలప్పుడు కూడా ప్రత్యేక ప్రకటనల టార్గెట్ ఉంటుంది.

ఈ టార్గెట్‌ని చేరడానికి స్ట్రింగర్‌లు తెలివిగా వ్యూహాలు రూపొందించుకుంటారు. ప్రముఖ నాయకుల కార్యక్రమ విషయాలు, సమావేశాల వంటివి ఎన్నో తమ పత్రికకు వార్తగా రాసి పంపుతారు. అందువల్ల ఆయా నాయకులకి, పత్రికకి మధ్య సంబంధం ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఆయా నాయకుల కార్యకర్తలు తమ నాయకుణ్ని అనుసరించి పత్రికకు దగ్గరవుతారు. ఇలా స్ట్రింగర్స్ పార్టీని, నాయకుల కార్యకర్తలను పత్రికకు దగ్గర చేస్తారు. పత్రికలో పార్టీకి సంబంధించిన వార్తలు, కథనాలు, వ్యాసాలుగా రాసి, ప్రచురించి ఈ బంధాన్ని వ్యాపార ప్రకటనలను ఆకర్షించడానికి ఉపయోగిస్తారు. అయితే వీళ్ళు ప్రకటనల ఆదాయంపై ఆధారపడటం వల్ల వార్తా కథనాలు సందేశాత్మకంగా, సానుకూలంగా రాస్తారు. పార్టీకి సంబంధించిన వార్తలు, వాటికి వ్యతిరేకంగా, ఇబ్బందికరంగా రాయరు, ప్రకటనల వల్ల వచ్చే ఆదాయం కోల్పోతామని.

స్ట్రింగర్స్ తమ ప్రాంతంలో ముఖ్యులైన స్థానికులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడతారు. స్థానిక నాయకులచే కొంత మంది వారి కార్యకర్తలను పత్రికకు సబ్‌స్క్రిప్షన్ చేయించమని అభ్యర్థిస్తారు. ఇలాంటి మెళుకువలు ఉపయోగించి వారికున్న పత్రికా సర్క్యులేషన్ టార్గెట్ సంవత్సరానికి 20 నుండి 200 వరకు పూర్తి చేస్తారు.

వీరు పత్రికా సంస్థలకి ఎన్నో రకాల పనులు చేస్తున్నప్పటికీ, వీరిని పార్ట్‌టైమ్ వర్కర్లుగానే చూపిస్తారు. సంస్థ రికార్డుల్లో ఉద్యోగిగా చూపరు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరు సంస్థలో అనియుత కార్మికులు.

"ఆల్ ఇండియా రేడియోలో, దూరదర్శన్ టెలివిజన్ ఛానెల్‌లో కూడా పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్ ఉన్నారు. జిల్లా మొత్తం న్యూస్ సేకరించే వారినే పార్ట్‌టైమ్ కరస్పాండెంట్‌లు అంటున్నాయి ప్రభుత్వ మీడియా సంస్థలు. ప్రైవేటు మీడియా సంస్థలు తమ సంస్థలో పని చేసేవారిని పార్ట్‌టైమ్ ఉద్యోగులు/కార్మికులు అని పిలవడానికి కారణం వారిని తమ సంస్థలలో చట్టపరంగా పూర్తిస్థాయి ఉద్యోగి కాకుండా చేయడానికే." (ప్రభంజన్ యాదవ్, అసిస్టెంట్ ప్రొ. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, తెలంగాణా యూనివర్సిటి, నిజామాబాద్)

ఇది విషాదం. వీరి వల్ల వార్తా పత్రిక జిల్లా పేజీలలో "వార్తలు" పెరిగాయి. ఎక్కువ మంది పత్రికలకు చందాదారులు అవుతున్నారు, పత్రికల సర్క్యులేషన్ పెరిగి వ్యాపార ప్రకటనలు రావడంతో ఆదాయం పెరిగింది. మీడియా సంస్థలు విస్తరించడం జరిగింది. దీంతో జీతాలు పెంచబడ్డాయి, ఇవన్నీ స్ట్రింగర్స్ వల్లనే జరిగినాయి. కాని వీరికి మాత్రం ఎటువంటి ప్రయోజనం చేకూరట్లేదు.

"స్ట్రింగర్ వ్యవస్థ లేకపోతే న్యూస్ నెట్‌వర్క్ కుప్ప కూలిపోతుంది." (ప్రొ. రాజారామ్, హెచ్.ఓ.డి. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, తెలంగాణా యూనివర్సిటి, నిజామాబాద్)

**స్ట్రింగర్-న్యూస్ పేపరు**

వార్తా పత్రికా సంస్థలలో ముఖ్యంగా రెండు రకాల ఉద్యోగస్తులుంటారు. ఒకటి వర్కింగ్ జర్నలిస్టులు. వీరు ఎడిటర్ నుండి పార్ట్ టైమ్ న్యూస్ కాంట్రిబ్యూటర్స్ వరకు; రెండు నాన్ వర్కింగ్ జర్నలిస్టులు. వీరు యాడ్స్, సర్కులేషన్, అకౌంట్స్, ప్రింటింగ్ మరియు తయారీ విభాగాలలో పని చేసే వారు.

స్ట్రింగర్స్ పత్రికా సంస్థకు వార్తలు సేకరిస్తూ జర్నలిస్టులుగాను, పత్రికకు యాడ్స్ సేకరిస్తూ, సర్కులేషన్ ఇతర పనులు చేస్తూ నాన్ వర్కింగ్ జర్నలిస్టులుగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. కానీ పత్రికా సంస్థలు వీరిని 'న్యూస్ ఏజెన్సీ'లకి చెందిన వారిగా చూపడం వల్ల వీరు సంస్థలో భాగం కాలేకపోతున్నారు.

"వార్తా పత్రిక సంస్థలకు వార్తలు పంపించే ఔట్ సోర్సింగ్ న్యూస్ నెట్‌వర్క్ సంస్థలను 'న్యూస్ ఏజెన్సీ'లు అంటారు. దాదాపు ప్రతి పత్రికా సంస్థకు తమ సొంత 'బినామి' న్యూస్ ఏజెన్సీ ఉంది. స్ట్రింగర్స్‌ని తమ పత్రికా సంస్థకు సంబంధించిన వారిగా కాక, ఫలానా న్యూస్ ఏజెన్సీకి సంబంధించిన వారిగా చూపుతారు. వీరికి పత్రికలో చేరేటప్పుడు ఎటువంటి అపాయింట్‌మెంట్ లెటర్ కూడా ఇవ్వరు. ఇలా చెయ్యడం వల్ల స్ట్రింగర్స్ ఎలాంటి చట్టపరమైన చర్యలు చేపట్టే అస్కారం లేకుండా అన్ని రకాలుగా పత్రికా యాజమాన్యాలు జాగ్రత్తపడుతున్నాయి." (నరేందర్‌రెడ్డి, జర్నలిస్టు యూనియన్ లీడర్, హైదరాబాదు)

స్ట్రింగర్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఉద్యోగ భద్రత లేకపోవడం. వీరిని ఒక్క ఫోన్ కాల్‌తో విధుల నుండి తొలగించేటంత బలహీనమైన పరిస్థితి పత్రికా సంస్థలలో ఉంటోంది. ఒక స్ట్రింగర్ మాటల్లో 'మా ఉద్యోగం తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది'.

రెండవ సమస్య 'స్థిర వేతనం' లేకపోవడం. కొన్ని పత్రికలు లైన్ అకౌంట్ ఆధారంగా డబ్బులు ఇస్తున్నాయి. మరి కొన్ని పత్రికలు అసలు ఏమీ ఇవ్వడం లేదు. ఏ పత్రికా సంస్థ కూడా చట్టపరంగా లైన్ అకౌంట్ ఇవ్వడం లేదు. అన్ని పత్రికా సంస్థలు స్ట్రింగర్స్‌ని ఆర్థికంగా దోచుకుంటున్నాయి.

ఈ సమస్యల వలనే పలు జర్నలిస్టు యూనియన్‌లు పత్రికా యాజమాన్యాల విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు తెల్పుతూ వచ్చాయి. వీటి మూలంగా ప్రభుత్వం వేతన బోర్డులను ఏర్పాటు చేసింది. 2011లో జె.ఆర్. మజీథియా వేతన నిర్ణయ బోర్డు రికమెండేషన్స్‌ను ఆమోదిస్తూ జీ.వో విడుదల చేసింది. ఇది వర్కింగ్ జర్నలిస్టుల పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని కూలంకషంగా వివరించింది. వారిని వివిధ కేటగిరీలుగా విభజించింది, చివరి ఆరవ కేటగరీ క్రింద స్ట్రింగర్లను ఉంచాలని తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన వేతన నిర్ణయ బోర్డు ప్రకారం న్యాయంగా వార్తా పత్రికా సంస్థలు నాన్ వర్కింగ్ జర్నలిస్టులకు వేతనాలు చెల్లించాలి. వీటిని అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖది. దీనిని పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటి ఉంటుంది. ఇందులో ప్రభుత్వ అధికారులు, మీడియా యాజమానులు, జర్నలిస్టు ప్రతినిధులు ఉంటారు.

**స్ట్రింగర్స్-క్షేత్రస్థాయి పని**

స్ట్రింగర్స్ వృత్తిరీత్యా క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు ఎన్నో రోజువారీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండల్లో, వర్షంలో నిర్ణయించిన ప్రాంతాలకు వెళ్ళాలి. పరిస్థితులు ఎలా ఉన్నా ప్రకృతి విపత్తులు, దాడులు జరిగినా వార్తలు

సేకరించడానికి వెళ్ళాలి. అక్రెడిషన్ ఉన్నా ఒక్కోసారి సమయానికి బస్‌లు, రైళ్ళు లేకపోవడం వల్ల పాస్ ఉపయోగించుకోలేని పరిస్థితి ఉంటుంది. అందువలన తన సొంత ఖర్చులతో టూవీలర్‌ని ఖచ్చితంగా ఉపయోగించాల్సి ఉంటుంది.

ప్రతి స్ట్రింగరు ఉదయం లేచిన తర్వాతనో, ముందు రోజు సాయంత్రమో ఆ రోజు జరిగే కార్యక్రమాలు, మీటింగుల వివరాలు తన తోటి స్ట్రింగర్స్, అధికారులు, తన ప్రాంతంలోని పలువురి ద్వారా తెల్సుకుంటాడు. తను పని చేసే వార్తా పత్రిక, ఇతర వార్తా పత్రికలు అన్నింటిని తిరగేసి తాను రాసిన వార్తలలో తప్పులేమయినా దొర్లాయేమో చూసుకుంటాడు.

"నిన్నటి కృషికి (వార్తల రచన) మరుసటి రోజే ఫలితాన్ని (ప్రచురణ) చూసేది మేమే" (సంతోష్, స్ట్రింగర్, హైదరాబాదు).

వార్తలు/కథనాలు రాసినందుకు కొన్ని సార్లు పొగడ్తలు వస్తాయి. ఆక్రమాలు, అవినీతి బయటపెట్టే వార్తలు రాసినప్పుడు విమర్శ లేక బెదిరింపులు వస్తాయి. హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడు సంఘటన స్థలానికి ప్రభుత్వ అధికారులు, పోలీసులకంటే ముందే చేరి సంఘటన స్థలంలో వుండే చుట్టు ప్రక్కల నివాసితులను, వివరాలు అడిగి తెలుసుకుంటారు. అలాగే కేసు బుక్ చేసిన పోలీసు అధికారుల నుండి కూడా వివరాలు తెల్సుకుంటారు. చివరకు ప్రభుత్వ వైద్యుని నుండి పోస్టు మార్టమ్ రిపోర్ట్ సేకరిస్తారు. ఇలా న్యూస్‌ను కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఫాలో అవుతారు.

ఇంకా తమ ప్రాంతానికి చెంది చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి కడు పేదరికంలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులకి ధన సహాయం అందించే ఉద్దేశంతో "సరస్వతీ పుత్రికకు లక్ష్మీ కటాక్షం లేదు" అన్న పేరుతో స్టోరీ రాస్తారు. ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లల ఆరోగ్య సమస్యలు, వృద్ధులను చేరదీయని కొడుకుల గురించి ఇలా మానవత్వాన్ని ప్రేరేపించే కథనాలు రెండు రోజులకు ఒకసారి పత్రికల్లో కనిపిస్తూనే ఉంటాయి.

ప్రముఖుల మీటింగులు, పబ్లిసిటి కోరుకునే వ్యక్తులు, సంస్థల కార్యక్రమాల వార్తల సేకరించానికి వెళ్ళినప్పుడు కొందరు నిర్వాహకులు కవరేజీ కావాలని ఇతనికి వంద, రెండు వందల రూపాయలు ఇస్తారు. కొందరు చవక రకం బహుమతులు ఇస్తారు. అక్కడ భోజన సదుపాయాలు అందరితో పాటు ఇతనికి కూడా ఏర్పాటు చేస్తారు. ఎక్కువగా ఫీల్డులో ఉన్నప్పుడు వీరికి కనీసం త్రాగడానికి మంచినీరు కూడా ఇచ్చేవారుండరు. తిండిలేక పస్తులుండే రోజులే ఎక్కువగా ఉంటాయి.

వ్యాపార ప్రకటనల డబ్బులు సేకరించడానికి నానా తంటాలు పడాల్సి ఉంటుంది. చందాదారులను కలవడానికి పది, పదిహేను సార్లు తిరగాల్సి వస్తుంది. వారు మళ్ళీ రమ్మనవచ్చు లేదా కఠినంగా ప్రవర్తించవచ్చు.

ఫీల్డ్‌కి సంబంధించిన ఒత్తిడి ఏదో ఒక రూపంలో ఉంటుంది. స్ట్రింగర్స్ బీ.పి, షుగరు మరియు సమయానికి తిండి లేక పోవడం వల్ల అల్సరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం వడదెబ్బ సమస్యను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. వార్తలు సంస్థకి తొందరగా చేరవేయాలనే పోటీ వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవటం మరియు మరణాలు కూడా జరుగుతున్నాయి.

**స్ట్రింగర్స్ – కుటుంబం**

స్ట్రింగర్స్ వార్తా పత్రికకు చేస్తున్న పని ప్రభావం వీరి కుటుంబాల పైన తీవ్రంగానే ఉంటుంది. వీరు ఏ సమయమైనా విధులకి వెళ్ళాలి. రాత్రి పగలు అనేది లేదు. తాను పని చేసే ప్రాంతంలో ఏ సమయమైనా, ఎలాంటి వార్తయినా సేకరించడమే ప్రథమ విధి. వీరు ఎప్పుడు ఇంటికి వెళ్తారు, విశ్రాంతి తీసుకుంటాడు అనేది ఆరోజు పరిస్థితులే నిర్ణయిస్తాయి. కాబట్టి వీరు కుటుంబ సభ్యులతో సరిగ్గా సమయం గడప లేరు. పిల్లలు హోం వర్క్ చేశారో లేదో అనే విషయాలను చూడలేరు. వీరి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర అనారోగ్యంతో ఉన్నా వారికి సమయాన్ని కేటాయించలేని దుస్థితి ఉంటుంది. వీటి ప్రభావం వల్ల వీరు తమ కుటుంబీకులు, బంధువులతో మంచి సంబంధాలను కొనసాగించలేరు. కాని స్ట్రింగర్స్ తన సృజనాత్మక రచనలతో పత్రికకు పాఠకులను దగ్గరయ్యేలా చేస్తారు. రచనల ద్వారా వ్యాపారులను, నాయకులను పత్రికకు దగ్గర చేయటంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**ముగింపు**

వార్తా పత్రికా సంస్థలు స్ట్రింగర్స్ వల్ల చాలా రకాలుగా లబ్ధిపొందుతున్నాయి. అదే స్థాయిలో స్ట్రింగర్ నష్టపోతున్నారు. వీరు యాడ్స్ తేవడం వల్ల వార్తా పత్రికా సంస్థలలోని అందరు ఉద్యోగస్థులకు జీతాలు చెల్లించబడుతున్నాయి. కాని వీరికి జీతం లేదు. వీరు పత్రికకు సర్కులేషన్ పెంచి పాఠకుల సంఖ్యను పెంచుతూ పత్రికకు స్థానాన్ని కల్పిస్తున్నారు. కాని వీరికి వార్తా పత్రికాసంస్థలో స్థానం లేదు.

"పత్రికా సంస్థలో స్ట్రింగర్ ద్వితీయ శ్రేణి పౌరుడు" (కాసుల ప్రతాప్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు, హైదరాబాదు).

స్ట్రింగర్స్ విధి నిర్వహణలో భాగంగా ఇసుక మాఫియా, కల్లు మాఫియా చేతులలో పోలీసులు–నక్సలైట్ల మధ్య ఎదురు కాల్పుల్లో కానీ మరణించినప్పుడు అది సంచలన వార్త అవుతుంది. కానీ వీరి మరణాలు వడదెబ్బ, అనారోగ్య కారణంగా జరిగితే యాజమాన్యాలు పెద్దగా పట్టించుకోవు. వీరి కుటుంబాలని ఆదుకోవు. సాధారణ మరణాలుగా కొట్టిపారేసి వీరి కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక సహాయాన్ని అందించవు.

"ఒక స్ట్రింగర్ మరణిస్తే అతని స్థానంలో ఎవరిని నియమించుకోవాలనే దాని మీద ఉన్న ధ్యాస మరణించిన స్ట్రింగర్ కుటుంబం పరిస్థితి ఎలా ఉందో అనే దాని మీద ఉండదు. ఇంత అమానవీయ పరిస్థితులు పత్రికా సంస్థలో ఉంటాయి". ప్రొ. రాజారామ్, తెలంగాణ యూనివర్సిటి.

రచయిత 2013–14 సం॥లో అన్వేషి షార్ట్‌టర్మ్ ఫెలో



# నెట్ తటస్థతకై పోరాటం: ఆర్థిక, రాజకీయ, విధానపరమైన అంశాలు

■ కె జి సుజిత్

మానవుల మధ్య సమాచార ప్రసారం మౌఖిక సంప్రదాయంతో మొదలైనప్పటి నుంచి వివిధ సమాజాలలో అనేక చర్యల ద్వారా ఆ ప్రసారాన్ని నిర్భంధించటానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ మాధ్యమానికీ పూర్తి స్వేచ్ఛ ఎప్పుడూ లేదు. ఇది ఇంటర్నెట్‌కు కూడా వర్తిస్తుంది. ఎలాగైతే చరిత్రలో మౌఖికం నుంచి, లిఖిత, ప్రచురణ, తంతి, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ సమాచార సంస్కృతులు క్రమంగా అభివృద్ధి చెందాయో, అదే విధంగా వాటిని క్రమబద్ధీకరించే పద్ధతులు కూడా రూపొందుతూ వచ్చాయి.

ఇంటర్నెట్‌కి సంబంధించిన స్వేచ్ఛ, మనం కొనుక్కున్న సమాచారాన్ని మనకి కావలసినట్టుగా వాడుకునే స్వేచ్ఛపై ఉన్న నిబంధనలు, ఆయా నిబంధనల దీర్ఘకాలిక ప్రభావాలు రోజురోజుకి భారత దేశంలో ప్రస్ఫుటమవుతున్నాయి. ఈ నిబంధనలు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మనకిచ్చిన స్వేచ్ఛని కట్టడి చేస్తాయి కాబట్టి వీటిపై చర్చ, వాద-ప్రతివాదనలు జరగటం చాలా అవసరం. నేడు ఇంటర్నెట్ వాడుకోగలగటం మానవ స్వేచ్ఛలో భాగం; ఒక హక్కు.

ఈ నిబంధనలకు, కొంత మందికే ఇంటర్నెట్ సులభంగా అందుబాటులో ఉండటానికీ వ్యతిరేకంగా 'నెట్ తటస్థత' అన్న పేరు మీద పోరాటం జరుగుతోంది. అంటే ఇంటర్నెట్ సేవలు ఆయా వ్యక్తుల కొనుగోలు శక్తిపైన, వినియోగదారుల భౌగోళిక ప్రాంతంపైన, ఇంటర్నెట్‌లో పోస్ట్ చేస్తున్న విషయాలపైన ఆధారపడి ఉండకూడదు. ఈ విషయాల పట్ల తటస్థత అవసరం అని దీని కోసం కింది విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి.

### ఆర్థిక నిబంధనలు

కార్పొరేట్ సంస్థ 'సమాచారాన్ని' తాము 'ఉత్పత్తి చేసిన సరుకు'గా మార్చుకుని, తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవటానికి వీలు కల్పించటం కోసమే ఇంటర్నెట్ స్వేచ్ఛపై నిబంధనలు ఉండాలనే డిమాండు ముందుకొస్తోంది. ఇప్పుడున్న ప్రతిపాదనలో డేటాను వారికి కావాల్సిన ధరకు అమ్ముకోవడమే కాకుండా సమాచార అందుబాటుని వారికి కావలసినట్టుగా నియంత్రించవచ్చు. ప్రస్తుతం వినియోగదారులు ప్రతి అప్లికేషన్‌లో తాము డేటా వాడుకున్న మేరకే డబ్బు చెల్లిస్తున్నారు. కానీ ప్రతిపాదించిన పద్ధతి ప్రకారం ఈ స్వేచ్ఛ పోయి, ఒక్కో అప్లికేషన్‌కు వారు నిర్ణయించిన మొత్తం డబ్బు చెల్లించాల్సి వస్తుంది. వినియోగదారుల ఎంపిక చేసుకునే స్వేచ్ఛను నియంత్రించడమే కాకుండా వారి కొనుగోలు శక్తికి ఇదొక పరీక్ష. ఇలాగే కొనసాగితే ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా కొనుగోలు శక్తి బట్టి నడిచే మాధ్యమాలుగా మారే పరిస్థితి వస్తుంది.

వివిధ సేవలకు వివిధ రేట్లను నిర్ణయించడం వలన వినియోగదారుల స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. ప్రాథమిక అవసరంగా మారుతున్న ఈ సాధనాన్ని ఒక లాభం చేకూర్చే సరుకుగా మార్చటం అప్రజాస్వామికం; మానవ శ్రేయస్సుకు వ్యతిరేకం. ఈ ప్రతిపాదనలను అమలుపరిస్తే, ఏ చారిత్రక కారణాల వల్ల ఈ సాధనం అభివృద్ధి చెందిందో, వాటికి ఇదొక సవాలుగా మారుతుంది.

అమెరికాలో 1990ల నుండి, నెట్ తటస్థత విషయంపై "నెట్వర్క్ వినియోగదారులు"(ఇంటర్నెట్ వాడుకునే వాళ్ళు) మరియు "ఆక్సెస్ ప్రొవైడర్స్" (సేవలు అందించే వాళ్ళు)కు మధ్య విభేదాలున్నాయి. 2015 వరకు నెట్‌ను నెమ్మదిపరిచే చర్యలపై న్యాయపరమైన నిబంధనలు లేవు. 2005, 2006లలో రెండు పక్షాల వారూ చాలా డబ్బు ఖర్చుపెట్టి అమెరికన్ కాంగ్రెస్‌ను తమకు అనుకూలంగా మార్చుకోటానికి లాబీయింగ్ జరిపారు. 2005 నుంచి 2012 మధ్య అమెరికన్ కాంగ్రెస్‌లో నెట్ తటస్థత పైన ఐదుసార్లు బిల్లులు ప్రవేశపెట్టినా అవి విఫలమయ్యాయి. ఈ బిల్లులన్నీ ఇంటర్నెట్ ప్రొవైడర్స్ ఏర్పర్చిన వేరు వేరు రేట్ల విధానాలను నియంత్రించే ప్రయత్నం చేసాయి. వినియోగదారులు నిర్ధారించే 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్ లెవెల్' ఆధారంగా రూపొందిన ఈ విధానాలను ఇండస్ట్రీ వారు వివిధ శ్రేణుల బట్టి అందించే సేవలుగా అభివర్ణిస్తే ఆర్థికవేత్తలు ధరల అంతరాల బట్టి అందించేవిగా వర్ణించారు. ఫేస్ బుక్ వారు ప్రవేశపెట్టిన ఇంటర్‌నెట్ ఓఆర్‌జి లాంటి ప్రాజెక్టులలో కొన్ని వెబ్‌సైట్లు ఉచితంగా అందచేస్తున్నారు. అయితే నెట్ తటస్థతకు కొన్ని సేవలను నిర్బంధిస్తే జరిగే నష్టం లాగానే కొన్ని సేవలను అడ్డగోలుగా ప్రోత్సహించడం వల్ల కూడా నష్టం జరుగుతుంది.

### క్రమబద్ధీకరణ విధానంలో సంక్షోభం

డిజిటల్ కమ్యూనికేషన్ వల్ల రెండు ప్రాంతాల మధ్య దూరం తగ్గించడం ద్వారా సమయాన్ని కుదించగలుగుతున్నాం. దీని వల్ల సమయానికి కొత్త రకమైన రూపం ఏర్పడింది. దీనితో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ దూరాలకు తేడా లేకుండా పోయిందని వినియోగదారులు భావిస్తారు. అంతే కాకుండా డిజిటల్ మీడియా కొందరికే కాకుండా అందరికి చేరుతుంది. పాత మీడియాలలో విషయాన్ని, ప్రసారాన్ని సెన్సార్ బోర్డు ద్వారా గానీ, స్వయం నియంత్రణ ద్వారా గానీ నియంత్రించేవారు. మీడియా సంస్థలు దేశంలోని చట్టాలకి కట్టుబడి ఉంటాయి. వారు ప్రసారం చేసిన విషయాలపై వారిదే బాధ్యత. ఇప్పుడొస్తున్న కొత్త (సోషల్) మీడియాలో విషయంపై యాజమాన్యం ఎవరిదనేది చాలా క్లిష్టమైన, కష్టమైన సమస్య. ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలోని పెద్ద సంస్థలు సొంతంగా ఏ సమాచారాన్ని, విషయాన్ని రూపొందించవు. సోషల్ మీడియా ఒక చంచలమైన ప్రసార మాధ్యమం, ఇందులో ఎవరికి కావలసింది వారు ప్రభుత్వ, ఇతర సంస్థల ప్రమేయం లేకుండా వారే సృష్టించుకోవచ్చు. కొత్త మీడియాలోని ఈ లక్షణం వల్ల న్యాయ ఉల్లంఘన మరియు నియమ నిబంధనలపై కొత్త సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి.

డిజిటల్ మీడియాకు శరవేగంగా కలిసిపోయే లక్షణం (ఉదా: స్కైప్‌తో మైక్రోసాఫ్ట్); ఇంటరాక్టివ్ లక్షణం (ఫేస్ బుక్); హైపర్ టెక్స్ట్ వాడడం ద్వారా ఇంకో లింకుకు సులభంగా వెళ్ళగలిగే లక్షణం; దీనంతటికి వర్చ్యువల్ ఉనికే తప్ప భౌతిక ఉనికి లేకపోవడంతో – కొన్ని ప్రత్యేకమైన లక్షణాలున్నాయి. దీనితో నియంత్రణ మరింత కష్టమౌతుంది. కొత్త మీడియాలో చాలా మంది నుండి చాలా మందికి సమాచార ప్రసారం జరుగుతుంది. దీన్ని డిజిటల్ రూపంలోనే రికార్డ్ చేసే అవకాశం ఉంటుంది, దాంతో మొదట సృష్టించినప్పుడున్న విషయ ఉద్దేశ్య పరిధి, త్వరలో అవధి దాటుతుంది. మాన్యుల్ కాస్టల్స్ చెప్పినట్టు గ్లోబల్ నెట్వర్క్స్ వల్ల మానవులకు కొత్త అనుభవాలు ఏర్పడుతున్నాయి. ఈ అనుభవాల ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు, సాంస్కృతిక పద్ధతులు, పరస్పర అవగాహనలు, మిగతా సమాజ రూపాల్లో మార్పులు ఏర్పడతాయి. కనబడని డిజిటల్ ప్రపంచంలో నిజస్వరూపానికి, వర్చ్యువల్ స్వరూపానికి తేడా ఉత్పన్నం

చేసి లింగం, వ్యక్తిత్వం, వృత్తి మార్చుకొనే అవకాశం కల్పిస్తుంది.

సాంప్రదాయ మీడియాలా కాకుండా డిజిటల్ మీడియాలో ఏర్పడే వర్చ్యువల్ సమాజం భౌతిక పరిధుల్ని దాటిపోతుంది. అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ సంస్కృతిలో కొత్త మీడియా సమాచార ప్రసార ప్రక్రియలను, ఫలితాలను, వివిధ స్థాయిలలో ప్రభావితం చేస్తుంది. డిజిటల్ మీడియాలో వచ్చే సందేశాలను కూడా మిగతా వాటిలాగే ఒప్పుకునేవాళ్ళు, ఒప్పుకోని వాళ్ళు ఉంటారు. ప్రసారంలోని సందేశం, సాంస్కృతిక సందర్భం మీడియా వాడుకని నిర్దేశిస్తుంది. నెట్ తటస్థతకు సంబంధించిన చర్చలలో ఇది ప్రధానంగా కనిపిస్తుంది. ఆలోచనా పద్ధతులు, భావ ప్రకటనా పద్ధతులు, నెట్ వినియోగదారుల సాంస్కృతిక నేపథ్యం వారి వారి మీడియా వాడుకను, ప్రసారమయ్యే సందేశాలని నిర్దేశిస్తాయి. అలాగే విభిన్న వినియోగాల ప్రభావం కూడా విభిన్నంగానే ఉంటుంది.

కొత్త మీడియాలో వేరు వేరు సంస్కృతుల వారు స్వేచ్ఛగా అభిప్రాయాలు వెలిబుచ్చడమే కాకుండా సంబంధాలు ఏర్పర్చుకోవటానికి అవకాశముంది. సాంప్రదాయక మీడియాకి కొత్త మీడియాకి ఉన్న వ్యత్యాసం వల్ల ఒకే సంస్కృతిలోని వారికైనా, భిన్న సంస్కృతులలోని వారికైనా పరస్పర భావప్రకటన ఒక సవాల్‌గా పరిణమిస్తుంది. వేరు వేరు సంస్కృతుల మధ్య ఏర్పడే సంబంధాలు, చర్చలు, విభేదాలపై కొత్త మీడియా ప్రభావం నెట్ తటస్థత చర్చల్లో ముఖ్యమైన అంశం.

**రాజకీయ సవాళ్ళు**

నెట్ తటస్థతపై చర్చ ఉద్యమాల్లో, సమాలోచనల్లో, రచనల్లో, క్యాంటీన్ కబుర్లలో, కోర్టు కేసుల్లో, అన్ని చోట్లా వినబడుతోంది. నెటిజెన్ మరియు నెటిజెన్‌షిప్ అనే పదాల అర్థం ఇంటర్నెట్ స్థితి మీద, దాని వినియోగ స్వేచ్ఛ, దానిపై ఉండే నియంత్రణలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు మన ముందున్న పెద్ద ప్రశ్న ఏంటంటే ఇంతటి చంచలమైన మరియు పలు విధాల అవకాశాలు కలిపిస్తున్న ఈ మాధ్యమాన్ని సినిమా వంటి మాధ్యమాల లాగా ప్రభుత్వ సెన్సార్ పరిధిలోకి తీసుకు రావడం సబబేనా? నెట్ తటస్థతకి అనుకూలంగా, ప్రతికూలంగా ఉన్న వర్గాల మధ్య ఈ ఆలోచన పెద్ద గలాటాకే కారణమైంది. అయితే చాలా వరకు కొత్త మీడియాలోనే నెలకొన్న ఈ గందరగోళం సుప్రీం కోర్టు ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ చట్టాన్ని కొట్టి వేయడంతో సర్దుకుంది.

ఈ నిర్ణయంతో వ్యక్తులకు 'బాధ కలిగించే, అత్యంత హానికరమైన' సమాచారాన్ని పోస్ట్ చేస్తే 3 ఏళ్ళ శిక్ష విధించే 'సెక్షన్ 66ఎ' చట్టం రద్దు చేయబడింది. చాలా కేసుల్లో ప్రభుత్వానికి, సంఘానికి, వ్యక్తులకు అవమానకరమైన విషయాలను పోస్ట్ చేసినందుకు ఈ చట్టం కింద వ్యక్తులను అరెస్ట్ చేసారు. భావప్రకటన స్వేచ్ఛ ఉద్యమకారులు, వారిలో ముఖ్యంగా సుప్రీం కోర్టులో మొదట కేసు వేసిన శ్రేయ సింఘల్ అనే న్యాయ శాస్త్ర విద్యార్థిని చేసిన రెండు సంవత్సరాల పోరాటం తర్వాత అత్యున్నత న్యాయస్థానం ఈ చట్టాన్ని కొట్టి వేసింది. సుప్రీం కోర్టు 66ఎ చట్టాన్ని భారత రాజ్యాంగానికి విరుద్ధమైనదిగా, వాక్స్వాతంత్రాన్ని హరించేదిగా అభివర్ణించింది. శ్రేయని పేర్కొంటూ "ఎవరూ జైలు శిక్షకు భయపడి వారు చెప్పాలనుకున్నది మానకూడదు, ఈ రోజు కోర్టు పౌరుల హక్కులను నిలబెట్టింది" అని కోర్టు ఉద్ఘాటించింది. భారత రాజ్యాంగంలో వాక్స్వాతంత్రం గురించి రాస్తున్నప్పుడు ఇంటర్నెట్ ప్రస్తావనకి అవకాశం లేకపోయింది. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత కొన్ని సమస్యలు రావడంతో 66ఎ పుట్టింది.

చాలా దేశాలలో ప్రజలకు వాక్స్వాతంత్రం, రచనా స్వాతంత్రం ఉండడం ప్రభుత్వాలకు భయం కలిగిస్తుంది. చాలా దేశాలలో ప్రభుత్వాలు ప్రజలను భయపెట్టడం ద్వారా తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నాయి. ఇలాంటి భయాలు చాలా రకాలుగా ఉంటున్నాయి. తమ అసమ్మతిని ఇంటర్నెట్లో తెలిపితే జైలుకెళ్ళ వలసి వస్తుందనే భయం కూడా వీటిలో ఒకటి; ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలోనైనా, నియంతృత్వం ఉన్న చైనాలోనైనా ఈ భయం ఉంది – ఉన్న వ్యత్యాసమల్లా భయానికి కారణాలు, సెన్సార్షిప్ విధింపు పరిధి, నియమ ఉల్లంఘనకున్న దండన పరిధి.

ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ (ISP) కనపడే తీరు మరియు వెబ్‌సైట్ల లభ్యత తగ్గించడం ద్వారా ఇంటర్నెట్ లోని విషయాన్ని నియంత్రించవచ్చని భారత ప్రభుత్వం ప్రతిపాదించింది. దీని ద్వారా ఆయా వెబ్ సైట్లపై పరోక్షంగా కన్నేసి, తనకు అభ్యంతరకరమైన విషయాన్ని వారు బయట ప్రచురించకుండా లేదా తొక్కి పెట్టేటట్లు చూడదలచుకుంది. అయినా కూడా ప్రభుత్వం రచయితలను, ఫిలిం మేకర్స్‌ను (film makers), బ్లాగర్స్‌ను (bloggers) పీడించదని కానీ, వారిపై అభియోగం మోపదనీ కానీ నమ్మకం లేదు. వెబ్‌సైట్లలో, బ్లాగ్‌లో ప్రచురణలను ప్రభుత్వం తన సంస్థల ద్వారా ప్రచురణ ముందైనా, తర్వాతైనా ఆపుచేయవచ్చు.

ఐఎస్‌పిలను శక్తివంతం చేసి, వారి ద్వారా వెబ్ సైట్స్ యొక్క ట్రాఫిక్‌ని నియంత్రించాలని ప్రభుత్వం ఆలోచన చేసినప్పుడు విషయం చాలా ముందుకి పోయింది. అయితే ఇది కనిపించేటంత సులభం కాదు. ఇందులో ముఖ్యమైన ప్రశ్న: వివాదం వస్తే ఎవరి దగ్గర వెళ్ళాలన్నది. ఐఎస్‌పిల దగ్గరికి వెళ్ళాలా? మన దేశంలో పనిచేసే కార్పొరేట్ సంస్థలు ఆచరణలో ఇటు ప్రజలకు గానీ అటు ప్రభుత్వానికి గానీ జవాబుదారీ కాదు. వారికి సమాచార హక్కు వంటి చట్టాలు కూడా వర్తించవు. వారిని ఎదుర్కొనే అవకాశం ఒక్క న్యాయస్థానంలోనే ఉంటుంది. కార్పొరేట్ శక్తులతో సామాన్యులు కోర్టులో పోరాడడం బురదలో పందితో పోరాడినంత కష్టం.

నియంతృత్వ పాలన ఉన్న ఉత్తర కొరియా వంటి దేశాలలో ఇవన్నీ వర్తించవు. అక్కడ విషయం సులభం. ప్రజలు వాక్స్వాతంత్రం గురించి మాట్లాడాలన్నా, పోరాడాలన్నా వారికి ఎక్కడో అక్కడ కొంచెమైనా మాట్లాడే అవకాశం ఉండాలి. వారికి ఎక్కడా కూడా కొంచెం కూడా స్వేచ్ఛ ఇవ్వకపోవటంవల్ల ఇంటర్నెట్‌లో గానీ, బయట గానీ ఏమీ మాట్లాడలేరు. కానీ మన దేశంలో ఖచ్చితంగా చెప్పగలిగే విషయమేమిటంటే ప్రజా ఉద్యమాలకు ఎన్ని కోర్టు కేసులనైనా కష్టపడకుండా పోరాడగలిగే సమర్థత ఉన్న కార్పొరేట్ సంస్థలను వ్యతిరేకించటం కన్నా ప్రభుత్వాన్ని లక్ష్యంగా పెట్టుకుని పోరాడడం సులువు.

జులై నుండి డిసెంబరు 2014 మధ్య ఫేస్ బుక్ సంస్థ, 5,382 విషయ భాగాలను భారత ప్రభుత్వ విజ్ఞప్తుల కారణంగా నియంత్రించింది. అవి "ముఖ్యంగా చట్టాన్ని అమలు చేసే సంస్థలు, ఇండియా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం కోరిక మేరకు అలజడి మరియు అశాంతి కలిగించే మత విభేదాలకు దారి తీసే భావాలు, ద్వేషపూరిత ప్రసంగాల వంటివి" అని ఫేస్ బుక్ పేర్కొంది.

66ఎ తీర్పుని పేర్కొంటూ న్యాయమూర్తి ఆర్.ఎఫ్.నారిమన్ "ప్రజల తెలుసుకునే హక్కును ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది" అని అన్నారు. 2009లో రాష్ట్రపతి అంగీకారంతో వచ్చిన ఈ చట్టం "బాధ కలిగించే, వ్యక్తిత్వానికి హానికరమైన" సమాచారాన్ని పోస్ట్ చేస్తే 3 ఏళ్ళ వరకు జైలు శిక్ష పడే అవకాశాన్ని కలిగించింది. ఇలాంటి కేసులలో ప్రభుత్వ సంస్థలు, న్యాయస్థానాల నుండి పెద్దగా ఏమీ ఆశించలేము. ప్రస్తుతానికైతే ఈ (నెట్ తటస్థత) చర్చ సద్దుమణిగి, మనకు నచ్చిన బాండ్ విడ్తనే వాడుకొని డబ్బు చెల్లిస్తున్నాం. కానీ ఇది మనమనుకున్నంత తేలికగా సద్దు మణిగేది కాదు. యూనివర్శిటీలు, కంపెనీలు వంటి సంస్థలలో ఇంటర్నెట్‌ని నియంత్రిస్తున్న ఫైర్ వాల్స్ గురించి ఏం చేయగలం? ఈ చర్చ వివిధ స్థాయిలలో ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది.

**అనువాదం : తేజస్విని మాడభూషి**

రచయిత ఇఫ్లూ యూనివర్సిటీలో
ఫిల్మ్ స్టడీస్ విభాగంలో డాక్టరల్ రీసర్చర్‌గా ఉన్నారు

# ప్రపంచీకరణ గురించిన వ్యాసాల సంపుటి

■ **లెఖ్‌నర్, బోలి**




సాంస్కృతిక రంగంలో జరిగిన ప్రపంచీకరణ అన్నింటికన్నా సాధారణం, సుపరిచితమయింది అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే, దీనికి ప్రతీకలైన కోకా-కోలా, నీలంరంగు జీన్సు, రాక్ మ్యూజిక్, మెక్‌డోనాల్డ్స్ మనని చుట్టుముట్టి ఉన్నాయి. ఎక్కడ చూసినా మన కళ్ళకి అగుపించే ఈ చిహ్నాలు ఒక సంస్కృతితో ముడిబడి ఉన్న వస్తువులని, భావజాలపరమైన వైవిధ్యాన్ని తుడిచి వేసి 'అంతా ఒకటే' అనిపించేటట్లు చేస్తున్నాయని కూడా మనకు తెలుసు. ఇవేకాక హాలీవుడ్ సినిమాలు, ఫ్రెంచి తత్వశాస్త్రం, జపాను దేశం అందించిన కంపెనీల నిర్వహణ విధివిధానాలు – ఏవైతే అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఉన్న కంపెనీలు విస్తృతంగా అమలులో పెడ్తున్నాయో చూస్తే మనకి అర్థమయ్యేది ఏమిటంటే "సాంస్కృతిక ప్రపంచీకరణ' అనేది ప్రపంచంలో ఉన్న వైవిధ్య సంస్కృతులని కలగలిపి, ఏకసదృశ సాధారణ సంస్కృతిగా మలచి వేయగల శక్తి సామర్థ్యాలున్న సార్వజనీన ఔషధం అని.

దీన్ని ఇంటా, బయటా అమెరికనైజేషన్ అనో, పాశ్చాత్యీకరణ అనో, సాంస్కృతిక ఇంపీరియలిజమ్ అనో పేర్కొనవచ్చు. అలా అంటున్నారు కూడా. అయితే దీని వెనుక ఉన్న మహత్తర శక్తి మాత్రం వార్తా మాధ్యమాలు (మాస్ మీడియా) అని చాలా మంది విశ్లేషకులు పేర్కొన్నారు. అమెరికా, యూరప్ దేశాల ఆధిపత్యం కనీకనిపించకుండా శబ్దతరంగాల రూపంలో ప్రపంచం అంతటా వ్యాపిస్తున్నాయి. ఇవి శక్తివంతమైన చిత్రాలవ్వచ్చు. శబ్దాలవ్వచ్చు; వార్తా ప్రకటన రూపంలో వీటిని ఎలా ఎదుర్కోవాలో తెలియని ప్రజానీకాన్ని ప్రభావితం చేసి తమ గుప్పెట్లో పెట్టుకొంటున్నాయి. వీటి ధ్యేయం ఒకటే – పెట్టుబడిదారీ సంస్థల పెట్టుబడి విలువని పెంచడం. ప్రపంచీకరణ గురించి ప్రబలి ఉన్న చర్చల్లో ప్రధాన అంశం వార్తా మాధ్యమాల ప్రమేయం గురించే. ఇది...అయితే ఇది ఒక కోణం మాత్రమే. ఇటువంటి సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ ముందుకొచ్చిన వేరే గొంతులు ఇంకెన్నో ఉన్నాయి. నిర్మాణపరంగా, వ్యవస్థాపరంగా మారుతున్న మధ్యమాలు, టి.వి, రేడియో, మ్యూజిక్, ఫిల్మ్ ఇవన్నీ ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న, అందరికీ తెలిసిన 'సత్యాలని' జ్ఞానాన్నీ ప్రశ్నిస్తున్నాయి.

ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ దేశాల్లో వలసవాదం అస్తమిస్తున్న తరుణంలో వందలాది జాతి రాజ్యాలు ఉద్భవించిన తర్వాతి కాలంలో సాంస్కృతిక సామ్రాజ్యవాదంపై చర్చలు తారాస్థాయికి చేరాయి. వలసవాదం చనిపోయిన లేదా అవసాన స్థితికి చేరుకున్నప్పటికీ, దాని స్థానంలో కొత్త రూపంలో పెట్టుబడిదారీ వ్యవస్థ మూడవ ప్రపంచ దేశాలని లోబర్చుకునే ప్రయత్నాలు చేపట్టింది (1960ల నుంచీ మూడవ ప్రపంచ దేశాలనటం పదం మొదలైంది). దీనిలో రాజకీయాంశాల కంటే ఆర్థిక అంశాలకి; మిలటరీ ఆధిపత్యం స్థానంలో, భావజాలపరమైన ఆధిపత్యానికి ప్రాబల్యం ఎక్కువ. ఈ ప్రయత్నాలనే మేధో చర్చలో నయా వలసవాదం అని పిలుస్తారు. రాజ్యాధికారం ద్వారా మిలటరీ బలగాలనుపయోగించడం ఆచరణలో సాధ్యం కాదు కాబట్టి, నయా వలసవాదులు సాంస్కృతిక, ప్రతీకాత్మక, చిహ్నాలు, మానసిక నియంత్రణా పద్ధతులని ఎన్నుకొన్నారనీ; దీనికి అతివేగంగా ప్రపంచ వ్యాప్తంగా ఏకీకృతమై, వ్యాప్తి చెందిన వార్తాప్రసార మాధ్యమాలు, ముఖ్యంగా టెలివిజన్ చేయూత నిచ్చిందనేది ముఖ్యాంశం.

అమెరికన్ సంస్కృతిలో భాగమైన వినిమయతత్వం, కోరుకొన్నది వెనువెంటనే పొందాలనే తపన (instant gratification), ఎంతసేపూ తన గురించి మాత్రమే ఆలోచించుకొనే మనస్తత్వం వంటి విలువలు అందరికీ వ్యాపింప చేసి ప్రాచుర్యం కలిగించిన కొత్త మీడియా సంస్థలు ప్రపంచ పెట్టుబడిదారీతనానికి ఊపిరిపోస్తూ కమ్యూనిస్టు భావజాలంతో సోవియట్ రష్యా ఆధ్వర్యంలో ఉన్న రెండవ ప్రపంచ దేశాల మీద జరిగే సంఘర్షణలకి మద్దతునిచ్చాయి.

సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్భవించిన వాదనలు ఒక కొత్త ప్రపంచ సమాచార విధానం(NWIO) ఏర్పడాలని ఒక బలమైన పిలుపునిచ్చాయి. పాశ్చాత్య వార్తా ప్రసార సంస్థలు తమ మీద తెచ్చిన ఒత్తిడిని తట్టుకోలేకపోయిన అభివృద్ధి చెందని చిన్న దేశాలు యునెస్కో, ఇతర ఐక్యరాజ్యసమితి వేదికలలో పాశ్చాత్య సాంస్కృతిక ప్రచారంపై కట్టుబాట్లు ఉండాలని, తమ తమ సమాచార వ్యవస్థలని అభివృద్ధి చేసుకోవడానికి నిధులు ఇవ్వాలని వాదించాయి. అలాగే ప్రపంచంలోని నలుమూల్లో ఉన్న వార్తాపత్రికలకి ప్రపంచ వార్తలను అందించే అమెరికాకి చెందిన అసోసియేట్ ట్రస్ట్, యునైటెడ్ ప్రెస్ ఇంటర్నేషనల్, టెలివిజన్‌కి బ్రిటీష్ సంస్థ అయిన 'ర్యూటర్స్', ఫ్రాన్స్‌కి చెందిన 'ఏజెన్స్ ఫ్రాన్స్' ప్రెస్ కీలక ప్రపంచ వార్తాప్రసార సంస్థల పక్షపాతంతో కూడిన ప్రాపంచిక దృక్పథం అని వాదించాయి. ఈ చర్చల వలన పెద్ద మార్పులేవీ జరగలేదు. దీనికి కారణం తమ తమ దేశాల్లోని కొత్తగా ఏర్పడిన దేశాలు వార్తా ప్రసార మాధ్యమాలని పూర్తిగా కైవసం చేసుకొన్న ఆయా దేశాల ప్రభుత్వాలు రేడియో, టి.వి ప్రధాన వార్త పత్రికలు అన్నిటినీ తమ దేశ ప్రభుత్వ విధానాలని ప్రచారంచేసే సాధనాలుగా మార్చేసుకున్నాయి.

రూపర్టు ముర్డాక్ వార్తా కార్పొరేషన్ వంటి ఆక్రమణదారులైన కంపెనీలు వేరే కంపెనీలను కొనుగోలు చేయడం ద్వారా, కలిపేసుకోవటం వలన భారీ మీడియా సమ్మిళిత కంపెనీలు ఏర్పడ్డాయి. వీటికి ప్రపంచం మొత్తానికి వార్తా ప్రసారాలు చేయగలిగే శక్తి ఉంది. టెడ్ టర్నర్ స్థాపించిన కేబుల్ న్యూస్ నెట్‌వర్క్ (CNN) మొదట్లో ధక్కామొక్కీలు తిన్నప్పటికీ సర్వాంతర్యామిగా తయారయింది. అదే సమయంలో ప్రపంచ మీడియా పరిశ్రమ వికేంద్రీకరణకు గురయ్యింది; ప్రపంచంలోని వివిధ మూలల్లో ప్రాంతీయ వార్తా ఉత్పత్తి కేంద్రాలు తయారయ్యాయి : స్పానిష్ భాష టెలివిజన్ కార్యక్రమాలకు మెక్సికో; సినిమాల కోసం భారతదేశం; తూర్పు ఆసియా సినిమాలు, టెలివిజన్ కోసం హాంగ్‌కాంగ్ మొదలగునవి. అలాగే పాశ్చాత్య దేశాల్లో రూపొందిన కార్యక్రమాలు క్రమంగా దేశవాళీ రంగు, వాసనలు సంతరించుకోవటం ప్రారంభించాయి. అమెరికాలో బాగా ప్రాచుర్యం పొందిన 'డల్లాస్' టెలివిజన్ షోరూమ్ రూపుమార్చుకుని బ్రెజిలియన్ సోప్ ఒపేరాలుగా, మెక్సికోలో టెలినావెల్లాగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు తమ రోజువారీ జీవితాలను మీడియా ద్వారా ఎక్కువగా దర్శించుకుంటున్నారు. అయితే దానివల్ల అందరూ ఒకేరకంగా మారిపోతున్నారని ఇదివరకంత ఖరాఖండిగా మాత్రం చెప్పలేము.

**అనువాదం: దుగ్గిరాల వసంత**

# తెలుగు మీడియాపై కార్పొరేట్ యాజమాన్యాల అడ్డగోలు ఆధిపత్యం

■ పంతుకాల శ్రీనివాస్

మారుతున్న మీడియా యాజమాన్య ముఖచిత్రం రాజకీయ నాయకులకి, వ్యాపార వేత్తలకి, రియాల్టర్‌లకి, పెట్టుబడిదారులకి ఎన్నో కొత్త అవకాశాలని తెచ్చి పెట్టింది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోను మరియు తెలంగాణలోను కూడా మీడియా వ్యవస్థ పెట్టుబడిదారి వర్గాలు, రాజకీయ నాయకులు, చిట్‌ఫండ్ కంపెనీలు, విత్తన వ్యాపారులు; ట్రస్టులు, సొసైటీలు, సారా వ్యాపారులు స్టాక్ హోల్డర్ల ఆధీనంలో ఉంది. పాత్రికేయ యజమానులు అరుదు. మన దేశంలో మీడియాపై అడ్డగోలు ఆధిపత్యానికి కారణం ఇక్కడ ఎలాంటి నియమ నిబంధనలు లేకపోవడం. దీనివల్ల వార్తా పత్రికలని, టెలివిజన్ ఛానెళ్ళని, ఎఫ్.ఎమ్ రేడియో స్టేషన్లని ఎవరైనా ప్రారంభించవచ్చు.

మన భారతదేశ మీడియా పరిధిలో ఉన్న ప్రచురణ సంస్థలు, రేడియో స్టేషన్‌లు, టెలివిజన్ ఛానెళ్ళు, ఇంటర్నెట్ వెబ్‌సైట్లు వినియోగదారుల అభిమతానికి, విభిన్నతకి, బహుళాత్మక ప్రయోజనాలకి ఒక భరోసా ఇస్తున్నామని అంటుంటాయి. మార్చి 31, 2011కి 82 వేల ప్రచురణ సంస్థలు రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్‌లో నమోదు కాబడ్డాయి. ప్రపంచ దేశాల్లో కెల్లా ఒక్క భారత దేశంలోనే రేడియోపై ప్రభుత్వ గుత్తాధిపత్యం ఉన్నప్పటికీ 250 ఎఫ్.ఎమ్ రేడియో స్టేషన్లు నడుస్తున్నాయి. సమాచార మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ 800 టెలివిజన్ ఛానెల్స్‌ని మన దేశం నుండి అప్ లింక్ మరియు డౌన్ లింక్ చేసుకోవడానికి అనుమతి నిచ్చింది. అందులో 300 ఛానెళ్ళు వార్తలు మరియు వర్తమాన సమాచారం అందించేవి. ఇక సోషల్ మీడియా వెబ్‌సైట్‌ల కయితే లెక్క లేదు. మన దేశంలో సగం జనాభాలో పేదరికం, నిరక్షరాస్యత ఉన్నప్పటికీ ఇక్కడ సమాచార స్రవంతి ఈ రకంగా విస్తరించడం అభినందించదగ్గ విషయం.

అయితే ఈ విస్తరణ, మీడియాకున్న శక్తి ప్రజలకు ఏదైనా మంచి చేస్తోందా? మన ప్రజాస్వామ్యం ఏమైనా పరిణతి చెందిందా? మీడియాకు సంబంధించి బహిరంగ చర్చలు ఏవైనా మొదలయ్యాయా? దశాబ్దాలుగా ఉన్న సమస్యలకి మీడియా ఒక పరిష్కారమా? లేక అది కూడా సమస్యలో భాగమయి పోయిందా? తన తప్పులు తెలుసుకుని దిద్దుకునే ప్రయత్నాలు ఏవైనా మొదలు పెట్టిందా? లేక ప్రజల్లో పెరుగుతున్న పట్టింపులని క్రమబద్ధీకరిస్తుందా? ప్రజలకు ఉపయోగపడేలా వివేకవంతమైన చర్చను తీసుకువచ్చే బదులు తనకనుకూలమైన వినిమయ వ్యవస్థలో పడి ఇంకా పతనమవుతుందా ఇలాంటి చిరకాల ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి.

దక్షిణ భారత రాష్ట్రాల్లో మీడియా పరిశ్రమకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం (ఫిక్కీ మరియు కెపిఎమ్‌జి–2012) ఈ విధంగా ఉంది:

తమిళనాడులో 1,170 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 800 కోట్లు, కర్నాటకలో 560 కోట్లు. జాతీయ మీడియా (హిందీ, ఇంగ్లీష్‌లో స్తబ్ధత నెలకొన్నప్పటికీ) తో పోల్చుకుంటే దక్షిణ దేశపు ప్రాంతీయ భాషల్లో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. తెలుగు ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, రాజకీయ సంబంధాలు ఉన్న నాయకులు టెలివిజన్ మీడియాపై దాదాపు గుత్తాధిపత్యం సాధించారు. రామోజీరావు అధినేతగా ఉన్న ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్ (ఈనాడు టి.వి నెట్‌వర్క్) మరియు తెలుగు దేశం పార్టీ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. అందులో వారి వారి ఆర్థిక ప్రయోజనాలు కూడా ఒక భాగం. 1974లో ఈనాడు మొదలైనప్పటి నుండీ కూడా సంపాదకీయాల్లో కాంగ్రెస్‌కు ఎప్పుడూ సుముఖంగా లేదు. 1982 అంటే టిడిపి రాకముందు కమ్మవర్గం ఆధిపత్యంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీకి కొమ్ము కాసింది. అలాగే కాంగ్రెస్ హయాంలో వచ్చిన ఎమర్జెన్సీ రామోజీరావుకు కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరగడానికి కారణమయింది. కాంగ్రెస్ వర్గాల నియంత్రణలో ఉన్న సారా వ్యాపారాన్ని నిషేధించాలని ఈనాడు బాగా ప్రచారం చేసింది. సారా ఉద్యమ ఫలితంగా నిషేధం వచ్చింది. కాని ఇదే పత్రిక టిడిపి నిషేధాన్ని ఎత్తివేసినపుడు పెద్దగా వ్యతిరేకించలేదు.

వై.ఎస్.రాజశేఖర రెడ్డి కుమారుడు, రాజకీయ నాయకుడు అయిన జగన్‌మోహన్ రెడ్డి స్వంతంగా ఇందిరా టెలివిజన్ లిమిటెడ్ మరియు జగతి పబ్లికేషన్స్ కింద సాక్షి వార్తా పత్రిక మరియు సాక్షి టివి ఛానెల్ ప్రారంభించారు. జగన్‌మోహన్ రెడ్డి



స్థాపించిన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీని సాక్షి టివి బాహాటంగానే సమర్థిస్తుంది.

రాజకీయ ఉద్దేశ్యాలతో ప్రారంభించబడిన ప్రముఖ ఛానెల్ టి.న్యూస్. ఇది వెలమ కులానికి చెందిన ప్రస్తుత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మరియు అతని కుమారుడు కె.తారక రామారావు అధీనంలో ఉంది. తెలంగాణా బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్షుడు కెసిఆర్ మరియు అతని కుటుంబ పర్యవేక్షణలో ఈ కంపెనీ నడుస్తుంది.

టి.వి 5 మరియు ఎన్‌టివి సంస్థలు రియల్ ఎస్టేట్ మరియు విద్యుత్ వ్యాపారుల చేతిలో ఉన్నాయి. పెట్టుబడిదారీ వర్గాల చేత ప్రారంభమైన ఈ ఛానెళ్ళ ముఖ్య ఉద్దేశ్యం ఏదో రకంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి తమకు అనుగుణంగా మార్చుకోవడమే. ఐ న్యూస్ అనే ఛానెల్ ఎమ్.ఆర్.ఐ విద్యా సంస్థలచే ప్రారంభించబడింది. స్టూడియో ఎన్ ఛానెల్ వెనుక ప్రస్తుత ఆంధ్ర ముఖ్యమంత్రి దన్ను ఉంది.

ఈ మధ్యనే సిపిఐ (ఎమ్) టివి 10 న్యూస్ ఛానెల్‌ని ప్రారంభించి అందులో తమ పార్టీ కార్యకలాపాలను ప్రచారం చేస్తోంది. సిపిఐ కూడా టివి 99 టెలివిజన్ న్యూస్ ఛానెల్‌ని మొదలు పెట్టింది. ఒక్క ఛానెల్‌తో ప్రారంభమైన ఈ టివి మరియు మాటివి అతికొద్ది కాలంలోనే వివిధ నెట్‌వర్క్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. ఇప్పుడు మార్కెట్‌లో వాటికున్న విలువతో పెద్ద కంపెనీలతో విలీనమై బిజినెస్ కార్పొరేషన్లుగా అవతరించాయి. రూపర్ట్ మర్డోచ్ బిజినెస్ తరహాలో అంతర్జాతీయ స్థాయితో వివిధ ప్రాంతాల్లోని రాజకీయాలను ప్రభావితం చేస్తూ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నాయి. ఇక్కడ ప్రముఖంగా చెప్పుకోవలసింది మా టివి యాజమాన్యం గురించి. ఇది న్యూస్ ఛానెల్ కానప్పటికీ, ఇతర వ్యాపారాల్లో ఉన్న పట్టు మరియు రాజకీయ సంబంధాలు దాని ప్రాముఖ్యతకు కారణం. ప్రముఖ నటులు, చిరంజీవి, అక్కినేని నాగేశ్వరరావు కుటుంబాలు మరియు నిమ్మగడ్డ ప్రసాదరావు మా టి.వికి వాటాదారులుగా ఉన్నారు. సినిమా ఇండస్ట్రీ మరియు ఇతర వ్యాపార సంస్థల అండలో ఛానెల్ బాగా అభివృద్ధి చెందడమే కాక సోనీ పిక్చర్స్ టెలివిజన్ నెట్‌వర్క్‌తో విలీనమయింది. నిమ్మగడ్డకు సాక్షి టివి మరియు ఇతర వ్యాపారాల్లో కూడా వాటా ఉంది. టివి 9 కూడా పెద్ద కార్పొరేషన్లతో విలీనమవడానికి ప్రయత్నిస్తుందని సమాచారం.

ఇండియాలోనే కాదు ప్రపంచంలోనే పెద్ద మీడియా కార్పొరేషన్లు తమ కార్యకలాపాలలో భాగంగా రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. మన దేశంలో ప్రముఖ అంతర్జాతీయ టెలివిజన్ బ్రాడ్ కాస్టింగ్ నెట్ వర్క్‌లయిన టర్నర్/సి.ఎన్.ఎన్, వయాకామ్, మా టివి, ఆర్.ఐ.ఎల్, నెట్‌వర్క్ 18 మరియు సోనీ ప్రాంతీయ నెట్‌వర్క్‌లతో కలిసి పనిచేస్తున్నాయి. అంతేకాక, తెలుగు ప్రాంతాల్లోనే కాక దేశం మొత్తం మీద ఏకీకరణ కేంద్రీకరణ సాధించే దిశగా పావులు కదులుతున్నాయి. ఉదాహరణకు 2015లో స్టార్ టివి నెట్‌వర్క్ చేతిలోకి అన్ని మా టివి బ్రాడ్‌కాస్ట్ చానెల్స్ వెళ్లిపోయాయి.

అంకం రవి, V6 న్యూస్ సి.ఇ.వో మరియు వార్తా సంపాదకుడి మాటల్లో "మీడియా ఇలా విస్తరించడానికి కారణం వ్యయం అందుబాటులో ఉండడం. తక్కువ ఖర్చుతో అంటే 10 నుంచి 15 కోట్లు ఉంటే చాలు ఎవరైనా ఛానెల్ ప్రారంభించవచ్చు. సాంకేతిక విజ్ఞానం కన్నా విషయ పరిజ్ఞానం ముఖ్యం. చెప్పే విషయంలో విభిన్నత ఉండాలి, ఆకర్షణీయంగాను చెప్పగలగాలి. కాని ప్రజల్ని చేరే గమనంలో చాలా ఇబ్బందులు ఉన్నాయి. పైగా ఇప్పుడు పంపిణీ వ్యవస్థ కొన్ని మీడియా సంస్థల అధీనంలో ఉంది. వాటిని మనం వ్యాపార వాణిజ్య సంస్థలుగానే చూడాలి తప్ప వాటి నుంచి ఒక సామాజిక బాధ్యతను ఆశించలేము. 2009లో జరిగిన సాధారణ ఎన్నికలలో మీడియా ప్రభావం 30% ఉంటే 2014 వచ్చేసరికి అది 100% ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఛానెల్స్ పెరిగి పోవడంతో 2019లో జరగబోయే ఎన్నికలలో ఎలాంటి ప్రభావం ఉండకపోవచ్చు. ప్రజలని మోసం చేయడం కష్టం కావచ్చు. ప్రజాస్వామ్యానికి ఇది చాలా మంచిది." (వ్యక్తిగత ఇంటర్వ్యూ, 2013).

అయితే విజయ్ నర్రా అభిప్రాయం దీనికి భిన్నంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని టెలివిజన్ పాత్రికేయ స్వరూపం గురించి మాట్లాడుతూ "ఇంతకు ముందు పాత్రికేయులకి, ఇప్పటి వారికి మధ్య చాలా తేడా ఉంది. ఇప్పుడు పాత్రికేయులు మీడియా దిగ్గజాల వశంలో ఉన్నారు. వారి ఆదేశాల మేరకే వార్తల సేకరణ కాని, వాటి ప్రెజెంటేషన్ గాని ఉంటుంది. పాత్రికేయులకి స్వతంత్రంగా వార్తలు సేకరించే అవకాశం లేదు. అంతేకాక వారి యజమానుల ఇష్టాయిష్టాలు, నియమ నిబంధనలను అనుసరించి పని చేయాల్సి వస్తుంది." (వ్యక్తిగత ఇంటర్వ్యూ 2013)

మీడియాపై అడ్డగోలు ఆధిపత్యం గురించి ఉస్మానియా యూనివర్శిటీలో కమ్యూనికేషన్ మరియు జర్నలిజమ్‌లో పని చేస్తున్న పద్మజా షా మాట్లాడుతూ "సమాచారంపై ఒక్కరిదే ఆధిపత్యం ఉంటే అది చింతించాల్సిన విషయమే. ఈరోజు ఈనాడు వార్తా పత్రికలలో మొదటి స్థానంలో ఉంది. కాని ఈటివి పెద్దగా పనిచేయడం లేదు. టివి 9 మరియు టివి 5కి వార్తాపత్రికలు లేవు కాని టివి ఇండస్ట్రీలో అవి బాగా పని చేస్తున్నాయి. మంచి మార్కెట్ ఉంది. సమస్య ఎక్కడొస్తుందంటే రెండు మూడు ఛానెళ్ళకి రాజకీయ పార్టీల దన్ను కుదిరినప్పుడు. దీనినే సమాచార ఒప్పందం అంటారు."

మీడియాపై విభిన్న వర్గాల ఆధిపత్యం మరియు సమాజంపై దాని ప్రభావం గురించి మాట్లాడుతూ మధుసూదన్ పమిడి కాలువ ఇలా వివరించారు,

"మీడియాపై అడ్డగోలు ఆధిపత్యం భవిష్యత్తులో సమాజంపై చాలా దుష్ప్రభావం చూపిస్తుంది. ఈ రోజు 20 కోట్ల పెట్టుబడితో టెలివిజన్ ఛానెల్ ప్రారంభించవచ్చు. అదే ఒక ముద్రణా సంస్థను ప్రారంభించాలంటే 400 నుండి 600 కోట్ల వరకు కావాలి. ఒక పాత్రికేయుడివల్లో లేక కొంతమంది వల్లో ఇది సాధ్యంకాదు, కేవలం బహుళజాతి సంస్థలు లేదా ఏవైనా వ్యాపార సంస్థలు కలిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఒక్కసారి టి.వి, రేడియో మరియు వార్తాపత్రికలు వారి నియంత్రణలోకి వెళ్ళాక ప్రజలకు ఎంపిక చేసుకునే అవకాశం ఉండదు. ఇంకో ప్రక్క విస్సా టి.వి; జీ 24 గంటలు, హెచ్.టి.వి, ఆర్.వి.ఎస్, ఆర్కే న్యూస్ సాటిలైట్ ప్రసారాలు సాగిస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాయి. ఆసియా నెట్ సితార, సత్య టి.వి మరియు తులసి టి.వికి ఇంకా ఆ పరిస్థితి రాలేదు. నష్టాల్లో ఉన్నప్పటికీ వాటికున్న నేపథ్యం వల్ల ఇంకో ఒకటి రెండేళ్ళు నడవగలవు. రాజ్.టి.వి, ఎన్.టి.వి, స్టూడియో ఎన్.ఛానెళ్ళు పూర్తిగా వాణిజ్యాత్మకంగా మారకపోతే ఎక్కువ కాలం మనలేవు. మన మొత్తం టెలివిజన్ నెట్‌వర్క్‌లో జీ నెట్‌వర్క్ ఎక్కువ

**టెలివిజన్ కంపెనీలు : విలీనమైనవి మరియు స్వాధీన పరచుకున్నవి**

| నెం | మీడియా సంస్థ | కొత్త భాగస్వామ్యం | విలీనమైనవి |
|---|---|---|---|
| 1 | ఈనాడు టివి | ఆర్.ఐ.ఎల్. మరియు నెట్‌వర్క్ 18 50% (5 ఛానెల్లు) మరియు 25.4% 12 తెలుగు ఛానెళ్ళు జనవరి 2012 నాటికి | నెట్‌వర్క్ 18 సంస్థల ప్రాంతీయ విస్తరణ కొరకు |
| 2. | మా టివి | సోనీ పిక్చర్స్ టెలివిజన్ 30% 2012, ఏప్రిల్ నాటికి 2015లో స్టార్ టెలివిజన్ మా టివి ని కొనుక్కుంది. | సోనీ పిక్చర్స్ టెలివిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంతీయ విస్తరణ కొరకు |
| 3. | టివి 9(?) | | |

(ఫిక్కీ మరియు ఆధారంగా కె.పి.ఎమ్.జి రిపోర్ట్ 2013)

**ఆంధ్రప్రదేశ్‌లోని మీడియాపై విభిన్న మీడియా సంస్థల ఆధిపత్యం.**

| నెం. | టి.వి వార్తా ఛానెల్ పేరు మరియు సంస్థ | ముద్రణా సంస్థ | రేడియో | టి.వి | ఇంటర్నెట్ | ఎం.ఎస్.ఓ డి.టి.హెచ్ |
|---|---|---|---|---|---|---|
| 1. | జెమిని వార్తా ఛానెల్ సన్ నెట్ వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ | √ | √ | √ | √ | √ |
| 2. | ఈనాడు టి.వి 2 ఉషోదయా ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ | √ | | √ | √ | |
| 3. | టి.వి 9 అసోసియేషన్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 4. | ఎన్.టి.వి రచనా టెలివిజన్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 5. | టి.వి 5 శ్రేయ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 6. | హెచ్.ఎమ్.టి.వి హైదరాబాద్ మీడియా హౌస్ లిమిటెడ్ | √ | | √ | √ | |
| 7. | ఐ న్యూస్ ఇంటిగ్రేటెడ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 8. | సాక్షి టి.వి ఇందిరా టెలివిజన్ ప్రైవేట్ లిమిటెడ్ | √ | | √ | √ | |
| 9. | మహ టి.వి మోనికా బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 10. | జీ 24 గంటలు జీ టెలివిజన్ నెట్ వర్క్ లిమిటెడ్ | | | √ | √ | √ |
| 11. | స్టూడియో ఎన్ | | | √ | √ | |
| 12. | ఎ.బి.ఎన్. ఆంధ్రజ్యోతి ఆమోద బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | √ | | √ | √ | |
| 13. | హెచ్.వై.టి.వి పాజిటివ్ టి.వి ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | | |
| 14. | టి.న్యూస్ తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | √ | |
| 15. | వి 6 న్యూస్ వి.ఐ.ఎల్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ | | | √ | | |
| 16. | 10 టి.వి న్యూస్ స్ఫూర్తి కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ | √ | | √ | √ | |
| 17. | సి.వి.ఆర్ న్యూస్ | | | √ | | |

మూలం : సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ మరియు ఇతర సమాచారం నుండి

లాభాల్లో ఉంది. కాని అది వార్తా ఛానెల్‌గా మాత్రం విజయం సాధించలేదు. ఇప్పుడది ఒక రాజకీయ పార్టీ కోసం కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తోంది. వాటి ఒప్పందం ముగిసిన తర్వాత జీ న్యూస్ భవిష్యత్తు ఏమిటి అనేది ఎవరూ చెప్పలేరు. మొత్తం మీద, టెలివిజన్ ఛానెల్ ప్రారంభించడం అనేది పెద్ద ఖర్చుతో కూడిన పని కాని, భారం కాని కాదు" (వ్యక్తిగత ఇంటర్వ్యూ 2013).

మీడియా కార్పొరేటైజేషన్ మరియు అడ్డగోలు ఆధిపత్యం అనేది చాలా ప్రమాదకరంగా మారుతోంది. నిలువుగాను, అడ్డంగాను అన్ని రంగాల్లోను వ్యాపిస్తున్న కార్పొరేషన్లకి ఇది ఒక ఆయుధం. ఇలా అనేక శక్తుల మిశ్రమం పోటీని తగ్గించి వేయడమే కాక కొత్తవారికి, చిన్న వ్యాపారులకు రావడానికి అవకాశం ఇవ్వదు. మీడియాపై మిశ్రమ శ్రేణుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాల్సిందిగా ఒక రిపోర్టు[1] కొన్ని సూచనలు చేసింది. ఆ రిపోర్టు ప్రకారం కొన్ని ప్రత్యేక మీడియా సంస్థలకి మార్కెట్ ఆధిపత్యం ఉన్నట్లు పక్కా ఆధారాలు ఉన్నాయి. కాబట్టి మీడియాపై ఆధిపత్యాన్ని గురించి నియమావళి రూపొందించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా జాతీయ మార్కెట్‌లో కన్నా ప్రాంతీయ మార్కెట్‌లో దీని అవసరం ఎక్కువ ఉంది.

కాంగ్రెస్ ఎమ్.పి రావు ఇంద్రజిత్‌సింగ్ ఆధ్వర్యంలోని స్టాండింగ్ కమిటీ మీడియా ఆధిపత్యంపై నిబంధనలు ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అంతర్జాతీయ పద్ధతుల ననుసరించి ట్రాయ్ సహాయంతో నియమాలు రూపొందించాల్సిందిగా సంబంధిత మంత్రిత్వ శాఖను కోరింది. ఈ నియమాల పట్ల మీడియా వర్గాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. వాటి వాదన ప్రకారం ఇలాంటి నిర్ణయాలు అభివృద్ధిని నిరోధిస్తాయి; మీడియా మిశ్రమం బహుళత్వం, క్రమబద్ధీకరించని ఇండియన్ మార్కెట్ ఏకీకరణను నిరోధిస్తాయి; అంతేకాక మన వాక్ స్వాతంత్ర్యపు హక్కుపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

ఈ ధోరణి వల్ల ప్రత్యామ్నాయ దారులు, మీడియా మార్గాలు ప్రధాన స్రవంతి నుండి మటుమాయం అవుతాయి. అనంతంగా, అడ్డులేకుండా, సాంస్కృతిక ఏకశిలాసదృశ్యంగా మారుతున్న మీడియా ప్రజాస్వామ్య హద్దులను దాటిపోకుండా ఉండాలంటే భారతీయ టెలివిజన్ ప్రసారాల క్రమబద్ధీకరణ, మీడియా తనని తానే క్రమబద్ధీకరించుకోవటం అత్యవసరం.

**అనువాదం: డి. సుజాత**

రచయిత ఇఫ్లూలో అధ్యాపకులు

[1] పూర్తి నివేదిక కొరకు కింది లింకును చూడండి http://www.mib.nic.in/WriteReadData/*documents*/ascstudyreport230312.pdf

# పుస్తక సమీక్ష:
# ఎడ్వర్డ్ సయీద్, *కవరింగ్ ఇస్లాం*

## (లండన్: వింటేజ్ బుక్స్ 1997)

■ **అయేషా ఫరూకీ**

***ఇస్లాం,*** *ముస్లింలు, పాశ్చాత్య ప్రపంచానికి మధ్య గల సంబంధాల గురించి ఎడ్వర్డ్ సయీద్ రాసిన మూడు పుస్తకాల (ట్రైలజీ)లో చివరిది. మొదటి రెండు: ఓరియెంటలిజం (1978); పాలస్తీనా సమస్య (1979).*

ఈ పుస్తకం 'ఇస్లాం గురించి జరిగే ద్వేషపూరితమైన సూత్రీకరణలు', ముస్లింలని 'హింసాపూరిత, అవివేకమైన, మూఢ భక్తి గల, కామాంధులు'గా చూపించే ధోరణుల గురించి చర్చిస్తుంది, ఇరానియన్ విప్లవం, ఆ తరువాత అక్కడ (జిమ్మీ కార్టర్ ఇరాన్ పట్ల అనుసరిస్తున్న విధానాలని నిరసిస్తూ) 60 మంది అమెరికన్ దౌత్య సిబ్బందిని సంవత్సరం పైగా ఇరానియన్ విద్యార్థులు బందీలుగా తీసుకోవటం వల్ల కలిగిన అంతర్జాతీయస్థాయి దౌత్య సంక్షోభం, 1991సంవత్సరంలో జరిగిన గల్ఫ్ యుద్ధం, ప్రపంచ ట్రేడ్ సెంటర్‌పై 1993లో జరిగిన బాంబుదాడి, ఆ తరువాత ప్రసార మాధ్యమాల్లో పెరిగిన ప్రతికూల ధోరణులు – ఈ సంఘటనలు అన్నింటి గురించి పాఠకులతో సయీద్ సంభాషిస్తాడు.

ఇరానియన్ విప్లవం, బందీల సంక్షోభం జరిగిన వెంటనే 1981లో ఈ పుస్తకం మొట్టమొదట ప్రచురించబడింది. 1997లో తిరిగి తరువాతి పరిణామాలను కూడా పరిగణనలోనికి తీసుకుని, కొత్త పరిచయంతో పునర్ముద్రించబడింది. 1981లో, 1997లో, ఇప్పుడూ కూడా, ఇస్లాం ప్రసార మాధ్యమాల తీక్షణ దృష్టికి గురవుతూనే ఉంది.

ఓరియెంటలిజంలో ప్రతిపాదించిన కొన్ని కీలక భావనల్ని కవరింగ్ ఇస్లాం పుస్తకంలో సయీద్ విశదీకరిస్తాడు. ఓరియెంటలిజం పుస్తకంలో సయీద్ జ్ఞానం అధికారంతో ముడిపడి ఉంటుందని ప్రతిపాదిస్తాడు. పాశ్చాత్య దేశాలు ఇస్లాం గురించి, ఇస్లామిక్ ప్రజల గురించిన జ్ఞానాన్ని ఓరియెంటలిజం అన్న జ్ఞాన దృక్కోణం ద్వారా ఉత్పత్తి చేస్తాయి; అది కేవలం వారి ఆధిపత్యం, వారికి ఆయా 'ఇస్లామిక్' దేశాలతో ఉన్న ఘర్షణల నుండే కాక, సాంస్కృతిక విరోధం నుండి కూడా రూపుదిద్దుకుంది. ఇస్లాంని పాశ్చాత్య ప్రపంచానికి పూర్తి విరుద్ధమైనదిగా నిర్వచించారు. వారికి తెలియని సంస్కృతిని, ప్రజలని 'అన్యులు'గా సూత్రీకరించే ఈ 'అన్యత్వ' దృక్కోణం వారు ఇస్లాం గురించి తెలుసుకోగలిగిన జ్ఞాన పరిధులను తీవ్రంగా తగ్గించింది. ఇటువంటి అన్యత్వ దృక్కోణం పాశ్చాత్య ప్రపంచంలో చెల్లుబాటులో ఉన్నంత కాలం, ఇస్లాంని 'ముఖ్యమైన జీవన విధానంగా లేదా జీవితానుభవం'గా అర్థం చేసుకోవటం అసాధ్యం అని' సయీద్ అంటారు. ఓరియెంటలిజం అనే జ్ఞాన నిర్మాణంలో ఉన్న మౌలిక లోపం ఇస్లాంకు ఒక సార్వత్రిక గుణాన్ని ఆపాదించటం. సయీద్ మాటల్లో, "ఇది ముస్లింలపై, ఇస్లాంపై ఒక దౌర్జన్యపూరిత దాడి. ఇది సామ్రాజ్యవాదం విధించిన పాత్రలలో ఇమడమని ముస్లింలను బలవంత పెడుతుంది".

కవరింగ్ ఇస్లాం పుస్తకంలో మూడు ప్రధాన అధ్యాయాలు ఉన్నాయి. అవి 'ఒక వార్తగా ఇస్లాం', 'ఇరాన్ వృత్తాంతం', మూడవది 'జ్ఞానం మరియు అధికారం'. మొదటి అధ్యాయం 'ఒక వార్తగా ఇస్లాం'లో సయీద్ ఇస్లాంకు, క్రైస్తవ పాశ్చాత్య ప్రపంచానికి ఉన్న సంబంధాల చరిత్రని, ముఖ్యంగా యూరోప్‌కు మధ్య యుగాల్లో ఇస్లామిక్ సైన్యాలు కలిగించిన భయం జాడల్ని గురించి చర్చిస్తాడు. పాశ్చాత్య దేశాల మస్తిష్కాన్ని ఈ భయం నీడలు ఇంకా పట్టి పీడిస్తున్నాయని ఆయన వాదిస్తాడు. ఇస్లాం గురించి పాశ్చాత్య ప్రపంచంలో ప్రబలి ఉన్న ఈ రకమైన భయానికి లోతయిన మత మూలాలు ఉన్నాయి; ఇక్కడ ఇస్లాంని క్రైస్తవానికి పోటీగా చూస్తారు. ఈ రకమైన భయమే పాశ్చాత్య దేశాలన్నిటిలోనూ ఇస్లాం వ్యతిరేక మనోభావాలని ప్రేరేపిస్తుంది.

ఈ భాగంలో అమెరికన్లకు, పాశ్చాత్య ప్రపంచానికి ఇస్లాం, ముస్లింలు అంటే తెలియదని చెప్తూ, వారికి ఇస్లాం గురించి తెలిసిందల్లా 'ప్రాస యోగ్యమైన అంశాలై'న చమురు, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ లేదా ఉగ్రవాదం అని ఎత్తి చూపుతారు. ఈ విషయాలని కవర్ చేసే క్రమంలో వారి మీడియా ఇస్లాంని మరుగుపరిచి, కప్పిపెడుతుంది. కవరింగ్ ఇస్లాంకి ద్వందార్థాలున్నాయన్న మాట. ఒక విషయం గురించి రాయటంతో పాటే ఆ విషయాన్ని గురించిన సత్యాలని మరుగున పెట్టటం, దాయటం లేదా కప్పేసి ఉంచటం. మరుగుపరిచిన విషయాలు వెల్లడించిన విషయాలకి విరుద్ధంగా ఉంటాయి. ముస్లింలను 'ప్రచ్ఛన్న ఉగ్రవాదులు' గా, 'చమురు సరఫరా దారులు'గా చూపే చిత్రీకరణ వల్ల శాంతియుతంగా వర్ధిల్లిన ఇస్లామిక్ సంస్కృతి, చరిత్ర, తర్కశాస్త్రం, ఖగోళ శాస్త్రం, వైద్య శాస్త్రంలో అగ్రగాములుగా, మార్గదర్శులుగా ఉన్న వారి వృత్తాంతాలు, వారు ఆల్జీబ్రాని కనిపెట్టిన సత్యం మరుగున పడిపోయాయి.

'ఒక వార్తగా ఇస్లాం' అధ్యాయం ఏ వార్తనైనా ప్రచురణ యోగ్యమని ఎలా నిర్ధారిస్తారో చర్చిస్తుంది. వార్త అన్నది ఒక జడ పదార్థం కాదు; సంక్లిష్ట మార్గాల ద్వారా జరిగే ఉద్దేశపూర్వక ఎంపిక ఫలితమే వార్త అని సయీద్ అంటారు. "పాత్రికేయులు, వార్తా సంస్థలు, నెట్‌వర్క్‌లు జాగ్రత్తగా దేన్ని గురించి రాయాలి, ఎలా రాయాలి అని నిర్ణయిస్తారు. అమెరికన్ ప్రసార మాధ్యమాలు, వారి వారి పాత్రికేయులు తమ ప్రభుత్వ విధానాలు నిర్దేశించిన చట్రంలోనే బయటి ప్రపంచాన్ని గురించిన సమాచారాన్ని సేకరిస్తారు". ఒక వాక్యంలో చెప్పాలంటే, ఇంధన కార్పొరేట్ సంస్థలు, యూదు మతవాదులు, రక్షణ పరిశ్రమలు, రహస్య సమాచార విభాగాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే వర్గాలే ఏ విషయాలు 'ప్రచురణా లేదా వార్తా యోగ్యమో' నిర్ణయిస్తాయి".

అమెరికన్ పౌరులకు వారి మీడియా సత్యాలను అంత సులువుగా అన్నిసార్లు అందించదని సయీద్ భావన. "వాస్తవ ప్రపంచంలో చిత్రాలు, ఆలోచనలు ఎగసిపడి మన కళ్ళకి, మెదడుకి అగుపించవు; సత్యం మనకే నేరుగా లభ్యం కాదు". ఈ పచ్చ కామెర్ల దృష్టి వాస్తవ ప్రపంచం లోని కొన్ని ప్రత్యేక అంశాలను గురించి మీడియా చేసే వర్ణనల వలన ఏర్పడుతుంది.

'ఇరాన్ వృత్తాంతం' గురించిన తరువాతి అధ్యాయం పాశ్చాత్య ప్రపంచం ఇరానియన్ విప్లవాన్ని, అక్కడి రెజా షా పహల్వీను తొలగించటం, బందీల సంక్షోభం గురించి చర్చిస్తుంది. బంధీల సంక్షోభం సందర్భంలో మీడియా కవరేజ్ గురించి మాట్లాడుతూ, సయీద్, దానిలో "పడికట్టు పదాలు, వ్యంగ్య చిత్రాలు, అజ్ఞానం, స్వచ్ఛమైన స్వజాతి వ్యామోహం. తప్పులు కోకొల్లలుగా ఉండేవి; 'మనం' (అమెరికన్లు) 'సాధారణం'గా ప్రవర్తిస్తే, వారు (ఇరానియన్లు) ధర్మాగ్రహంతో పూనకం వచ్చినట్లు ఊగిపోయారనీ, మాససిక రోగుల్లా ప్రవర్తిస్తున్నారనీ, మతం కోసం వీర మరణాన్ని కాంక్షిస్తున్నారనీ" రాసారు. అమెరికన్ మీడియా ఖొమేనిని ఇరాన్‌ను ఏడవ శతాబ్దానికి ఈడ్చుకెళ్లాలని ప్రయత్నిస్తున్న తలపాగా ధరించిన మధ్యయుగ నియంతగా చిత్రించింది. ఇరాన్, ఆయతొల్లా ఖొమేనిల్లో వారికి ఉగ్రవాదం నుండి, పాశ్చాత్య వ్యతిరేకత వరకు ఇస్లాంలో ఉండే అభ్యంతరకరమైన అంశాలన్నీ కనిపించాయి. విప్లవకారులను షా పహల్వి ప్రవేశపెట్టిన ఆధునికతకి వ్యతిరేకులుగా చూపించారు. కమ్యూనిజం భూతంలాగా ఇది 'హద్దులు దాటిన ఇస్లాం'గా వర్ణించారు. ఇరానియన్

విప్లవాన్ని అధ్యయనం చేసిన కొంత మంది నిపుణులు అది మార్క్సిజం–లెనినిజం వంటిదని, ఈ జబ్బు ఇస్లాంకు జన్మత: ఉండేదని చూపటానికి ప్రయత్నించారు. ‘కుళ్ళిపోయిన ఇరాన్’, ‘ఇస్లాం: దూసిన కత్తి’, ‘ఆయతొల్లా యొక్క మీన్ కాంఫ్’, ‘ఇరాన్లో చెలరేగిన కొత్త రకం కిరాతకులు’ అన్న శీర్షికలతో వచ్చిన మీడియా కథనాలు అమెరికన్లని ఎంతగా రెచ్చ గొట్టాయంటే అమెరికన్ ప్రజాభిప్రాయం ఇరాన్‌పై యుద్ధానికి దిగాలని, ఇరాన్‌కి న్యూక్లియర్ సత్తా చూపాలనే వరకూ వెళ్ళింది.

ఒక సంక్లిష్ట అంతర్జాతీయ సంఘటనని మామూలు నాటకీయ కథనంగా చూపెట్టారని ఎడ్వర్డ్ సయీద్ విశ్లేషణ వెల్లడిస్తుంది. ‘నిష్పాక్షిక వార్త’ల పేరుతో రాసిన అమెరికన్ మీడియా కథనాలు అతితక్కువ వాస్తవాల ఆధారంతో తమ పాఠకులని, వీక్షకులని వేరే దేశానికి వ్యతిరేకంగా యుద్ధానికి సిద్ధపరిచాయి. ఈ క్రమంలో ఇరాన్ రాజకీయాలలో అమెరికన్ జోక్యం గురించిన సమాచారం పెద్దగా ఎవరికీ తెలిసిరాలేదు. అలాగే, ఇరాన్‌కు అప్పటి సోవియట్ యూనియన్‌తో ఉన్న 1600 మైళ్ళ సరిహద్దు అమెరికన్ల వ్యూహాత్మక జోక్యానికి ప్రేరేపణ అనే విషయమూ బయటికి రాలేదు. అంతేకాక షా పహల్విని ఇరాన్‌లో గద్దె నెక్కించటంలో, ఇరాన్లో అతడికి పెరుగుతున్న వ్యతిరేకతని పట్టించుకోకుండా ఆ గద్దె మీద అతడిని ఉంచటంలో అమెరికా పాత్రను గురించి రాసిన వారు అతి తక్కువ.

‘జ్ఞానం, అధికారం’ అన్న చివరి అధ్యాయంలో సయీద్ పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాలు, ప్రపంచాన్ని అధ్యయనం చేసి దాని గురించి రాయటానికి ఉపయోగపడే వాటి తటస్థ, వైజ్ఞానిక రచనా సాధనాలు ఇస్లాం వంటి అపరిచిత, దూర ప్రాంతాన్ని ఏ రకంగా అపార్థం చేసుకోవటానికి ఉపయోగపడతాయనే విషయాన్ని పరిశీలిస్తాడు. “వృతిపరంగా పండితులైన వారు ఇస్లాం గురించి రాసినదంతా కార్పొరేట్ సంస్థలు, మీడియా, ప్రభుత్వ ప్రభావిత చట్రంలోనే ఉంటుంది. ఆయా రచనలన్నీ ఇస్లాంకి తాత్పర్యం చెప్పటంలో, అలా ఉత్పత్తి చేసిన జ్ఞానాన్ని దేశ ప్రయోజనాలకి అనుగుణంగా మార్చటంలో పెద్ద పాత్ర పోషిస్తాయి. ఒక మాటలో చెప్పాలంటే అమెరికాలో ఇస్లామిక్ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానోత్పత్తి, వారి ప్రసార మాధ్యమాలలో ఇస్లామిక్ ప్రపంచాన్ని కవర్ చేయటం ఆ దేశ ఆర్థిక, భౌగోళిక ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది. ఇస్లాం ‘మధ్య యుగానికి చెందింది, ప్రమాదకరమయింది. విరోధి ‘అన్న భావన ఇప్పుడు సాధికారిక సూత్ర స్థాయికి చేరుకుంది.

ఇస్లాం గురించి ఇటువంటి దీర్ఘకాలిక శత్రుపూరిత ప్రసారాలని ప్రతిఘటిస్తూ కొత్తరకమైన జ్ఞానాన్ని తీసుకు రావాలని ఎడ్వర్డ్ సయీద్ పిలుపునిస్తాడు. దాన్ని ‘విరుద్ధ జ్ఞానం’ అని వర్ణిస్తాడు. విరుద్ధ జ్ఞానమంటే ప్రబలిపోయిన సాంప్రదాయ జ్ఞానానికి వ్యతిరేకంగా రాయాలని అనుకునే వారు ఉత్పత్తి చేసే ‘జ్ఞానం’ అని నిర్వచిస్తాడు. “ఓరియెంటలిజం తాను అనుసరించిన పద్ధతుల గురించి పాటించిన నిశ్శబ్దాన్ని, ఈ కొత్తరకమైన జ్ఞానం, పండిత జ్ఞానానికుండే రాజకీయ అంతరార్థాల గురించిన చర్చతో భర్తీ చెయ్యాలి. ఈ విరుద్ధ పాండిత్యం ఇస్లాంని తక్కువచేసి, ఏకవర్ణ సదృశ్యంగా చూపదు”. అంతకంటే ముఖ్యంగా విరుద్ధ పండితులు తమ మేధని అధికార సేవల్లో కాక, విమర్శ, సంఘం, చర్చ, నైతికతల కోసం ఉపయోగిస్తారు.

విరుద్ధ జ్ఞానం కోసం సయీద్ ఇచ్చిన పిలుపు ఈ రోజు కూడా అంతే ఆవశ్యకం.

**అనువాదం: ఏ.సునీత**

అయేషా ఉస్మానియా యూనివర్శిటీలో అధ్యాపకులు

## *కవరింగ్ ఇస్లాం, ఎడ్వర్డ్ సయీద్*

ఇస్లాంను ‘కవర్’ చేస్తున్నప్పుడు నా దృష్టి వర్తమానం మీద ఉంటుంది. పశ్చిమదేశాలు – ముఖ్యంగా అమెరికా–ఇస్లామిక్ ప్రపంచాన్ని ఎట్లా చూస్తున్నాయి. దానిపట్ల ఎట్లా స్పందిస్తున్నాయి అనేది చర్చించడం అవసరం. ముఖ్యంగా 70ల నుంచి ఈ విషయంలో వారి దృక్కోణాన్ని పరిశీలిస్తే అది ద్వేష పూరితంగా, సమస్యాత్మకంగా కనిపిస్తుంది. ఇస్లాంను కవర్ చేయడం అనడంలో ఉన్న వ్యంగ్యం పుస్తకాన్ని చదివే కొద్దీ అందరికీ ఎలాగూ అర్థమవుతుంది. కానీ ఆరంభంలో కూడా చిన్న వివరణ అవసరమనిపిస్తోంది. ఓరియెంటలిజం అన్న దృక్కోణం నుంచి చూస్తే ఇస్లాం అనే పదం ఒకటే అర్థమిచ్చే అంశంలాగా కనిపిస్తుంది. వాస్తవానికి ఇస్లాంను చిత్రించే పద్ధతిలో కొంత కట్టు కథ ఉంటుంది. భావజాలాన్ని రుద్ది ముద్రలు వేయడం ఉంటుంది. కొంత వరకు ఒక మతాన్ని సూచించడానికి వాడిన పదంలానూ ఉంటుంది.

పశ్చిమ దేశాలు చెపుతున్న ఇస్లాంకు విస్తృతమైన వైవిధ్యంతో కూడిన ఇస్లాంకు సంబంధం లేదు. 80 కోట్ల జనాభాతో ప్రధానంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో అనేక సమాజాలుగా, రాజ్యాలుగా, చరిత్రలుగా, సంస్కృతులుగా లక్షలాది చదరపు మైళ్ల ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఇస్లామిక్ ప్రపంచానికి పశ్చిమదేశాలు ఏకార్థంలో వాడే ఇస్లాం అనే భావనకు సంబంధం లేదు. పశ్చిమదేశాల్లో ఇస్లాం అంటేనే కలవరపాటు ఉంది. అలా ఎందుకుందో ఈ పుస్తకంలో వివరిస్తాను, ఇటీవలి కాలంలో ముఖ్యంగా ఇరాన్ పరిణామాల తర్వాత ఐరోపా, పశ్చిమదేశాల దృష్టి దీనిపై పడింది. దీంతో వాళ్ల మీడియా ఇస్లాంను కవర్ చేసింది. వాళ్లు తమ కోణం నుంచి ఇస్లాంను చిత్రించారు, వ్యాఖ్యానించారు, విశ్లేషించారు. అంతా తమకు తెలిసిపోయిందని ఇక మనకు బోధించడమే మిగిలిందని భావించి ఇస్లాం–ఒక పరిశీలన అన్న రీతిలో మనకు లెక్చర్లు ఇస్తున్నారు. నేను ముందే చెప్పినట్లు ఈ కవరేజీ, అందులో వ్యాఖ్యానాలు చేసే అకడమిక్ నిపుణులు, ది క్రిసెంట్ ఆఫ్ క్రైసిస్ లాంటి పదబంధాలు ఉపయోగించి విశ్లేషణలు చేసే భౌగోళిక–రాజకీయ వ్యూహకర్తలు, ది డిక్లైన్ ఆఫ్ ది వెస్ట్ అని దుమ్మెత్తి పోసే సాంస్కృతిక పండితులు వీరంతా మనల్ని పూర్తిగా పక్కదారి పట్టించేవారే. ఇస్లాంను తాము పూర్తిగా అర్థం చేసేసుకున్నాం అనే భావన కల్పించే ప్రయత్నం చేస్తారు కానీ వాళ్ల కవరేజ్‌లో ఎక్కువ భాగం వాస్తవిక అంశాల మీద ఆధారపడినది కాదు. పొరపాటుగా అన్వయించడం మాత్రమే కాదు, మా మతమే గొప్పది అనే ఆధిక్య భావన – అసహనం – సాంస్కృతికపరమైన జాతిపరమైన ద్వేషం, అన్నింటిని కలగలిపి ఇస్లాం మీద రుద్దేయడానికి కూడా తమకు పేటెంట్ ఉంది అని అనుకుంటారు. న్యాయంగా, సమతూకంగా, బాధ్యతగా కవర్ చేస్తున్నట్టే చెపుతారు గానీ వాస్తవం వేరుగా ఉంటుంది. అడ్డూ ఆపూ లేకుండా బాధ్యతారహితంగా, ఇష్టమొచ్చినట్టు, నోటికొచ్చినట్టు రొడ్డకొట్టుడు పదాలతో ఇస్లాంను అభివర్ణించొచ్చు అనే అహంకారపూరితమైన భరోసా ఏదో కొంత మందికి ఉంటుంది. తమకు చమురు సప్లయ్ చేసే దేశాల్లో మాత్రం ఇస్లాం అనేది వాస్తవమైన సుస్థిరమైన అంశంగా ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తారు. ఈ తరహా కవరేజ్ చాలావరకు కొన్ని అంశాలను కరవ్ అప్ చేయడంలో భాగం అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా మనకిష్టం లేని ఏ పరిణామం జరిగినా దాన్ని ఇస్లాం మీదకు తోసేసి బలిపశువు చేయొచ్చు అనే ఏకాభిప్రాయం లాంటిది ఏర్పడి ఉంది. రైటిస్టులకేమో ఇస్లాం అంటేనే అనాగరికం. లెఫ్టిస్టులకు అది మధ్య యుగాల మతస్వామ్యం. సెంట్రిస్టులకు అది అభిరుచి లేని విచిత్రపదార్థం. ఇస్లామిక్ ప్రపంచం గురించి సరిగా తెలీకపోయినా అందులో ఆమోదనీయమైంది అంతగా లేదు అని అనుకోవడంలో మాత్రం అందరికీ ఏకీభావమయింది. ఇస్లాంకు సంబంధించిన చర్చనంతా విద్వేషపూరితమైనదిగా చెప్పలేకపోవచ్చు గానీ, తమతమ భావజాలాలకు సంబంధించిన రాజకీయ, ఆర్థిక, మేధో కళ్లద్దాల్లోంచి చూస్తున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. తూర్పు అయినా పశ్చిమమైనా ఈ విషయంలో మాత్రం ఒకటే. ఇస్లాంకు సంబంధించిన చర్చఅంతా ఏదో ఒక ఆధిపత్యం, అధికారంతో ముడిపడి ఉంటుంది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఇస్లాంపై వచ్చిన మేధో వ్యాసాలను అన్నింటిని తిరస్కరించాలనేది నా ఉద్దేశం కాదు. ఆ విశ్లేషణ ఏ ప్రయోజనాలను నెరవేరుస్తోంది అని తెలుసుకోవడానికి అది బాగా ఉపకరిస్తుంది. మానవ సంబంధితమైన విషయాల్లో పరిపూర్ణ సత్యం అనేదేదీ ఉండకపోవచ్చు. ఖచ్చితమైన పరిజ్ఞానం అనేదేదీ సాధ్యం కాకపోవచ్చు. అవి విశాలమైన అర్థంలో ప్రతిపాదనలుగా మాత్రమే భావించాల్సి రావచ్చు. కానీ ప్రస్తుత సందర్భంలో ఇస్లాం గురించి ఎవరు మాట్లాడినా ఆ మాట్లాడుతున్నదెవరు అనేది చూడాలి. అందులో నిజమెంత అనేది మాట్లాడేవారిని బట్టి ఉంటుందని గుర్తించాలి.

**అనువాదం : జి.ఎస్.రామ్మోహన్**

# పరమత ద్వేషంతో జాగ్రత్త: వాక్ స్వేచ్ఛ జాపిరో కార్టూను

■ మహమూద్ మమ్దాని

*మకెరెరే యూనివర్సిటీ, కంపాలా, ఉగాండా*
*(జోహానెస్ బర్గ్ యూనివర్సిటీ ఇచ్చిన గౌరవ డాక్టరేట్ స్వీకరించిన సందర్భంగా చేసిన ప్రసంగం)*

నిన్న నేను కేప్‌టౌన్‌లో ఉన్నప్పుడు, నా మిత్రుడు ఒకరు మెయిల్ & గార్డియన్ తాలూకు తాజా సంచిక ఇచ్చినాడు. ఆ పత్రికలో నాకు అతి ఇష్టమైన 'జాపిరో' కార్టూన్ వైపు నా కళ్ళు పరుగెత్తాయి. ఆశ్చర్యకరంగా, అక్కడ మహమ్మద్ ప్రవక్తపై జాపిరో వేసిన కార్టూన్ కనిపించింది. "ఇతర ప్రవక్తలకు హాస్యప్రియులైన అనుయాయులు ఉన్నారు" అని ఆవేదన చెందుతున్న మహమ్మద్ ప్రవక్త ఆ కార్టూన్లో ఉన్నాడు. హాస్యం ప్రాణాంతకంగా మారిన సందర్భాల గురించీ, స్థలాల గురించీ ఆలోచించడానికి నేనీ సందర్భాన్ని ఉపయోగించ దలిచాను. డానిష్ కార్టూన్లకు కొనసాగింపుగా, జాపిరో ఈ కార్టూన్ల పరంపరను మొదలు బెట్టినట్లు కనిపిస్తున్నది. అందువల్ల నేను జాపిరో కన్నా ముందు వాటికి మాతృకయిన డానిష్ కార్టూన్ల తో 'నా ఆలోచన' ప్రారంభిస్తాను.

డానిష్ కార్టూన్లపై వివాదం బ్రద్దలైనప్పుడు నేను నైజీరియాలో ఉండినాను. ఉత్తర నైజీరియాలోని 'కానో' నగరం ముస్లింలు మెజారిటీగా ఉన్న నగరం. ఆ నగర వీధుల్లో తిరిగేటప్పుడు, క్రైస్తవ మతాన్ని అవహేళన చేసే రకరకాల వస్తువులను వీధి వ్యాపారులు అమ్ముతూ ఉండడం మనం గమనిస్తాం. అదే విధంగా, నైజీరియా తూర్పు ప్రాంతానికి, ఉదాహరణ 'ఏనుగు' లాంటి (క్రైస్తవ ఆధిక్య) పట్టణాలకు నీవు వెళితే, ఇస్లాంను అవహేళన చేసే రకరకాల వస్తువులు అక్కడ అమ్ముతూ ఉండడం మనకు కనిపిస్తుంది. (స్వ)మతధిక్కారం కాదు. ఇది స్పష్టంగా (పర)మత ఛీత్కారం. వివాదాస్పదమైన కార్టూన్లను ప్రచురించడానికి ముందు అదే డానిష్ పత్రిక వద్దకు జీసస్ క్రీస్తుపై వేసిన కార్టూన్లు ప్రచురణ కొరకు వచ్చాయి. అయితే, క్రైస్తవ పాఠకుల మనోభావాలు గాయపడతాయనే కారణంగా ఆ డానిష్ పత్రిక జీసస్ క్రీస్తుపై కార్టూన్లను తిరస్కరించింది. ఒకవేళ డానిష్ పత్రిక జీసస్ క్రీస్తు కార్టూన్లను ప్రచురించి ఉంటే, ఆ చర్య (స్వ) మతధిక్కారం పరిధిలోకి వచ్చి ఉండేది. చివరకు ఆ పత్రిక ప్రచురించిన కార్టూన్లు (పర) మత ఛీత్కారం కోవకు చెందినవే కానీ (స్వ)మతధిక్కారం కోవకు చెందినవి కావు.

స్వమత ధిక్కారమూ, పరమత ఛీత్కారమూ అనేవి రెండూ 'వాక్ స్వేచ్ఛ' అనే విశాల సంప్రదాయానికి చెందినవే అయినప్పటికీ, శతాబ్ద కాలంగా సాగుతున్న జాతి హననమూ, నరమేధాల అనుభవాల నేపథ్యంలో, ఒకే సంప్రదాయానికి చెందిన ఈ రెండు ధారల మధ్య ఉన్న తేడాను కూడా అర్థం చేసుకోవలసిన అవసరాన్ని ఈ రోజు నొక్కి చెప్పవలసి ఉన్నది. వర్తమాన రాజకీయ పరిభాషలో ఆ తేడాను గుర్తించే పదం ఒకటి ఉంది. పరమత ఛీత్కారాన్ని విద్వేష ప్రసంగంగా భావించడం ఇప్పుడు పరిపాటి.

డానిష్ కార్టూన్లు ప్రచురించబడ్డ కొన్ని వారాల తరువాత, ఒక పోర్చుగీసు వారి పత్రిక, 'విసావ్' ఒక ఇంటర్వ్యూను ప్రచురించింది. సుప్రసిద్ధ జర్మన్ రచయిత గుంథర్ గ్రాస్ ఇచ్చిన ఇంటర్వ్యూ అది. ఆ ఇంటర్వ్యూలో గుంథర్ గ్రాస్, ఒక వ్యాఖ్య చేసారు. డానిష్ కార్టూన్లు 'దెర్ స్టెర్‌మర్' అనే జర్మన్ పత్రికలో ఒకనాడు ప్రచురించబడ్డ యూదు-వ్యతిరేక కార్టూన్లను గుర్తుకు తెచ్చాయని ఆయన అన్నారు. ఈ ఇంటర్వ్యూను పున:ప్రచురించిన న్యూయార్క్ టైమ్స్ ఒక చారిత్రక విశేషాన్ని జోడించింది. 'దెర్ స్టెర్‌మర్' పత్రిక ప్రచురణకర్త న్యూరెంబర్గ్‌లో విచారణ ఎదుర్కొన్నాడనీ, మరణశిక్షకు గురయ్యాడనీ అందులో ఉంది. డానిష్ కార్టూన్లు ఆనాటి జర్మన్ కార్టూన్ల మధ్య ఎంత సారూప్యత ఉంది అనే అంశం కన్నా కార్టూన్లను ప్రచురించినందుకు ఒక పత్రికా యజమానికి మరణశిక్ష ఎందుకు విధించారన్న అంశమే నాకు ఎక్కువ ఆసక్తికరంగా కనిపించింది. నేను పని చేస్తున్న అనేక అంశాలలో రువాండా నరమేధం ఒకటి. ఈ నరమేధంపై విచారణ జరుపుతున్న, ఆరుషా అంతర్జాతీయ ట్రిబ్యునల్ హత్యాకాండకు పథక రచన చేసిన వారినీ, హత్యాకాండలో పాల్గొనేలా హుటూ యువతను పురిగొల్పిన మేధావులు, కళాకారులు, ఆర్.టి.ఎమ్.సి (ర్యాండమ్ రేడియో) విలేఖరులనూ కూడా ఆ నరమేధానికి బాధ్యులుగా, నేరస్తులుగా గుర్తించింది. ఈ విషయం మీలో చాలా మందికి తెలుసు. 'వాక్ స్వేచ్ఛ'లోని చీకటి కోణాలను రువాండా విచారణలు మరొక్కసారి తాజాగా వెలుగులోకి తెచ్చాయి. అధికారంలో ఉన్న ఆధిపత్య శక్తులు ఒక అల్పసంఖ్యాక సముదాయాన్ని దోషిగా మార్చగలవో, అధిక సంఖ్యాకుల దాడికి లక్ష్యంగా మార్చగలవో మనకు మరొక్కసారి తేటతెల్లమైంది.

వాక్ స్వేచ్ఛను పరిరక్షించేందుకు నిబద్ధమై ఉండే న్యాయస్థానాలు, అమానుష నేరాలకు కార్టూనిస్టులను ఎలా బాధ్యులుగా చూడగలుగుతున్నాయి? ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలంటే మొదట మనం మత ఛీత్కారానికీ, మతధిక్కారానికీ మధ్య ఉండే తేడాను గ్రహించవలసి ఉంటుంది. మతధిక్కారం అంటే, ఒక మత సాంప్రదాయాన్ని ఆంతరంగికంగా, అంటే దాని లోపలి నుంచే సవాలు చేసే కార్యాచరణ. అందుకే మతధిక్కారం అంటే స్వమతధిక్కారం అనే అర్థం. మత ఛీత్కారం అంటే ఒక మత సాంప్రదాయాన్ని, బయటి నుంచి దాడి చేయడం. మతధిక్కారంలో, అధికారం ముందు ధైర్యంగా నిలబడి నమ్మిన సత్యాన్ని ప్రకటించడం ఉంది. మతఛీత్కారం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఇక్కడ అధికారమే (తన ప్రయోజనాల కొరకు) సత్యాన్ని ఒక సాధనంగా మార్చటం జరుగుతుంది. కార్టూన్ల వివాదంలో మనకు కొట్టొచ్చినట్లు కనబడే అంశం ఏమిటంటే పరమత ఛీత్కారాన్ని, స్వమత ధిక్కారంగా గందరగోళపడడం.

విద్వేష ప్రసంగాలను చట్టాల ద్వారా వారించగలుగుతామా? నాకైతే పెద్దగా ఆశ లేదు. చట్టాలు మహా అయితే వ్యక్తుల స్థాయిలో జరిగే తప్పులను సరిదిద్దగలవేమో కానీ, ఉద్యమ స్థాయిలో, సామూహిక రూపాలలో అల్ప సంఖ్యాకులపై దాడి రూపంలో బద్దలయ్యే విద్వేషాన్ని చట్టాలు ఏమీ చేయలేవు అన్నది సుస్పష్టం. అయితే డానిష్ కార్టూన్లు ఒక్క సంగతి మాత్రం ప్రపంచానికి స్పష్టంగా చాలా చెప్పాయి. యూరప్‌లో 'ఇస్లాంభీతి' అనేది రోజు రోజుకూ పెరిగిపోతున్నది. అయితే ఈ దృగ్విషయం వ్యక్తమవుతున్న భావజాల వైవిధ్యత మాత్రం మనకు విస్మయం కలిగిస్తుంది.

ఫాసిజం కన్నా ముందే యూరప్‌లో యూదు వ్యతిరేక వామపక్ష భావధార ఉండినట్లే, ఇప్పుడు కూడా మనందరికీ సుపరిచితమైన మితవాద భాషలోనే కాక మనకు అంతగా పరిచయంలేని వామపక్ష భాషలో కూడా 'ఇస్లాంభీతి' అన్నది వ్యక్తమవుతూ ఉంది. వామపక్ష 'ఇస్లాం భీతి' ఉపయోగించే భాష లౌకికవాద భాష. డానిష్ కార్టూన్లు, ఆ తరువాత ఆ కార్టూన్లను ఎంతో ఉత్సాహంగా యూరప్ వ్యాప్తంగా పున:ప్రచురించిన మితవాద, వామపక్ష పత్రికలను చూసినప్పుడు మనకు ఒక విషయం కనిపిస్తుంది. వామపక్ష మరియు మితవాద ఇస్లాంభీతి ఒక సమన్వయంలో కలసి నడుస్తున్నాయని మనకు అర్థం అవుతుంది. దీనివల్ల ఏర్పడ్డ రాజకీయ ప్రభావం ఏమిటంటే భిన్నాభిప్రాయాలు ఒకదానితో ఒకటి సంభాషించుకోగలిగిన అవకాశమే లేకుండా పోయింది. ప్రజాస్వామిక చర్చాక్షేత్రమే అదృశ్యం అయిపోయింది.

జాపిరో మనకు ఏం చెబుతున్నాడు? మనం కూడా హాస్యప్రియులమే అని నిరూపించుకోవడం కొరకు ఈ ప్రజాస్వామిక చర్చాక్షేత్రమే మనం వదిలేసి వెళ్ళి పొమ్మంటున్నాడా? ఒకవేళ జాపిరో ఉద్దేశం అదే అయితే కనుక, మనం ఈ రోజు ఎదుర్కొంటున్న సవాలును ఆయన సరిగ్గా అర్థం చేసుకోలేదనే నేను భావిస్తాను. ఈ సవాలు మేధోపరమైనదీ, రాజకీయమైనది కూడా. మేధోపరమైన సవాలు ఏమిటంటే, వాక్ స్వేచ్ఛా సంప్రదాయానికి చెందిన రెండు ధోరణులను – మతఛీత్కారము, మతధిక్కారము – వేరు చేసి చూడగలమా లేదా అన్నది. రాజకీయపరమైన సవాలు ఎక్కడుందంటే, అన్ని రకాలైన పరమత ఛీత్కారానికి వ్యతిరేకంగా స్థానికంగా, అంతర్జాతీయంగా ఐక్య సంఘటనలు ఏర్పాటు చేయగలమా లేదా అన్నది. యూరప్‌లో పెరుగుతున్న పరమత ఛీత్కార ధోరణికి మూలం ఎక్కడుంది అని మనం చూడాలి. రెండు పరిణామాలను అర్థం చేసుకోవడంలో యూరప్ విఫలం చెందింది. దాని ఫలితమే ఈ పరమత ఛీత్కార ధోరణి అని నా అభిప్రాయం. అందులో మొదటి పరిణామం, ఇటీవలి కాలంలో యూరప్‌లో హఠాత్తుగా పెరుగుతున్న ముస్లిం అల్పసంఖ్యాకులూ, సమాన మానవ, పౌర హక్కుల కొరకు వారు చేస్తున్న పోరాటాలు. ఇక రెండవది, ప్రపంచ చరిత్రలో అత్యంత నాటకీయమైన మలుపు గుండా మనం జీవిస్తున్నాం.

గత ఐదు శతాబ్దాలుగా ప్రపంచ చరిత్రపై పాశ్చాత్య ఆధిపత్యమే నిరాఘాటంగా కొనసాగింది. 1491లో మొదలైన నాటి నుండి, పాశ్చాత్య వలసవాదం, తనను

తాను ఒక నాగరికతా వికాస క్రమంగా, వెనుకబాటుతనంలో మగ్గిపోతున్న సమాజాలను ఆ ఊబి నుండి బయటికి లాగి ఉద్ధరించే శక్తిగా భావించుకుంటూ, ప్రకటించుకుంటూ వచ్చింది. అంటే పాశ్చాత్యేతర సమాజాలలోని బలహీనులైన అల్పసంఖ్యాకులను కాపాడడం, అధిక సంఖ్యాకులను నాగరికులుగా మార్చడం అనే పవిత్ర కర్తవ్యం నెరవేర్చుతున్నానని వలసవాదం ప్రకటించుకుంటూ ఉండేది. వలసవాదుల భాష, తర్కమూ, సంవాదం ఎల్లప్పుడూ, వలసదేశాల ప్రజల లో అమలవుతున్న అనాగరిక అంశాలపైనే కేంద్రీకరించబడి ఉండేవి. సతి, బాల్య వివాహము, బహు భార్యాత్వము మొదలైన అంశాలపైన భారత దేశంలో, స్త్రీ జననాంశాల విరూపణ, బానిసత్వం అనే అంశాలపై ఆఫ్రికాలో – వలసవాదులు చర్చ చేసేవారు. అందువల్ల ఈ ప్రాంతాలలోని స్త్రీలు, పిల్లలు, అల్పసంఖ్యాక సముదాయాలను అనాగరిక ఆచారాల నుండీ, అత్యాచారాల నుండీ కాపాడే శక్తిగా వలసవాదం తనను తాను చిత్రీకరించుకొనేది. అదే సమయంలో ఈ అనాగరికతకు మూలమైన అధిక సంఖ్యాకులను నాగరికులుగా మార్చే విశాల ప్రణాళికను కూడా ప్రకటించేది. ఈ 'పవిత్ర కర్తవ్య దీక్ష'లో నిమగ్నమైన పాశ్చాత్య అల్ప సంఖ్యాకులు వలసదేశాలలో ఇష్టారాజ్యంగా, ప్రత్యేక హక్కులతో బతికేవారనే సంగతి వేరే విషయం అనుకోండి. మొత్తం పైన, ఈ చరిత్రంతా, భిన్నత్వంతో కలసి బతక లేకపోయిన అయిదు వందల సంవత్సరాల అసమర్థ చరిత్ర. ఆ భిన్నత్వాన్ని రాజకీయం చేసిన కుటిల చరిత్ర. విషాదకరమైన విచిత్రం ఏమిటంటే, ఇటీవలి కాలంలో, యూరప్ ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు అనేక మంది, బహుశా సామ్రాజ్యవాద గత వైభవ జ్ఞాపకాల ప్రభావం వల్ల కావచ్చు, తమ దేశాల అంతర్గత రాజకీయాలలోకి కాల పరీక్షలో నెగ్గిన వలసవాద భాషా చాతుర్యాలను చొప్పించే ప్రయోగాలు చేస్తున్నారు. తమ దేశాలలోకి బతుకు తెరువులకై వలసవచ్చిన అల్పసంఖ్యాక సముదాయాల అనాగరిక సాంస్కృతిక ఆచారాల జాబితా తయారుచేసి, వాటి కారణంగా వారిని ప్రధాన స్రవంతి నుండి వేరుచేసి, అసహ్య వస్తువులుగా నిరూపించి, వారిని దోషులుగా నిలబెట్టే వికృతక్రీడ ప్రారంభించారు.

కానీ ప్రపంచం మారుతూ ఉంది. కొత్త శక్తులు అవతరిస్తున్నాయి. చైనా, భారత దేశం గురించి కొత్తగా చెప్పేదేమీ లేదు. ఈ రెండు దేశాలు ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలుకాదు కానీ, గణనీయమైన సంఖ్యలో ముస్లింలు మైనారిటీలుగా ఉన్న దేశాలు. ఈ డానిష్ ఉదంతం మనకు, ఏమి చేయకూడదో అన్నది నేర్పుతుంది. ప్రపంచంపై ఇంత కాలం పెత్తనం చెలాయించిన పాశ్చాత్య అల్ప సంఖ్యాకులకు మరీ ముఖ్యమైన పాఠం నేర్పుతుంది. వేగంగా మారిపోతున్న ప్రపంచాన్ని చూసి దిగులుబడి, ఆందోళనకు గురై, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి దురహంకారపు ముసుగు ధరించి యాగీ చేయడం పశ్చిమ సమాజాలు మానేయాలి. మారిపోతున్న ప్రపంచంలో వస్తున్న కొత్త పోకడలను కాస్త వినయంతో, గమనించి సానుకూలంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

ముస్లిం దేశాల ప్రజలకు కూడా ఇక్కడ ఒక పాఠం ఉంది. ఈ కొత్త సంఘర్షణలో మధ్యప్రాచ్యము, ఇస్లాం అన్నవి తటస్థ, ప్రజాస్వామిక చర్చాక్షేత్రంలో భాగం అన్న విషయం మరువరాదు. 'ఇస్లాంభీతి' కి వ్యతిరేకంగా పోరాడడమే అతి ప్రధాన పోరాటం అని భావిస్తే పప్పులో కాలేసినట్టే. ఎందుకంటే అది ప్రధాన పోరాటమే కాదు. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఒక కొత్త సువిశాల సందర్భాన్ని మనం దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఈ విశాల సందర్భాన్ని అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే మనం మన నిజమైన మిత్రులెవరో, ఎవరితో కలిసి మనం ఉమ్మడి పోరాట వేదికలను నిర్మించుకోవాలో గ్రహించగలుగుతాము. ఈ కృషిలో భాగమైనప్పుడు మాత్రమే, మనం – బహుశా, మన మిత్రుడు జాపిరో – సుసంఘటితమైన విద్వేష ప్రచార ఉద్యమాలను దృఢంగా ఎదుర్కోగలుగుతాము. కార్యాచరణ ద్వారా లేదా కార్టూన్ల ద్వారానైనా మనపై సాగే విద్వేష ప్రచారాన్ని – హాస్య ప్రియత్వంతోనే తిప్పి కొట్టగలుగుతాము.

**అనువాదం: జి.భార్గవ**

మహమూద్ మమ్‌దానీ, కొలంబియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు

# జాతి సమస్య, ప్రసార మాధ్యమాలు, మారణహోమానికి పాల్పడే హంతకులు

## ■ ఫరియా అథర్




ఏప్రిల్ 20, 1999లో కొలరాడో నగరంలో దాదాపుగా 30 మంది ఒక బాంబు పేలుడు ఘటనలో చంపబడ్డారు లేదా గాయపడ్డారు. ఆ ఘటనలో చనిపోయిన వారు, గాయపడిన వాళ్ళంతా రోజూ స్కూలుకు వెళ్ళే 15-18 మధ్య వయసులో ఉన్న టీనేజ్ పిల్లలు. పెట్టిన బాంబుల్లో కొన్ని విఫలమయి ఉండకపోతే మరణించిన వారి సంఖ్య పదింతలు ఎక్కువగా ఉండేది. ఈ ఉదంతానికి పాల్పడ్డ ఇద్దరు స్కూలు క్యాంటీన్‌లో ఒక ఫైర్ బాంబును మరియు 99 మందుగుండ్ల సామాగ్రిని అమర్చారు. రోజులో అత్యంత రద్దీగా ఉండే సమయంలో ఆ బాంబులను పేల్చి వీలయినంత ఎక్కువ మందిని చంపాలనేది వారి పథకం. ఒకవేళ అదే జరిగి ఉంటే దాదాపుగా 455 మంది చనిపోయి ఉండేవారు.

దుర్ఘటన అనంతరం దర్యాప్తు సమయంలో మీడియా ఈ ఘటనని హేతుబద్ధంగా వివరిస్తూ ఎన్నో కారణాలను చెప్పింది. బులియన్ నుండి మ్యూజిక్, వీడియో గేమ్‌లు, కుటుంబ పరిస్థితులు మరియు మరెన్నో. పరిశోధకులు ఈ ఘటనకు పాల్పడ్డ వారు ఒంటరితనం మరియు డిప్రెషన్‌లో ఉండి ఉంటారని పేర్కొన్నారు. ఇన్ని చెప్పుకోదగ్గ కష్టాల్లో ఉన్న వీరిద్దరికున్న ఒక ప్రివిలేజ్ వల్ల వీరు పాల్పడ్డ ఈ ఘటన గన్ కంట్రోల్‌పై ఎలాంటి చర్చా లేవనెత్తకుండా, వీరికి క్షమాభిక్ష వచ్చేలా చేసింది. వారికున్న ఆ విశేషాధికారం వారు అమెరికాలో తెల్లజాతి మగవాళ్ళుగా పుట్టటం.

కాస్త అలా కాలాన్ని ముందుకు జరిపి చూస్తే 2015లోనూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. డిలన్ రూఫ్ అనే ఒక తెల్లజాతి యువకుడు నల్లజాతీయుల చర్చిలో కాల్పులు జరిపి 9 మందిని చంపాడు. దీనిని అనుసరించి మరికొంత మంది తెల్లజాతి ఆధిపత్యవాదులు ఇంకో నాలుగు నల్లజాతీయుల చర్చిలను తగలబెట్టారు. జాతి విద్వేషానికి, జాత్యహంకారానికి ఇది ఒక ఘోరమైన ఉదాహరణ. అయినప్పటికీ మీడియా దీనిని ఒక నేరంగా వర్ణించటానికి ఎంతో వెనుకా ముందూ ఆడింది. ఏదో ఊరికే చెప్పాలి అన్నట్టుగా చెపుతూ ఘటనకి సంబంధించిన క్రూరత్వాన్ని ఎక్కడా కనపడని ధోరణిలో రిపోర్ట్ చేసింది.

అదే ISIL క్రిస్టియన్ చర్చిపై చేసిన దాడుల గురించిన రిపోర్టులను వీటితో పోల్చి చూస్తే, మీడియా రిపోర్టింగ్ తీవ్రస్థాయిలో ఎడ తెరిపి లేకుండా కొనసాగింది. ఎలాంటి సంకోచం లేకుండా మొదటి పేజీలో "చర్చిలను హింసా గృహాలుగా మార్చిన ఇస్లామిక్ ఉగ్రవాదులు" అనే హెడ్‌లైన్లు వచ్చాయి. చెప్పే స్వరం ఘటనను చాలా నిర్దిష్టంగా, ఆలోచనాపూర్వకంగా, ఎంత భయంకరంగా చిత్రీకరిస్తుందంటే, ఘటన ఎక్కడో జరిగినా దానిని చదివే వ్యక్తి తరువాత తామే దానికి గురవుతామేమో అన్న భయానికి గురయ్యేటట్లు ఉంటుంది.

నేరం చేసిన వ్యక్తి తెల్లజాతి వాడయితే డిప్రెషన్ వల్ల నేరానికి పాల్పడ్డాడని, ముస్లిం అయితే మతం వల్లనీ, నల్లజాతి వ్యక్తయితే రంగువల్లనీ, విదేశీయుడయితే జాతీయత వల్లనీ, మీడియా సునాయాసంగా సోమరి వర్గీకరణలు చేస్తుంది. అంటే మైనారిటీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి చేసిన నేరాన్ని మొత్తం ఆ వర్గ ఖాతాలో వేసేస్తుందన్న మాట, ఆ ఘటన నేపథ్యంతో సంబంధం ఉండనవసరం లేదు. ఎప్పుడైనా ఆ నేరస్థునికి, తాము రూపొందించిన లేబుల్‌కి మధ్య సంబంధం బలహీనంగా ఉంటే పాత చరిత్ర తవ్వి, వేరే సందర్భంలోని చిత్రాలను జోడించి చిత్రీకరణని బలపరుచుకోవటానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

ఉదాహరణకి అమెరికాలో నిరాయుధులైన నల్లజాతి వ్యక్తుల హత్యల గురించి ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతూ ఉంటే అమెరికన్ మీడియా ఆ హత్యలకి సంబంధం లేనటువంటి పాత ఘటనలను తెరపైకి తీసుకుని వచ్చి బాధితులు హింసాప్రవృత్తి కలవారు అని చెప్పే ప్రయత్నం చేస్తుంది. అవి బాధితుల చావుకు సంబంధం లేనివి, గతంలో ఎప్పుడో జరిగినవి అయినప్పటికీ వాటిని తారాస్థాయిలో తెరపైకి తీసుకుని వచ్చి వారికి ఒక చెడ్డ ఇమేజ్‌ని నిర్మిస్తారు. అదే విధంగా 2014లో మలేషియన్ విమానం అదృశ్యమైనప్పుడు, ఒక ప్రఖ్యాత దక్షిణ భారత వార్తా పత్రిక ఆ మలేషియన్ ముస్లిమ్ పైలెట్ వేరే సందర్భంలో చేతిలో కిచెన్ కత్తి పట్టుకుని నవ్వుతూ చూస్తున్నట్లు ఒక బొమ్మ ప్రచురించింది. దాన్నుండి మనమర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, "అతడికి చంపడం అంటే ఇష్టం"అని.

**అనువాదం: నవదీప్**

ఫరియా అతర్ సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో బి.ఎస్.సి మొదటి సంవత్సరం చదువుకుంటోంది

# ఇస్లామో ఫోబియో

# ఇస్లామ్ మరియు జిహాద్ నుండి

## ఏ.జి నూరాని (న్యూ ఢిల్లీ, లెఫ్ట్‌వర్డ్, 2002)

పాశ్చాత్య మీడియా మూడో ప్రపంచ దేశాలపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ మధ్యే దయా కిషన్ తుస్సు తన సమర్థవంతమైన సర్వేలో పాశ్చాత్య మీడియా "ఇస్లాం నాగరిక విలువలకు వ్యతిరేకమైంది" అని చూపిస్తుందని నిర్ధారణ చేసారు. "పాశ్చాత్య దేశాలకు ఆయుధాలు, చమురుపై ఉన్న ఆసక్తి, తమ ప్రయోజనాలను కాపాడుకోవటానికి ఇస్లాంను భయానకంగా చూపించటం చాలా చక్కగా లాభిస్తుంది. కమ్యూనిస్టు దేశాలు కనుమరుగైన తరువాత, పాశ్చాత్య ప్రపంచానికి ఇస్లాం తమ భద్రతకు పెద్ద ఆపదగా కనిపిస్తూ ఉన్న సందర్భంలో ముస్లిం దేశాలలోని మీడియా వార్తల కోసం పాశ్చాత్య మీడియాపై ఆధారపడకుండా ఉండడానికి తమ తమ దారులను వెతుక్కోవలసి ఉంది" అని పేర్కొన్నారు.

విస్తరిస్తున్న పాశ్చాత్య ఎలక్ట్రానిక్ సామ్రాజ్యాల వల్ల, ఆయా ప్రసార సంస్థలకు, వాటి ఉపగ్రహ మరియు కేబుల్ టెక్నాలజీ ద్వారా వెనువెంటనే ప్రపంచంలో ఎక్కడికైనా చేరుకొనే సామర్థ్యం ఉంది. పాశ్చాత్య మీడియా, అతి ముఖ్యంగా ఆంగ్లో-అమెరికన్ మీడియా ప్రపంచ స్థాయిలో ఆన్‌లైన్ సేవలు, టెలివిజన్, రేడియో, ప్రింట్ జర్నలిజంని శాసిస్తున్నాయి అని రచయిత అంటారు.

"పాశ్చాత్య వార్తా సంస్థలే అంతర్జాతీయ వార్తలను అత్యధికంగా ఉత్పత్తి చేసి ప్రసారం చేస్తాయి: రాయిటర్స్ టెలివిజన్, వరల్డ్ వైడ్ టెలివిజన్, ఎ.పి టెలివిజన్ లాంటి వార్తా సంస్థలు రా ఫుటేజ్ (కామెంటరి లేని దృశ్యాలు) సరఫరా చేస్తే; సిఎన్ఎన్, స్కై, బిబిసి, వాయిస్ ఆఫ్ అమెరికా, బిబిసి వరల్డ్ వైడ్ సర్వీస్ వంటి ఉపగ్రహ, కేబుల్ మీడియా సంస్థలు తయారు చేసే నివేదికలు, వార్తలు, వేరు వేరు భాషలలో తమ సేవలతో కలిపి ప్రపంచ స్థాయిలో వార్తా ప్రసారాలను శాశిస్తున్నాయి".

ప్రపంచంలో నాలుగు అతి పెద్ద న్యూస్ ఏజెన్సీస్ అయిన అసోసియేటెడ్ ప్రెస్ ఇంటర్నేషనల్, రాయిటర్స్ మరియు అగేన్సు ఫ్రాన్స్ ప్రెస్సులలో మొదటి మూడు ఆంగ్లో-అమెరికన్ యాజమాన్యంలో నడుస్తాయి. ఈ నాలుగు కలిపి దాదాపు 80 శాతం ప్రపంచ వార్తలను బయటకి తెస్తాయి. అంతర్జాతీయ ఉద్యోగులు ఉన్నప్పటికీ, తెలిసో, తెలియకో ఈ కంపెనీలు పూర్తిగా పాశ్చాత్య మరీ ఖచ్చితంగా చెప్పాలంటే ఆంగ్లో-అమెరికన్ న్యూస్ ఎజెండానే ప్రోత్సహిస్తాయి.

అంతేకాక, ఆయా సిండికేట్‌లతో ఒప్పందాల పుణ్యమా అని భారత దేశంలోని అన్ని ప్రముఖ ఆంగ్ల వార్తా పత్రికలు, వారి వారి వార, మాస పత్రికలలో, చాల గర్వంగా పాశ్చాత్య వార్తా పత్రికలు, మాస పత్రికల నుండి వార్తలను ప్రచురిస్తాయి. ఈ విధంగా పాశ్చాత్య దేశాల వార్తా సంస్థలు ఒక ప్రపంచ స్థాయి వార్తా కార్యక్రమాలని తమకనుగుణంగా రూపొందించుకోగలుగుతున్నాయి.

భారతదేశంలోని చాలా వార్తా సమాచార పత్రికలు పాశ్చాత్య మీడియా ధోరణులని అనుసరిస్తూ వాటి భాషను, వార్తలను, విలువలను మరియు పద్ధతులను కూడా అనుకరిస్తున్నాయి. 1994 లో పి.వి.నరసింహారావు అమెరికా దేశానికి వెళ్ళినపుడు ఒక భారతీయ వార్తా పత్రిక 'టెర్రర్‌ని ఎగుమతి చేస్తున్న పాన్-ఇస్లామిక్ మితవాదం' అనే శీర్షికతో భారతదేశం ఎదుర్కొంటున్న ఇస్లామిక్ ఉగ్రవాద ముప్పు గురించి ఒక 20 పేజీల కవర్ స్టోరీని ప్రచురించింది.

1996లో రన్నీమేడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'బ్రిటిష్ ముస్లింలు మరియు ఇస్లామో ఫోబియా'పై తీసుకువచ్చిన ఒక సంప్రదింపు పత్రం బ్రిటిష్ సమాజంపై మీడియా మరియు చరిత్ర మోపిన భారం వల్ల జరిగిన దుష్పరిణామాల గురించి ఉదాహరణలతో సహా విశదీకరించింది. యూనివర్శిటీ ఆఫ్ సస్సెక్స్ ఉప-కులపతి ప్రొ.గోర్డాన్ కాన్వాయ్ ఈ సింపోజియంకు అధ్యక్షత వహించగా, డా॥జాకి బడావి, ప్రిన్సిపాల్, ముస్లిం కాలేజ్, లండన్, రిటైర్డ్ రివరెండ్ రిచర్డ్ చర్టర్స్, బిషప్ ఆఫ్ లండన్ (డిసెంబర్ 1996 వరకు), ఇయాన్ హార్‌గ్రీవెస్, న్యూ స్టేట్స్‌మన్ సంపాదకులు, డా.ఫిలిప్ లూయిస్, మత సామరస్యతపై బిషప్ ఆఫ్ బ్రాడ్ఫోర్డ్ సలహాదారుడు, జాహిద్ మంజూర్, బ్రాడ్ఫోర్డ్ హెల్త్ అథారిటీ అధ్యక్షురాలు, రబ్బీ జూలియా న్యూబర్గర్, రన్నీమేడ్ ట్రస్ట్ ట్రస్టీ, ట్రెవర్ ఫిలిప్స్ రన్నీమేడ్ ట్రస్ట్ అధ్యక్షులు, డా.సెబాస్టియన్ పొల్లార్, సివిల్ సర్వీస్ కమీషనర్, నస్రీన్ నేహ్మాన్, రన్నీమేడ్ ట్రస్ట్ ట్రస్టీ, సబా రిసలుద్దిన్, కల్మాస్ ఫౌండేషన్ డైరెక్టర్, ఇమాం డా॥అబ్దుల్‌జలీల్ సాజిద్, సస్సెక్స్ ముస్లిం సొసైటీ డైరెక్టర్, డా॥రిచర్డ్ స్టోన్, జ్యూయిష్ కౌన్సిల్ ఫర్ రేసియల్ ఈక్వాలిటీ అధ్యక్షుడు, ది రివరెండ్ జాన్ వెబ్బర్, మత సామరస్యతపై బిషప్ ఆఫ్ స్టెఫనీ సలహాదారుడు సభ్యులుగా ఉన్నారు.

కాన్వాయ్ తన ముందు మాటలో ఈ విధంగా రాసాడు: 'ఒకవేళ మీకు బ్రిటన్‌లో ఇస్లామో ఫోబియా ఉందా అనే సందేహం ఉన్నట్లయితే, నేను చదివినట్లు ఒక వారం రోజులు స్థానిక, జాతీయ న్యూస్ పేపర్లను చదవండి. మీరు ముస్లిమ్స్‌కు మరియు ఇస్లాంకు సంబంధించిన వార్తలను చూస్తే పూర్తిగా విరోధంతో కూడుకున్న వాక్యాలు, కొన్నిసార్లు నిగూఢంగా, మరికొన్నిసార్లు బహిర్గతంగా, పచ్చిగా కనిపిస్తాయి. మీడియా మార్గదర్శనం చేసిన చోట చాలా మంది అనుసరిస్తారు. బ్రిటిష్ ముస్లింలు వారు చదివే విద్యా సంస్థలలోను, పనిచేసే చోటా వివక్షకు గురి అవుతారు. ముస్లింల పట్ల జరుగుతున్న వేధింపులు మరియు హింస సర్వసాధారణం.'

ఈ కమిషన్ తీసుకువచ్చిన పత్రం ప్రకారం : 'ఇస్లామో ఫోబియా అంటే ముస్లింల పట్ల మరియు ఇస్లాం పట్ల భయం మరియు అసహ్యం. ఇది పాశ్చాత్య దేశాల్లో, సంస్కృతిలో ఎన్నో శతాబ్దాల నుండి ఉన్నా, గత 20 ఏళ్లుగా స్పష్టంగా బహిర్గతంగా, భయానకంగా వ్యక్తమవడం మొదలయింది. ఇది అన్ని మీడియా సంస్థలలో అంతర్లీన భాగం; సమాజంలోని అన్ని వర్గాలలోను వ్యాపించి ఉంది.'

ఈ పత్రం ఇస్లామో ఫోబియాకి ఉండే 7 సాధారణ లక్షణాలను ముందుకు తీసుకువచ్చింది. అవి :

1. ముస్లిం సంస్కృతి ఏకశిలా సదృశం అంటే స్థల, కాల అనుగుణంగా మార్పు చెందనిది, మార్పులేనిది అని నొక్కి చెప్పటం. 2. ముస్లిం సంస్కృతులు మిగతా అన్ని సంస్కృతుల కంటే పూర్తి భిన్నమయినవని వేరు చెయ్యటం. 3. ఇస్లాం ప్రమాదభరితమయింది అని; 4. ఇస్లాం మతస్తులు తమ మతాన్ని ఎక్కువగా రాజకీయ అధికారం కోసం, యుద్ధంలో గెలవటానికి వాడుకుంటారు అని పదే పదే పేర్కొనడం. 5. పాశ్చాత్య సంస్కృతి, సమాజంపై ముస్లింలు చేసే విమర్శలను పూర్తిగా కొట్టి పడేయటం. 6. ఇస్లాం పట్ల భయం మరియు జాతి వివక్ష వలన వలసలను వ్యతిరేకించడం. 7. ఇస్లామోఫోబియా సహజ సిద్ధమయింది అని, అది పెద్ద సమస్య కాదు అని అనుకోవడం.

ఇస్లాం ఒక ప్రమాదం అని నాలుగు ముఖ్య దృష్టికోణాల నుండి భావించటం జరుగుతుంది: ముస్లిం రాజ్య స్థాపన జరిగిపోతుందని; ఇస్లాం ప్రపంచ శాంతికి భంగమని; 'యుద్ధాలు వస్తాయి' అని; 'ముసుగు వేసుకున్న మూకలు జయిస్తారు' అని. ది స్పెక్టేటర్ అన్న పత్రిక సంపాదకుడయిన చార్లెస్ మూర్ ఏం రాస్తాడంటే : 'మీరు ఇంగ్లీషు మాట్లాడకపోయినా. క్రైస్తవుడు కాకపోయినా, తెల్లవారు కాకపోయినా బ్రిటిష్ పౌరులు కావచ్చు. అయితే గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే బ్రిటన్ ఇంగ్లీషు మాట్లాడే, క్రైస్తవులయిన తెల్లవారిది. ఒకవేళ అది ఉర్దూ మాట్లాడే, ముస్లిం మతస్తులయిన, గోధుమ రంగు వ్యక్తులకి చెందుతుంది అంటే భయం, కోపం వస్తాయి. మనం మూర్ఖత్వంతో కావలసినంత మంది పిల్లలను కనకుండా ఉండటం వల్ల, పాశ్చాత్య యూరోపియన్ నాగరికత కొత్త రక్తంతో పునరుజ్జీవనం పొందాల్సిన సమయంలో చావుకు చేరువవుతోంది. అప్పుడు ఆ ముసుగు మూకలు జయిస్తాయి. గెలిచాక గిబ్బన్ చెప్పినట్లు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల్లో ఖురాన్ బోధిస్తారు.'

ఆర్.ఎస్.ఎస్ ప్రచురణలు ఆర్గనైజర్, పాంచజన్య (హిందీ) పాఠకులు పాశ్చాత్య దేశాల్లోని ఇస్లామోఫోబిక్ వ్యక్తులకి, భారత దేశంలో ఇస్లామో ఫోబిక్ వ్యక్తులకీ మధ్య ఆలోచనలు ఎంత దగ్గరిగా ఉన్నాయో తెలుసుకుని సంభ్రమానికి లోనవుతారు. వీరిద్దరూ ఆత్మబంధువులు మరి!

**అనువాదం: నవదీప్**

రచయిత న్యాయవాది, చరిత్రకారుడు
ముంబాయి నివాసి

# తెలుగు ప్రసార మాధ్యమాలు: ముస్లింల సమస్యలు

■ మధుమిత సిన్హా , ఎమ్.ఏ.మోయిద్

తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాలు సాధారణంగా ముస్లింల సమస్యలకు సంబంధించి ఏ విధంగా రిపోర్టు చేస్తాయనే దానితో పాటు ప్రత్యేకంగా టెర్రరిజానికి సంబంధించిన రిపోర్టులు ఎలా ఉంటున్నాయన్న పరిశీలనే ఈ వ్యాసం ఉద్దేశం. హైదరాబాద్ నేపథ్యంలో చూసినప్పుడు మా పరిశీలనకు వచ్చిన అంశమేమంటే తెలుగు పత్రికలు, ప్రసారమాధ్యమాలు కేవలం పోలీసులు చెప్పే కథనాలనే అంగీకరిస్తూ, అత్యుత్సాహంతో ఈ వర్గానికి చెందిన యువకులను టెర్రరిస్టులుగా ముద్రవేస్తూ రాస్తున్నాయి. ఈ మధ్య ఏప్రిల్ 7, 2015 న జరిగిన ఆలేరు ఎన్‌కౌంటర్‌లో విచారణలో ఉన్న ఐదుగురు ముస్లిం యువకులను చంపేయటం మాకెంతో దిగ్భ్రాంతిని కలిగించటమే కాక అందులో ఇమిడివున్న వివక్ష మాలాంటి వారినెందరినో కలిచివేసింది. దాదాపు అన్ని తెలుగు పత్రికలు, ఛానెళ్ళు పోలీసుల చర్యను ఏకగ్రీవంగా సమర్థిస్తూ, ఆ యువకులను కరడుగట్టిన తీవ్రవాదులుగా ముద్రవేస్తూ, వారు ఇలాంటి చర్యకు అర్హులే అని తీర్పునిస్తూ, పోలీసుల చర్యను సమర్థిస్తూ రాసాయి, చూపించాయి. ఇది ఒకవైపు తెలుగు పత్రికా, ప్రసార రంగాలలో ముస్లింలపట్ల నెలకొనివున్న తీవ్ర అపనమ్మకాన్ని సూచిస్తుంది. మరోవైపు ముస్లిం యువకులను అతి సులభంగా టెర్రరిస్టులుగా ముద్రవేస్తూ వారికి విచారణ కూడా అవసరం లేదని నిర్ధారిస్తుంది. అనేక సందర్భాలలో తెలుగు పత్రికా, ప్రసార రంగాలు ఏ రకమైన బాధ్యత లేకుండా, సానుభూతి లేకుండా, తెచ్చిపెట్టుకున్న నిశ్శబ్దాన్ని పాటిస్తాయి. అదే సమయంలో ఆలేరు లాంటి దుర్మార్గమైన సంఘటనలు బహిరంగంగా జరిగినా గానీ, నిజాలను వెలికి తీసేవిధంగా పరిశోధనాత్మక కథనాల వైపు పోకుండా పోలీసుల అవగాహననే తమ గొంతుగా వినిపిస్తాయి.

ఆలేరు ఎన్‌కౌంటరు గురించి తెలుగు వార్తాపత్రికలు, ఛానెళ్ళలో రిపోర్టులు ఏ విధంగా వచ్చాయో, ఉర్దూ పత్రికలు ఏ విధంగా రాసాయో చూద్దాం. చివరి రెండు ఉర్దూ పత్రికలలో వచ్చినవి.

1. ఖేల్ ఖతమ్ (8 ఏప్రిల్, ఈనాడు, జిల్లా ప్రధానపేజీ)
2. టెర్రరిస్ట్ అడ్డా-నల్గొండ (9 ఏప్రిల్, ఈనాడు, జిల్లా ప్రధాన పేజీ)
3. మన పుట్టలో పాములే,(17 ఆగస్ట్, 2008, ఈనాడు)
4. వరంగల్‌లో ఎన్‌కౌంటర్ పారిపోవటానికి ప్రయత్నించిన టెర్రరిస్ట్ వికారుద్దీన్ కాల్చివేత-వి6 టివి ఛానెల్
5. వరంగల్‌లో ఐయస్ఐ ఏజెంట్ వికారుద్దీన్ మరియు నలుగురు సిమి కార్యకర్తల ఎన్‌కౌంటర్-ఎబిఎన్ టివి న్యూస్
6. వికార్ అతని నలుగురు స్నేహితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులు (8 ఏప్రిల్ 2015, మున్సిఫ్, ఉర్దూ దినపత్రిక)
7. నల్లగొండలో విచారణలో ఉన్న ఐదుగురు ముస్లిం ఖైదీల ఎన్‌కౌంటర్ (8 ఏప్రిల్ 2015, ఏతెమాద్, ఉర్దూ దినపత్రిక)

తెలుగు వార్తా పత్రికల వలేకాక ఉర్దూ వార్తా పత్రికలు వాస్తవ పరిస్థితిని గురించి నివేదించాయి. ఈ పరిస్థితి నుండి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి: తెలుగు పత్రికల్లోనూ, ప్రసారమాధ్యమాలలో ముస్లింల మీద ఇంత ఏకీకృత వ్యతిరేకత ఎందుకు ఉంది? దీని ద్వారా వాళ్ళు ఏం సాధించదలుచుకున్నారు? మొదటినుంచీ తెలుగు పత్రికారంగం, ప్రసారమాధ్యమాలు ఈ విధంగానే ముస్లింలపట్ల వ్యతిరేకంగానే ఉన్నాయా? మీడియాలో, పత్రికలలో ఈ రకమైన నిర్ణయాల బాధ్యత ఎవరిది? ఇలాంటి కథనాలవల్ల సమాజంలో ఉత్పన్నమయ్యే సమస్యల గురించి వీరికి ఏ మాత్రమైనా అవగాహన వుందా? మరీ ముఖ్యంగా తెలుగు పాఠకుల మెదళ్ళలో ఈ రకమైన ద్వేషాన్ని నింపటం ద్వారా ప్రజల మధ్య మరింత విభజనకు కారణమవుతామని ఆలోచించారా? ఇలాంటి సమస్యల గురించి యాజమాన్యాలు ఏ విధంగా ఆలోచిస్తున్నాయి? తెలుగు జర్నలిస్టుల నేపథ్యం ఏమిటి? వార్తలు ఎంచుకోవటాన్ని, వాటిని చెప్పే విధానాన్ని ఎవరు నిర్ణయిస్తారు? వీటి పట్ల ప్రభుత్వధోరణి ఏమిటి?

ఈ ప్రశ్నలన్నీ మమ్మల్ని వెంటాడాయి. వీటికి సంబంధించి మరింత తెలుసుకోవడం కోసం ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు, హైదరాబాద్‌లోని ఉర్దూ పత్రికారంగంలో పనిచేస్తున్న ప్రముఖ జర్నలిస్టు ఎమ్.ఏ.మాజిద్‌తో చర్చించాము. జర్నలిస్టు సమూహంలోని వ్యక్తిగా, ఉర్దూ పత్రికారంగంలో భాగంగా ఉన్న ఈయనతో మాట్లాడటం ద్వారా ఈ పరిస్థితికి సంబంధించి మరిన్ని కోణాలు తెలిసే అవకాశం ఉంటుందని మేం భావించాం.

ప్రపంచ వ్యాపితంగా ముస్లింలను టెర్రరిస్టులుగా చూపే ధోరణి బాగా పెరగటంలో 9/11 సంఘటన అతిముఖ్యమైన పాత్ర పోషించింది. అయితే ఈ సంఘటన కంటే ముందుగానే ఎడ్వర్డ్ సయీద్ తన ప్రఖ్యాత 'కవరింగ్ ఇస్లామ్' అనే పుస్తకంలో అంతర్జాతీయంగా ముస్లింల పట్ల మీడియాలో పెరుగుతున్న ద్వేషభావాన్ని ప్రస్తావించాడు: "అంతర్జాతీయ నూతన రాజకీయ, సామాజిక, ఆర్థిక పోకడలలో ఇస్లాం ఒక బలిపశువుగా మారిందనే విషయాన్ని మనం ఒప్పుకోకపోవచ్చు. మనందరికీ దీనిపై ఏకాభిప్రాయం ఉండకపోవచ్చు. కానీ ప్రపంచమంతటా, రైట్ వింగ్ దృష్టిలో ఇస్లాం అంటే ఆటవికత్వం; వామపక్షాల దృష్టిలో భగవంతుడే సర్వాధికారి అనే మధ్యయుగాలనాటి భావజాలం ఉదారవాదుల దృష్టిలో ఇదొక అప్రియమైన పరదేశీయత." ఈ అభిప్రాయమే పాత్రికేయ రంగంతో సహా మతపరమైన సమీకరణ ఉధృతమైన ప్రతి రంగంలోనూ ముస్లింల పట్ల తీవ్ర వ్యతిరేకతగా ప్రతిబింబిస్తోంది. మాజిద్ అభిప్రాయంలో అంతర్జాతీయ సంఘటనల ప్రభావంతో ఈ ధోరణులనే తెలుగు పత్రికా, ప్రసారరంగాలు యధాతథంగా తీసుకుని "టెర్రరిస్ట్" అనే పదాన్ని తెలుగు పాఠకుల్లోకి, ప్రేక్షకుల్లోకి విస్తృతంగా చేరవేస్తున్నాయి. నిజానికి హైదరాబాద్ ముస్లింల సాంస్కృతికతత్వం, విలువల గురించి తెలుగు పత్రికా, ప్రసార రంగాలకి తెలిసింది చాలా తక్కువ. కానీ, ఇవి రెండు రాష్ట్రాల్లోనూ విస్తరించివున్నాయి కాబట్టి, వాటి అభిప్రాయాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయి. వాటికి వున్న లక్షలాదిమంది పాఠకులు, ప్రేక్షకులు ఈ పత్రికలలో, టీవీల్లో ఇచ్చే కథనాలతో సహజంగానే ప్రభావితమయి తీరతారు.

మాజిద్ అభిప్రాయం ప్రకారం ఎన్.టి.రామారావు 1984లో అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు తెలుగు పత్రికా, ప్రసారరంగం ఒక నూతన దశలోకి అడుగుపెట్టింది. దాన్ని ఒక సంకేతంగా తీసుకుని తెలుగు మాట్లాడేవారు, వ్యాపారస్తులు హైదరాబాద్ నగరానికి వలసరావటం ప్రారంభించారు. నగరంలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య అనూహ్యంగా పెరగటం మొదలయింది. ఇబ్బడిముబ్బడిగా తెలుగు వార్తాపత్రికలు, టివి ఛానెళ్ళను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని మీడియా సంస్థలు ఆంధ్రా పెట్టుబడిదారుల యాజమాన్యంలోనే ఉన్నాయి. వారు తమ ప్రాంతాలకు చెందినవారినే జర్నలిస్టులుగా, సంపాదకులుగా నియమించుకున్నారు. వీరికి ముస్లింల గురించి గానీ, తెలంగాణ గురించి గానీ కనీసపాటి అవగాహన కూడా లేదు. మాజిద్ అభిప్రాయంలో టిఆర్‌పి, పంపిణీ అంశాలు కూడా ముస్లింలకు వ్యతిరేక ధోరణులను ప్రోత్సహించేలా చేస్తున్నాయి: టెర్రరిస్టుల గురించి ఉండే కథనాలు వాటి అమ్మకాలని, టిఆర్‌పిని పెంచుతాయి. అదే సమయంలో మక్కా మసీదు బాంబుపేలుళ్ళ

విషయంలో అది హిందూ టెర్రరిస్ట్‌ల దాడి అనే అంశాన్ని పూర్తి స్థాయిలో మరుగున పెట్టడానికి తోడ్పడతాయి.

తెలుగు పత్రికా, ప్రసారరంగాల గురించి మాజిద్ మరిన్ని అంశాలను దృష్టికి తీసుకువచ్చారు. మొదటిది అసలు వేరే వృత్తులలో ఇమడలేనివారు జర్నలిజంలోకి వస్తున్నారు. వారికి జర్నలిజం విలువల పట్లగానీ, పద్ధతుల పట్ల గానీ ఏ విధమైన గౌరవం ఉండదు, అలాగే సామాజిక అంశాల పట్ల కూడా ఏ రకమైన అవగాహనా వుండదు. అలాంటివారిని కార్పొరేటు తరహా సంస్థలుగా పనిచేసే మీడియా యాజమాన్యాలు తొందరగానే గుప్పిట్లో పెట్టుకుంటాయి. పైగా వారి ఆలోచనాధోరణి అంతా కూడా మితవాద రాజకీయాల పరిధిలోనే ఉంటుంది.

అలాగే చాలా సంపాదకవర్గాలలోని సభ్యులు కూడా ముస్లిం వ్యతిరేక భావజాలంతో ఉండటం వల్ల ఆ ధోరణులు రిపోర్టులలో కూడా కనిపిస్తాయి. కొంతమంది సీనియర్ జర్నలిస్టులను ఈ విషయమై మాజిద్ ప్రశ్నించినపుడు వారు తాము పనిచేస్తున్న పత్రికలలో ఈ విధమైన ధోరణిని మార్చలేని తమ అసహాయతను వ్యక్తం చేశారు. వీళ్ళు ప్రతిసారీ ఈ నెపాన్ని యాజమాన్యంలోని కొంతమంది కీలకవ్యక్తులపై నెట్టివేసి, వాళ్ళే ఈ విధమైన వార్తలను అంగీకరించి వేయటం కానీ తిరస్కరించటం కానీ చేస్తారని చెబుతూ ఉంటారు. ఆలేరు ఎన్‌కౌంటర్‌కు సంబంధించి తెలుగు పత్రికా, ప్రసార రంగమంతా కూడా పోలీసులు అందించిన సమాచారాన్నే అందించారని వాళ్ళు ఒప్పుకున్నారు. అయితే ఒక్కటంటే ఒక్క స్వతంత్ర పరిశోధన, విచారణ కూడా లేకుండా పూర్తిగా పోలీసుల కథనం మీద ఈ రకంగా ఆధారపడటం ముస్లిం ప్రజాసమూహం మీద వివక్ష కాదనుకున్నా గానీ అది ఈ వర్గాల మీద వారి నిరాసక్తతని చూపుతోందని మాజిద్ అభిప్రాయపడ్డారు. ఇవి తమలో వున్న వివక్షను కప్పిపెట్టుకోడానికి ఖచ్చితంగా వారుచెప్పే కుంటి సాకులే.

మాజిద్ అభిప్రాయం ప్రకారం ఇంతకుముందు పత్రికారంగంలో వామపక్ష ఆలోచనా ధోరణికలవారు ప్రధానంగా పనిచేసేవారు. అయితే ఇప్పుడు ఆ స్థానంలోకి మితవాద ధోరణితో కలవారు వచ్చేశారు. ఇప్పుడు మరిన్ని ఎక్కువ పత్రికలు ఇదే ధోరణిని అవలంబిస్తున్నాయి. ఆయన అభిప్రాయం ప్రకారం ఇది జర్నలిజానికి పూరించలేని నష్టం, అలాగే సామాన్య ప్రజలకు కూడా. ఇది ప్రజల దైనందిన వాస్తవాలను అనేకవిధాలుగా ప్రభావితం చేస్తుంది. ప్రెస్ కౌన్సిల్ ఈ విషయంలో ఏమైనా చేయగలుగుతుందా అని ప్రశ్నించినపుడు, పేరుకే తప్పించి దానికి ఏ రకమైన అధికారాలు లేవని మాజిద్ అభిప్రాయపడ్డారు. ఇందులో ప్రభుత్వం ఏ రకమైన పాత్ర తీసుకోదలచుకోలేదని కూడా మాజిద్ స్పష్టం చేశారు. ప్రభుత్వం కేవలం చూస్తూవూరుకుంటుందని, సమయం వచ్చినపుడు దానినుంచి కావలిసిన ప్రయోజనం పొందటానికి ఉపయోగించు కుంటుందని అభిప్రాయపడ్డాడు.

హైదరాబాద్ ఫోరమ్ ఫర్ జస్టిస్ 2008లో చేసిన మీడియా ప్రచారోద్యమం "టెర్రర్ ఎక్యూజ్‌డ్ ముస్లిమ్స్:




హౌ ఫెయిర్ ఆర్ ది ట్రయల్స్ బై మీడియా?" కూడా మాజిద్ లాంటి ఎంతోమంది అభిప్రాయాలకు అద్దం పట్టింది.

"పలుకుబడి కల్గిన ఇంగ్లీషు, తెలుగు మీడియా 'టెర్రరిజం' గురించి కథనాలు రాయటంలో ఈ అంశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పోలీసుల కథనాల్నే అతి మామూలుగా ఇచ్చేయటం ద్వారా సాధారణ జనంలో పోలీసులు ఏదో పని చేస్తున్నారన్న అభిప్రాయాన్ని నెలకొల్పడమే దీని వెనుకనున్న ఉద్దేశం. కానీ, మీడియాకు ప్రజల అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు ఈ అంశాల మీద ఒక సైద్ధాంతిక భూమికను కూడా తయారుచేయాల్సిన బాధ్యత ఉంది. దీనిలో ముఖ్యంగా వివక్షలను కూడా చర్చించాల్సిన బాధ్యత మీడియాకుంటుంది. ఉదాహరణకు, బాంబుపేలుళ్ళలో అనేకమంది ముస్లింలు కూడా చనిపోయినప్పటికీ వారి గురించి కనీసం ఊసు కూడా ఉండదు. అదే ముస్లిములను టెర్రరిస్టులుగా చూపటానికి మాత్రం చాలా ముందు ఉంటారు. దాదాపు అన్ని సమయాల్లోనూ మేము గమనించినదేమంటే పోలీసులు గానీ, దర్యాప్తు సంస్థలు గానీ ఇచ్చే కథనాలే పత్రికల్లో వస్తూవుంటాయి. కనీసం కొద్దిపాటి జర్నలిజం కూడా దానిలో ఉండదు. 'జిహాది', 'జిహాది సాహిత్యం' లాంటి పదాలు తరచూ వాడుతూ వాటిలో ఇమిడివున్న అర్థమేమిటనే తేడాను కూడా పాటించవు. అభ్యంతరకరమైన, హానికరమైన 'ఇస్లామిక్ టెర్రరిస్ట్ లేదా జిహాది టెర్రరిస్ట్' లాంటి పదాలను ప్రతిసారీ వాడుతున్నారు. ఏ కొంచెం సంకోచం కూడా లేకుండా మసీదులు, మద్రసాలను 'టెర్రరిస్టు స్థావరాలు'గా పేర్కొంటున్నారు. ఈ వర్గాల యువకులను అరెస్టు చేసినపుడు అవి సెన్సేషనల్ హెడ్‌లైన్స్‌గా మారుతున్నాయి. అరెస్టు అయినవారిని ఐయస్ఐ, లష్కర్-ఎ-తొయిబా, సిమి, ఇండియన్ ముజాహిదీన్ ఏజెంట్లుగా, ఇలా అప్పటికి ఏది పాపులర్‌గా ఉంటే ఆపేరుని వాడుతున్నారు. వారి ఫోటోలను సాధారణ వార్తల్లోనూ, ప్రత్యేక కథనాలల్లోనూ పదే పదే చూపిస్తున్నారు. న్యాయస్థానం నిర్ధారించేదాకా వాళ్ళు కేవలం అనుమానితులే అనే అంశాన్ని కనీసంగా కూడా పట్టించుకోవడం లేదు. అయితే, న్యాయస్థానం కానీ పోలీసులు కానీ వీరికి సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభించలేదని చెప్పినప్పుడు, ఆ వార్త ప్రచురణకు, ప్రసారానికి నోచుకోవట్లేదు. న్యాయస్థానం విడుదల చేసినట్లుగా కూడా కనీసం ప్రస్తావించటం లేదు. అలాగే, పౌరహక్కుల సంఘాలు విడుదల చేసే రిపోర్టుల గురించి కూడా ఏ రకమైన ప్రస్తావనా ఉండదు."

మాజిద్ అభిప్రాయం ప్రకారం సమాజంలో పెద్దఎత్తున కొనసాగుతున్న ధోరణులే విజువల్ మీడియాలోనూ, వార్తా పత్రికల్లోనూ ప్రతిబింబిస్తున్నాయి. సమాజాన్ని అనుసరించాలో లేక పరిస్థితిని విశ్లేషిస్తూ ముందుకి నడిపించాలో తెలియని సందిగ్ధం ఈరోజు మీడియా ఎదుర్కొంటోంది. మాజిద్ గానీ ఇంకా అనేకమంది అభిప్రాయపడుతున్నదేమిటంటే, భారతదేశంలోని స్థానిక మీడియా సమయానికి తగ్గట్లుగా వ్యవహరించటం లేదు. మరోమాటలో చెప్పాలంటే ప్రజల మధ్య విద్వేష భావాల్ని, అపనమ్మకాన్ని వ్యాప్తి చేయటంలో ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్నాయి కూడా. లాభాపేక్షతోనే నడిచే పత్రికా, ప్రసారసాధనాల యాజమాన్యాలు ఈ సందిగ్ధాలను కొనసాగిస్తూనే ఉంటాయని కూడా అనేకమంది భావిస్తున్నారు. ఇదంతా జరిగే క్రమంలో అనేకమంది అమాయక ప్రజలకు, మన సమష్టి జీవిత ప్రయోజనాలకు తీవ్రమైన విఘాతం కలుగుతుంది.

**అనువాదం: కె.సజయ**

మధుమితా సిన్హా ఇఫ్లూలో అధ్యాపకురాలు.
ఎమ్.ఏ.మోయిద్ అన్వేషిలో రిసెర్చి ఫెలో.

# హైదరాబాద్ సంస్థానంలో ఉర్దూ పత్రికలు

■ మహమ్మద్ అష్రఫ్

భారతదేశంలో ప్రచురణా సంస్కృతి (ప్రింట్ కల్చర్) గురించిన అధ్యయనం చాలా వరకు తక్షణ, బహిరంగ రాజకీయ పర్యవసానాల గురించే జరిగింది. ఉదాహరణకు పందొమ్మిదవ శతాబ్దంలో ఉత్తర భారతంలో, హిందుస్తానీకి, హిందీ-ఉర్దూ భాషలకు మధ్య ఉండే వివాదాలు, దక్షిణాదిలో అందరూ మాట్లాడే భాషా ప్రాతిపదికగా ప్రాంతీయ అస్తిత్వాలను నిర్మించుకోవడం ప్రధాన అంశాలుగా ఉంటూ వచ్చాయి.(ఘోష్ 2004).

ఫ్రాన్సిస్కా ఓర్సినీ, 1920-40ల మధ్య కాలంలో హిందీ భాష మాట్లాడే ప్రజా రంగం గురించి అధ్యయనం చేసారు. విద్యావంతులైన భారతీయులు తమ రాజకీయ, సామాజిక, సాహిత్య ప్రయోజనాలను ప్రచురణా రంగం ద్వారా వ్యవస్థీకరించుకున్నారని నిరూపించారు (ఓర్సినీ 2002). అల్‌రైక్ స్టార్ (2008) పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తర భారతంలో పుస్తకోత్పత్తికి సంబంధించి అప్పటి వరకు తెలియని సామాజిక, సాంస్కృతిక, భౌతిక అంశాలను విశ్లేషించారు. ఈమె అధ్యయనం పందొమ్మిదవ శతాబ్దపు రెండవ అర్థ భాగంలో ప్రచురణలు చేపట్టిన నవల్ కిషోర్ ప్రెస్ అనే వాణిజ్య ముద్రణా సంస్థను గురించి. స్టార్ తన అధ్యయనంలో ఫ్రెంచి సిద్ధాంత కర్త పియరే బోర్దు కార్యరంగ సిద్ధాంతాన్ని, సాంస్కృతిక ఉత్పత్తి సిద్ధాంతాన్ని వాడుకున్నారు.

మసూద్ అలీఖాన్ (1995), హైదరాబాద్‌లో ఉర్దూ పత్రికల కాలక్రమానుగత చరిత్రను అధ్యయనం చేసారు. కవితా సరస్వతి దాట్ల తన పుస్తకంలో (2013), ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన, మేధా సంపత్తి చరిత్రలతోపాటు హైదరాబాదులో ఉర్దూ భాషల అభివృద్ధిలో అనువాదాల పాత్ర, పుస్తక రచన, ప్రచురణా కార్యకలాపాల గురించి కూడా పరిశోధించారు. ఆమె మౌలికంగా హైదరాబాద్ ముస్లింల పరిధిలో ఉర్దూ భాష, విద్యారంగ పరిస్థితులు, జాతీయత అంశాల కోణం నుండి మేధో సంపద యొక్క చరిత్రను అధ్యయనం చేయటానికి ప్రయత్నం చేసారు. హైదరాబాద్‌లోని సంస్కృతిని వర్ణించిన, విశ్లేషించిన అధ్యయనాలు అరుదు. సిద్ధాంత పరంగా, వీణా నెరెగల్ (2004), భాషల శ్రేణీకరణకి, విద్యావంతులైన పాఠకులకి, రాజకీయ వ్యవస్థలకు దగ్గరి సంబంధం ఉందని బలమైన వాదన చేసారు.

హైదరాబాద్‌లో ప్రచురణా సంస్కృతిని అధ్యయనం చేయటం అత్యంత ఆవశ్యకం. అయితే అటువంటి అధ్యయనం ఇక్కడి తెలుగు మరియు ఉర్దూ పత్రికా రంగం, రాజకీయ రంగంలోని వైవిధ్యం, ప్రజారంగానికుండిన పరిధుల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జరపాలి.

**హైదరాబాద్ అధికారులు, సంస్కృతి, ప్రజారంగం**

హైదరాబాద్ సంస్థానం, బహుళ సంస్కృతుల కలయిక. సామాజిక వైవిధ్యానికి పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని సామాజిక వ్యవస్థ శతాబ్దాల క్రితం వలస వచ్చిన వివిధ మత, భాషా సమూహాల మిశ్రమం. ఇరాక్, యెమెన్, టర్కీ, ఆఫ్రికా, ఆర్మీనియా దేశాల నుండి ముస్లింలు, హిందూ మతానికి చెందిన వివిధ సమూహాలు దక్కన్ పీఠభూమిలోని ఈ ప్రాంత జనాభాలో అంతర్భాగం. హైదరాబాద్ సంస్థానం వలస వచ్చిన వారికి, వలస వెళ్ళిన ప్రజలకు, వైవిధ్యానికి, సార్వజనీనతకు, బహుళ సంస్కృతికీ, నెలవుగా ఉండింది. (సల్మా అహ్మద్ ఫారూఖీ, 2008). బెంజమెన్ కోహెన్ రచించిన కింగ్‌షిప్ అండ్ కలోనియలిజమ్ ఇన్ ఇండియన్ డెక్కన్ (2007) లో చెప్పినట్లు, హైదరాబాద్ సంస్థానం వంటి రాజ్యాలను బహుళస్థాయి, బహుళ జాతి రాజ్యాలుగా అభివర్ణించాలి. ప్రాచీన హిందూ రాజ్యరూపాలు, తరువాత ఏర్పడిన ముస్లింల పాలనలో కలిసిపోయి ఉండటం వలన, ఈ రాజ్యాల అధ్యయనం వివిధ స్థాయిలలో జరగాల్సి ఉంటుంది (జుట్షి 2009). దక్షిణాసియాలో మొట్టమొదటి ఉర్దూ విశ్వవిద్యాలయమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనలో 1918లో స్థాపించబడింది. ఇది హైదరాబాద్‌లో మేధావుల ఎదుగుదలకు, ప్రత్యేకించి ఉర్దూ భాష ప్రామాణీకరణకు ఎంతో దోహదం చేసింది (దాట్ల, 2013). ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లభాష రెండవ భాషగా తప్పని సరిగా చదవవలసి వచ్చేది.

హైదరాబాద్‌లో రాజకీయ, ప్రజారంగాలు, వివిధ సామాజిక, రాజకీయ, భాషా సంస్కృతులు మేళవించిన ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజ్, హిందూ మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, భారతీయ జాతీయ కాంగ్రెస్, ముస్లిమ్ లీగ్‌ల చేత ప్రభావితం అయ్యాయి. తెలుగు, కన్నడ, మరాఠీ ప్రధాన వాడుక భాషలుండేవి. 1940ల వరకూ, హైదరాబాద్ ప్రజా జీవితాన్ని ముస్లింలే ఎక్కువ ప్రభావితం చేసారు. భూమి వాళ్ళ చేతుల్లో ఉండటం, ప్రభుత్వోద్యోగాలలో వాళ్ళే ఎక్కువగా నియమించబడటం వల్లే కాక, అధికార భాష ఉర్దూ కావటం దీనికి కారణాలు. (గ్రేయర్, జాఫ్రెలాట్, 2013). సామాజిక, రాజకీయ అంశాల చర్చ ద్వారా ప్రజా జీవితాన్ని చైతన్యవంతం చేయటంలో పౌర సమాజ సంస్థలు, ఉద్యమాలు నాయకత్వపు పాత్రను నిర్వహించాయి. భారత దేశ స్వాతంత్ర్యానికి దారితీసిన దశాబ్ద కాలంలో, హైదరాబాద్‌లో ప్రభుత్వ యంత్రాంగం ఎన్నో విధాల అవరోధాలు కల్పించినప్పటికీ, పౌర సమాజం చురుకుగా పని చేయటం కనిపిస్తుంది.

సాలార్‌జంగ్ ఇరవయ్యో శతాబ్ది రెండవ దశకంలో ప్రవేశపెట్టిన ఆధునికీకరణ పథకాలు, రాజ్యాంగ సవరణలు, హైదరాబాద్‌లో ప్రజారంగం ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడ్డాయని; తరువాతి కాలంలో అవే నిజాం రాచరికపు అధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగంలో ముస్లింల పెత్తనాన్ని సవాలు చేయటానికి కూడా దారితీసాయని రమాసుందరి మంతెన (2014) అభిప్రాయం.

హైదరాబాద్ సంస్థానంలో అన్ని రంగాలలో రాజకీయాలు ప్రముఖ పాత్రను నిర్వహించాయి. రాజకీయ భావజాలం, దృక్పథాలే మత,కుల,భాష, భౌగోళిక లేక ఇతర వర్గీకరణకు గానీ, అస్తిత్వ కొలమానాలకు మార్గదర్శనాలైనాయి.

**హైదరాబాద్ సంస్థానం-భాష:**

ఉత్తర భారత దేశం నుంచి ముస్లింల పాలన దక్కనుకు విస్తరించడం వలన, ఈ ప్రాంతంలో మొదట పర్షియన్ భాష, ఆ తరువాత, 20వ శతాబ్దం నుండి ఉర్దూ భాషలు, పరిపాలనా యంత్రాంగంలో, విద్యాబోధనలో బలంగా ఉండేవి. హైదరాబాద్‌లో దక్కనీ భాష ముందునుండే వృద్ధిచెందింది. కవిత దాట్ల (2013:9) వలస పాలనా కాలంలో హైదరాబాద్‌లో ఉర్దూ జాతీయతను గురించి చేసిన అధ్యయనంలో, ఇరవయ్యో శతాబ్ది తొలి రోజులలో ఉర్దూ భాషకూ ఇతర భాషలతో దానికున్న తేడాలను ఎత్తి చూపిండటం మాత్రమే కాక, అందరికీ మతాతీమైన భవిష్యత్తును ఊహించటానికి ఉర్దూ ఉపయోగపడిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మేధావులు ఉర్దూను హిందీకి పోటీగా కాక, ఇంగ్లీషు భాషకు, పాశ్చాత్య విద్యకు వ్యతిరేకంగా వాడుకుంటూ, ఉర్దూను మతానికి అతీతంగా చూసారు. పర్షియన్, ఉర్దూ భాషలు ముస్లింల పాలనకు ప్రతీకలుగా కూడా చెలామణీ అయ్యేది.

భారత దేశంలోని మిగిలిన ముస్లిం ప్రాంతాలతో పోలిస్తే, హైదరాబాద్‌లో ఉండే కులీన వర్గాలు, పర్షియన్ భాషను తమ సాంస్కృతిక వారసత్వంగా, సమాజంలో తమ ఉన్నత స్థాయికి ప్రతీకగా, రాజకీయ అధికారానికి చిహ్నంగా భావించేవారు. హైదరాబాద్‌లో 'పైగా' అనే కులీన వంశస్తులు, పర్షియన్‌ని తమ సాంఘికీకరణలో భాగంగా అధ్యయనం చేసేవారు. అయితే, కాలక్రమేణా అధికార వర్గాలలో ఇంగ్లీషు, ఉర్దూ భాషలకు ప్రాబల్యం పెరగటం వల్ల వాటికి దగ్గర రావటం ప్రారంభించారు. 1884లో ఉర్దూ అధికార భాషగా గుర్తింపబడేవరకూ పర్షియన్ ముస్లింల సాంస్కృతిక రాజకీయ ఆధిపత్యానికి ప్రతీకగా ఉండేది.

పర్షియన్ నుంచి ఉర్దూకు జరిగిన మార్పు రాజ్య రాజకీయాలతో ముడిపడి ఉండింది. ముఖ్యంగా స్థానికులు (ముల్కీలు), స్థానికేతరుల (ముల్కీకాని వారు) మధ్య ఏర్పడిన ఘర్షణల వలన వచ్చింది. బ్రిటిషు వారి పాలనలో ఉన్న ఉత్తర భారతం నుండి హైదరాబాద్‌కు వలన వచ్చిన హిందూస్థానీలు అక్కడ 1840ల నుండి విద్యాబోధన, న్యాయస్థానాలలో ఉర్దూ వ్యవహార భాషగా ఉండటం వలన హైదరాబాదు రాజ్య పాలనా వ్యవహారాలు కూడా ఉర్దూలో నిర్వహించటం సమంజసమేనని భావించారు.

హిందూస్థానీ అధికారులు, రాజ్యంలో ఉర్దూకు అనుకూలంగా ఒక బృందాన్ని తయారుచేసారు. సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామీ ఉస్మాన్ అలీఖాన్‌కు ఉపాధ్యాయుడు; ముప్పైరెండు సంవత్సరాల పాటు విద్యాశాఖకు ముఖ్య అధికారి. ఈయన ఉర్దూ మీడియంలో విద్యాబోధనని ప్రోత్సహించే వాడు. ఉర్దూకు మద్దతునిచ్చేవాడు. పర్షియన్‌కు బదులుగా ఉర్దూ భాషను అధికార భాషగా చేసిన తరువాత కూడా ఆంగ్లభాషకు వ్యతిరేకంగా, క్రియాశీలకంగా పని చేసేవాడు. ఉర్దూకు అనుకూలంగా ప్రారంభమైన ఉద్యమం మొదట పర్షియన్‌కి, తరువాత స్థానిక భాషలకు, ఇంగ్లీషుకు వ్యతిరేకంగా పనిచేసింది. సాలార్ జంగ్ 1, మొదట పర్షియన్ నుంచి ఉర్దూకు మార్పును వ్యతిరేకించాడు గానీ, తరువాత ఉర్దూ భాషకు కొన్ని మినహాయింపులు ఇచ్చాడు. ఈ మార్పు అధికారికంగా 1884లో జరిగింది. సంస్థానంలో స్థానిక భాషల వాడుకని సహించిప్పటికీ, హైదరాబాద్ వంటి నగరాలలో ఉర్దూ భాష మాత్రమే వాడుకలో ఉండేది.

హైదరాబాద్ రాజ్యానికి పర్షియన్ అధికారిక భాషగా ఉన్నప్పుడు కూడా, ఉర్దూకు ఒక రాచరిక లాంఛనప్రాయ మర్యాద ఉండేది. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు, ప్రభుత్వోద్యోగాలు సంపాదించుకోవడం కోసం ఉర్దూ నేర్చుకునేవారు. ఉర్దూ భాషను ప్రోత్సహించటానికి చాలామంది వ్యక్తులు, సంస్థలు ఉండేవి. ఉర్దూతో అనుబంధం ఉన్న వ్యక్తులలో మౌల్వీ అబ్దుల్ హక్ చెప్పుకోదగ్గ వాడు. అతనికి "ఉర్దూ పిత"గా గుర్తింపు ఉండేది. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులలో ఒకడు. ఆయన దారుల్ తర్జుమా (అనువాదాల విభాగం)కు అధ్యక్షునిగా వ్యవహరిస్తూ ఉత్తర భారతం నుండి హైదరాబాద్‌కు ఎంతో మంది పండితులను ఆహ్వానించాడు. మౌల్వీ అబ్దుల్ హక్ 'ఉర్దూ భాష పట్ల ప్రేమ' ఉండటం, ముస్లింలకుండాల్సిన లక్షణమని అభిప్రాయపడ్డాడు. సమాజంలోని పైతరగతుల వారు ఇంగ్లీషు భాష పట్ల మక్కువ చూపడం మొదలు పెట్టినప్పుడు కూడా మధ్య తరగతి ప్రజలు ఉర్దూలో విద్యాభ్యాసం పట్ల మొగ్గు చూపేవారు (దాట్ల 2013).

హైదరాబాద్ రాజ్యంలో ఉర్దూని వివిధ కోణాల నుంచి చూసేవారు. ఇస్లాం మతానికి, ముస్లింలకు ప్రతీకగా; ఇంగ్లీషు భాషకు, ఆంగ్ల విద్యాబోధనకు పోటీగా; దక్కనులో ఇతర భాషలతో వ్యవహరించటానికి అనుసంధాన భాషగా దీన్ని పరిగణించే వారు. అయితే పందొమ్మిదవ శతాబ్దపు చివరి భాగంలో ఉత్తర భారత దేశంలో ఉర్దూ భాషను (పర్షియన్ లిపిలో) ముస్లింలకు, హిందీ (సంస్కృతం లిపిలో) ని హిందువులకు ప్రతీకగా చూసే ఉద్యమం మొదలైంది.

**హైదరాబాద్‌లో ఉర్దూ పత్రికారంగం:**

హైదరాబాద్‌లో కేప్టన్ సైదెక్ హామ్ అప్పటి నిజాంకు ఐరోపా విజ్ఞాన శాస్త్ర పరికరాలను, యుద్ధ సైనికుడి నమూనాలను, ఎయిర్ పంప్‌ను, ముద్రణా యంత్ర నమూనాలను చూపించినప్పుడు ఆయన ముద్రణా యంత్రం పట్ల ఎటువంటి ఆసక్తి చూపకపోగా, మద్రాసు నుంచి తాము తయారుచేసిన యంత్రం వినియోగానికి సంబంధించిన సూచనలు ఇవ్వటం కోసం వచ్చిన వారి నైపుణ్యానికి ప్రతిఫలంగా వారికి బహుమతి కూడా ఏమీ ఇవ్వలేదట. అయినప్పటికీ, 1886 నాటికల్లా దేశవ్యాప్తంగా 1094 ముద్రణా సంస్థలు ఏర్పడితే, అందులో 200 దక్షిణ భారతంలోనే నెలకొల్పబడ్డాయి. (గుప్తా చక్రవర్తి, 2004:11)

హైదరాబాద్‌లో ప్రచురణా సంస్థలకు అసఫ్ జాహీ కాలంలోని కులీన వంశస్థులైన ఒక 'పైగా' కుటుంబంతో సన్నిహిత సంబంధం ఉంది. అటువంటి 'పైగా' వంశస్థులలో అబ్దుల్ ఫతేఖాన్ మొదటివాడు. అబ్దుల్ ఫతేఖాన్ కొడుకైన ఫక్రుద్దీన్‌ఖాన్, ప్రధాన మంత్రిగా నియమింపబడి కొంత కాలం తరువాత రాజీనామా చేసి, విద్యా, మేథోపరమైన కార్యకలాపాలలో నిమగ్నమయ్యాడు. విజ్ఞాన సముపార్జన, పంపిణీ కోసం ఒక అకాడమీని, ప్రచురణా సంస్థను ప్రారంభించాడు. దీనిలో ప్రధానంగా విదేశీ పండితులు రాసినవి గాని, విదేశీ భాషల నుండి అనువదించబడినవి గాని, విజ్ఞాన, గణిత శాస్త్రాలలో గ్రంథాలు ప్రచురించబడ్డాయి. (సాజీదా అదీబ్ 2005). అదీబ్ అభిప్రాయంలో "ఇది హైదరాబాద్ రాజ్యంలో మొట్టమొదటి ప్రచురణా సంస్థ. ఫక్రుద్దీన్ ఖాన్‌కు అప్పట్లో ఐరోపాలో జరుగుతున్న విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక రంగాలలోని అభివృద్ధి విషయంలో అవగాహన ఉండేది. అతడు ఇంగ్లండు, ఫ్రాన్స్ మొదలైన దేశాల నుండి విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రం, సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను తెప్పించి, అప్పటి అధికార భాషలైన ఉర్దూ, పర్షియన్‌లలోకి అనువదింపచేసి, తన సంస్థలో ముద్రించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాడు".

హైదరాబాద్‌లో పత్రికా సంస్కృతి ఆధునిక, శాస్త్రీయ విద్యా కార్యకలాపాలలో భాగంగా మొదలైంది. మొదటి ఉర్దూ వైద్య విజ్ఞాన పత్రిక అసఫ్ జాహీ కాలంలో, 1857లో, "రిసాలా-ఇ-తబాబత్" అనే పేరుతో ప్రచురించబడింది. ఈ పత్రిక సంపాదకుడు జాన్ స్మిత్. ఉర్దూ పాత్రికేయరంగ చరిత్ర, రాజకీయ, సామాజిక, సాహిత్య అవసరాలతో పాటు, ప్రధానంగా పాశ్చాత్య విజ్ఞాన, వైద్య శాస్త్రాలతో పరిచయం చేసుకునే నిమిత్తం మొదలైంది. ఈ విధంగా వైద్య, విజ్ఞాన శాస్త్రాలు ఉర్దూ పాత్రికేయ రంగానికి పునాది అయినాయి.

"హైదరాబాద్‌లో ఉర్దూ పత్రికారంగ చరిత్ర" అనే పుస్తకంలో డా॥మసూద్ అలీఖాన్ (1995), దీనికి సంబంధించిన కాలక్రమానుగత చరిత్రను అధ్యయనం చేశాడు. ఖాసిమ్ అలీ సజ్జన్‌లాల్ అభిప్రాయంలో, 1860లో ప్రచురించబడిన 'ఆఫ్తాబే దెక్కన్' హైదరాబాద్‌లో మొదటి ఉర్దూ పత్రిక. అన్వరుల్ హక్ జఫారీ, ఉర్దూ పత్రికా రంగం 19వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో అభివృద్ధి చెందిందని రాశాడు. అతడి అభిప్రాయంలో 1883లో సుల్తాన్ మొహమ్మద్ దెహ్లవీ సంపాదకుడుగా మొదలయిన "ఖుర్షీద్-ఏ-దెక్కన్" మొట్టమొదటి వార్తాపత్రిక (మసూద్ అలీఖాన్ 1995:12).

ఉర్దూ పత్రికా రచనలో తొలి దశలో వచ్చిన పత్రికలు ఖుర్షీద్-ఏ-దెక్కన్, హజారే దాస్తాన్, అఫ్సరుల్ అఖబెర్, అక్బర్-ఏ-ఆసఫీ, ముషీర్-ఏ-దెక్కన్. 1902లో మొహిబ్-ఇ-హుసేన్ ప్రారంభించిన మూడవ దిన పత్రిక ఇల్మ్-వో-అమల్ పత్రికకంటే ముందు 1901 నాటికి 14 వార్తా పత్రికలు, మేగజీనులు ప్రచురితమయ్యేవి. వీటిలో 12 ఉర్దూలో, 2 మరాఠీలో ఉండేవి. 12 ఉర్దూ పత్రికలలో ఏడు దిన పత్రికలు.

హైదరాబాద్‌లో పత్రికా రచన, ప్రచురణ ప్రారంభమైనప్పటి నుండి 1918 వరకు, హైదరాబాద్ కాంగ్రెస్, మజ్లిస్-ఏ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ స్థాపింపబడే వరకు కూడా, వార్తా పత్రికలన్నీ సంస్కరణ దృక్పధాన్నే అవలంబించేవి. బ్రిటిష్ పాలనలోని భారత దేశంలో ప్రారంభమైన జాతీయోద్యమం హైదరాబాద్‌కు విస్తరించి ఈ రాజ్యంలో రాజకీయ దృక్పథాల్ని మార్చి వేసింది. సుభా-ఏ-దెక్కన్, నిజాం గెజెట్, రాష్ట్రంలో ప్రధానమైన వార్తా పత్రికలుగా ఉండేవి. హకీమ్ గుఫారన్ అహ్మద్ అన్సారీకి ఎప్పుడూ పత్రికలతో అనుబంధం ఉండేది. వేర్వేరు పేర్లతో ఆయన 17 వార్తా పత్రికలు నడిపేవాడు. ప్రభుత్వంపైన బలమైన విమర్శ చేసేవాడు కాబట్టి, అతడికి నేరుగా వార్తా పత్రికలు ప్రచురించే అనుమతి లభించలేదు. ఆయన సయ్యద్ నూర్ అల్ హక్ జఫారీ సంపాదకత్వంలో 'మజ్లిస్, 'అల్ అజాన్, 'చార్మినార్' అనే పత్రికలను ప్రచురించేవాడు.

ఎమ్.ఎన్.నర్సింగరావు రాజకీయవేత్త, పాత్రికేయుడు. ఆయన 1928లో తన దృక్పధాన్ని ప్రచారం చేసుకోవటం కోసం 'రయ్యత్' అనే వార్తా పత్రికను ప్రచురించటం మొదలుపెట్టాడు. ప్రభుత్వం ఈ పత్రికకు వ్యతిరేకంగా కఠినమైన చర్యలు తీసుకోవటం వలన దీని ప్రచురణ మూతబడిపోయింది. అబ్దుల్ రెహమాన్ రయీస్ 1929లో 'మన్‌షూర్' అనే పత్రికను, తరువాతి కాలంలో 'వకత్' అనే పత్రికను నడిపాడు. చాలా మంది రచయితలు అతడితో సహకరించటం వలన అతడి వార్తా పత్రికలు మంచి పేరు తెచ్చుకున్నాయి. అతడు జాతీయవాదిగా గుర్తింపు పొందాడు; ఖిలాఫత్

ఉద్యమంలో కూడా పాల్గొన్నాడు. రయీస్‌ను, అతడి సహచరులను, ప్రభుత్వం ఒక కంట కనిపెడుతూ ఉండేది. 1930లో అహ్మదుల్లా ఖాద్రి, రాజకీయాలకు దూరంగా ఉండే 'సల్తనత్' పత్రికను ప్రారంభించాడు. ఈ పత్రిక నిజామ్ ఆదేశాలను, అతడు రాసిన కవిత్వాన్ని ప్రచురించేది.

ఖ్వాజీ అబ్దుల్ గఫార్ 1935లో 'పాయమ్' వార్తా పత్రికను ప్రారంభించాడు. దీనితో ఉర్దూ పత్రికా రచన ఉన్నత స్థాయిని చేరుకుంది (ఐబిడ్:19). ఈ పత్రిక సాహిత్యాభిరుచిని వ్యక్తీకరించటమేకాక స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ విషయాలను చర్చించేది.. ప్రగతిశీల భావాలను ప్రోత్సహించేది. హైదరాబాద్ పాత్రికేయ రంగాన్ని ఒకవైపు రాజ్య సంస్కరణల సమితి ఏర్పాటు, రాష్ట్ర కాంగ్రెస్, మరొక వైపు బహదూర్ యార్ జంగ్ నాయకత్వంలోని మజ్లిస్ రాజకీయ కార్యకలాపాలు రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రభావితం చేసాయి. వార్తాపత్రికలు సహజంగానే ఈ రెండు గ్రూపులు కింద విడిపోయాయి.
మొహిబ్-ఇ-హుస్సేన్ తొలుత ప్రారంభించిన సంస్కరణ ఉద్యమాలని 1938-40లలో రాష్ట్ర కాంగ్రెస్ కొనసాగించింది. ఈ ఉద్యమాలని సంఘటితం చేయటంలో 'రయ్యత్', 'పాయమ్', ఇమ్రోజ్" పత్రికలు తోడ్పడ్డాయి.

1947లో సంభవించిన రాజకీయ సందిగ్ధ స్థితి నుంచి 'ఇత్తెహాద్' పుట్టింది. మజ్లిస్ సంస్థ అధికార పత్రికైన 'ఇత్తెహాద్'కు అబ్దుల్ ఖాదర్ హష్మి, సుల్తాన్ బిన్ ఒమర్ సంపాదకులు. మొదట్లో మజర్ అలీ కామిల్ దీని ప్రధాన పోషకుడు. తరువాతి కాలంలో హైదరాబాద్‌లో రజాకార్ ఉద్యమాన్ని ప్రారంభించిన ఖాసిమ్ రజ్వీ సహకారంతో ఇది ప్రచురించబడింది. వీరు 'అల్‌బలాగ్' అనే వార్తా పత్రికను కూడా ప్రచురించేవారు. హష్మి తరువాత సుల్తాన్ బిన్ ఒమర్ దీని సంపాదకులయ్యారు. ఇమ్‌రోజ్ 1948లో ప్రారంభించబడిన జాతీయవాద వార్తా పత్రిక. కాంగ్రెస్ పార్టీ మద్దతును సంపూర్ణంగా అందుకున్న షోయెబుల్లా దీని సంపాదకుడు. షోయెబుల్లా హత్య అనంతరం ఈ పత్రిక మూతబడింది.

ముషీర్-ఏ-దెక్కన్, ఇల్మ్-వో-అమల్ ప్రచురణ మొదలైన తొలి రోజులలో, సామాన్య ప్రజలలో సాహిత్యం విషయంలో ఆరోగ్యకరమైన పరిణామాలు చోటుచేసు కున్నాయి. ఈ కాలాన్ని నిర్మాణాత్మకమైనదిగా, సంస్కరణాత్మకమైనదిగా గుర్తించటం సమంజసంగా ఉంటుంది. పత్రికలు నెమ్మదిగా తమ విశ్వసనీయతను స్థాపించుకోవటం మొదలు పెట్టాయి. ఉర్దూ పత్రికల ఎదుగుదల రెండు దశలలో జరిగిందని చెప్పవచ్చు. మొదటి దశ 1850-1925ల మధ్య; రెండవ దశ 1925-1948లలో మొదలయి, హైదరాబాద్ భారతదేశ సమాఖ్యలో కలిసిపోయే వరకు కొనసాగింది.

ఉర్దూ పత్రికారంగ రెండవ దశలో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన మేధావులందరూ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన వారే. 1945-48 మధ్య



కాలంలో వీరిలో కొందరు నిజాం అధికారాన్ని సమర్థిస్తే, కొందరు మజ్లిస్‌కి మద్దతుగా ఉండేవారు; కొందరు ప్రగతిశీలమైన దృక్పథంతో ఉంటే, మిగిలిన వాళ్ళు జాతీయతావాదులు. 1938-48ల మధ్య కాలంలో పత్రికలు, పాత్రికేయులు చాలా క్రియాశీలకంగా పనిచేశారు. ఈ కాలంలో వెలువడిన వార్తా పత్రికలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

మొదటి వర్గానికి చెందినవి బలంగా అప్పటి ప్రభుత్వ పక్షాన్ని తీసుకున్న 'నిజాం గెజెట్', 'సుభా-ఏ-దెక్కన్'. ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు ప్రచురించాల్సిన బాధ్యత అన్ని వార్తా పత్రికల మీద ఉండినప్పటికీ, నిజాం ఆదేశాల విషయంలో ఈ రెండు పత్రికలు అత్యంత విశ్వసనీయమైనవిగా పరిగణించబడేవి. రెండవ వర్గానికి చెందిన వార్తా పత్రికలు, అంటే, రహబరే- ఏ-దెక్కన్, మజ్లిస్, ఇత్తెహాద్, ఆఫూస్, మజ్లిస్ పార్టీకి, సంస్థకు మద్దతుగా ఉండేవి. ఈ వార్తా పత్రిక నిజాంకు ముస్లింల 'ప్రయోజనాల'కి ప్రాతినిధ్యం వహించి, పరిరక్షించే బాధ్యత ఉంది గనుక హైదరాబాద్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలని ప్రకటించేవి. మూడవ వర్గానికి చెందిన వార్తా పత్రికలైన రయ్యత్, పాయం, వక్త్, ఇమ్‌రోజ్ రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వం కావాలని వాదించేవి. ఇవి జాతీయవాద పత్రికలు కూడా. పాయమ్ ఆధునిక భావాలను ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో కమ్యూనిస్టులకు నెలవయ్యింది.

ఈ చర్చ సారాంశమేమిటంటే, హైదరాబాద్ ఉర్దూ పత్రికారంగం సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాల గురించి చర్చిస్తూ వివిధ దశలలో ఎదిగింది. హైదరాబాద్‌లో ఆధునిక విద్య, పాశ్చాత్య విజ్ఞానం, సాంఘిక సంస్కరణ, రాజకీయ చైతన్యం, సాహిత్య, సాంస్కృతిక అభివృద్ధి, ఉర్దూ పత్రికారంగం చేపట్టిన కార్యక్రమాలని, లక్ష్యాలని ప్రభావితం చేసాయి. ఉర్దూ పత్రికలు వ్యాపార లక్ష్యాలతో ప్రారంభం కాలేదు. వీటికి మేధోసంపత్తి, విద్య, రాజకీయ రంగాలతో సంబంధముండింది. మొదటి దశలో సామాజిక సంస్కరణ, ఆధునికీకరణలు ధ్యేయాలయితే. రెండవ దశలో విద్య, రాజకీయాభివృద్ధి కొరకు పని చేసాయి. 1920 నుండి భారత దేశంలో హైదరాబాద్ కలిసి పోయేవరకు, ఉర్దూ పత్రికలు రాజకీయ రంగంలో క్రియాశీలకంగా పని చేసాయి. జాతీయవాదం, కమ్యూనిజం, ఇస్లాం, హిందూమతవాదం వంటి అన్ని రకాల భావజాలాలు రాజ్య రాజకీయ రంగంలో భాగమైనాయి. రాజ్య స్వరూప స్వభావాలను నిర్ధారించటంలో, భాష, మతం, కులం, ప్రాంతం, ఇతర అంశాలు. ముఖ్యమైన పాత్రను వహించాయి. ఉర్దూ పత్రికారంగ ఆవిర్భావం, అభివృద్ధిలో ఈ అంశాలన్నీ ప్రధాన పాత్ర పోషించాయి.

**అనువాదం: పి.మాధవి**

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో
డాక్టరల్ ఫెలో

# కనిపిం(చని)చే దళితులు: కులహింసా స్థావరమైన పాత్రికేయ రంగం

■ రంజిత్ తంకప్పన్

దళిత విలేఖరి నాగరాజు మరణం, వార్తాపత్రిక యాజమాన్యం అతని పట్ల చూపిన వైఖరి భారతీయ మీడియాలో ప్రబలిన దళిత వెలివేతని, అణచివేతని మరొక్కసారి తెరముందుకు తీసుకొచ్చాయి. బాహాటంగా, నిస్సిగ్గుగా కులమన్నదే లేదని ప్రవర్తించే ప్రసార మాధ్యమ సాధనాలు ఉన్నట్లుండి మేలుకొన్నాయనీ, దళిత సమస్య మీద సభ్య సమాజం చారిత్రక మౌనాన్ని బద్దలు కొట్టిందనీ కాదు కానీ అతడి మరణం పాత్రికేయ సంస్కృతీ సంప్రదాయాల మీద విమర్శాత్మక చర్చకు దారి తీసింది.

నాగరాజు పట్ల వార్తా పత్రిక యాజమాన్యం కనబర్చిన అశ్రద్ధని కార్పోరేట్ పెట్టుబడిదారి వ్యవస్థ శ్రామిక వర్గం పట్ల చూపే సైద్ధాంతిక అలసత్వం అనే సార్వత్రిక తర్కంలోకి కుదించగలమా? మొదటి పేజీలో చోటు చేసుకోదగిన దళిత వార్తా కథనాలను తెగనరికేసే చర్యల్లో దళితేతర సంపాదకీయులు ప్రత్యేకంగా అనుభవించే కుల విలాసం ఏదైనా ఉందా? ఒక దళిత వ్యక్తి పత్రికా సంస్థలో సంపాదక పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఒక రకమైన బ్రాహ్మణికపు దురద మిగిలిన వారికి కలుగుతుందా? భారత దేశ మీడియా సంస్థల్లో దళితులు పాత్రికేయ వృత్తి చేపట్టలేరన్న అప్రకటిత కులసూత్రం ఏదైనా ఉందా?

భారత దేశ పాత్రికేయ వ్యవస్థలో దళితులను గురించి లేవనెత్తబడిన ఇటువంటి కొన్ని క్లిష్టమైన సమస్యలని సంక్షిప్తంగా వివరించి విస్తృత వెలివేత పద్ధతులతో కూడుకున్న ఈ వ్యవస్థని ఆవహించిన జెండర్ కుల-వర్గ మేళవింపుల చట్రం గురించి ఈ వ్యాసంలో చర్చిస్తాను. మరొక విధంగా చెప్పాలంటే పాత్రికేయరంగంలో దళిత ప్రాతినిధ్య సమస్యని చుట్టుముట్టిన రాజకీయాల్లో కనిపించేది సభ్య సమాజం అవలంబిస్తున్న ఆధిపత్యపు తిరస్కార పద్ధతులే. అవి రాజ్యానికి ఆవల రాజ్యం పట్ల అప్రమత్తతతో ఉన్నట్లు కనిపించినా, నిజానికి సామాజిక అసమానతలను పెంచి పోషించే భావజాలం నుండే రూపుదిద్దుకుటున్నాయి.

**కనిపించి/కనిపించని దళితులు:**

సమాచార ప్రసార మాధ్యమంలో కనిపించటం, కనిపించకపోవటం అన్న చట్రం తీరుతెన్నులను దళిత వృత్తాంతాలు నిర్ధారిస్తున్నాయి. దళితుల సమస్యలకు సంబంధించి తగినంత వార్తాసేకరణ లేని పరిస్థితి ఒకవైపు, మరొక వైపు అవి వార్తల్లో చోటు చేసుకున్నప్పటికీ కొన్ని ప్రత్యేకమైన అంశాలకే పరిమితమై ఉన్న పరిస్థితి కనిపిస్తుంది. కనిపించే వార్తల్లో, దళితులు తక్కువ రకం మనుషులు అనే మూసరూపాలను బలపరిచేవే ఎక్కువ. మొదటి దానిలో దళితులు వార్తల్లో కనపడరు. ఈ రెండు స్థితులకు సంబంధముంది. దళిత కథనాలు వార్తల్లో చోటు చేసుకున్న సందర్భాల్లో అగ్రకులాల వారు దళితుల పట్ల దాతలుగా, సంరక్షకులుగా తమ ఘనత చాటుకునే విధంగా ఉంటాయి. ఈ రకమైన కలుపుకోవటం దళితులు రాజకీయ స్వాభిమాన ప్రకటన చెయ్యకుండా వారి గొంతు నొక్కేస్తుంది. ఈ రకంగా మూగబోయిన దళిత సొంత అస్థిత్వ స్థానంలో జాతిరాజ్య ప్రామాణికానికి లోబడి నాగరీకరించబడే ఆవశ్యకత ఉన్న పాలితులు వచ్చి చేరుతారు. ఇక నెమ్మదిగా చర్చల్లోకి నడుద్దాం. ప్రస్తుత అకడమిక్ అధ్యయనాలు భారతదేశ జాతీయ మీడియాలో దళిత ప్రాతినిధ్యం లేదన్న విషయాన్ని తెలియజేస్తున్నాయి. పాత్రికేయ రంగంలో దళితుల ప్రాతినిధ్యం, అఖిల భారత ప్రమాణాల గురించి అంబేద్కర్ కాలంనుండే చర్చలు జరిగాయి. చారిత్రకంగా దళితుల పట్ల జాతీయవాద మీడియా చూపే నిర్లక్ష్యపు జాడలు పట్టుకోవాలంటే అంబేద్కర్‌తో మొదలుపెట్టాలి. దళితులకు ప్రాతినిధ్యం వహించేది తామేనంటూ కాంగ్రెస్, గాంధీ చేసిన వాదాన్ని సవాలు చేస్తూ అంబేద్కర్, జాతీయవాద వార్తా పత్రికలకున్న కుల ప్రచార స్వభావాన్ని ఉదహరించారు. జాతీయ మీడియాలో దళితులకూ, వారి రాజకీయాలకు ప్రాతినిధ్యం లేకపోవటాన్ని పేర్కొంటూ ఆయన ఇలా అన్నారు:

"ఇటువంటి పరిస్థితికి ముఖ్యకారణం భారత ప్రెస్ కాంగ్రెస్‌కు అనుకూలంగా చేసే ప్రచారం. ఇండియాకి ప్రాతినిధ్యం వహించేది కాంగ్రెస్ మాత్రమే అని, అస్పృశ్యులతో సహా బయటి ప్రపంచం కూడా నమ్మటానికి కారణం అస్పృశ్యుల తరపున కాంగ్రెస్ హక్కుదారి అనే వాదనకు వ్యతిరేక ప్రచారం లేనందున... వారికి (దళితులకి) పత్రికలు లేవు. కాంగ్రెస్ వారి పత్రికలు వారిని రానియ్యవు. వారికి అతిస్వల్ప ప్రచారం కూడా ఇవ్వవద్దని గట్టిగా నిర్ణయించారు. దళితులకి తమ సొంత వార్తా పత్రికలు ఉండే అవకాశం లేదు" (అంబేద్కర్ 1945)

భారత పత్రికా రంగంలో బ్రాహ్మణ ఆధిపత్యం మీద దృష్టి కేంద్రీకరిస్తూ ఆయన తన విమర్శను ఇలా కొనసాగించారు.:

"ఇండియాలో ప్రధానంగా సమాచార పంపణీ చేసే సంస్థ అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ ఇండియా. ఈ సంస్థ సిబ్బంది మొత్తం మద్రాస్ బ్రాహ్మణులు. నిజానికి భారత దేశపు పత్రికా రంగం మొత్తంగా వారి చేతుల్లోనే ఉంది. అందరికీ వారెందుకు కాంగ్రెస్ అనుకూలవాదులో తెలుసు గనుక వారు కాంగ్రెస్ వ్యతిరేక వార్తలేవీ ప్రచారం కావడానికి అనుమతించలేరు. ఇవి దళితుల స్వాధీనంలో లేని కారణాలు". (పైన పేరొన్న వ్యాసం)

అయినప్పటికీ, మరెన్నో దశాబ్దాలకి గానీ 'భారత పత్రికా రంగంలో దళిత ప్రాతినిధ్య సమస్య' మళ్ళీ తెర ముందుకు రాలేదు. రాజకీయ, ఆర్థిక పెనుమార్పులు జరుగుతున్న 1990వ దశకం మధ్యలో 'ది వాషింగ్‌టన్ పోస్ట్' భారత కరస్పాండెంట్ కెనెత్ కూపర్, దళిత పాత్రికేయులేరన్న ప్రశ్నతో 'ది పయనీర్' సంపాదకుడు బి.ఎన్. ఉనియాల్‌ని ఎదుర్కొన్నారు. ఈ ప్రశ్నకు కెనెత్ కూపర్‌కు రాసిన జవాబులో బి.ఎన్. ఉనియాల్ ఇలా సమాధానమిచ్చారు :

"ఉన్నట్టుండి నేను తెలుసుకున్నది ఏంటంటే నేను జర్నలిస్టుగా పని చేసిన ముప్పయి సంవత్సరాలలో నాతోటి జర్నలిస్టుల్లో ఒక్క దళితుడు కూడా లేరని. కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. అంతకంటే అధ్వానంగా అనిపించేది ఏంటంటే...నాకు నా వృత్తిలో ఒక తీవ్రమైన లోపమేదో ఉందని ఎప్పుడూ తట్టలేదు." (ఉనియాల్ 2006)

పాత్రికేయ పరిశోధన ద్వారా కెనెత్ కూపర్, భారత దేశంలోని వార్తా పత్రికల గదుల్లో దళిత జర్నలిస్టులనే తప్పిపోయిన లంకె కోసం అన్వేషించిన ఉనియాల్, భారత దేశంలోని పాత్రికేయ సంస్కృతిలో ఉన్న పెత్తందారీతనాన్ని వివరించారు. తరువాత దళిత రచయిత, ఆందోళనకారుడు అయిన చంద్రభాన్ ప్రసాద్ మరియు ఎస్.బచ్చన్ చొరవ తీసుకొని భారతీయ మీడియాలో దళితులకు 'అఫర్మేటివ్ యాక్షన్' కోసం డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ ప్రసిద్ధ 'భోపాల్ డాక్యుమెంట్'గా రూపం

దాల్చింది. ఆ తరువాత, ఒక విప్లవ తరంగంలా ఉప్పొంగిన భారతదేశ వార్తా పత్రికా పరిశ్రమ గురించి మార్గనిర్దేశకంగా నిలిచిన ఒక ముఖ్యమైన గ్రంథం రచించిన రాబిన్ జెఫ్రీ ఇలా అన్నారు:

నేను పదేళ్ళకు పైగా భారతీయ భాషల్లోకి వార్తా పత్రికల్ని అధ్యయనం చేశాను. ఇరవై వారాలు, ఇరవై పట్టణాల్లో పర్యటించి, డజన్లకొద్దీ వార్తా పత్రిక కార్యాలయాలు చూసి, 250 మందిని ఇంటర్వ్యూ చేశాను. నాకు తెలిసినంత వరకు, ప్రధాన స్రవంతి ప్రచురణాలయాల్లో పని చేసే ఒక్క దళిత జర్నలిస్ట్‌ని కూడా కలవలేదు. ఇక దళిత సంపాదకుల, యజమానుల సంగతి సరే సరి.

జెఫ్రీ దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల్ని కలిసినపుడు అతను లేవనెత్తిన ప్రశ్నల్లో ఒకటి భారతీయ మీడియాలో దళితులు లేకపోవటం గురించి. జెఫ్రీకి భారతీయ పాత్రికేయులు ఇచ్చిన సమాధానాలు గమనిస్తే భారత జాతీయ మీడియాకి దళితుల పట్ల ఉన్న నిర్లక్ష్యం, విముఖత కనిపిస్తుంది. ఈ క్రింది విభాగంలో ఇటువంటి కొన్ని సమాధానాలను వివరంగా చూద్దాం.

**ప్రతిభాస్వామ్య కుల వెలివేత**

దళిత ప్రాతినిధ్యమనే మౌలికమైన ప్రశ్నకు ఉదారవాద భారతీయ జర్నలిస్టుల ప్రతిస్పందన వారిలో అంతర్లీనంగా ఉన్న కులతత్వాన్ని సూచిస్తుంది. ఈ కులతత్వం "ప్రతిభావాదం" అనే ముసుగులో చెలామణిలో ఉంది. రాబిన్ జెఫ్రీ రచించిన ప్రముఖ గ్రంథం '*ఇండియన్ న్యూస్ పేపర్ రివల్యూషన్*' లో ప్రస్తావించిన ప్రతిస్పందనలు కొన్ని యథావిధిగా కింద ఇవ్వబడ్డాయి.

1.బల్వంత్ షా, అనుభవజ్ఞుడైన సీనియర్ సంపాదకుడు, సందేష్:

"మేమది (సంపాదక బృందంలో దళితులు ఉన్నారా లేరా అన్నది) గమనించలేదు. అతను (జర్నలిస్టు) ఏ కులంవాడు అన్నది అసలు పట్టించుకోము. మేము అర్హత గల వ్యక్తికి అవకాశాన్నివ్వడానికి ఇష్టపడతామంతే.

2. తన పరిశోధనాత్మక అధ్యయన కాలంలో జెఫ్రీకి తారసపడిన అతి తక్కువ మంది దళిత జర్నలిస్టులలో ఒకరైన డి.ఎస్. రవిదాస్ ఇలా వివరించారు:

"కొంత మంది షెడ్యూల్డు కులాలకు చెందిన జర్నలిస్టులు ఉన్నప్పటికీ, తాము వేరుగా చూడబడటం ఇష్టం లేక వాళ్ళు షెడ్యూల్డ్ కులస్థులన్న సంగతి బయట పెట్టుకోరు. వారంతా విద్యావంతులూ, ప్రగతివాదులూ అయినప్పటికీ కొంతమంది జర్నలిస్టుల మెదళ్ళలో కులతత్వ భావనలు ఉన్నాయి. (....) అలవాటుగా ఏ వార్తా పత్రిక కూడా ఎస్.సీలకు వ్యతిరేకం కాదు. అలాగని, వాళ్ళ జీవితాలను గురించి పట్టించుకున్నదీ లేదు. ఎస్.సీల పట్ల ప్రత్యేక శ్రద్ధంటూ ఏదీ వారు తీసుకోరు. తమ వ్యథాభరిత అనుభవాల తాలూకు సంపూర్ణ అనుభూతి, స్పందన కలిగి ఉందేది ఒక్క దళితులు మాత్రమే. యాతన అనుభవించేది వాళ్ళే. ఈ బాధలు వేరే వాళ్ళ అనుభవంలో లేనివి. (......) ఒకానొక జర్నలిస్టు ఎస్.సీ అయితే గనక అతను వేరే జర్నలిస్టుల కన్నా ఎక్కువ రాయగలడు. దానికి కారణం ఈ సమస్యల్లో మునిగి ఉన్నది అతడే గనక

3. అతి పెద్ద సర్క్యులేషన్ ఉన్న ప్రాంతీయ భాషా దినపత్రికల్లో ఒకటైన *మళయాళ మనోరమ* సహ సంపాదకుడు జోస్ పణచిపురం:

మేము వాళ్ళని (దళితుల్ని) ఎప్పుడూ వేరుగా చూడము. అయితే వాళ్ళు ఉన్నత స్థానాల్లో ఏమీ లేరు.

4. మాజీ వార్తా సంపాదకుడు జోస్ టి. థామస్, *దీపిక*:

వాళ్ళు (దళితులు) న్యూస్ రూమ్స్‌లో లేరు. ప్రెస్ క్లబ్బుల్లో లేరు. జర్నలిజం డిపార్ట్‌మెంట్లలో లేరు. వాళ్ళ సమస్యలు రిపోర్టు కావు, దిన పత్రికల్లో ప్రచురించబడవు.

'దళితులు కనిపించర'నే ఒక నిదర్శన పూర్వక వాస్తవం భారత దేశ మీడియాకున్న ఒక వికారమైన లక్షణాన్ని తెలియజేస్తుంది: మీడియాలోని న్యూస్ రూములనుండి న్యూస్ స్టాళ్ళనుండి దళితులు వెలివేయబడుతున్నారు. భారత దేశ రాజధాని నగరమైన ఢిల్లీలోని అధికారిక జర్నలిస్టులతో సి.ఎస్.డి.ఎస్ (సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్, న్యూ ఢిల్లీ) నిర్వహించిన ఒక అధ్యయనంలో ఇది నిరూపితమైంది. ఈ అధ్యయనం భారత దేశ జాతీయ ఆంగ్ల మీడియాలో దళితులు లేకపోవటమే కాక ఒక సముదాయానికి అంటే బ్రాహ్మణులకి ఆధిపత్యం ఉందని కూడా సూచించింది. మీడియాలో దళిత సంబంధిత విషయాలకు చోటు లేకపోవటం అసలు లేకుండా పోయిన లేదా అతి తక్కువ ప్రాతినిధ్యం ఉన్న దళిత జర్నలిస్టుల పరిస్థితిని సూచిస్తుంది. అంతేకాక, కాబోయే వినియోగదార్లుగా కూడా దళితులు లేరని తెలుస్తూ ఉంది. రాబిన్ జెఫ్రీ ఇలా అంటారు:

భారతీయ భాషల్లోకి దినపత్రికల్లో చిన్నచిన్న సంపాదక ఉద్యోగాల్లో సైతం దళిత పురుషులు గానీ, స్త్రీలు గానీ, దాదాపుగ లేనట్టేనన్న వాస్తవం నుండి అర్థమయ్యే దేమిటంటే దళితుల జీవితాలకి సంబంధించిన అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. భారత దేశంలో ప్రముఖమైన దిన పత్రిక ఒక్కటి కూడా దళితులకి చెందినది కానీ, వారు సంపాదకులుగా ఉన్నది కానీ లేకపోవటం వల్ల వాళ్ళని గురించిన కథనాలు కవరేజ్‌కి నోచుకోవట్లేదు. ఉదాహరణకి, పట్టణాలకు చెందిన మధ్యతరగతి వినియోగదారులకు సంబంధించి జరిగే నిరంతర వార్తా సేకరణ దళితుల గురించి జరగడం దుస్సాధ్యం. (జెఫ్రీ 2003, 178)

జాతీయ పత్రికా రంగం నుండి దళితుల వెలివేత భారతీయ మీడియాలో బ్రాహ్మణీయ గుత్తాధిపత్యం ఉన్న తరుణంలోనే సంభవించిన చారిత్రక వాస్తవం. బ్రాహ్మణీయ సాంస్కృతిక గుత్తాధిపత్యంలోని ఈ అంశాన్ని చరిత్రీకరిస్తూ, డా. తిరుమల్ ఇలా అంటారు:

మొదట్లోనే ప్రముఖ దళిత మేధావులు హిందూ జాతీయవాదాన్ని, వలసవాదాన్ని విమర్శించే సాంస్కృతిక కార్యక్రమాలని చేపట్టారు. వారిలో దక్షణాదిన అయోతి దాస్, ఉత్తరాదిన స్వామి అచ్యుతానంద ఉన్నారు. వాళ్ళిద్దరూ పంతొమ్మిదవ శతాబ్దపు చివరి భాగంలో, ఇరవైయవ శతాబ్దపు మొదటి భాగంలో దళిత కులాలను గురించి ముఖ్యమైన వార్తా పత్రికలు ప్రారంభించారు. అయినప్పటికీ, ఈ ప్రయత్నాలు దాదాపు పూర్తి గుత్తాధిపత్యం కలిగిన బ్రాహ్మణుల కార్యకలాపాలతో పోల్చదగినవి కాదు. (తిరుమల్ 2008, 99)

ఒకవైపు సంక్షేమరాజ్య విధానాలు దళితులను ఆధునికతావాద నాగరికతా ప్రాజెక్టులకు బంధిస్తుంటే, మరొక వైపు సభ్య సమాజపు బ్రాహ్మణీయ ఆధిపత్యం ఉదారవాద లెఫ్టిస్టు వాక్చాతుర్యం అనే మారువేషం కట్టింది. ఈ రెండింటి మధ్య బిగించిన ఉచ్చు వల్ల కులం, కుల ఆధారిత అసమానతల పట్ల మౌనం వలయాలుగా అల్లుకుంది. సంవిధాన న్యాయంలో భాగంగా రాజ్యం దళితుల రాజకీయ, ఉద్యోగ సంబంధ ప్రాతినిధ్యం ఉండేలా చూసింది. కానీ సభ్య సమాజం మరియు మీడియా ఇటువంటి న్యాయాన్ని ప్రజాస్వామిక వ్యవస్థలోని మౌలికమైన సిద్ధాంతాల్లో ఒకటిగా గుర్తించాల్సి ఉంది. ప్రముఖ తమిళ రాజకీయ తత్వవేత్త, రచయిత అయిన రవికుమార్ ఇలా వాదిస్తున్నారు:

ఒక పత్రికను నడపడం అంటే ఒక ఫ్యాక్టరీని సొంతం చేసుకోవటంలాంటిది కాదు. పత్రికలని ప్రజాస్వామ్యంలోని మూల స్తంభాల్లో ఒకటిగా ఎంచుతారు గనుక దేశ రాజకీయ వ్యవస్థని రూపుదిద్దటంలో అది ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. కాబట్టి దళితులకు మీడియాలో స్థానం కల్పించాలన్న డిమాండును కేవలం ఉద్యోగాల కోసం చూపే సాకులాగ చూడటానికి వీల్లేదు. అసెంబ్లీలో, పార్లమెంట్‌లో, న్యాయవ్యవస్థలో దళిత ప్రాతినిధ్యం కోసం చేసే డిమాండులాగానే ఇది కూడా ప్రజాస్వామ్యం కోసం చేసే ఒక డిమాండు. భారత జాతీయ, తమిళ వార్తా పత్రికా యాజమాన్యాలు ఇటువంటి డిమాండును ఇంత కాలంపాటు లక్ష్యపెట్టకపోవడం నైతికంగా సమంజసమేనా? (రవికుమార్ 2007, 30)

ఏదేమైనప్పటికీ, ఈ విషయాన్ని కేవలం అంకెలకు సంబంధించిన ప్రశ్నగా చూడకూడదు. ఎందుకంటే వారిని కలుపుకుపోయే క్రమం, దళితులను భారతీయ ఆత్మకి 'అన్యులు'గా మూసపోసి చూడటానికి దారితీసింది.





సంవత్సరాలుగా, బ్రాహ్మణులు 'జాతి'గా 'జాతీయులు'గా అయ్యారు. దళితులు మాత్రం జాతి వ్యతిరేక అస్థిత్వవాద కుల రాజకీయాల అంచులకు నెట్టబడ్డారు. బ్రాహ్మణుల బ్రాహ్మణత్వం లౌకికవాద ఉదారవాద సారంగా తయారయి 'బ్రాహ్మణ' అస్థిత్వం మరుగున పడింది. దీని కారణంగా, బ్రాహ్మణమనేది ఒక కుల అస్థిత్వంగా చూడబడడం లేదు. సరి కదా, ఇటువంటి ఆధిపత్యీకరణ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించే దళితులు మట్టుకు 'కులవాదులుగా' ప్రదర్శితమవుతున్నారు.

మీడియాకున్న అధునిక లౌకిక అస్థిత్వముద్రని సూచిస్తూ ఎస్.ఆనంద్ ఇలా అంటారు.

భారతీయ మీడియాలో కులానికి సంబంధించిన వార్తా సేకరణని 'కింది కులాల'కు, అంటే దళిత మరియు ఓ.బీ.సీలకు(శూద్రుల)కు సంబంధించి విషయాలను అందించే సమాచార నివేదికలతో సమానమని భావిస్తారు. విస్తృతంగా నగరీకరింపబడిన మీడియా కులమనేది ఇతరులకి సంబంధించిందే తప్ప దళితేతర, శూద్రేతర ద్విజులకు సంబంధించింది కాదనే బ్రాహ్మణీయ ఎగువ మధ్యతరగతికి చెందిన 'కామన్ సెన్స్'నే ప్రతిబింబిస్తుంది (ఆనంద్ 2005, 172-173)

'సమానత్వం కోసం యువత' వంటి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు, ఆమ్ ఆద్మీ పార్టీ కలగజేసిన ఉదారవాద యుఫోరియా వంటివి, మార్క్సిస్ట్ రాడికల్ రాజకీయాల వంటివన్నీ కూడా ఇటువంటి ఆలోచనాధోరణిని ఆధారం చేసుకున్నవే. బావిలో కప్పల్లాగా ఉన్న మీడియా యాజమాన్యం మరియు జర్నలిస్టులు, కాబోయే దళిత జర్నలిస్టుల మీద ఆధునిక కుల హింసా రూపాలతో విరుచుకుపడతారు. భారతీయ జాతీయ మీడియా యొక్క కుల హింసాపూరిత భావజాలానికి సజీవ సాక్ష్యంగా బలి అయ్యాడు నాగరాజు.

దళితుల సామాజిక స్థాయి వెలివేయబడ్డవారిగా, కుల బహిష్కృతులుగా పాతుకొని ఉంది. పాత్రికేయ రంగంలో ఇదే భావజాలపు అల్లిక అగుపిస్తుంది. సమాచార స్థలాల్లో దళితుల్లేకపోవడం లేదా దళిత మౌనం అనే వాస్తవం జాతీయ మీడియా సంస్కృతిని నిర్వచిస్తుంది. దళిత మౌనం / కానరానితనం ప్రధాన స్రవంతి జర్నలిజం యొక్క 'జాతీయ మహా 'వృత్తాంతం' కాగా ప్రాంతీయ స్థాయిలో అదే ప్రత్యేక సాంస్కృతిక రూపాలు తీసుకుంటుంది.

**సారాంశం:**

'దళితుల్లేని' సమాచార స్థలాలు ఉండటమంటే పాత్రికేయ క్షేత్రంలో దళిత రచనని చెరిపేయడం, దళిత గొంతుని నొక్కేయడం. "దళితులెక్కడున్నారు?" అన్నది కేవలం రుజువులు, దాఖలాలు చూపమని అడిగే ప్రశ్నకాదు. ఇది ఒక భావజాలానికి సంబంధించి ప్రశ్న. ఇది ప్రజా జీవిత రంగంలో దళితుల్ని కానరానివారిగా, మూగబోయిన వారిగా చేసే ఒక సాంస్కృతిక శూన్యతను సూచిస్తుంది. (తంకప్పన్ 2006)

సంప్రదించిన గ్రంథాల వివరాలు ఇంగ్లీషు వ్యాసంలో చూడగలరు.

**అనువాదం: స్వాతి మార్గరేట్**
**రచయిత ఇప్లూలో అధ్యాపకులు**



# ఒక దళిత పాత్రికేయుని అన్వేషణలో

■ **బి.ఎన్.ఉనియాల్**

గత వారం ఒక ఉదయం, ఢిల్లీలో పనిచేసే విదేశీ వార్తా పత్రిక పాత్రికేయుడు ఫోన్ చేసి నీకు ఎవరైనా దళిత జర్నలిస్టు (పాత్రికేయుడు) తెలుసా అని అడిగాడు. కాన్షీరాం మరియు మాయావతిలకి మీడియా వ్యక్తులతో జరిగిన వివాదాస్పద ఉదంతం గురించి ఒక దళిత జర్నలిస్టు నుండి అభిప్రాయం తీసుకోవాలను కుంటున్నానని చెప్పాడు.

"ఉనియాల్ గారూ, ఒక భారతీయ పాత్రికేయుణ్ని, మీరు దళితుడా అని అడగవచ్చా?" అంటూ సంభాషణ ప్రారంభించాడు.

"మిత్రుడా, తెలియదు, నాకు నిజంగా తెలియదు!" అని అన్నాను.

"అయితే చెప్పండి. ఈ ప్రశ్న మిమ్మల్నే అడిగితే మీరు కోపం తెచ్చుకోరు కదా?"

ఏ విధంగా ప్రతి స్పందించాలో తెలియక తికమక పడిపోయాను.

"సరే" అని ఒక క్షణం ఆగి నాలో సంఘర్షించుకుంటున్న విభిన్న ఆలోచనలను ఒక కొలిక్కి తెచ్చి, సరైన ప్రతిస్పందన యిచ్చేందుకు కాసేపు ఆలోచించాను. కాని అప్పటికే నాకు తెలియకుండా ఒక సుదీర్ఘ ప్రసంగం ప్రారంభించేసాను.

"అంటే ఈ విషయం భారతదేశంలో గత 200 సంవత్సరాలుగా జరిగిన నిరంతరమైన పోరాటం, మరియు వాటి ద్వారా ఏర్పడిన వివిధ పరిణామాలు దృష్టిలో పెట్టుకొని చూడవలసి ఉంది." ఓరి దేవుడో! రాళ్ళ వర్షం కురిసినట్లుగా ఉంది'. అని నాకే అనిపించింది. ఏదో విధంగా ఈ సంభాషణని ఒక ముగింపుకు తెచ్చే ప్రయత్నం చేసాను, కాని సాధ్యం కాలేదు.

ఇంతలో అదృష్టవశాత్తు అతడే నా దారి తప్పిన వాక్యం మధ్యలో అంతరాయం కలిగించాడు.

"ఉనియాల్ గారు, నాకు కావలసింది పై విషయంపై ఒక దళిత జర్నలిస్టు యొక్క అభిప్రాయం మాత్రమే, నేను కుల వ్యవస్థ మీద వ్యాసం వ్రాయడం లేదు".

"నిజంగా చెప్పాలంటే మిత్రమా, నాకు ఏ దళిత జర్నలిస్టు తెలియరు కానీ రెండు మూడు రోజుల్లో కొంత మంది స్నేహితులని అడిగి చెప్పగలను".

హఠాత్తుగా నాకు తట్టింది. గత 30 సంవత్సరాలుగా ఒక పాత్రికేయుడుగా పనిచేసినా ఒక్క తోటి దళిత జర్నలిస్టుని కూడా కలవలేదని. ఒక్కరంటే ఒక్కర్ని కూడా. అంతేకాదు, గత ఎన్నో సంవత్సరాలుగా ఈ వృత్తిలో ఉండి కూడా ఇంత పెద్ద సమస్య ఉందని నేను గ్రహించలేక పోయాను; ఒక జర్నలిస్టుగా గమనించవలసిన విషయాన్ని గమనించలేదు.

ఈ 30 సంవత్సరాలలో నేను అనేక జర్నలిస్ట్ సహచరులతో దేశంలో ప్రతి జిల్లాలో పర్యటన చేశాను, వివిధ నగరాలు, పట్టణాల్లో వందలాది మంది జర్నలిస్టులను కలుసుకున్నాను. కానీ ఇంత వరకూ ఒక్క దళిత జర్నలిస్టుని కలిసినట్లు నాకు జ్ఞాపకం లేదు. నాకున్న పాత్రికేయ స్నేహితులలో క్రైస్తవులు, ముస్లింలు, జైనులు, సిక్కులు అందరూ ఉన్నారు. వారిలో ఒక్కరూ దళితులు కారు, ఎంత విచిత్రం? ఢిల్లీలో కనీసం కొద్ది మంది అయినా దళితులు ఈ వృత్తిలో ఉండేవుంటారు అని నాకు నేనే చెప్పుకున్నాను. వారిని వెతకాలని నిర్ణయించుకున్నాను.

మొదట ఒక ఆంగ్ల భాషా పత్రికలో కాలమిస్టు, ఒక వార పత్రికా సంపాదకుడుగా పనిచేసిన స్నేహితుడికి ఫోన్ చేసి అడిగాను. అతను చాలా మంది యువ పాత్రికేయులని కలుస్తుంటాడు. "తెలియదు. నాకు ఎవరూ తెలియదు" అన్నాడు. మరొక మిత్రుడికి ఫోన్ చేసి అడిగాను. అదే సమాధానం. ఇంకో మిత్రుడికి చేసాను. అతనిది కూడా అదే సమాధానం. ఒక హిందీ దిన పత్రిక సంపాదకునికి ఫోన్ చేసాను. అతడు నాపై మండి పడ్డాడు.

"ఈ పాశ్చాత్య పాత్రికేయులు భారత దేశాన్ని అర్థం చేసుకోరు. వారికి భారత దేశ చరిత్ర గురించి ఎటువంటి అవగాహన ఉండదు. వారు కేవలం మన దేశాన్ని దూషించే ప్రయత్నంలో ఉంటారు. అటువంటి వ్యక్తులను ఎందుకు ప్రోత్సహిస్తున్నావు?"

నా విచారణ ఇంకా అవసరమా అని అనుమానపడుతూ ఫోన్ పెట్టేసాను. అదే సమయంలో ప్రముఖ హిందీ కాలమిస్టు నా ఆఫీసు గదిలోకి వచ్చాడు. అతడికి ఒకప్పుడు ఒక హిందీ వార పత్రిక సంపాదకుడుగా మంచి గుర్తింపు ఉంది. నేను అతనిని కూడా అదే ప్రశ్న అడిగాను, అతడిదీ అదే సమాధానం. తరువాత వేరొక జర్నలిస్టు స్నేహితునికి ఫోన్ చేసాను. అతడు చాలా కాలంగా ఒక కార్మిక సంఘం కార్యకర్త కూడా అతనికైతే తప్పకుండా ఎవరైనా తెలిసే ఉంటారు అని అతనిని అడిగాను. అతడు చాలా కలతచెంది నా ప్రశ్నని వేరే విధంగా అర్థం చేసుకున్నాడు. అందులో విలేఖర్ల కూటమిని విడదీసే కుట్రను చూసాడు. తిరిగి ఫోన్ పెట్టేసాను. మొట్టమొదటి ప్రశ్న లేవదీసిన విదేశీ పాత్రికేయుని ఉద్దేశాలపై నాకు కొంత అనుమానం కలగటం ప్రారంభమయింది.

**ఒక కవి ఆవేదన**

ఆరోజు రాత్రి నేను ప్రెస్ క్లబ్‌కు వెళ్ళి అక్కడ మిత్రులను కలుసుకున్నాను. అక్కడ చాలా మందిని ఆరాతీసాను. మీకు ఎవరైనా దళిత జర్నస్టు తెలుసా అని. ఎవరికీ తెలియదు. ఓ మిత్రుడు నేను ఇటువంటి విషయం పై వ్రాసి ఇతరులను తనదన్నే ప్రయత్నంలో ఉన్నానని భావించాడు. అంతే కాదు 'మా అందరిలో నువ్వు ఒక్కడవే కులం పట్టింపు లేని వాడిలాగా చూపించుకోవాలి అని అనుకుంటున్నావా' అని నిలదీశాడు. పాత్రికేయులను, పాత్రికేయులుగానే చూడాలి, కులం పేరిట కాదు అని మరో దీర్ఘకాలిక మిత్రుడు అన్నాడు, 'కాన్షీరాం చెప్పినట్లు మీడియా (ప్రెస్) నిజంగా మనువాదని భావిస్తున్నావా? మనలో ఎవరైనా వ్రాసినప్పుడు ఒక బ్రాహ్మణ జర్నలిస్టుగా గాని, ఒక కాయస్తగా గాని, లేదా ఒక జైన్‌గా గాని వ్రాస్తున్నామా!' అని అడిగాడు. అతడన్నది సరైనదే అని ఒప్పుకున్నాను గానీ అప్పటికి నా మాటపై నాకే కొంత నమ్మకం సడలింది. మా మధ్య ఒక్క దళిత జర్నలిస్టు కూడా లేకపోవటమన్న విషయానికి అర్థమేంటి? ఇలాంటి ప్రశ్నకు నేను అసలు సమాధానం ఇవ్వగలనా అని నాకు నాపైనే అనుమానం కలిగింది.

నేను తిరిగి ఇంటికి వచ్చి 1996 అక్రిడిటేషన్ ఇండెక్స్‌ని తిరగెయ్యటం మొదలు పెట్టాను. ఢిల్లీ రాజధాని నగరంలో పని చేసే అందరి పాత్రికేయుల పేర్లు దీన్లో నమోదు చేస్తారు. వారే భారత జాతి కళ్ళు, చెవులు. ప్రతి రోజూ ఏ విషయం వార్త అవ్వాలో, వద్దో వారే నిర్ణయిస్తారు. అది ఏ పత్రికైనా సరే, దిన, వార, మాస పత్రిక కానివ్వండి, ఒక వార్తలో, ఎవరిని పైకెత్తాలి, ఎవరిని క్రిందికి దించాలన్నది విలేఖరులు ఒక్కరే నిర్ణయించక పోయినప్పటికీ, చదివే వార్తలలో ఉన్న స్త్రీలు, పురుషుల పట్ల మన వైఖరులని మలిచే వ్యక్తులు వారే. పత్రికా సమావేశాలు వారు ఏ విధమైన ప్రశ్నలు అడుగుతారు, ఎలా అడుగుతారు అనే దాని పైనే ఆధారపడి ఉంటాయి. చివరగా, వారు తమ నివేదికలను రూపొందించే తీరుపై ఆధారపడి ఉంటుంది.

అక్రిడిటేషన్ ఇండెక్స్ మర్మాన్ని బయటపెట్టింది. జాబితా ప్రకారం 688 గుర్తింపు పొందిన పాత్రికేయులు ఉంటే, అందులో 454 మంది తమ పేరు చివర కులం పేరు పెట్టుకున్నారు. అందులో దాదాపు 240 మంది బ్రాహ్మణులు, 79 మంది పంజాబీ క్షత్రియులు, 44



మంది కాయస్తులు,  26 మంది ముస్లింలు, 26 మంది వైశ్యులు, 19 మంది క్రైస్తవులు, 12 మంది జైనులు, తొమ్మిది మంది బెంగాలీ బైద్యాస్. మిగతా 232 విలేఖరులలో 47 మంది కులాన్ని కనుక్కుంటే అందులో ఒక్కరు కూడా దళితులు కారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో పని చేసే ఒక  సీనియర్ అధికారి మాట్లాడుతూ "తప్పకుండా కొంత మంది ఉంటారు. కాని వారిని కనిపెట్టడం కష్టం. ఎందుకంటే వారు కులం ఇంటి పేరు వ్రాయరు. వారు తమ కులాన్ని దాచాలనుకుంటారు. ఎవరు మాత్రం తనొక షెడ్యూల్డ్ కులానికి చెందిన వాడినని చాటాలనుకుంటారు?" అన్నాడు.

వేరొక మిత్రుడు "ఇంతకీ ఈ విచారణ ద్వారా ఏమి సాధించాలనుకుంటున్నావు?" అని అడిగాడు. "నువ్వు కూడా కాన్షీరాం అంటించిన కులం కుంపటికి బొగ్గులు అందించాలనుకుంటున్నావా? పాత్రికేయుల కుల వివరాలు తెలుసుకోవడం అవసరమా? ఏమైనా పాత్రికేయలకు కులం పట్టింపు లేదు కదా? ఉదాహరణకు నీకు కులం పట్టింపు లేదు కదా?" "ఏమో! నేను ఖచ్చింతంగా చెప్పలేను" అని ఫోన్ పెట్టేసాను.

ఒకవేళ పత్రికా వృత్తిలో ఎంత మంది బ్రాహ్మణులు ఉన్నారో అంత మంది దళితులు కూడా ఉండి ఉంటే ఎలా ఉండేదో అని ప్రశ్నించుకున్నాను. మహారాష్ట్రకు చెందిన దళిత కవి నామదేవ్ ధశాల్ వ్రాసిన కొన్ని పంక్తులు గుర్తుకు వచ్చి ఆ కవితా సంపుటి కోసం వెతికాను.

ఒక రోజు నేను ఈ దొంగ ముండా దేవుడిని తిట్టాను
అతడు సిగ్గు లేకుండా నవ్వాడు నా పొరుగు వాడు,
కలంకే పుట్టిన బ్రాహ్మణుడు నిర్ఘాంత పోయాడు.
అతడు ఆముదం ఓడుతున్న ముఖంతో నన్ను చూసాడు
నేను ఇంకో మంచి బూతు శాపం శపించాను.
విశ్వా విద్యాలయం భవనం అదిరింది.
నడుము వరకు మునిగింది వెంటనే పండితులు పరిశోధన
మొదలుపెట్టారు ప్రజలు ఎందుకు అగ్రహితులు
అవుతున్నారు అని.. 'ద పయనీర్' మేగజీన్ నుండి 16
నవంబర్, 1996.

**అనువాదం: వి.కాంతి**

బి.ఎన్.ఉనియాల్ ఢిల్లీలో నివసించే పాత్రికేయుడు

# న్యూస్ సర్వీస్ అవసరం: *అణగదొక్కబడిన భారతీయుడు*

## మొదటి సంపాదకీయం (ఏప్రిల్ 1979 )

■ **కాన్షీరాం**

"ప్రస్తుతం ఉన్న వార్తా మాధ్యమం మన చుట్టూ జరుగుతున్న ఘాతుక చర్యల్నీ, అవమానాలనీ, హింసనీ చాలా సాధారణ విషయాలలాగా రిపోర్టు చెయ్యడాన్ని నిరసిస్తూ, మనకోసం ప్రత్యేకమైన న్యూస్ సర్వీసుని మనమే తక్షణం ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందని కాన్షీరాం పైన పేర్కొన్న పత్రికలో వ్యాఖ్యానించారు. అలా చెయ్యకపోతే విషయావగాహన కోల్పోయి, చదువుకున్న మనందరం కూడా చిమ్మ చీకటిలో తడుముకొంటూ బతకాల్సి వస్తుంది"

మనోహర్ ఆటె, కాన్షీరాం సంపాదకీయాల సంకలన సంపాదకుడు.

భారత దేశంలో మూడింట రెండు వంతుల జనాభా వెనుకబడిన తరగతులకి చెందిన వారుంటే (ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి ). సాధారణంగా 'మైనార్టీలు' అనబడేవారు ఇంకో 17.2% ఉండొచ్చు. వెనుకబడిన తరగతి ప్రజల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఆదివాసీలు) భారతదేశ వెనుకబాటుతనానికి ముఖ్య ప్రతినిధులు. వీళ్ళందరు కలిసి భారత దేశ జనాభాలో 85 శాతం వరకూ ఉన్నప్పటికీ, ఈ దేశ న్యూస్ సర్వీసులో వారికి ఏమాత్రం చోటు లేదు. వీరికి సంబంధించిన వార్తలు, వీరి ప్రత్యేక సమస్యల గురించిన వార్తలు యాధృచ్ఛికంగా వార్తా పత్రికల్లో వస్తుంటాయి. దాంతో యువకులు, విద్యార్థులు, రైతులు, పైచదువులు చదివి ఉద్యోగాల్లో ఉన్న ప్రజలు, ఆయా ప్రజల సంఘాలకి చెందిన నాయకులు అందరూ కూడా సమగ్ర అవగాహన కొరవడి అంధకారంలో తడుముకొంటూ బతుకుతున్నారు.

**బాధితుల మీదే బండలు**

షెడ్యూల్డ్ కులాలకి, జాతులకి చెందిన ప్రజలు ఎదుర్కొనే హింస, అత్యాచారాలు, అవహేళనలని గమనిస్తే, అసలు వీళ్ళు ఈ భూమి మీద జన్మించడం ఇటువంటి అమానవత్వ చర్యలనుభవించడానికేనేమో అనిపిస్తుంది. వార్తా పత్రికల్లో వచ్చే వార్తలు సూది మొనంత మాత్రమే. అంటే, అసలు విషయంతో పోలిస్తే చాలా తక్కువ శాతం మాత్రమే అని అందరికీ తెలిసిన విషయం. 90శాతం మంది ప్రజల సమస్యలు పాలక వర్గాల చాకచక్యం, జిత్తులమారి యోజనల వల్ల పైకి కనిపించకుండా ఉంటాయి.

నెహ్రూ, ఇందిరాగాంధీ పాలనలో జరిగిన అఘాయిత్యాల వివరాలు (ఇప్పటి వరకూ సేకరించబడినవి) చూస్తే ఎవరికైనా దిగ్భ్రాంతి కల్గుతుంది. నిస్సహాయులైన అణచివేయబడిన ప్రజల మీద దేశవ్యాప్తంగా జరిగిన హింసాకాండ గురించిన వివరాలు చాలా వరకు అందుబాటులో ఉన్నాయి కాబట్టి వాటి గురించి మళ్ళీ కొత్తగా ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. జనతా పార్టీ పాలన చివరి రెండేళ్ళల్లో అణగదొక్కబడిన భారతీయులు అనుభవించిన హింసాత్మక చర్యల్ని పరిశీలిస్తే వీళ్ళు కాంగ్రెస్ 30 ఏళ్ళల్లో జరిపిన అఘాయిత్యాల లెక్కలని మూడేళ్ళ లోపలే దాటడానికి ప్రయత్నించారేమోననిపిస్తుంది. ఉత్తర భారతంలో బెల్చీ నుంచి దక్షిణ భారత దేశంలోని బేలాపురం వరకు షెడ్యూల్డ్ కుల ప్రజల "బాధల కోటా" పూర్తి అయ్యిందనవచ్చు. బీహార్ రాష్ట్రం ఆదివాసీల పాలిట ఒక అగ్ని భాండం అయ్యింది. బీహార్‌లోని పూర్నియా జిల్లాకి చెందిన ఆదివాసీలపై కుల హిందువులు జరిపిన హత్యాకాండలు, అత్యాచారాలు ఇప్పుడు సంతాల్ పరగణాల్లో జరుగుతున్న హింసతో పోలిస్తే పోటీ పడలేక పాలిపోతాయి. ఇక కేంద్ర రిజర్వ్ పోలీసులు ఆదివాసీ స్త్రీల మీద బెల్దిహల్ గ్రామంలో డిసెంబరు 1978లో జరిపిన సామూహిక అత్యాచారాల విషయం గురించి ఆలోచిస్తే పుండు మీద కారం జల్లినట్లు అనిపిస్తుంది. పూర్వం ఇలాంటి అన్యాయాల వెనుక ఫ్యూడల్ జమిందార్లు, మహాజన్ల హస్తం ఉండేది. ఆదివాసీ నివాస స్థలాలని కబ్జా చేయడంలో వాళ్ళు ముఖ్య పాత్ర వహించేవారు.

హిందూ కులస్థుల "సొంత ఆస్తి" అయిన వార్తా ప్రచురణ సంస్థలు ఇటువంటి హింసకి సంబంధించిన వార్తల్ని చాలా చిన్న విషయాల్లాగా చూపిస్తాయి. హింసకి గురవ్వడం మూలాన జరిగిన అనర్థాలు, దాని కోసం జరిగిన/జరగని శిక్షల వివరాలు వారి కుల హిందూ పత్రికలలో అంతంత మాత్రంగానే ఉంటాయి. నిజానికి హింసలో పాల్గొన్న వ్యక్తులకి చిన్నపాటి శిక్ష పడటమో, లేదా పూర్తిగా వదిలేయబడడమో జరుగుతుంది. అణగారిన వర్గ ప్రజల చేతుల్లో న్యూస్ సర్వీస్ ఉంటే, పైన జరిగిన సంఘటనల వివరాలని సంపూర్ణంగా రిపోర్టు చేసి, ప్రజాభిప్రాయం బాధితులవైపు ఉండేటట్లు చేయడానికి దోహద పడుతుంది.

**పేరున్న వారి పట్ల అగౌరవం**

అంటరాని కులాల్లో కూడా కొంత మందికి మంచి పేరు ప్రతిష్టలు ఉండొచ్చు, దైనందిన జీవితం సుఖంగా ఉన్నప్పటికీ కూడా వివిధ రకాల అగౌరవాలకీ, అమర్యాదలకీ గురవుతూ ఉంటారు, గుజరాత్‌లో జరిగిన రెండు ఘటనల వివరాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి.

జామ్ నగరంలో పైకులానికి చెందిన కుల హిందూ స్త్రీ ఒకామెని ఆపరేషన్ థియేటర్‌లోకి ఆపరేషన్ కోసం తీసుకెళ్ళారు. తనకి ఆపరేషన్ చేసే వైద్యురాలు అంటరాని కులానికి చెందినామె అని తెల్సుకున్న ఆ స్త్రీ ఆపరేషన్ చేయించుకోనని మొరాయించిందట. తను చావుకైనా సిద్ధమే కానీ అంటరాని కులస్థులు తనని ముట్టుకోవడం మాత్రం భరించనని ఆమె అన్నదట. ఈ విషయాన్ని అప్పటి గుజరాత్ గవర్నర్ శ్రీమన్ నారాయణ ప్రస్తావిస్తూ ఇంకో విషయం కూడా చెప్పారు. మంచి క్వాలిఫికేషన్లు ఉన్నా ఒక హరిజన యువకుడి కుల వివరాలు తెల్సుకొన్న తర్వాత అహ్మదాబాదులోని ఒక కాలేజీలో ఉద్యోగం ఇవ్వ నిరాకరించారట యాజమాన్యం.

ఈ సంఘటనల తర్వాత ఈ ఇద్దరు నైపుణ్యంగల అంటరాని వాళ్ళకు ఏం జరిగింది? గవర్నర్ మాటల్లోనే అంటరానితనం నిరోధక చట్టాన్ని ఉల్లంఘించిన వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోబడ్డాయి? బహుశా ఎంతో నైపుణ్యం కలిగి ఘోర అవమానాలకు గురయిన ఈ అంటరాని వాళ్ళు బయటికి చెప్పుకోలేక, ఒంటరిగా బాధపడ్డారేమో కానీ, అంటరాని వాళ్ళకు సొంతంగా న్యూస్ సర్వీస్ ఉండి వుంటే ఈ విధంగా అవమానాలకు గురవుతున్న వ్యక్తుల మధ్య సంబంధాలు ఏర్పడేవి. అలా అందరూ కలిసికట్టుగా పనిచేస్తే, తాము పడే బాధల్ని కొంత వరకూ తగ్గించుకోవడం, బాధించిన వాళ్ళకి శిక్ష పడేటట్లు చూడడం, తమ భవిష్యత్తుని మంచిగా తీర్చి దిద్దుకోవడానికి అస్కారం ఉండేదేమో.

**అంటరాని కులస్థుల ప్రయత్నాలు-న్యూస్ 'బ్లాక్ అవుట్'**

తాము అనుభవించే వివక్ష నెదిరించి తమ జీవితాలను మెరుగు పర్చుకొనే ప్రయత్నాలు అణగారిన వర్గ ప్రజలు చేస్తూనే ఉన్నారు. అయితే కుల హిందువుల చేతిలో ఉన్న ప్రచురణ సంస్థలు వాటిని వెలుగులోనికి రానీయకుండా చేస్తున్నాయి. ఢిల్లీలో జరిగిన సంఘటనల వివరాలు ఆగ్రా, అంబాలా లాంటి దగ్గరి నగరాలకి కూడా చేరటం లేదు. ఇక దేశ నలుమూలలకి చేరడం లేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

1968 డిసెంబరు 6వ తేదీన హైదరాబాదులో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైన "ఆది ఆంధ్ర సమావేశం" గురించిన వార్తలు చాలా సంవత్సరాలు మరుగున పడిపోయాయి. చివరికి ఒక అణగారిన వర్గ ప్రజలు వేసిన ఒక చిన్న కర పత్రం మూలాన బయటికొచ్చాయి. ఆది ఆంధ్ర సమావేశంలో భారత దేశంలో ఉన్న ఎస్.సీ, ఎస్.టీ కుల ప్రజలందరూ ఢిల్లీలోగానీ, హైదరాబాదులోగానీ కలుసుకోవాలని తీర్మానించారట. కానీ, హైదరాబాదుకి అవతల నివసించే వారికి కూడా ఈ పిలుపు చేరక పోవటంతో ఈ అత్యవసరమైన సమావేశం జరగలేదు.

1964-65 సంవత్సరంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతులకి చెందిన భారత దేశవాసులందరూ తమ కష్టాలని బహిరంగంగా

వెల్లడించి న్యాయం చేయాలంటూ అభ్యర్థించారు. సుమారు మూడు లక్షల మంది అరెస్టు అవ్వడానికి సిద్ధపడ్డారు. అయితే కుల హిందూ ప్రచురణ సంస్థలు ఈ సంఘటనకు సంబంధించి ఏ వార్తా రిపోర్టు చేయలేదు.

దక్షిణ భారత దేశంలో శ్రీ ఎలియా పెరుమాళ్‌లాంటి ఇతర నాయకులు ఎందరో అణచివేతననుభవిసున్న భారతీయులకి న్యాయం చేకూర్చాలని ఎన్నో పోరాటాలు చేసారు. కానీ వాటి గురించిన వార్తలు బయటకు రాలేదు. ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పరచి శ్రీ పెరుమాళ్ గారిని కమిటీకి చైర్మన్‌గా నియమించింది. దీనివలన ఈయనకి కావల్సినంత పబ్లిసిటీ వచ్చింది. అయితే ఈ కమిటీ తన నివేదికలో కుల హిందువుల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గాలని బహిరంగ పరచటం వలన రిపోర్టుని బయటికి రాకుండా, శ్రీ పెరుమాళ్ గారి కృషిని కనపడకుండా చేశారు.

పైన పేర్కొన్నట్టు, భారత దేశం మొత్తంలో అణగారిన ప్రజల పోరాటాల వివరాలు బయటికి వచ్చి ఉంటే కనుక వీరి సమస్యల సాధన కోసం ఎంతో సమర్థవంతమైన సంఘం తయారై ఉండేది. ఈ విషయాలని న్యూస్ సర్వీసులు బ్లాక్ అవుట్ చేసాయి  కాబట్టి ఒకచోట జరిగిన సంఘటనల వివరాలు ఇంకో చోటికి చేరలేకపోయాయి. ప్రత్యేకమైన, బాగా పనిచేసే న్యూస్ సర్వీస్ కనుక ఉండి ఉంటే, అదీ అణగదొక్కబడిన ప్రజల నిర్వహణలో ఉంటే, పరిస్థితి ఇంత చీకటిగా, దయనీయంగా ఉండేది కాదు.

**అల్ప సంఖ్యాకుల్ని దండించడం:**

ఈ మధ్యనే ఇందిరా కాంగ్రెస్, ఎ.ఐ.ఎ.డి.ఎమ్.కె పార్టీల వాళ్ళు మైనార్టీలని వేధించడాన్ని వ్యతిరేకిస్తూ లోక్‌సభ నుండి వాక్–అవుట్ చేసారు. కరపత్రాలు, చిన్నపాటి పుస్తకాల ద్వారా అరుణాచల్ ప్రదేశ్‌లో ఉన్న క్రిస్టియన్స్ అనుభవించే వివక్ష, పక్షపాతధోరణుల గురించిన వివరాలు అప్పుడప్పుడు మన దృష్టికి వస్తున్నాయి: చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాల కూల్చివేతల గురించీ; కాన్వెంట్ స్కూళ్ళ మీద జరిగిన దాడుల గురించీ; బీహార్‌లో నన్స్ మీద జరిగిన భౌతిక దాడులు, అత్యాచారాల గురించి వస్తున్న కొద్దిపాటి వార్తలు భారత దేశ క్రైస్తవ పౌరుల దయనీయ స్థితికి అద్దంపడుతున్నాయి. క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డ్ కుల ప్రజలు తమకి రావాల్సిన విశేష హక్కుల్ని (ప్రివిలేజెస్) పూర్తిగా కోల్పోయారు. అది సరిపోదన్నట్లు ఈ మధ్య ప్రవేశపెట్టబడిన త్యాగి బిల్లు ఆమోదించబడినట్లయితే, అది  క్రైస్తవ అర్చకుల పాలిట శాశ్వతమైన గుదిబండ అవ్వచ్చు. అందుకే  క్రైస్తవులు రోడ్ల మీదకెక్కి ఈ బిల్లుని వ్యతిరేకించడం సమర్థనీయమైన చర్యే. 1979 మార్చి నెల 3వ తేదీన సుమారు ఒక లక్ష మంది క్రైస్తవులు బొంబాయిలో త్యాగి బిల్లుని వ్యతిరేకిస్తూ ఆందోళన చేసారు.

మైనార్టీల్లో అత్యధికంగా ఉన్న ముస్లింల పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంది. అలీఘడ్‌లో ఈ మధ్య జరిగిన మారణకాండ ఒక ఉదాహరణ. ఈ సందర్భంలో కూడా మనదైన, చైతన్యవంతమైన, స్వతంత్రంగా పనిచేయగలిగే న్యూస్ సర్వీస్ లేకపోతే, వివక్ష చూపించే వారినీ, వారి కుతంత్రాలనీ బహిర్గతం చేయలేమని చెప్పాల్సి వస్తుంది.

**బాధితులందరూ ఏకం అయితేనే బాధల్ని ఎండగట్టగలుగుతాం**

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్ ఆదివాసీలు తమపై జరుగుతున్న అత్యాచారాలు, వివక్షలను వ్యతిరేకించటానికి, వాళ్ళ తీవ్రమైన సమస్యలను వెలుగులో తేవటానికి, వాళ్ళ మధ్యలోనే సమాచారం పంచుకొనే విధంగా ఒక చిన్న న్యూస్ మీడియాను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నారు. అదే విధంగా మైనార్టీలు కూడా తాము సొంతగా మీడియాని స్థాపించి తమ సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని పంచుకొనే విధంగా చేస్తున్నారు. ఇలా అణచివేయబడిన వాళ్ళు, మైనార్టీలు ఇద్దరూ ఒంటరిగా పోరాడుతూ, అణచివేతకు గురవుతున్నారు. వీళ్ళిద్దరికి వారి సమస్యల పట్ల ఒకరికొకరికి అవగాహన లేదు. వీళ్ళిద్దరూ ఒకరి సమస్యలు ఒకరు అర్థం చేసుకొని, ఒకరికొకరు సహకరించుకొని వాళ్ళ బాధలను పరిష్కరించుకొనేందుకు ఈ ఇద్దరూ కలవాల్సిన చారిత్రక అనివార్యత ఉంది.

**హిందూ ప్రచురణల ద్వారానే విదేశీయులు మన గురించి వివరాలు తెలుసుకొంటున్నారు.**

శరవేగంతో పయనం సాగిస్తూ సదా కుంచించుకుపోతున్న ఈ ప్రపంచంలో, అభివృద్దిని సాధించిన దేశాలకి తమకంటే కిందస్థాయిలో ఉన్న, ఇంకా అభివృద్ధి కోసం పాకులాడే దేశాల గురించిన వివరాల పట్ల ఆసక్తి ఉంటుంది. అణచివేతకి గురైన ప్రజల జీవనం మెరుగు పర్చడానికి ఎంతో కొంత సహాయం వాళ్ళు సాధారణంగా ఇస్తారు. కానీ ఆ విధంగా వచ్చే సహాయం, ముఖ్యంగా డబ్బు రూపంలో ఉన్నది, చేరవల్సిన చోటుకి చేరదని మనందరికీ అవగతమే. మన క్లిష్టతరమైన కుల వ్యవస్థ గురించి విదేశీయులకి అవగాహన అంతగా ఉండకపోవటం కూడా సమస్య. సహాయం గురించిన  సమస్యని పక్కకి పెట్టినా, ప్రపంచంతో మన గురించి సంపూర్ణంగా, స్పష్టమైన వివరాలు పంచుకోవాలంటే మనదైన ప్రత్యేక న్యూస్ సర్వీస్ ఒకటి తప్పకుండా ఉండాలి.

**అంబేద్కర్ ప్రయత్నాలు**

అణగారిన ప్రజానీకం తమ సమస్యల్ని పరిష్కరించు కోవాలంటే స్వంత న్యూస్ సర్వీస్‌ని ఏర్పరచుకోవాలనే అవగాహన డా.బి.ఆర్.అంబేద్కర్‌కి అరవై సంవత్సరాల క్రితమే ఉండింది. ఆ రోజుల్లో  అక్షరాస్యత ఉన్న అంటరాని ప్రజలు ఎక్కువ శాతం లేనప్పటికీ, 1920లోనే ఆయన "మూక్ నాయక్" అనే పక్ష పత్రికని ప్రారంభించారు. "మూక్ నాయక్" అంటే మూగవాళ్ళ నాయకుడు అనే అర్థం. ఈ పదం వాడటం ఆయన స్ఫూర్తికి నిదర్శనం. 1927లో "బహిష్కృత్ భారత్", 1930లో 'జనతా', 1955లో 'ప్రబుద్ధ భారత్' అనే పత్రికలు తీసుకొచ్చారాయన. ఈ పత్రికల పేర్లు మారుతున్న అప్పటి సమాజానికి దర్పణాలుగా ఉండటం వెనక ఆయన కృషిని మనం గమనించాలి. అయితే ఇప్పుడు మనం మళ్ళీ "మూక్ నాయక్" కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితికి చేరాం. ఎంత అప్రతిష్ట!

**అవసరం – అవకాశం**

పైన చర్చించిన విషయాలన్నీ మనకోసం ప్రత్యేక న్యూస్ సర్వీస్ ఏర్పరుచుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కల్గిన ఈ అవగాహనా సూర్తితో కొంత మంది ఈ అవసరాన్ని పూరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, వాటివల్ల అంత లాభం లేదు. ఆకలితో అలమటించే మనిషి చేతులో బ్రెడ్డు ముక్క పెడితే సరిపోతుందా? ఒక చిన్న పత్రిక కాదు కావల్సింది, దేశ నలుమూలల్నీ సంధానించే న్యూస్ సర్వీస్ నెట్ వర్క్‌ని అత్యంత ప్రణాళికాబద్ధంగా, విస్తారమైన అవగాహనతో కూడిన ప్రయత్నం చెయ్యాల్సిన ఆవశ్యకత మన ముందుంది. దాని ద్వారా జరిగిన సంఘటనల వివరాలు పంచుకోవడంతో సరిపుచ్చుకోకూడదు. ప్రయోజనాత్మకంగా, సునిశిత పరిశోధనలకి అనుగుణంగా ఉండే వార్తలని ఈ న్యూస్ సర్వీస్ అందరికీ అందజేయాలి.

ఇటువంటి న్యూస్ సర్వీస్ అవసరాన్ని 50 సంవత్సరాల క్రితమే గుర్తించిన డా.అంబేద్కర్, దాన్ని స్థాపించడానికి అవకాశాలు ఎక్కువ లేని రోజుల్లో, 1931లోనే ప్రజల్ని పెద్ద మొత్తంలో విరాళాలివ్వమని అభ్యర్థించారు. ఈ రోజూ ఆ అవసరం అట్లానే ఉంది, అయితే ఇప్పుడు అవకాశాలు మాత్రం పుట్టెడు. అణగారిన వర్గాలకి చెందిన ప్రజల్లో 50 సంవత్సరాల క్రితం అక్షరాస్యులు చాలా కొద్ది శాతం మంది మాత్రమే. కానీ ఇప్పుడు, నాలుగు లక్షల మంది విద్యార్థులు కాలేజీలలో చదువులు సాగిస్తున్నారు; 20 లక్షల మంది చదువు ముగించి పబ్లిక్ సర్వీసుల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అంటే, అణిచివేతకి గురైన ప్రజానీకంతో కొంత మంది సంపన్న వర్గానికి చెందిన వారు ఉన్నారు. అంటే ఇప్పుడు మన వార్తలు చదివే చదువరులు చాలా మంది మన ముందున్నారు; వార్తలు రాయగలిగే విలేఖరులు ఉన్నారు, అన్నిటికంటే మించి ఇటువంటి న్యూస్ సర్వీస్‌కి అవసరమైన నిధుల్ని మనమే కూడ గట్టుకోగలిగే స్థితికి మనం చేరాం. దగ్గర దగ్గర 2 లక్షల మంది అణచివేతకి గురైన ఉద్యోగస్తులకి ఈ రోజు నాలుగు సంఖ్యల్లో ఉన్న జీతాలు దొరుకుతున్నాయి. ఇంకో 10 లక్షల మందికి సగటు నెల వేతనం 500 రూపాయలు. ఈ అవకాశాలని మనం ఉపయోగించుకోవడమే తక్షణ కర్తవ్యం. 50 సంవత్సరాల క్రితం అంటరాని కులాలకి చెందిన ప్రజలతో పొత్తు పెట్టుకోవడానికి ఎవరూ లేరు. ఇక ఆదివాసీలైతే అరణ్యాలకే పరిమితమై ఉన్నారు. కానీ ఈ రోజు ఓ.బీ.సీ కులాలకి చెందిన కొందరు, మైనారిటీ ప్రజలు, ఇతర అణచివేయబడిన భారతీయుల పట్ల ఆందోళన చెందే స్థితికి చేరారు. ఇదొక మంచి అదనపు అవకాశం.

**"అణదొక్కబడిన భారతీయుడు", మళ్ళీ మొదటికి**

ఈ పేరుతో మాసపత్రిక ఇప్పుడే ప్రారంభం అవుతోంది. … ఎదుర్కోవాల్సిన సమస్యలు ఇంకెన్నో. అవసరాలూ, అవకాశాలూ రెండూ మనకి స్ఫూర్తినిచ్చాయి. న్యూస్ సర్వీసు రంగంలో ప్రవేశించేటట్టు చేసాయి. మన ప్రగతిని ఆశించే, మన ఆలోచనల్ని పంచుకొనే స్నేహితుల సహకారంతో సవాళ్ళతో నిండిన ఈ ప్రయత్నాన్ని మనం సమర్థవంతంగా సాధించగలం. వచ్చే రెండేళ్ళల్లో ఈ న్యూస్ నెట్‌వర్క్‌ని భారత దేశ నలుమూలలకి వ్యాపించేటట్లు చేయగలుగుతామని ఆశిస్తున్నాం.

**అనువాదం: దుగ్గిరాల వసంత**

# విషపుకాటు–అంటరాని ప్రజలు

■ **రవికుమార్**

**తమిళ** రచయిత్రి వాసంతి రాసిన 'థినవు' (దురద) కథలో మాయావతికి సంబంధించిన ప్రస్థావన ఉందనడంతో సందేహం లేదు. మాయావతి అనుకోకుండా ముఖ్యమంత్రి అయ్యిందనీ, గతంలో ఆమె ఒక ఠాకూర్‌కు ఉంపుడుగత్తిగా ఉండేదనీ ఈ కథ ఆమె మీద బురద జల్లే ప్రయత్నం చేసింది. ఇక్కడ తమిళేతర పాఠకులకు వాసంతిని గూర్చి కొంచెం చెప్పాలి. ఈమె తమిళంలో పేరున్న జర్నలిస్టు, రచయిత్రి. మద్రాసు నుంచి తమిళంలో వెలువడే 'ఇండియా టుడే' పత్రికకు సంపాదకురాలుగా పనిచేశారు. ఆమె రాసిన కథలు ఇంగ్లీషులోకి అనువదించబడ్డాయి. ఇండియాటుడే (తమిళం)లో ఆమె ఇప్పటికీ వ్యాసాలు వ్రాస్తూ ఉంటారు. తమిళ వర్గాల్లో ఆమెకు ఒక ప్రముఖ 'రాజకీయ వ్యాఖ్యాత'గా పేరుంది.

ఇప్పుడు క్లుప్తంగా 'థినవు' కథేంటో చూద్దాం. పొగరుబోతైన ఠాకూర్ రతన్‌సింగ్ 'కోరిక'ను తీర్చడానికి చమేలీ వాళ్ళ అమ్మకి తన కూతుర్ని అతని దగ్గరకు పంపించాల్సిన అగత్యం ఏర్పడుతుంది. ఒకరోజు రతన్‌సింగ్ మంచి 'కామానందం'లో ఉన్నప్పుడు చమేలీని ఎన్నికల్లో పోటీ చేయించాలని నిర్ణయిస్తాడు. చమేలీ భయపడి తనకా అర్హత లేదంటుంది. దానికి రతన్‌సింగ్, "నీకేం అర్హత కావాలి? నువ్వు పోటీ చేయొచ్చని చట్టం చెబుతోంది కదా?" అంటాడు. తిరిగి ఆలోచించుకొన్న చమేలీ, చేతికందొచ్చిన ఈ 'అనుకోని అదృష్టాన్ని' ఎలాగైనా వదులుకోకూడదని నిర్ణయించుకుని, తన పేరును చారుమతిగా మార్చుకొని ఎన్నికల్లో పోటీ చేస్తుంది. తన అలవాట్లను కూడా మార్చుకొంటుంది (వెంట్రుకలు పొట్టిగా కత్తిరించుకొని, ఇంత కాలంగా 'తక్కువ కులాల' వారికి నిషేధించబడిన మసాలా చాయ్ తాగుతూ నెయ్యి పదార్థాలు తినడానికి అలవాటు పడుతుంది). ఒకరోజు ఆమె నియోజకవర్గమైన సోహన్‌పూర్ నుంచి ఆమెను కలవడానికి కొంత మంది మగవాళ్ళు వస్తారు. ఎందుకో తెలియదు కానీ వాళ్ళు ఆమెను కలుసుకోకుండానే వెళ్ళిపోతారు. ఆమె వాళ్ళకోసం వెతుకుతూ వాళ్ళను ఒక రోడ్డు ప్రక్కన కలుసుకొంటుంది. వాళ్ళ ఊర్లో ఉన్న బావిని ఎవరైనా వాడుకోవచ్చని చారుమతి ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాళ్ళు ఆ బావిని కనీసం తాకకూడదని ఠాకూర్ బెదిరించాడని వాళ్ళలోని 'కాలూ' తాతయ్య మొరపెట్టుకొంటాడు. "కేవలం ఠాకూర్ దయాదాక్షిణ్యాల వల్లే నీకీ పదవి దక్కింది. దీనివల్ల ఒరిగేదేమీ లేదు" అంటాడాయన. ఊర్లో వాళ్ళంతా తనను ఎందుకూ కొరగాని మనిషిగా చూస్తున్నారన్న విషయాన్ని అర్థం చేసుకొన్న ఆమె, ఠాకూర్ ఒక టెండర్ కోసం పెట్టుకొన్న దరఖాస్తును ఆపేస్తుంది. ఊహించినట్టుగానే రతన్‌సింగ్ ఆమె వాకిటి ముందు ప్రత్యక్షమవుతాడు. ఊర్లో ఇంతకు ముందెప్పుడూ లేని సంప్రదాయాన్ని యిప్పుడు కొత్తగా మొదలు పెట్టవద్దని బెదిరిస్తాడు. నేను చట్ట ప్రకారం నడచుకొంటున్నానంటుంది చారుమతి.

"నువ్వు నా దయాదాక్షిణ్యాల పైన ఆధారపడి బతికేదానివి. చట్టం గురించి మాట్లాడడానికి నీకెంత ధైర్యం? ఇక్కడ నేను చెప్పిందే చట్టం అన్న విషయాన్ని మర్చిపోయావా?" అని గట్టిగా కేకలేస్తాడు రతన్‌సింగ్. అదేరోజు పోలీసులు రతన్‌సింగ్ బంగ్లాకొచ్చి, నిద్రపోతున్న అతన్ని లేపి దురుసుగా అరెస్టు చేస్తారు. అప్పుడు ఠాకూర్లంతా చమేలీ కాళ్ళ మీద పడతారు. "అంతా తల్లకిందులైంది... చమేలీ యిప్పుడు ఠాకూరైపోయింది. ఇది మంచికా? చెడుకా?" అని మథనపడతాడు ఎటూ తేల్చుకోలేని కాలూ తాతయ్య. అంతకు ముందెప్పుడూ సుఖంగా నిద్రపోని చమేలీ మనసిప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఆమె దిండు కింద పోటా (POTA) చట్టం ప్రతి ఉంది.

ఈ కథ మాయావతి గురించే ఎందుకయ్యుండాలి అని అడగవచ్చు. దీనికి కథలో ఎన్నో ఆధారాలున్నాయి. ముఖ్యమయిన చమేలీ పాత్ర 'క్రింది కుల' స్త్రీగా చెప్పబడింది. ఆమె తన జుట్టును 'క్రాఫ్' చేయించుకుంటుంది. కథలోని సోహన్‌పూర్, మాయావతి నియోజకవర్గమైన హెూరోరాలో ఉన్న సోహరాన్‌పూర్ జిల్లా పేరును పోలి ఉంటుంది.

కథలోని పల్లెటూరి ప్రజలు దళిత కులాలకి చెందినవారని, చమేలీ వారిలో ఒకరని మంచినీళ్ళ బావి సమస్య సందర్భంలో స్పష్టంగా తెలిసిపోతుంది. చమేలీ ప్రధాన మంత్రితో ఫోన్‌లో మాట్లాడినప్పుడు, అలాగే ఊరి బావులను అందరికీ అందుబాటులో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసినప్పుడు, ఆమె ముఖ్య హెూదాలోనే ఆ పనులు చేసిందని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. అంతేగాకుండా, కొత్తగా వచ్చిన పోటా (POTA) చట్టాన్ని అమలు చేసిన 'క్రింది కుల' స్త్రీ మాయావతి తప్ప వేరొకరు కావడానికి ఆస్కారం లేదు (పాత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అనిగానీ, ఢిల్లీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ అనిగానీ, బీహార్ ముఖ్యమంత్రి రబ్రీదేవి అనిగానీ పొరబడే ఆస్కారం లేదు).

కథలోని ఠాకూర్ రతన్‌సింగ్‌కు, మాయావతి ప్రభుత్వం పోటా చట్టం క్రింద ఈ మధ్య అరెస్టు చేసిన రాజాభయ్యాకు చాలా పోలికలున్నాయి (కథలో ఇతని ఇంటి వెనుక భాగంలో చాలా ధనం దాచి పెట్టబడి ఉంటుంది. అలాగే ఆయన ఇంట్లోని రహస్య గదుల నిండా ఆయుధాలుంటాయి. ఆయన ఎన్ని హత్యలు చేయించాడనే విషయం యింత వరకు ఎవ్వరికీ ఖచ్చితంగా తెలియదు). రాజాభయ్యా ఠాకూర్ అనే విషయం మాత్రం అందరికీ తెలుసు.

ఎయిర్ కండిషన్ గదిలో కూర్చొని ఉన్న చమేలీని వాళ్ళ అమ్మ తాలూకు జ్ఞాపకాలు వెంటాడుతాయి. వాళ్ళమ్మ తన పాత పేరుతో 'చమేలీ' అని పిలిచిన పిలుపు ఆమెకు వినిపిస్తుంది. బెదిరిపోయిన వాళ్ళమ్మ చూపులు ఆమె గదినిండా ఆవరించుకోగా, ఆ జ్ఞాపకాలను చమేలీ తన కొరడా మరియు రివాల్వర్‌లతో వాటి వెంటపడి తరుముతుంది. పాత జ్ఞాపకాలు ఆమెను పిచ్చిదాన్ని చేస్తాయి.

చారుమతి వాళ్ళమ్మ ఇండ్లలో పాచిపనులు చేసేది. ఆమెకు అగ్రకులాల వాళ్ళంటే చచ్చేంత భయం. తన కూతుర్ని ఠాకూర్ రతన్‌సింగ్ దగ్గరకు (అతని లైంగిక) కోరికలను తీర్చడానికి పంపుతుంది. చిన్నప్పుడు చారుమతి కేవలం డ్రాయరు వేసుకొని వాళ్ళమ్మ చీర పేలికలను పైన కప్పుకొనేది. సేఠ్‌లాలా వాళ్ళ దుకాణం వరండాను ఊడుస్తున్నప్పుడు అతను యిష్టంగా తాగే మసాలా చాయ్ కొన్ని చుక్కలైనా తాగాలని తనకు కోరికగా ఉండేది. ఒకసారి ఆమె లక్ష్మణ్‌సేఠ్ ధోతీపైన కొన్ని చుక్కలు చాయ్‌ను పొరపాటున ఒలకబోసినపుడు అతను కోపంతో కాలిపోతున్న చాయ్‌ను తన మీద పోసిన సందర్భాన్ని ఆమె ఎప్పటికీ మరచిపోలేదు. వాళ్ళమ్మ వేరే ఏ అవకాశం లేకనే తనను రతన్‌సింగ్ దగ్గరకు పంపించిందనే విషయం ఆమెకు తెలుసు. ఆమె ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ప్రధాన మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు సోఫాలో కూర్చోనున్న రతన్‌సింగ్ శరీరాన్ని ఆమె కాంక్షగా గమనించేది. మొరటుగా ఉన్న అతని చేతుల నుండి ఆమెకు "కామ వాసన" వచ్చేది. అతని శరీర కదలికల్ని ఆమె జాగ్రత్తగా గమనించేది. గతంలో అతని 'ఆకలి'ని తీర్చడానికి తనను పంపినప్పుడు, అతనికి 'భావప్రాప్తి' కలిగినపుడు అతను చేసే శబ్దం ఆమెకు గుర్తొచ్చింది. కానీ 'పోటా' ఆయుధం తన చేతుల్లోకి వచ్చింతర్వాత చారుమతి రతన్‌సింగ్‌ను అర్థరాత్రివేళ పకడ్బందీగా అరెస్టు చేయించడమే కాక, తన మీద చాయ్‌ను పోసిన లక్ష్మణ్‌సింగ్‌ను సైతం అరెస్టు చేయమని పోలీసుల్ని ఆదేశిస్తుంది. ఇది చమేలీ లేక చారుమతి గురించి (నిజంగా చెప్పాలంటే మాయావతి గురించి) వాసంతికున్న అభిప్రాయం. మాయావతి భారత



దేశంలోని దళితులున్న ఉత్తర ప్రదేశ్‌లోనే కాక, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాబల్యమున్న రాజకీయ పార్టీకి అధిపతి. అంబేద్కరు తర్వాత దళితుల్ని అత్యంత నేర్పుగా సమైక్యం చేయగలిగింది మాయావతేనని ఒక పత్రిక పేర్కొంది. అలాంటి నాయకురాలు వాసంతి దృష్టిలో అనుకోకుండా అధికారంలో కొచ్చింది. ఒక హిందూ ఆధిపత్య కులానికి సంబంధించిన వ్యక్తి సహాయం లేకుండా ఒక దళిత కులం నుంచి వచ్చిన వ్యక్తి అధికారంలోకి రావడం అసాధ్యమని వాసంతి నమ్మకం కావచ్చు. ఆమె దృష్టిలో, దళితులు అధికారంలోకొస్తే, వాళ్ళు చట్టాన్ని తమ యిష్టాయిష్టాల కనుకూలంగా సొంత పనులకు వాడుకొంటారు. వాళ్ళు అధికారంలోకొస్తే వాళ్ళు కూడా ఠాకూర్‌లవుతారు. ఇదే వాసంతికి తెలిసిన న్యాయం. అయితే వాసంతి అభిప్రాయాలు ఎంతవరకు సమంజసమో తెలుసుకోవడానికీ, అలాగే ఉత్తరప్రదేశ్‌కు సంబంధించి ఆమె ఆలోచనలు సరైనవా కాదా అని నిర్ణయించే ముందు ఆ రాష్ట్ర రాజకీయాలను కొంచెం అర్థం చేసుకోవడం అవసరం. దళితులు ఎన్నికల రాజకీయాల ద్వారా ఎలా బలోపేతం కావచ్చో అర్థం చేసుకోవడానికి బహుజన్ సమాజ్ పార్టీ చరిత్ర ఉపయోగపడుతుంది. 1998 సంవత్సరంలో బి.ఎస్.పి ఉత్తరప్రదేశ్‌లోని 60.6 శాతం దళితుల ఓట్లని సంపాదించింది. 1996 జనరల్ ఎలక్షన్‌లో ఆ పార్టీ 201 స్థానాల్లో పోటీ చేసి 11 స్థానాలను గెలుచుకొంది. వాటిలో రిజర్వుడు నియోజక వర్గాల్లో నెగ్గినవి మూడు మాత్రమే. దేశం మొత్తంలో ఉన్న దళిత ఓట్లలో ఆ పార్టీకి 12.1 శాతం వచ్చాయి. ఎలక్షన్ కమీషన్ ప్రకటించిన సమాచారం ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం ఓట్లలో ఆ పార్టీకి 20.16 శాతం వచ్చాయి. 1985 సంవత్సరం తర్వాత బి.ఎస్.పి ఓటు శాతం క్రమంగా పెరిగింది. 1985లో 4 శాతం, 1993లో 10.8 శాతం ఓట్లను గెలుచుకోగా, 1996 నాటికి అది 201.6 శాతానికి పెరిగింది. బి.ఎస్.పికి ఓట్లేసిన వాళ్ళలో అత్యధికులు చదువురాని పల్లెటూరి దళితులు కానీ రాజకీయ చైతన్యం కలిగిన వాళ్ళు. వాసంతి చిత్రీకరించినట్లుగా మాయావతి, బి.ఎస్.పిలు అనుకోకుండానో లేక ఠాకూర్‌ల దయాదాక్షిణ్యాల వల్లనో పైకి రాలేదు. ఇది అర్థం చేసుకోవాలంటే, దళితులు ఉత్తరప్రదేశ్‌లో గత డెబ్బై ఏళ్ళుగా సాగించిన పోరాట చరిత్రను తెలుసుకోవాలి. 1940లలో ఉత్తరప్రదేశ్‌లోని దళిత రాజకీయాలు అఖిల భారత షెడ్యూల్డు కాస్ట్ ఫెడరేషన్ గొడుగు క్రిందకు వచ్చాయి. ఎన్నో రకాలుగా తమ మీద రుద్దబడిన హీన వృత్తులను వ్యతిరేకించిన చరిత్ర దళితులకుంది. అలాగే సంప్రదాయ వెట్టిచాకిరిని వ్యతిరేకించడం, అసలే వేతనాలు లేని పరిస్థితి నుంచి న్యాయమైన వేతనాల కోసం పోరాటం చేయడం, యిలా అనేక రూపాల్లో దళిత పోరాటాలు ముందుకొచ్చాయి. వీటన్నింటిలో దళిత స్త్రీల పాత్ర చెప్పుకోదగ్గది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) అవతరించే వరకు ఈ ఫెడరేషన్ ఉత్తరప్రదేశ్ ఎస్.సి. రాజకీయాల్లో కీలకపాత్ర వహించింది. 1969 వరకు ఆర్.పి.ఐ ఆ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహించింది. కానీ అటు తర్వాత 1980లలో బి.ఎస్.పి ఆవిర్భవించే వరకూ ఒక దశాబ్దకాలం పాటు మాత్రము అక్కడ బరిలో ఏ దళిత పార్టీ లేకుండా సాగింది.

వాసంతికి ఉత్తరప్రదేశ్ ఎలక్షన్ రాజకీయాల్లో దళితుల చరిత్రకు సంబంధించిన పరిజ్ఞానం శూన్యమైనప్పటికీ ఆమెకు వాటి గురించి వ్రాయాలనే కోరిక మాత్రం పోనట్టుంది. అయితే మాయావతి విమర్శలకు అతీతమా అనే ప్రశ్న రావచ్చు. ఇక్కడ సమస్య అది కాదు. ఎస్.కె.థోరట్, ఉదిత్‌రాజ్, చంద్రభాన్‌ప్రసాద్ లాంటి పేరున్న దళిత మేధావులు అవసరమైనప్పుడల్లా మాయావతిని విమర్శిస్తూనే ఉన్నారు. ఇంకా చెప్పాలంటే, చాలా మంది దళితులు మాయావతి రాజకీయాల్ని నిర్వహించే పద్ధతినే విమర్శించారు. అయితే మాయావతిని విమర్శించే దళితేతరులు ఆమె చాలా సంవత్సరాలుగా చేసిన మంచి పనుల్ని మాత్రం ఎక్కడా ప్రస్తావించరు.

మొదట్లో ఆమె ఆరునెలలపాటు అధికారంలో ఉన్నప్పుడు దళితులకు భూమినిచ్చారు. దళిత విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను రెండింతలు చేయడం, అయిదువేల మోడల్ అంబేద్కర్ పల్లెల్ని రూపొందించడం, ఎస్.సి/ఎస్.టి అట్రాసిటీస్ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయడం, ఎప్పట్నుంచో భర్తీ చేయకుండా వదిలేసిన రిజర్వుడు ఉద్యోగాలను భర్తీ చేయడం లాంటివి ఎన్నో చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గడచిన యాభై సంవత్సరాల్లో మిగిలిన ఏ రాష్ట్రానికి కూడా యిలాంటి విజయాల్ని సాధించిన ఘనత లేదు. ఆమె ప్రస్తుత పదవీ

కాలంలో న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా, అలాగే దళితులకు క్యాబినెట్‌లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించడానికి చట్టాన్ని సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం ద్వారా భారతదేశ ప్రజాస్వామ్య పరిధిని విస్తృతం చేశారు. దళితేతరులు వీటి గురించి ఎప్పుడూ ప్రస్తావించరు. మాయావతి తన పుట్టిన రోజును ఆర్భాటంగా జరుపుకొంటున్నప్పుడు మాత్రమే అంబేద్కర్ ఆశయాలు అగ్రవర్ణ హిందువులకి ఎందుకు గుర్తొస్తాయి? అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చలేదని మాయావతిని విమర్శించడమే కాకుండా, అంబేద్కర్ ఆశయాల్ని అనుసరించడానికి ఆమె రూపొందించిన ప్రభుత్వ విధానాలపై వారు మౌనం వహించడంలో ఉన్న మతలబేంటి? అంబేద్కర్ ఆశయాల్ని సాధించాల్సిన బాధ్యత దళితులమీదనే ఉందని వారు భావిస్తారు. వాళ్ళక్కూడా ఆ బాధ్యత ఉందని అనుకోరు. పత్రికలు మాయావతిని నేరుగానే విమర్శిస్తాయి. కానీ వాసంతి అలా ముక్కుసూటిగా వెళ్ళదల్చుకోలేదు. మాయావతిపై ఆమె వేసిన అభాండాలన్నీ కాల్పనిక సాహిత్య ముసుగులో అవతారమెత్తాయి. మాయావతిని పొగుడుతున్నట్లే నటిస్తూ, ఆమెపైన బురదచల్లే ప్రయత్నం చేసింది. అపనింద లెయ్యడంలో వాసంతి మూలాయంసింగ్‌ను మించి పోయింది. మాయావతి ఒక ఠాకూర్‌కు తన శరీరాన్ని అర్పించిందనేది ఆమె ఆరోపణ. వాసంతి తనను స్త్రీవాదిగా చెప్పుకుంటుంది. కానీ తన కథలో ఆమె మనకిచ్చే స్త్రీవాద సందేశమేమిటంటే, ఒక స్త్రీ తనసుకొన్న స్థాయికి ఎదగాలంటే అది పలుకుబడి కలిగిన ఒక పురుషుడికి ఉంపుడుగత్తెగా ఉండడం ద్వారానే సాధ్యమౌతుందనేది. వాసంతి తాను స్త్రీ కాబట్టి, బ్రాహ్మణ కులానికి చెందడం మూలానా తమిళనాడులో తాను వివక్షకు గురవుతున్నానని ఒక ఇంటర్వ్యూలో వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. అదే ఇంటర్వ్యూలో తనకు తమిళనాడుకు సంబంధించి అంతగా పరిజ్ఞానం లేదని ఒప్పుకొంది. ఆమె రాసిన కథ చదివితే తమిళనాడు గురించే కాదు, ఆమెకు ఇంకా చాలా విషయాల్లో పరిజ్ఞానం లేదని తెలుస్తుంది. ఆమె మేధావేనా, రచయిత్రేనా అనేది ముఖ్యం కాదు. ఆమె రాసింది సాహిత్యంగా పరిగణించవచ్చా లేదా అనేది కూడా మనకవసరం లేదు. ఆమె ఈ కథనిండా తన అసహ్యాన్ని, ద్వేషాన్ని ఎలా నింపిందనేది మనం అర్థం చేసుకోవాలి. మాయావతిని నీచంగా చూపించడానికి, అవమానించడానికి వాసంతి రాష్ట్ర, భాషా పరిధుల్ని అతిక్రమించడం ద్వారా "క్రాస్ బోర్డర్ టెర్రరిజం" లో తలదూర్చిందని చెప్పవచ్చు.

వాసంతి తన కథకు 'థినవు' అని పేరు పెట్టారు. తమిళ నిఘంటువు (The Tamil Lexicon-1982) ప్రకారం 'థినవు' అంటే 'దురద' (Itch) అని అర్థం. మిగిలిన నిఘంటువులలో 'అహంకారం' 'గర్వం' అనే అర్థాలు కూడా ఉన్నాయి. తమిళంలో ఈ పదాన్ని ఇంకా ఏ విధంగా ఉపయోగిస్తారో చూడాలి. 'థినవే దుత్త థోవ్' అనే మాటలు ఒక పురుషుని ధైర్యాన్ని, అతనికి యుద్ధానికి వెళ్ళడానికున్న ఉత్సాహాన్ని తెలుపుతుంది. అదే ఒక స్త్రీ విషయంలో 'థినవేదుత్తు థిరిగిరాల్' అనే మాటలు, ఆ స్త్రీ కామ వాంఛలకి తాపత్రయపడుతుందనే అర్థాన్ని స్ఫురింపచేస్తుంది. కథలో ఒక చోట 'థినవు' అనే పదం 'కొరడా చివరి భాగం' (ఇది అధికారాన్ని తెలియచేస్తుంది) అనే అర్థంలో వాడినట్లు చెప్పబడినా, 'కామ వాంఛ' అనే అర్థంలో కూడా వాడటం జరిగింది. చమేలీ మొరటుగా ఉన్న ఠాకూర్ వైపు కోరికగా చూసినట్లు చెప్పడం ద్వారా ఈ విషయం స్పష్టమవుతుంది. రచయిత్రి యొక్క ద్వేషపూరిత దృక్పథం ఈ కథకు ఆమె పెట్టిన పేరు ద్వారా వ్యక్తమవుతుంది.

1968 సంవత్సరంలో తంజావూరులోని 'కొజ వెన్మని' అనే పల్లెలో 44 మంది దళితులు ఊచకోతకు గురయ్యారు. ఈ సంఘటన జరిగిన తర్వాత రాసిన 'కురు దిప్పునల్' (దీనికి సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది) అనే నవలలో రచయిత ఇందిరా పార్థసారథి ఈ హత్యల వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవడానికి ఒక 'సైకో అనలిటికల్ రేషనాల్'ని మన ముందుంచుతారు. అదేంటంటే హత్యలను జరిపించిన భూస్వామి నపుంసకుడు కావడం వల్ల ఆ పని చేపించాడని. అలాగే, రాజాభయ్యాని అరెస్టు చేయడం వెనక ఒక తక్కువ కులం నుంచి వచ్చి ముఖ్యమంత్రిగా ఎదిగిన మహిళ మాయావతికావడం అలాగే ఆమెకు అతనిపైనున్న 'కాంక్ష' కూడా కారణమని వాసంతి అభిప్రాయం. ఒక బ్రాహ్మణ పురుష రచయిత దళితులపై జరిగిన ఒక దాడికి గల కారణాన్ని ఒక భూస్వామి అంగంలో వెదికే ప్రయత్నం చేస్తే, ఇంకో బ్రాహ్మణ రచయిత్రి 'దళిత ప్రతీకారాని'కి గల కారణాన్ని ఒక దళిత మహిళా యోనిలో అన్వేషించే ప్రయత్నం చేసింది. ఒక్క మాయావతినే గాక, మొత్తం దళితులు, దళిత రాజకీయాల్నే 'మురికిమయం'చేసే ప్రయత్నం జరిగిందిక్కడే. ఇలాంటి నీచమైన విషయాలను ఒక వ్యాసం రూపంలో రాస్తే తీవ్రపరిణామాలుంటాయని ఊహించి దానికి సాహిత్యం ముసుగులో అమ్మితే ఎవరికీ దొరకకుండా ఉండొచ్చని ఈ దారినెంచుకుంది. ఈ కథ ఆమె నోటి నుండి జారిపడిన ఒక పెద్ద రత్నం అని ఆమె అనుకుంటుండొచ్చు. అయితే ఇందులో ఉన్నది భయంకరమైన విషం అని దళితులు అర్థం చేసుకోగలరు. పాముల్ని పూజించే సంస్కృతి నుండి వచ్చినందువల్ల వాసంతి తాను ఎవరికీ భయపడవలసినవసరం లేదని అనుకుంటుండవచ్చు. కానీ మిగిలిన సంస్కృతుల నుంచొచ్చిన వాళ్ళు కూడా ఇక్కడి వాళ్ళే. వాళ్ళకు పాము దేవుడు కాదు. పాము కేవలం పామే. పాముల నుంచి తమను ఎలా రక్షించుకోవాలో వాళ్ళకు బాగా తెలుసు.

**అనువాదం: ఎన్.మనోహర్ రెడ్డి**

రచయిత తమిళనాడులో దళితోద్యమకారులు, తత్త్వవేత్త

ఈ వ్యాస రచనకి ఉపయోగపడిన రచనలని ఇంగ్లీషు భాగంలో చూడవచ్చు.

ఈ వ్యాసాన్ని వెనమస్ టచ్ (సామ్య 2009) నుండి తీసుకోబడింది.



# కొప్పుల నాగరాజు

## అంటకుండా చేద్దామంటే ఐకనయ్యిండు



■ గోగు శ్యామల

ఒక యువ మాదిగ పాత్రికేయుడు ఇంగ్లీష్ మీడియాలో ఉంటె, అదీ ఫీల్డులో ఎదురయ్యే వాస్తవ సంఘటనలను సృజనాత్మకంగా రాసే జర్నలిస్టుగా ఉంటె ఎట్ల ఉంటుంది అని ఎవరైనా ప్రశ్నించుకుంటే 'ఇంగ్లీష్ మీడియాలో ఉన్న మొదటి మాదిగ జర్నలిస్టు కొప్పుల నాగరాజులా ఉంటుంది'. అని నిస్సందేహంగా సమాధానం చెప్పుకోవచ్చు.

మనం తెలంగాణ యువ జర్నలిస్టు అనే పరిచయపు ఆసరాతో అతడు రాసిన రచనల్లోకి మరియు అతని జీవితంలోకి తొంగి చూస్తె, ఒక పక్క జర్నలిస్టు, ఇంకోపక్క ఐఏయస్ కావాలనీ, మరోపక్క పేయింటర్‌లాంటి వైవిధ్యభరితమైన నైపుణ్యాలతో బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలబడుతాడు. పేదరికం, అంటరానితనం అడుగడుగునా చీకటి. అగాధాలై అడ్డుకుంటున్నా ముందుకే ఎలా సాగాలో ఆలోచిస్తూ ప్రయత్నిస్తున్న వారికి; వారు ఏ సామాజిక కులాల, వర్గాల యువత ఐనా సరే, ప్రత్యేకంగా మాలమాదిగ, ఇతర బంధుకులాల కొత్త తరపు యువతకి, వారి ముందు అనేక విషయాలను నిలిపి నిలువెత్తు విజయ సంతకంగా నాగరాజు నిలబడిండు. నాగరాజు చనిపోబోతున్నాడని అందరికీ ముందే తెలిసింది. డాక్టరు రిపోర్టును చాలా మందే చూసారు; చూసిన వారు సోషల్ మీడియా ద్వారా, వాట్సప్ గ్రూపుల ద్వారా ఒకరి నుండి ఒకరికి అతడి విషమ ఆరోగ్య స్థితి తెలియచేసారు. కొంత దూరమున్న వారికి తప్పించి మిగితా వారందరికీ జరగబోయే ప్రమాదం తెలుసు. కానీ అతడి మరణాన్ని వినడానికి, చూడడానికి ఎవ్వరూ ఇష్టపడ లేదు. చివరి వరకు నాగరాజును బతికించేందుకు మిత్రులు, ముఖ్యంగా జర్నలిస్టులు, స్కాలర్స్ వారి వారి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే నాగరాజు వైద్యం బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం స్వీకరింప చేయాలని ప్రయత్నించారు. ఫలితంగా ప్రభుతం కొంతవరకు బాధ్యతను స్వీకరించింది.

తార్నాకా నుండి మౌలాలి వెళ్ళే హైవే ముగింపు దగ్గరి లాలాపేట్‌లోని జనప్రియ అపార్టుమెంటులోని ఒక ఇంటిలో బెడ్ మీద 34 సంవత్సరాల నాగరాజు ఎముకల గూడులాగ పడుకొని, ఓపిక లేకున్నా తన కోసం వెళ్ళిన వారందరిని నోటినిండా మాటలతో గలగల మాట్లాడించాడు. తన కంటె చిన్నవారు, మిత్రులు వెళ్ళి కలిసారు. చేయగలిగిన వారు చేయగలిగినంతా చేసారు. నాగరాజు బతికితే బాగుండు అని పత్రికల్లో రాసారు. అయితే నాగరాజును పట్టి పీడించిన లివర్ కాన్సర్ జబ్బు చిన్నదేం కాదు. 2015 సం॥ ఏప్రిల్ నెలలో 12 వ తేదీ నాటి ఉదయం నాగరాజు చివరి శ్వాస వదిలాడు.

అయ్యో...పాపం అనే కంటే ఒక సున్నితమైన మనసు గల గొప్ప నైపుణ్యమున్న స్కాలర్‌ను, జర్నలిస్టును, చిత్రకారుడిని, జీవిత స్వప్నాల కలల రారాజు నాగరాజును కోల్పోయామే అనే వేదనకు అందరూ గురయ్యారు. 'మాలాంటి వారికి రోగమొస్తే బతికే అవకాశమే లేదా? అన్న ప్రశ్నలతో సుడులు తిరిగే విషాదం అక్కడ చేరిన వారందరిలో నిండిపోయింది.

నాగరాజు పుట్టింది సారపాక అనే గ్రామంలోని పూరిగుడిసెలో. 1985 సం॥ మే నెల 25వ తేదీ నాడు ఖమ్మం జిల్లా భద్రాచలం మండలంలో మాదిగ వాడలోని దంపతులకు జన్మించిండు. నాలుగు సంవత్సరాల నాగరాజు పసిప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి వెంకటమ్మ తన పుట్టింటివారి ఆసరాతో నలుగురి పిల్లల బాధ్యత మోయాల్సి వచ్చింది. మామూలుగా అందరూ మాదిగలలాగానే వెంకటమ్మ కుటుంబానికి సొంత భూమిలేదు. ఇతర ఆసాముల భూముల్లోనే నిండా చాకిరి చెసేవారు. చాలని వేతనాల కారణంగా రోజూ పని దొరకని కారణంగా సారపాక గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పేపరు మిల్లులో పని చేయడానికి వెళ్ళేవారు. నాగరాజు కడుపులో ఉన్నప్పుడే తల్లి వెంకటమ్మ పేపరు మిల్లులో కార్మికురాలిగా పనిచేస్తూ ఉండేది. పొద్దుల్ల పడి కాస్పు అయ్యేదాక శ్రమ చెయ్యక తప్పని స్థితి ఆమెది. అందుకేనేమో నాగరాజుకు తల్లి కడుపులో ఉన్నప్పుడే కష్టపడే తత్వం అలవడింది. 'ఐదారు సంవత్సరాల పసివయసులోనే ఒక పక్క పలక పట్టుకొని బడికి పోతూనే బడి అయిపోయినంక సాయంత్రం పూట ఐస్‌క్రీములు అమ్మేవాడు. అట్ల వచ్చిన పైసలతో తన ఖర్చులు ఎల్లదీసుకునేవాడ'ని తల్లి చెప్పింది. తాను చదువులో ఎదుగుతున్నకొద్ది పెయింటింగ్ చేస్తూ డబ్బులు సంపాదించేవాడు. వ్యాపార దుకాణాలకు సైను బోర్డులు రాయడం కోసం ప్రముఖ సంఘసేవకులు మరియు సినీతారల పెయింటింగులు వేసేవాడు. అట్ల సారపాక గ్రామంలోని చాలా దుకాణాలకు నాగరాజు వేసిన సైన్ బోర్డులు వేలాడి ఉండడం విశేషం.

భద్రాచలంలో తన ఇంటరు, డిగ్రీ చదువు ముగించుకున్నాక నాగరాజు హైద్రాబాదు చేరిండు. యం.ఏ చరిత్రను చదవడానికి హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేరిండు. తరువాత ఢిల్లీలోని తెహల్కా పత్రిక అందచేసిన పారితోషికం సహకారంతో మద్రాసులో జర్నలిజం డిప్లొమా కోర్సు చదివాడు. దీని తరువాత నాగరాజు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దిన పత్రికలో జర్నలిస్టుగా పనిచేశాడు.

తను మనసు పెట్టి ఎంతో ఉత్సుకతతో ఆసక్తితో పని చేసాడు. అంతేకాక జర్నలిజం గురించి ఎన్నో కలలు కన్నాడు. 'మీడియా, అందులో ఇంగ్లీషు మీడియా తన జీవితంలో ఎన్నడూ చూడని కథలు రాస్తాను' అని ఒక సందర్భంలో నాగరాజు అన్న మాటలు అతడి కలల లోతులను, గుండెనిబ్బరాన్ని తెలియ జేస్తాయి. ఈ ప్రయత్నంలోనే అనేక ప్రత్యేక కథనాలు, కథలు రాశాడు. నిరంతరం శ్రమ చేసేవారిని గూర్చిన భిన్నమైన కోణాలను వెలికి తీశాడు. శ్రమ చేసే వారి సృజనాత్మకత, మరియూ వారి పట్ల యాజమాన్యాలు, ఆధిపత్య వ్యవస్థలు చూపుతున్న భయంకరమైన నిరాదరణ, నిర్లక్ష్యం, పరాయికరణకు గురిచెసె చర్యలను నిశితంగా వివరించాడు. వారు గురవుతున్న సామాజిక, ఆర్థిక అణచివేతలను, వారి మనోభావాలు, సామాజిక న్యాయం గురించిన అంశాలను గణాంకాలతో సహా ఎవరూ కాదనలేనంత బలంగా రుజువుచేస్తూ అనేక కథనాలు రాశాడు. వాటిని రాయడం కోసం వందల మైళ్ల దూరం ప్రయాణం చేసేవాడు. అది ద్విచక్రవాహనంపై అయినా, బస్సు అయినా, కాలినడక అయినా తిండి ఉన్నా లేకపోయినా పట్టించుకోలేదు. ఆరోగ్యం బాగున్నా, లేకున్నా, మాత్రలు ఉన్నా, లేకున్నా, అది అడవి ప్రాంతమైనా, పట్టణ ప్రాంతమైనా అవి అన్నీ ఆయనకు మామూలు విషయాలు. అంతగా లెక్కించగలిగినవి కావు. కాని అసలు లెక్క ఒక్కటే. అది కొప్పుల నాగరాజు తన కథనం రాయడమే. తన కథనాలతో పత్రిక యొక్క మనుగడను బహుముఖ విధాలుగా పెంచిండు. మొత్తానికి

పత్రిక యొక్క దృక్కోణాన్ని వైవిధ్యత మరియూ నేటివిటీల వైపు నడిపించిన ఘనత నాగరాజుకు దక్కుతుంది.

నాగరాజు మరణం తర్వాత ఆయన జ్ఞాపకార్థంలో భాగంగా మీడియాలో కులం చేసే విధ్వంసపు రాజకీయాల గురించి అనేక కోణాలలో చర్చలు జరిగాయి. ఇందులో భాగంగా ప్రముఖులు 'కొప్పుల నాగరాజు ఓ కలం యోధుడు, జర్నలిజానికే ఓ  ఐకాన్ అయ్యాడు, మాదిగ జాతిలో పుట్టిన నాగరాజు ప్రాథమిక చదువు నుండి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకొని అంచెలంచెలుగా ఎదుగుతూ ఆంగ్ల పత్రికలో పని చేశాడని అభిప్రాయపడ్డారు. ఆయన పేరుతో ప్రతి ఏటా ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఏర్పాటు చేయాలని, పుట్టిన ఊరు సారపాకలో నాగరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి' అని సూచించడంలో నాగరాజు కృషి ఇంగ్లీషు మీడియాలో, ప్రత్యేకంగా న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో అది ఎలాంటిదో రూఢి అయింది.

ఒక మాదిగ విద్యావంతుడుగా కొప్పుల నాగరాజును గూర్చి నేను గమనించిన ప్రత్యేకతలను ఇక్కడ చర్చించడం అవసరమనుకుంటున్నాను. దళితులు ఎంత కష్టపడినా సరే వెట్టి చేసేవారుగా, శారీరక, మానసిక శ్రమల దోపిడికి గురయి ఎదుగు బొదుగు లేని వారుగా, చదువు లేని వారుగానే ఎక్కువగా మిగిలిపోతారు. నాగరాజుకు మాత్రం ఈ చదువు, విజ్ఞానం వాటం ఎట్లా నెత్తికెక్కిందో ఏమో ఎన్ని అడ్డంకులొచ్చినా ఉన్నత చదువును వదలలేదు. 'చదువుకోసమే బతికిండు, బతుకు తెరువు కోసం చదువలేదు' అనిపిస్తుంది. అందుకే ఒక పెయింటర్‌గా, ఒక జర్నలిస్టుగా ఉంటూనే ఒక ఐఏయస్‌ను కావాలని అనుకున్నాడు. నాగరాజు కేవలం బ్రతుకుతెరువు చూసుకోవాలంటే చిన్ననాడే ఐస్‌క్రీమ్‌లు అమ్మితే వచ్చిన పైసలతోనే సరిపెట్టుకునే వాడేమో? సైన్‌బోర్డులు రాస్తే వచ్చే పైసలతో సరిపెట్టుకునేవాడేమో? అదే జరిగుంటే నాగరాజు అత్యధిక మంది దళితుల్లా శారీరక శ్రమచేసే కార్మికుడిగానో, కూలిగానే ఉండిపోయేవాడు. కాని అలాంటి 'పైసల భద్రత' అనే పరిమిత అలసత్వంలోకో, తాత్కాలిక వ్యక్తి భద్రతలోకో జారిపోలేదు. నిరంతర చలనశీలిగా తన భవిష్యత్తును ఉన్నత చదువుల వైపు కదపడంలో నాగరాజు ప్రత్యేక తపన కనిపిస్తుంది. ఎంతంటే 'అస్తులను, డబ్బులను ఎన్నింటినైనా వదులుకోవచ్చు కాని ఉన్నత చదువు అవకాశాన్ని మాత్రం అస్సలు వదులుకోవద్ద'ని అంబేద్కర్ చెప్పింది మనకు యాదికి వచ్చేంత వరకు. నాగరాజులోని ఈ గుణాన్నే నాతో సహా అందరూ ఇష్టపడ్డారు. ఈ లక్షణం నాగరాజుతోనే ఆగిపోకూడదని చాలా మంది స్కాలర్స్ మనసారా కోరుకుంటున్నారు. ఆ లక్ష్యం సమాజంలోని యువతలో, ప్రత్యేకంగా బహుజన సమాజంలోని అట్టడుగు మాదిగ, మాల, వారి బంధు కమ్యూనిటీస్‌లోని కొత్త తరానికి జీవన సరళిగా, జీవదారుగా, జీవిత లక్ష్యంగా రావాలని కొరుకోవాలి.

నాగరాజు ఆరోగ్యం గూర్చి తాను రాసుకున్న డైరి ప్రకారం నాకు తట్టిన ఆలోచనలు ఇక్కడ పంచుకోవడం అవసరం అని  అనుకుంటున్నాను.

బహుజనుల్లోని మాల, మాదిగలు, వారి బంధు కమ్యునిటీల ప్రజలు సమాజానికి వివిధ రూపాల్లో పని, సేవా చేసి ఎంత ముందుకు నడిపిస్తున్నారో అంత స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యరంగం నుండి సేవలను పొందలేకపోతున్నారని ఖచ్చితంగా చెప్పొచ్చు. ఈ ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యరంగాలు బహుజనుల ఆరోగ్యం పట్ల దుర్మార్గపు వ్యాపార ధోరణినే అవలంబించడం ఒక వైపు ఉంటే, ఆరోగ్యపు స్పృహ, 'ఆరోగ్యం అనేది ఒక హక్కు'గా భావించి దానిని పొందాలనే స్పృహ కూడా బహుజనులకు అంతగా లేదేమో అనిపిస్తుంది.

నాగరాజు ఆరోగ్యం విషయంలో చూసినట్లయితే మొదట తన శరీరంలో వస్తున్న మార్పులను అంతగా గమనించుకోలేక పోయిందనిపిస్తుంది. ఒక వేళ గమనించినా వైద్యుల్ని సంప్రదించడంలోనూ, రెండు, మూడు వైపుల నుండి సలహాలు తీసుకుని వ్యాధిని సరిగ్గా గుర్తించి నిర్ధారించుకోవడంలోనూ అప్రమత్తత ఉన్నట్లు కనిపించదు. తాను రాసే ప్రత్యేక ఇంగ్లీషు కథనాలలో కనపర్చిన నిశితమైన పరిశీలన, బహుముఖ కోణాల్లో పరిశీలించి రాసే తత్వం నాగరాజు తన ఆరోగ్యం విషయంలో కనబరచలేక పోయిండేమో అనిపిస్తుంది. ఇంత ప్రమాదకరమైన జబ్బు వస్తుందని ఎన్నడూ ఊహించకపోవడానికి కారణం తన మనుసు, మనో దైర్యం మీద ఉన్నంత నమ్మకం తన ఆరోగ్యం, శరీరం మీద కూడా ఉండడమే. ఈ తత్వం చాల మంది మాల, మాదిగల్లో ఉంటుంది. 'నా శరీరం చాలా గట్టిది.  నాకు రాళ్లు తిని అరిగించుకునె సత్తా ఉన్నది' అన్న ధైర్యాన్ని, నమ్మకాన్ని కలిగి ఉండడం జరుగుతుంది. అధిక శాతం నిరక్ష్యరాస్యులైన మాల, మాదిగ, బంధు కమ్యునిటీల ప్రజల గూర్చి ఇక్కడ మాట్లాడడంలేదు. చదువుకున్న కొద్దిమంది విద్యావంతులలో, ఉద్యోగులలో ఈ తత్వం చాలామార్లు మొండి ధైర్యంగా, గుడ్డి నమ్మకంగా మారిపోతుంది. ఆహారపు అలవాట్లలో వస్తున్న మౌలిక మార్పులు, వాతావరణంలో వస్తున్న అంతువట్టని మార్పులను గమనించి నడుచుకోకపోవటం వల్ల చాలా నష్టం జరుగుతోంది.

నాగరాజు విషయానికొస్తె అంతకు ముందు తనకు ఇష్టమైన పూరీల్లాంటివి తింటే సహించక పోవడం లాంటి మార్పులను పెద్దగా పట్టించుకోకుండా  తేలిక ఆహారం తీసుకుంటూ ఉండిపోయి జబ్బు మీరిందాక డాక్టరును సంప్రదించలేదు. ఒక సారి తన సొంత ఊరికి ప్రయాణమై మార్గమధ్యంలో సూర్యపేటకాడ ఎదలో తట్టుకోలెనంత తీవ్రమైన నొప్పి వచ్చినప్పుడు ఇంక అక్కడే బస్సు దిగి హాస్పిటల్‌కు వెళితే వైద్యుడు పరీక్షించి వైద్యపరీక్షలు చేయించమని చెప్పాడు. అట్లా టీబి ఉన్నదేమోనని ఉమ్మి పరీక్ష చేయించమని చెప్పడంతో ఎర్రగడ్డలోని చెస్ట్ దవాఖానను సంప్రదించాడు.. అక్కడ చేయించిన పరీక్షల్లో టీబి రిపోర్టులో ఎక్సరే  స్పష్టంగా రాలేదు. ఉమ్మి అయితే నెగెటివ్ అని స్పష్టంగానే వచ్చింది. అయినప్పటికి నాలుగయిదు నెలలపాటు టీబి తగ్గడం కోసం నాగరాజు మందులు వాడాడు. ఆ మందులు మింగడం ఎంతో కష్టతరమైనప్పటికీ క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడాడు. రోగం ఒకటుంటే మందు మరొకటి తీసుకోడం వల్ల నాగరాజుకు ఎక్కువ నష్టమే జరిగింది. అవి వాడినప్పుడు కడుపులో విపరీతమైన నొప్పి కలిగేది కాని జబ్బు తీవ్రత తగ్గకపోవడంతో క్యాన్సర్ హాస్పిటల్‌ని సంప్రదించాడు. అప్పటికే లివర్ క్యాన్సర్ నాలుగవ దశకు అంటె తీవ్ర స్థాయికి చేరింది. సరైన సమయంలో వైద్యం అందితే ఇంకొంత కాలం నాగరాజు జీవించేవాడు.

నాగరాజు జర్నలిస్టుగా పనిచేసిన న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక అతడి పట్ల దుర్మార్గమైన పక్షపాతిగా ప్రవర్తించింది. ఇక్కడ రెండు అంశాలను స్పష్టంగా చెప్పాల్సి ఉంది. ఒకటి క్యాన్సర్ జబ్బు తనను పీడిస్తుందని తెలియకుండా, దానికి సంబంధంలేని టీబి మందు వాడుతున్న అయోమయ పరిస్థితుల్లో, నాగరాజు ఫీల్డులో తిరిగె ఓపిక లేక, వైద్యం చేయించుకుంటూ విశ్రాంతి తీసుకుందామని సెలవు అడిగిండు. అయితే  న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక  రెసిడెంట్ ఎడిటర్ నాగరాజు అడిగిన సెలవును తిరస్కరించాడు. రెండు కాన్సర్ అని నిర్ధారణ అయినంక  రేడియేషన్ మరియూ కీమోథెరపి తీసుకుంటున్న అత్యంత బాధాకరమైన పరిస్థితుల్లో అదే పత్రికా మేనేజ్‌మెంట్ తన సిబ్బంది లిస్టులోనుండి కొప్పుల నాగరాజు పేరును తొలగించింది. ఈ విషయం తెలిసిన నాగరాజు ఎంతో మనస్తాపానికి గురయ్యాడు. ఒక జర్నలిస్టుకు ఉండాల్సిన కనీస హక్కులను గుర్తించలేదు, తమ సిబ్బందిలోని ఒక వ్యక్తికి, ఒక జర్నలిస్టుకు, ఒక సృజనాత్మక జర్నలిస్టుకు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను ఇవ్వాలనే స్పృహ వీరిలో లోపించింది. అంతే కాక నాగరాజు దళిత మాదిగ కనుక కుల వివక్షతను చూపిందనే నిర్ధారించవచ్చు. 'సమాజం మీద భావజాల నియంత్రణను, పెత్తనాన్ని చెలాయిస్తున్న బ్రాహ్మణాధిపత్య పోకడలు యధావిధిగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో కూడా కొనసాగుతున్నాయి' అనే వాస్తవం తెలిసిన వారు నాగరాజు కొరకు ఈ పత్రికా సహాయం చేస్తుందని, బాధ్యత వహిస్తుందనీ ఏమాత్రం ఆశించక పోవచ్చు. కాని రాజ్యాంగం ప్రకారం ఉద్యోగి అయిన కొప్పుల నాగరాజుకు వర్తించే మానవ హక్కుల సంగతేమిటి?  న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక మేనేజ్‌మెంట్ నాగరాజుకు దక్కాల్సిన హక్కుల విషయంలో ఘోర ఉల్లంఘునకు పాల్పడుతున్నదనేది అస్సలు  సమస్య.

ఆధునిక మీడియా, ప్రత్యేకించి న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రస్ యాజమాన్యం మధ్యయుగాల మనువాదాన్ని ఆచరిస్తే ఎట్ల? ఇక్కడ నాగరాజును రెండు క్యాన్సర్లు నమిలి తిన్నాయా అనిపిస్తుంది.. అవి లివర్ క్యాన్సర్ మరియు బ్రాహ్మణీయ కులం క్యాన్సర్. అందుకే అభద్రతా, అనిశ్చిత పరిస్థితుల నుండి, విషవలయాల నుండి, చీకటి అగాధాల నుండి నాగరాజును కాపాడుకునే ప్రయత్నం, తపన ఒక ఉద్యమ స్థాయిలో నడవాల్సి ఉండింది. పత్రిక దొరతనం, కాపిటలిస్టు (మనువు) పెత్తనం మీదికి కూడా ఈ పోరాటాన్ని ఎక్కుపెట్టడం అనివార్యమవుతుంది.  ఈ నేపథ్యంలోనే దళిత హక్కులు, మానవ హక్కుల స్పృహతో బ్రాహ్మణీయ కులం వేళ్లను పెకిలించడం కూడా తప్పని సరి.

బహుజనుల నుండి కొత్త తరంగా ఎదిగి వస్తున్న జర్నలిస్టులను నాగరాజును కోల్పోయినట్లు కోల్పోకూడదు. ఆరోగ్య, ఆర్థిక వివక్షలాంటి సమస్యల నుండి బయట పడె పద్ధతులు, నిర్మాణాలను వివిధ స్థాయిల్లో రూపొందించు కోవల్సిన అనివార్య పరిస్థితి నాగరాజు జీవితం రూపంలో పుస్తకమై మనముందు నిలిచింది.

**గోగు శ్యామల అన్వేషిలో సీనియర్ రీసెర్చ్ ఫెలో**

# నల్ల జాతీయులను చేర్చుకున్న అమెరికన్ మీడియా; దళితులను వెలివేసిన భారతీయ మీడియా

■ చంద్రభాన్ ప్రసాద్

30 ఏళ్ళు జర్నలిస్టుగా పనిచేసిన తర్వాత అకస్మాత్తుగా నేను తెలుసుకొన్న దేంటంటే ఇన్ని సంవత్సరాల్లో ఒక్క దళిత జర్నలిస్టును కూడా నేను కలవలేదని తన ప్రభావంతమైన వ్యాసం "ఇన్ సెర్చ్ ఆఫ్ ఎ దళిత్ జర్నలిస్టు"లో బి.ఎన్. ఉనియాల్ రాసాడు. ఆయన ఈ వ్యాసం రాయటం కోసం అన్ని సమచార మూలాలను వెతుకుతూ, చివరికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వారి అక్రిడిడేషన్ ఇండెక్స్‌లో కూడా వెతికాడు. కానీ ఢిల్లీ మొత్తంలో ఒక్క దళిత జర్నలిస్టుని కూడా కనుక్కోలేక పోయాడు.

ఏది ఏమయినా ఆయన చేసిన పనిని ఢిల్లీ పత్రికారంగం పట్టించుకోలేదు. ఏ ఒక్క సంపాదకుడు కానీ, కాలమిస్ట్ కానీ 2 కోట్ల జనాభా ఉన్న ఢిల్లీలో ఒక్క దళిత జర్నలిస్టు కూడా ఎందుకు లేదు అని ఆశ్చర్యపోలేదు. ఉనియాల్ వ్యాసం ద్వారా ప్రేరణ పొందిన మేము ఢిల్లీ పత్రికారంగంతో వాదించటం మొదలుపెట్టాం. మమ్మల్ని చూసి అందరూ గేలి చేసేవారు: "ఈ అతివాద అంబేద్కరైట్లను చూడండి. ఇప్పుడు వీరికి మీడియాలో కూడా రిజర్వేషన్ కావాలి"అని.

దళితులను (వర్ణ) మీడియా నుండి వెలివేయడం అనేది అతి తీవ్రమయిన అంటరానితనమని మాకు ఎప్పుడూ అనిపించేది. మేము అలా రాజధానిలోని మేధావుల వీధుల్లో తిరుగుతూ శ్రేయోభిలాషుల కోసం చూస్తూ ఉంటే ఢిల్లీలో స్థిరపడి ఒక ప్రముఖ అమెరికన్ దినపత్రికతో పని చేస్తున్న ఒకపెద్ద కళ్ళ తమిళ అమ్మాయి మమ్మల్ని ఆశ్చర్యపరుస్తూ అమెరికన్ మీడియాలో నల్లజాతి వారికి మరియు ఇతర తెగల వారికి రిజర్వేషన్ లాంటి పాలసీ ఉందని చెప్పింది.

అమెరికన్ మీడియా గురించి ఆ పొడుగాటి మేధావి చెప్పిన అన్ని విషయాలను నమ్ముతూ రాసుకున్నాం. అలాగే మా లక్ష్యం పట్ల లోతైన అవగాహన కలిగిన ఒక పొట్టి మేధావి స్త్రీ దానిని టైప్, చేసి ఎడిట్ చేసింది. అలా వచ్చిందే "భారతీయ మీడియాలో వర్ణ వివక్షను అంతం చేయండి, జాతి అభిప్రాయాన్ని ప్రజాస్వామీకరించండి" పేరుతో మేము ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా మరియు ప్రెస్ కౌన్సిల్‌కు సమర్పించిన మెమోరాండం.

'దళిత డైరీ' కాలమ్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావిస్తాను. పాఠకులు స్వయంగా తామే ఈ దేశ సంపాదక వర్గ చిత్తశుద్ధి గురించి ఒక నిర్ణయానికి రావచ్చు.

1922లో స్థాపించబడ్డ అమెరికన్ వార్తా పత్రికల సంపాదకుల సంఘం (ANSE) అతి పెద్ద సంపాదకుల సంస్థ. 1975లో అమెరికన్ మీడియా వ్యవస్థలో నల్లవారు, ఇతర జాతులవారు కేవలం 3.95 శాతం మంది మాత్రమే ఉన్నారని కనుక్కొన్నది ఆ సంస్థే. 1978లో జరిగిన వార్షిక సమావేశంలో జాతి వివక్ష, వెలివేతల గురించి చాలా లోతుగా, తీవ్రంగా చర్చించారు. ఆ సమావేశంలో ఏకగ్రీవంగా "ఇయర్ 2000 గోల్" అనే తీర్మానాన్ని ఆమోదించారు. 2000 సంవత్సరం వచ్చేసరికి అమెరికా పత్రికారంగంలో నల్లవారి ప్రాతినిధ్యం వారి జనాభాతో సరితూగేంతగా చేయాలని నిర్ణయించారు.

దీనిని చేరుకోవడానికి వార్తా పత్రికలు వారి సంస్థల్లో 'భిన్నత్వ' విభాగాలను తెరవాలని; నల్లవారికి మరియు ఇతర జాతుల వారికి పాత్రికేయ వృత్తిలో ఉపకార వేతనం, శిక్షణ ఇవ్వాలని; ఉద్యోగ మేళాల్లో వారిని సంస్థల్లో చేర్చుకోవాలని; అలాగే ప్రతీ సంవత్సరం పత్రికా సంస్థల్లో జాతుల జనాభా లెక్కల్లో పాల్గొనాలని నిర్ణయించారు.

దీని వలన అద్భుతాలు జరిగాయి: సభ్యులైన 1446 వార్తా పత్రిక సంస్థలలో, 950 ANSE తీర్మానాలను ఆమోదించాయి. వాటిలో లక్షకు పైగా రోజువారీ సర్కులేషన్ ఉన్న దిన పత్రికలు కూడా ఉన్నాయి. ఈ రోజు వాటిలో 11.64 శాతం ప్రాతినిధ్యం నల్లవారిదీ మరియు ఇతర తెగల వారిది. 1978–1998ల మధ్యలో ఈ జర్నలిస్టుల సంఖ్య 270 శాతం పెరిగింది. చిన్న సంస్థల కంటే కూడా పెద్ద సంస్థలు దీని పట్ల ఎంతో నిబద్ధతను చూపించాయి. 2001లో ANSE చేసిన సర్వే ప్రకారం:

పేరు : సర్కులేషన్ : నల్లజాతి వారు/ఇతర జాతుల వారు

వాల్ స్ట్రీట్ జర్నల్ : 17.52 లక్షలు : 17.1 శాతం

యు.ఎస్.ఎ టుడే : 17.58: 18.7

న్యూయార్క్ టైమ్స్ : 11.32: 16.2

లాస్ ఏంజెలెస్ టైమ్స్ : 10.80: 18.7

వాషింగ్‌టన్ పోస్ట్ : 07.75 : 19.5

ఈ కింది ఉదాహరణ ప్రకారం చూస్తే ANSE నల్లజాతి మరియు ఇతర జాతుల వారికి సంబంధించిన అతి చిన్న విషయాన్ని కూడా నమోదు చేస్తుందని అర్థమవుతుంది.

హోదా/పదవి: నల్లజాతి మరియు ఇతర తెగల వారి శాతం

సూపర్ వైజర్స్: 13,728 (9.10 శాతం)

కాపీ/లేఔట్ ఎడిటర్స్ : 10,901 (10.20)

రిపోర్టర్స్ : 25,593 (12.70)

ఫోటోగ్రాఫర్స్ : 6,171 (15.40)

మొత్తం కలిపి : 56,393(11.63)

ANSE తమ లక్ష్య ప్రకటనలో భాగంగా అన్ని వర్గాల గురించి పూర్తి వార్తా సేకరణ చేస్తామనీ, ప్రజాస్వామ్యంలో తమ పాత్ర పోషిస్తామనీ, ప్రజాస్వామ్య మార్కెట్ వ్యవస్థలో సఫలీకృతం అయ్యేందుకు తమ వార్తా కార్యాలయాల్లో అమెరికన్ సమాజంలోని జాతుల విభిన్నతను ఉట్టిపడేలా చేస్తామని పేర్కొంది. 2025 వరకు నల్లజాతి వారి మరియు ఇతర తెగల వారి జనాభా 38 శాతానికి చేరుకుంటుందనీ, ఆ సమయానికి వీరి సిబ్బంది నియామకాలను 229 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మరోవైపు చూస్తే భారతదేశంలో పరిస్థితి ఏమిటి? అక్కడ నల్లజాతి వారు, వేరే తెగల వారు 11 శాతం ఉంటే ఇక్కడ మనకు కనీసం 11 మంది దళిత జర్నలిస్టులయినా తెలుసా, ఈ వర్ణ మీడియాలో? ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ANSE వలే ఏదయినా కార్యక్రమాన్ని చేపట్టే ప్రయత్నం చేసిందా?

అమెరికన్ దినపత్రికలతో పోల్చి చూస్తే మన దేశపు వర్ణ వార్తా పత్రికలు విశ్వసనీయతలో కానీ, విషయంలో కానీ, సంపాదనలో కానీ, తీరుతెన్నుల్లో కానీ, కొత్తగా తెరవబోతున్న టెంట్ హౌస్‌లు, లేదా గ్రోసరీ షాపుల గురించి వచ్చే కరపత్రాల్లా ఉంటాయి. చాలా మంది వర్ణ మీడియా సంపాదకులు అమెరికన్ దినపత్రికల్లో, 'శిక్షణ కోసం' చేరినా సరే పని చెయ్యడానికి ఇబ్బంది పడతారు.

అయినప్పటికీ సందేహాస్పద మేధావితనం, చిత్తశుద్ధి గల ఈ సంపాదకులు ప్రతిభను ఉటంకించి, దళితులు మీడియాలోకి రాకుండా ఆపాలని మాట్లాడతారు. ఈ సంపాదకులు విదేశీ వార్తా పత్రికలు ఈ దేశంలోకి రావడం గురించి ఎందుకు వ్యతిరేకించలేదో ఆలోచిస్తూ......

*(ఈ కాలమ్‌ను రామలక్ష్మి మరియు మీనాక్షి నాథ్‌కు అంకితం చేస్తున్నాను.)*

ఈ వ్యాసం మరో రూపంలో చంద్రభాన్ ప్రసాద్, 2004లో, దళిత డైరీ, రిఫ్లెక్షన్స్ ఆన్ అపార్థెడ్ ఇన్ ఇండియా, పాండిచ్చేరి, నవయానా (www.ambedkar.org from:http://www.ambedkar.org/chandrabhan/Blacksin.htm)లో ప్రచురింపబడింది

**అనువాదం: నవదీప్**

చంద్రభాన్ ప్రసాద్ సీనియర్ జర్నలిస్టు,
ఢిల్లీలో నివాసి

# సారా వ్యతిరేక ఉద్యమం, మద్యనిషేధం: ఈనాడు పత్రిక వ్యూహాత్మక సమర్ధన, మౌనం

■ ఉమా మహేశ్వరి భృగుబండ

1990ల మొదటి భాగంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కుదిపేసిన సారా వ్యతిరేక ఉద్యమంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఈనాడు దిన పత్రిక ఎవరూ ఊహించని, సంచలనాత్మక పాత్ర పోషించింది. అప్పుడప్పుడే అక్షరాస్యులవుతున్న నెల్లూరు జిల్లాలోని దూబగుంట గ్రామ స్త్రీలు తమ గ్రామంలోకి సారా తెస్తున్న ఎక్సైజు జీపుపై దాడి చేయటంతో సారా వ్యతిరేక ఉద్యమం రాజుకుంది. తమ నెల్లూరు జిల్లా సంచికలో ఈ సంఘటనలని గురించి రాసిన మొదటి వార్తా పత్రిక ఈనాడు. ఈ వ్యాసంలో నేను ఎ) ఒక ప్రాంతీయ వార్తా పత్రికగా ఈనాడు చరిత్రని పరిశీలించటం బి) సారా వ్యతిరేక ఉద్యమంలోను, తరువాత సారా నిషేధంలో ఈనాడు పోషించిన పాత్రని లిఖించటం, పోరాటంపై దినపత్రిక రచనల ప్రభావాన్ని గురించి చర్చించటానికి ప్రయత్నించాను.

ఈనాడు సమీక్షల్లో వచ్చే స్వాభినందనలతో కూడిన వ్యాసాలను గమనిస్తే తనను తాను ఒక సామాజిక, రాజకీయ ధర్మ యుద్ధ వీరుడిలా చూసుకుంటుందని అర్థమవుతుంది. ఒక వ్యాసంలో పత్రిక సంపాదకులు రామోజీరావు 'ఈనాడు కేవలం రిపోర్టు చెయ్యటమే కాక రాజకీయ, సామాజిక సమస్యలను పరిష్కరించేదిగా ఉండాల' అన్నట్లు పేర్కొంది. అక్షరాస్యతా ఉద్యమం, మధ్య నిషేధ ఉద్యమం, వినియోగదారుల ఉద్యమం, పొదుపు ఉద్యమాల వంటి అనేక ప్రజా ఉద్యమాలలో పెద్ద పాత్ర పోషించినట్లు కూడా ఈ పత్రిక చెప్పుకున్నది.

1992లో అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్త్రీలు చేపట్టిన సారా వ్యతిరేక ఉద్యమం సామాజిక ఉద్యమాలలో అపూర్వమయింది. అద్వితీయమయింది. 1920, 1930లలో ఆంధ్రా ప్రాంతంలోని స్త్రీలు గాంధీ యుగంలో సారా వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నప్పటికీ, ఇప్పటి వరకూ వారి నాయకత్వంలో దీర్ఘ కాల సారా వ్యతిరేక ఉద్యమం రాలేదు. 1930లలో ఈ పోరాటానికి అనేక అంశాలు తోడ్పడ్డాయి...1992లో వచ్చిన ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవటం కొరకు సారాను పెద్ద ఎత్తున ప్రోత్సహించటం ప్రధాన కారణం. సారా ఉత్పత్తిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి గుత్తాధిపత్యం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సారా అమ్మకాల నుండి వచ్చే ఆదాయం మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే చాలా ఎక్కువ. అయితే కంచ ఐలయ్య వాదించినట్లు, రాష్ట్ర ఆదాయం కాకుండా దీని అమ్మకాల నుండి "2500 కోట్ల కనిపించని, లెక్కలలోకి అందని ఆదాయం కూడా వస్తుంది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి 25 పైసల ఆదాయానికి, కాంట్రాక్టర్లకి 75 పైసల ఆదాయం వస్తుంది. ఇటువంటి పెద్ద ఆదాయం నుండి కొంత భాగం రాజకీయ పార్టీలకి పార్టీ నిధుల రూపంలో చేరుతుంది." సారా తాగటం ఎక్కువ గ్రామీణ ప్రాంతాలలో కేంద్రీకృతమయింది. తాము సంపాదించేదాని కన్నా పేద ప్రజలు సారాపై ఖర్చు పెడుతున్నారన్నమాట. దీని వల్ల స్త్రీలపై హింస, కుటుంబాల్లో ఆకలి, పస్తులుండటం, పిల్లలు చదువుకోలేక పోవటం ఎక్కువయ్యాయి.

ఉత్తర తెలంగాణా జిల్లాల్లో 1980ల నుండి సిపిఐ (ఎమ్.ఎల్) పార్టీలు, పీపుల్స్ వార్‌తో సహా సారాకి, మద్యానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతూనే ఉన్నారు. అయితే, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో 'అక్షర జ్యోతి' అనే అక్షరాస్యతా పథకం అనేక మంది గ్రామీణ స్త్రీలని ఒక దగ్గరికి తెచ్చింది. ఈ కొత్త అక్షరాస్యులే సారాకి వ్యతిరేకంగా పోరాటం చెయ్యటానికి సిద్ధమయ్యారు. జన విజ్ఞాన వేదిక అనే విజ్ఞాన వేదిక ఈ నేపథ్యంలో కీలక పాత్ర పోషించిందని మనం గుర్తుంచుకోవాలి. అనేక గ్రామాలలో స్త్రీలు బృందాలుగా ఏర్పడి పురుషులని సారా దుకాణాలకి వెళ్ళకుండా భౌతికంగా అడ్డుకున్నారు; సారా కాంట్రాక్టర్లని, అమ్మే వారిని బహిరంగంగా నిలదీశారు. సారా దుకాణాలపై దాడి చేసారు, సారా పాకెట్లకి, పీపాలకి నిప్పు పెట్టారు. సారా ఆక్షన్లు జరగకుండా అడ్డుకున్నారు. నెల్లూరు జిల్లాలోనే 36 సార్లు ఆక్షన్లని ఆపారు. అన్ని జిల్లాలలో కూడా ఇదే జరిగింది. అనేక మంది స్త్రీలని అరెస్టు చేసి పోలీసులు వారిపై బూటకపు కేసులు బనాయించారు. పోరాటంలో పాల్గొన్న స్త్రీలు రెవిన్యూ అధికారులు, పోలీసులు, సారా కాంట్రాక్టర్ల బలమైన కూటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది.

#### వార్తా ప్రసారం

1992 ఏప్రిల్ నెలలో అయ్యవారిపాలెం, సాయిపేట గ్రామాలలో స్త్రీల సారా వ్యతిరేక పోరాటం గురించి ఈనాడు పత్రిక వార్తలు రాసింది. తమ జిల్లా సంచికలో ఈ పోరాటం గురించి విస్తృతంగా రాసి ఉద్యమం అనేక గ్రామాలకి వ్యాపించటంలో ఈనాడు కీలక పాత్ర పోషించిందని చెప్పాలి. 1992 జూన్ నాటికి నెల్లూరు జిల్లాలోని అనేక గ్రామాలకి ఈ ఉద్యమం వ్యాపించింది. అయితే, జులై వరకు ఈ వార్తలన్నీ నెల్లూరు జిల్లాకే పరిమితమయ్యాయి. 18 జులైతో మొదలయ్యి 1993 అక్టోబర్, 1993 ఏప్రిల్ మధ్యలో ఈనాడు సారా వ్యతిరేక ఉద్యమానికి విస్తృతమైన కవరేజ్ ఇచ్చింది. 1992 అక్టోబర్లో సారా వ్యతిరేక ఉద్యమం కోసం 'సారా పై సమరం' అనే ప్రత్యేక పేజీనే ప్రారంభించింది. ఆ పేజీలో ఉద్యమం పురోగతి, రాజకీయ పార్టీల, వివిధ ఆందోళనకారుల స్పందన, కల్తీ సారా వల్ల సంభవిస్తున్న మరణాలు మొదలైన వాటిపై మాత్రమే వార్తలు వచ్చేవి. అయితే సారా వ్యతిరేక ఉద్యమంపై వార్తలు కేవలం ఈ పేజీలో మాత్రమే వచ్చేవి కావు. వార్తా పత్రిక మొదటి పేజీల్లో, నగర పేజీల్లో, వసుంధర స్త్రీల పేజీల్లో కూడా ప్రముఖంగా ప్రచురించబడేవి. ఆరు నెలలపాటు ఈనాడు దిన పత్రికలో వచ్చిన వివిధ నివేదికలు, వార్తల వివరాలు ఈ కింద చూడొచ్చు.

1. ప్రజలని పోరాటానికి పురికొలుపుతూ, మద్యాన్ని, సారాని నిషేధించాలని ప్రభుత్వానికి అభ్యర్థనలు, హెచ్చరికలు జారీ చేస్తూ మొదటి పేజీల్లో అనేక సంపాదకీయాలు ఈ ఆరు నెలల్లో వచ్చాయి.

2. 'ఇదీ సంగతి' పేరుతో శ్రీధర్ వేసే రాజకీయ కార్టూను ఈ సమయంలో ఆపేశారు. దాని స్థానంలో శ్రీధర్ సారాంశం (పదంలో శ్లేషని బాగా వాడుకుని) అనే కొత్త కార్టూను ప్రారంభించి ప్రభుత్వం సారాపైన నిషేధం విధించే వరకు కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేసాడు. ఏప్రిల్ 1993లో నిషేధం విధించే వరకు ఇది కొనసాగింది.

3. కల్తీ సారా వల్ల, తాగి వాహనాలు నడపటం వల్ల సంభవించిన మరణాల గురించి పూర్తి వివరాలతో వార్తలు వచ్చాయి.

4. అలాగే సారా వ్యతిరేక ఉద్యమాన్ని సమర్థిస్తూ వచ్చిన అన్ని ప్రకటనల గురించి వివరంగా వార్తలు వచ్చాయి. వీటిలో బిజెపి, టిడిపి వంటి రాజకీయ పార్టీలు, విరసం, అరసం వంటి వామపక్ష సాహితీ సంస్థలు, ప్రగతిశీల మహిళా సంఘం వంటి స్త్రీల సంఘాలు, ఆర్ఎస్ఎస్ వంటి మితవాద రాజకీయ సంస్థలు ఇచ్చిన ప్రకటనలు ఉన్నాయి.

5. ఈనాడు పత్రిక వసుంధర స్త్రీల పేజీలో, మహిళా శాసన సభ్యులతో ఉద్యమం గురించి ఇంటర్వ్యూలు వచ్చాయి. సినిమా పేజీలో 'సారాపై సినిమా తారలు' అనే కొత్త శీర్షికతో వార్తలు ప్రచురించారు. మత నాయకులు, ఇస్కాన్ వంటి మత సంస్థలు ఉద్యమాన్ని సమర్థిస్తూ ఇచ్చిన ప్రకటనలు కూడా వచ్చాయి. ఎప్పుడూ ఒక దగ్గరికి రాని అనేక మందిని ఆశ్చర్యకరమైన రీతిలో దగ్గరికి తెచ్చి ఈనాడు పత్రిక మద్యానికి, సారాకి వ్యతిరేకంగా నైతిక సమర్థతని కూడగట్టింది. (అయితే, స్వతంత్ర నివేదికల వల్ల మనకి తెలిసింది ఏమిటంటే, ఉద్యమంలో స్త్రీలు ఎప్పుడూ దీనికొక నైతిక అంశంగా చూడలేదు)

6. హృద్రోగ నిపుణులు, నరాల వ్యాధుల నిపుణులు, గైనకాలజిస్టులు, ఉదర వ్యాధుల నిపుణులు అనేక మంది మద్యం సేవించటం వల్ల కలిగే చెడు ఫలితాల గురించి సాధికారికమైన వైద్యపరమైన సాక్ష్యాలు అందచేసారు.

7. సారా కథలు అన్న కొత్త శీర్షిక ప్రారంభించారు. సారా, మద్యం వల్ల నాశనమైన కుటుంబాలు, వ్యక్తుల గురించి చలించిపోయే కథనాలను ఈ శీర్షికలో ప్రచురించేవారు. చాలా వరకు కథనాలు తాగుబోతు భర్తల చేతిలో హింసకు గురైన స్త్రీల గురించే. 'పచ్చని సంసారంలో నిప్పులు పోసిన సారా' వంటి కాప్షన్లతో ఈ వార్తలు వచ్చేవి. సారా దుకాణాల్లో పని చేసే పిల్లల బాధలు; తాగి పిచ్చి వాళ్ళయిపోయిన ప్రేమికులు; మద్యం మైకంలో జరిగిన ఆత్మహత్యలు, హత్యలు, సారా కోసం పిల్లల్ని అమ్మేసిన తండ్రులు అందరి గురించిన కథనాలు వీటిలో ఉండేవి. మద్యం వల్ల జరిగిన విషాదాల గురించి వచ్చిన వ్యాస సంకలనం సారా-సారో పుస్తక ఆవిష్కరణ గురించి కూడా వార్తలు ఉన్నాయి.

8. ఈనాడు నగర సంచికలో రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్ళు, బస్సు స్టాండులు వంటి బహిరంగ ప్రదేశాలలో ఎక్కువవుతున్న తాగుబోతుల బెడద గురించి అనేక వార్తలు వచ్చాయి. 'బార్లుగా తయారవుతున్న స్థానిక రైళ్ళు; అనే ఒక వార్త (అక్టోబర్ 10, 1992); పబ్లిక్ గార్డెన్స్, ఇందిరా పార్క్, సంజీవయ్య పార్క్ వంటి పబ్లిక్ పార్క్‌లు పాప పంకిలాలుగా మారుతున్న విధాన్ని 'పార్కులు కావవి పాపకూపాలు' అన్న వార్త (అక్టోబర్ 9, 1992) తెలియచేసాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య సారా, మద్యం అని ఈనాడు చూపాలనుకున్నదనేది నిర్వివాదాంశం. ఉద్యమాన్ని గురించి వార్తలు రాయటమే కాక ఈ దినపత్రిక ఆందోళనకారులని సమన్వయపరచి, వారికి దారి చూపి, వారికి కావాల్సిన జెండా, ప్రతిజ్ఞలు, పాటలు వంటి ఉద్యమ సామాగ్రిని సమకూర్చే బాధ్యత కూడా నెత్తిన వేసుకుంది. ఉద్యమ నినాదాలని తమ పత్రికలో క్రమం తప్పకుండా ప్రచురించి ఉద్యమకారులని వాటిని వాడుకొమ్మని ప్రోత్సహించేది. సారా వ్యతిరేక ఉద్యమం గురించి కవితా పోటీలు, చిత్ర కళా పోటీలు నిర్వహించింది. ఉద్యమానికి ఒక కొత్త జెండా తయారు చెయ్యండని పాఠకులకి ఒక పోటీని కూడా నిర్వహించింది. ఈ వేదికలన్నీ ఉద్యమంలో పాల్గొంటున్న స్త్రీలను, ఆందోళనకారులను, రాజకీయ నాయకులను ఒక దగ్గరికి తీసుకురావటానికే. 1993 జనవరి 2న ఇటువంటి వేదికలన్నిటికీ కలిపి పత్రిక సంపాదకుడు రామోజీరావు అధ్యక్షతన, గవర్నర్, ముఖ్యమంత్రి, వివిధ రాజకీయ పార్టీల నాయకులూ పాల్గొన్న ఒక పెద్ద సభ హైదరాబాదులో నిర్వహించింది. ఈ సభని సారా వ్యతిరేక సమావేశంగా కాక, మద్య వ్యతిరేక సమావేశంగా పిలవటం విశేషం.

సారా ఉద్యమంలో పాల్గొన్న స్త్రీల తెగువ, పట్టుదల, ఈనాడుతో సహా అనేక మంది నుండి దానికి లభించిన మద్దతు వల్ల కాంగ్రెసు ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి ముందు నెల్లూరు జిల్లాలో, తర్వాత రాష్ట్రమంతటా సారాపై నిషేధం విధించక తప్పలేదు. 1993 ఏప్రిల్ నుండి సారాపై సమరం పేజీని, సారాంశం కార్టూనిని ఆపేసినప్పటికీ, ఈనాడు పత్రిక 1995 జనవరిలో సంపూర్ణ మద్య నిషేధం విధించే వరకూ తన ప్రచారాన్ని కొనసాగించింది. టిడిపి ముఖ్య మంత్రి ఎన్.టి.రామారావు ఈ నిషేధాన్ని విధించాడు.

ఈనాడు ఎందుకు ఇదంతా చేసింది? దాని వల్ల దానికేమి లాభం? ఈ దినపత్రిక ప్రచారోద్యమానికి రాజకీయ కోణమే కాక, వ్యాపార కోణం కూడా ఉంది. సారా వ్యతిరేక ఉద్యమం గురించిన వార్తలలోను, సంపాదకీయాలలోను అంతర్లీనంగా సంపూర్ణ మద్య నిషేధం విధించగలిగే సత్తా ఉన్న ప్రభుత్వం కావాలనే పిలుపు ఉంది. గృహిణుల ఆక్రోశం నుండి ఈ ఉద్యమం పుట్టిందని రాయబడింది. తమ సంపాదకీయాలలో, మహిళలు తమ రహస్య ఆయుధం అయిన ఓటును ఉపయోగించి సంపూర్ణ మద్య నిషేధం విధించలేని ప్రభుత్వాన్ని ఓడించి ఆ సత్తా ఉన్న పార్టీని ప్రభుత్వంలోకి తీసుకురావాలని రాసారు. అంతేకాదు ముందు పేజీల్లో సంపాదకీయంతోపాటు, టిడిపి పార్టీ ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన నివేదికను కూడా ప్రచురించారు.

ఈ రెండు సందేశాలను పక్క పక్కన పెట్టటంలోని అంతరార్థాన్ని పెద్దగా వివరించవసరం లేదు. ఎన్టీఆర్ సంపూర్ణ మద్య నిషేధం గురించి వాగ్దానం చేసి ఎన్నికల్లో గెలిచాడు. ప్రభుత్వం ఏర్పడగానే 1995 జనవరి 16న నిమిషాల్లో సంపూర్ణ మద్య నిషేధం విధించటం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఈనాడు దిన పత్రిక మద్య వ్యతిరేక ఉద్యమానికి ఇచ్చిన మద్దతుకి ఒక వ్యాపార కోణం కూడా ఉందని అందరూ చెప్పుకుంటారు. తమ ప్రత్యర్థి వార్తా పత్రిక ఉదయం అధినేత మాగుంట సుబ్బిరామిరెడ్డి సారా వ్యాపారాన్ని పడగొట్టటం. ఆసక్తికరంగా ఉదయం పత్రిక 1995లో సంపూర్ణ మద్య నిషేధం ప్రకటించిన వెంటనే మూత పడింది.

దిన పత్రిక ఉద్యమానికి కల్పించిన ప్రచారం ద్వారా రెండు విజయాల్ని సాధించింది:

1) ఉద్యమ పరిధిని గ్రామ స్థాయి నుండి విస్తరించి రాష్ట్ర స్థాయికి తీసుకు రావటం. అయితే అన్వేషి పరిశోధన సంస్థకు చెందిన బృందం 1992 అక్టోబర్‌లో సారా వ్యతిరేక ఉద్యమంలో ఉన్న మహిళలని కలిసి తయారు చేసిన నివేదికలో "తమ పరిస్థితులపై నియంత్రణ ఉండాలంటే తమ పోరాటాన్ని ఊళ్ళల్లో నిలబెట్టటం అత్యంత ఆవశ్యకమని" వారు బలంగా నమ్మారని పేర్కొంది. ఉద్యమంలో బాగా ప్రచారంలో ఉండిన "మా ఊరికి సారా వద్దు' నినాదం ఈ పట్టుదలకే అద్దం పడుతుంది.

2) సారా నుండి మద్యానికి దృష్టిని మరల్చటం. చాలా మంది మహిళా ఆందోళనకారులు సారా గ్రామీణ స్త్రీల సమస్యనీ, మద్యం పట్టణ స్త్రీల సమస్యనీ ఎత్తిచూపారు.

ఈనాడు సారా వ్యతిరేక పోరాటానికున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక కోణాలని ప్రజల దృష్టి నుండి తుడిచి వేయటంలో ఘన విజయం సాధించింది. సారాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న స్త్రీలు సారాకు వ్యతిరేకంగా పోరాడడంతోపాటు, కనీస అవసరాలయిన మంచి నీరు, ఆరోగ్య సదుపాయాలు, విద్య కోసం కూడా పోరాడారు. ఈనాడు తన వార్తల్లో ఈ అంశాలన్నిటికీ తక్కువ చోటు కల్పించి సంపూర్ణ మద్య నిషేధం ఆంధ్రప్రదేశ్ ప్రజల అన్ని సమస్యలకూ ఒకే ఒక పరిష్కారంగా చూపెట్టింది. మద్య నిషేధం అమలులోనికి వచ్చిన రోజు అది తెలుగు ప్రజల విజయంగా ఈనాడు తన సంపాదకీయంలో పేర్కొన్నది "ఈరోజు తెలుగు కూతుళ్ళ కన్నీటి అభ్యర్థనలు పట్టించుకున్న దినం" (ఈనాడు, 1995 జనవరి 16). నిషేధం అమలులో ఉన్నప్పుడు ఈనాడు తగ్గిన నేరాల సంఖ్య గురించి, పోలీసులు, అబ్కారి అధికారులు మద్యం, సారా బాటిళ్ళని తమ దాడుల్లో విజయవంతంగా పట్టుకున్న ఫోటోలను ప్రచురించింది. ఆ సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతిని మద్యనిషేధ దినంగా జరుపుకున్నారు. చంద్రబాబునాయుడు ఈనాడుని మద్య వ్యతిరేక ప్రచారోద్యమంలో 'మరిచిపోలేని' పాత్ర పోషించిన పత్రికగా అభినందించారు (ఈనాడు, 1995 అక్టోబర్ 3). తన సంపాదకీయంలో రామోజీరావు పెరిగిన కల్తీ కల్లు తయారీని పేర్కొంటూ కల్లుపై కూడా నిషేధం విధించాలని వాదించారు.

ఈ సమయంలో వేరే పత్రికలని గమనిస్తే నిషేధాన్ని అమలుపరచటంలో ప్రభుత్వ వైఫల్యం, అక్రమ మద్య తయారీ గురించి అనేక వార్తలు కనిపిస్తాయి. కొత్తగా వచ్చిన 'వార్త' దిన పత్రిక ఈసారి సారా వ్యతిరేక మహిళల పోరాటాన్ని సమర్థించి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మద్య నిషేధాన్ని ఎత్తి వేయటాన్ని 'ప్రజలకు చేసిన వాగ్దానాల ఉల్లంఘన' అని వర్ణించింది. ఈనాడు ఈ సమయంలో నిషేధం నుండి పక్కకి తప్పుకుని, నిషేధాన్ని




ఎత్తివేయటాన్ని ఎలా సమర్థించిందో అర్థం చేసుకోవాలంటే 1997 వార్తా పత్రికలన్నీ అధ్యయనం చెయ్యాల్సి ఉంటుంది.

**సారా వ్యతిరేక మహిళలు**

ఈనాడు పాత్రని అధ్యయనం చేస్తే స్త్రీల ఉద్యమాలకు, మీడియా వాటిని చిత్రీకరించే విధానానికి మధ్య సంబంధం గురించి మనకు అనేక ప్రశ్నలు వస్తాయి. మీడియా స్త్రీల పోరాటాలని, వాటిలో పాల్గొన్న స్త్రీలని ఏ విధంగా చిత్రీకరిస్తుంది? వారి సమస్యలని, సవాళ్ళని ఏ చట్రంలో కుదించి, ఏ రకంగా అభివర్ణిస్తుంది? పోరాటాలని ఏ రకంగా నిర్మించాలని చూస్తుంది? వాటి పరిధిని ఎలా నిర్వచిస్తుంది? ఏ రకమైన పదజాలాన్ని తమ చిత్రీకరణల్లో వాడుతుంది? ఒక సంపాదకీయంలో స్త్రీలు ఇంటి నుండి బయటికి రావటానికి సందేహించే స్త్రీలు ఈ పోరాటంలో వీధుల్లోకి వచ్చారని. స్వతంత్రోద్యమాన్ని గుర్తు చేస్తోందనీ అన్నాడు. ఈ సందర్భంలో గాంధీ, ఆయన అహింసా పోరాట ఎత్తుగడలు పదే పదే ముక్తాయించారు. ఈ ఉద్యమానికి అసలు గాంధేయ స్వభావమే లేదు. కానీ సంపాదకీయాలు మాత్రం గాంధీని ఉటంకించాయి. సారా ఉద్యమంలో పీపుల్స్ వార్ ఉపయోగించిన హింసాయుత మార్గాలని రామోజీరావు ఖండించాడు. స్త్రీలు తమ కుటుంబాలను కాపాడుకోవటానికి ఈ పోరాటం చేస్తున్నారని పేర్కొన్నాడు. అంటే పీపుల్స్ వార్ ఉద్దేశాలవలే కాకుండా ఈ స్త్రీల ఉద్దేశాలు శ్లాఘించ దగ్గవనీ, సక్రమమైనవనీ అర్థం (ఈనాడు, 1992 అక్టోబర్ 24). స్త్రీల కన్నీళ్ళ నుండి ఈ పోరాటం ఆవిర్భవించిందని పదే పదే పేర్కొన్నాడు. కాలే కడుపులతో, కారే కన్నీళ్ళతో, నిస్సహాయులైన స్త్రీలు తమ బాధల్ని భరిస్తున్నారు. (ఈనాడు, 1993 జనవరి 30). మన కూతుళ్ళు విలపిస్తున్నారు (ఈనాడు, 1993 జనవరి 16) ఇంకో పక్క స్త్రీలని వివిధ సందర్భాల్లో నరకాసురుడితో పోరాడిన సత్యభామతో, దుర్గా దేవితో, కాళీ మాతతో, ద్రౌపదితో పోల్చారు కూడా. అయితే ఇటువంటి పదజాలాన్ని వాడింది కేవలం రామోజీ రావే కాదు, సినిమా తారలు, విలేఖరులు, శాసన సభ్యులు కూడా ఇవే ఉపయోగించారు. స్త్రీలు పవిత్రత, ఆదర్శాలతో నిండిన వారు కాబట్టి వారే దేశాన్ని ప్రక్షాళన చెయ్యగలరని ఉద్ఘాటించారు.

పోరాటంలో పాల్గొన్న స్త్రీలలో అత్యధిక శాతం దళిత, ముస్లిం స్త్రీలని చాలా మంది రచయితలు ఎత్తి చూపారు, "వివిధ గ్రామాల్లో ఏర్పడిన గ్రామ కమిటీలకు పేద దళిత మహిళలే నాయకత్వం వహించారు". అయితే మీడియా వాడిన ప్రతీకలలో ఆయా స్త్రీల కుల, వర్గ అస్తిత్వాలు మాయమయ్యి స్త్రీలు అన్న ఒక ఏకసదృశ రూపం మనకి ప్రత్యక్ష మవుతుంది.

తమ తాళిని పట్టుకుని ఏడుస్తూ, నిస్సహాయులుగా, బాధితులుగా ఉండే స్త్రీలు, జుట్టు విరబోసుకుని, ఎర్రబడిన కళ్ళు, పెద్ద కుంకుమ బొట్టు, చేతిలో త్రిశూలం పట్టుకున్న స్త్రీలు ఈ రెండు ప్రతీకలు భారతీయ స్త్రీల గురించి మన దైనందిన జీవిత పురాణాల్లో భాగమే. సమాజంలో ప్రబలిపోయిన ఇటువంటి ప్రతీకలు, పద జాలాల నేపథ్యంలో మనం అడగాల్సిన ప్రశ్నలు ఏమిటంటే వీటి వల్ల స్త్రీలకి ఒరిగేదేమిటి? వాటిని విమర్శకి గురిచెయ్యటం వల్ల మనకి ఏమయినా ప్రయోజనాలు ఒనగూరుతాయా? కుటుంబాన్ని, స్త్రీల మర్యాదని కాపాడే ఉద్యమాలకి మాత్రమే సాధికారత కల్పించే ఈ ప్రతీకలు పితృస్వామ్య భావజాలాల్ని ప్రశ్నించలేవు. ఈనాడు పత్రిక పదే పదే నొక్కి చెప్పిన స్త్రీల కన్నీళ్ళు, కుటుంబం కోసం వారి ఆరాటం ఈ పోరాటంలో స్త్రీలు అవలంభించిన అనేక పద్ధతులని పూర్తిగా మరుగుపరిచాయి. కాంట్రాక్టర్లపై, ఎక్సైజు విభాగ అధికారులపై దాడి చేయటం, సారా దుకాణాలని నాశనం చెయ్యటం, కారం పొడి, చీపురు కట్టని వాడటం, ఇంట్లో వంట చెయ్యటానికి నిరాకరించటం, భర్తలకి విడాకులిస్తామని బెదిరించటం, మద్యం మాఫియా పంపిన గూండాలని ఎదుర్కోవటం మొదలైనవి.

**అనువాదం: ఏ.సునీత**

రచయిత ఇఫ్లూలో అధ్యాపకురాలు

ఇది మూల వ్యాసంలో కొంత భాగమే. మొత్తం వ్యాసం చదవాలంటే, Journal of Arts & Ideas, no.32-33 (April 1999)p, 73. reproduced at : http://dsal.uchicago.edu/books/artsandideas/pager.html?objectid=HN681.S597_32-33_075.gif చూడండి

# మహిళా ఉద్యోగినులు సమ్మెలో కూర్చుంటే..

■ **సురేష్ పి థామస్**

'ఇరిక్కల్ సమరం' అంటే సమ్మెలో కూర్చోవటం – కేరళలోని అతి పెద్ద ఖరీదైన బట్టల దుకాణాలలో ఒకటైన కళ్యాణ్ సారీస్‌లో పనిచేసే ఆరుగురు ఉద్యోగినులు 2014 డిసెంబర్ 30వ తేదీ నుండి 106 రోజుల పాటు సమ్మె చేసారు. వారిలో ఐదుగురు సేల్స్ గరల్స్ ఒకరు సేల్స్ మేనేజర్. త్రిస్సూర్ జిల్లాలోని కోవిలకతుంపడంలోని కళ్యాణ్ సారీస్ బట్టల దుకాణం ముందు ఎస్.కె.పద్మిని, పి.మాయాదేవి, రజని దాసన్, దేవి రవి, అల్ఫోంజ జాన్సన్, బీనా సోజన్ అనే మధ్య వయస్కులైన మహిళలు అసంఘటిత రంగ కార్మిక సంఘం (ఏఎంటియు) తరఫున సమ్మెకు కూర్చున్నారు. వారి డిమాండ్లు:

1. బదిలీ ఉత్తర్వులను రద్దు చెయ్యాలి.

2. విరామ సమయాలను మార్చాలి, సేల్స్ గరల్స్ కూర్చోవటానికి వీలు కల్పించాలి.

3. 8 గంటల పని దినం పద్ధతిని అమలు చెయ్యాలి.

4. సాయంత్రం 7 గంటల తర్వాత మహిళా ఉద్యోగినుల చేత పని చేయించే పద్ధతిని ఆపివెయ్యాలి.

క్లుప్తంగా చెప్పాలంటె సేల్స్ ఉద్యోగులు పనిచేసే సమయంలో కూర్చునే హక్కును ఉల్లంఘించటానికి వీలు లేని హక్కుగా జౌళి రంగ నిర్వాహకులు చట్టపరంగా గుర్తించేటట్లు చేయటమే వారి సమ్మె ఉద్దేశం. సేల్స్ ఉద్యోగులు ఇక మీదట పది, పదకొండు గంటల పాటు విరామం లేకుండా మానవ మరబొమ్మలలాగా నిలుచొని ఉండబోరని అటు మేనేజిమెంటుకి, ఇటు వినియోగదారులకు తెలియచెప్పటానికి జరిగిన నిరసన ఇది. మరుగు దొడ్లకు వెళ్ళటం వారి తక్షణ అవసరంగా ఉన్నప్పుడు ముఖాలపై జీవం లేని నవ్వులు తెచ్చిపెట్టుకుని వినియోగదారులకు అభివాదం చెయ్యలేరని, చట్టపరమైన హక్కుల ఉల్లంఘనను సమిష్టిగా ఎదిరించటానికి ఇప్పుడు వాళ్ళు సంఘటితంగా ఉన్నారనీ, ఇకపై బానిసత్వాన్ని ఏమాత్రం అంగీకరించరనీ తెలియచెప్పటానికే ఈ నిరసన.

సమ్మె చేసిన ఈ స్త్రీలకు రాజకీయ ఉద్యమాలలో పాల్గొన్న నేపథ్యం లేదు. ఈ స్త్రీలు తమను తాము "పెద్దగా చదువులేని, చాలా ఆర్థిక సమస్యలున్న పేద, సామాన్యమైన స్త్రీలు"గా చెప్పుకున్నారు. ఈ 'ఇరిక్కల్ సమరం' వీరు పాల్గొన్న మొట్టమొదటి సమ్మె మాత్రమే కాదు, అది వారి దృష్టికొచ్చిన మొదటి సమ్మె. "ఇంతకు ముందు నేను సమ్మె చేసే వాళ్ళను చూసినప్పుడు వాళ్ళు నోరుమూసుకుని పని చేసుకోవచ్చు కదా అని ఎగతాళి చేసేదాన్ని" అని అంటున్నది మాయాదేవి. కాని ఇప్పుడు ఎక్కడైనా నిరసన తెలుపుతున్న బృందం కనిపిస్తే వెళ్ళి విషయమేమిటో తెలుసుకోమని ఆమె తన పిల్లలకు చెబుతున్నది.

పత్రికలు టెలివిజన్ ఛానళ్ళు ప్రసారం చేసే కథనాలను పూర్తిగా నమ్మవద్దని కూడా ఆమె తన పిల్లలకు సలహా ఇస్తుంది. "మన ప్రసార సాధనాలపై నాకు నమ్మకం పోయింది, అవన్నీ డబ్బుకు బానిసలై పోయాయి. మీ దగ్గర బాగా డబ్బుంటే మీడియాను కొనుక్కుని స్వంత వార్తలు సృష్టించుకోవచ్చును. మాలాగా డబ్బు లేనివారికి మీడియాలో చోటు దొరకదు" అని అంటుంది ఆమె.

సమ్మె ప్రారంభించిన మొదటి వారంలో ఈ స్త్రీలు త్రిస్సూర్ ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టారు. ఇందుకోసం వాళ్ళు 1500 రూపాయల అద్దె కట్టవలసి వచ్చింది. అయితే ఏ పత్రికా, ఏ ఒక్క టివి ఛానెల్ కూడా ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తలను ప్రసారం చెయ్యలేదు. తమ సమ్మె పట్ల ఇంతగా ఉదాసీనత కనబరుస్తారని వాళ్ళు ఊహించలేదు. "వాళ్ళు మాతో పాటు సమ్మెలో పాల్గొంటారని మేము ఆశించలేదు కాని కనీసం ఇటువంటి సమ్మె ఒకటి జరుగుతున్నదని వార్త రాసి ఉండవచ్చు." అన్నది మాయాదేవి.



పద్మిని తన చిన్నతనంలో పత్రికా రచయిత కావాలని కలలు కన్నది. ఇప్పుడు 'మీడియా కూలీలైన' రిపోర్టర్ల పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నది. "వాళ్ళు కూడా మాలాగే కార్పొరేట్లకు అమ్ముడు పోయిన మేనేజిమెంటు దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన కార్మికులే" అంటుంది ఆమె. ప్రసార సాధనాలు ప్రత్యేకించి టెలివిజన్ వార్తా ఛానళ్ళు తమను తాము ఎటువంటి లోపం లేని ధర్మబద్ధమైన సంస్థలుగా ప్రచారం చేసుకోవటం పద్మినికి కోపం తెప్పించే విషయం. "వారికి కొంచెం కూడా సిగ్గనిపించదా" అని ఆమె ప్రశ్నిస్తుంది.

ఇరిక్కల్ సమరం కూడా చరిత్రలో జరిగిన అన్ని ముఖ్యమైన సమ్మెల లాగానే దీర్ఘకాలం పాటు పాతుకుపోయిన దోపిడీ వ్యవస్థ ఫలితంగా జరిగిన సమ్మె. ఈ ప్రతిఘటనకు వేళ్ళు ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోను, స్త్రీవాద ఉద్యమంలోను ఉన్నాయి. 2014 డిసెంబర్ 11వ తేదీ సాయంత్రం ముందుగా ఎటువంటి నోటీసు లేకుండా ఆరుగురు మహిళా ఉద్యోగినులకు బదిలీ ఉత్తరువులు ఇవ్వటమే ఈ సమ్మెకు తక్షణ కారణమైంది.

బదిలీ ఉత్తర్వులు రావటానికి వారం రోజుల ముందు ఈ ఆరుగురు మహిళలు కొజికోడ్‌లో జరిగిన అసంఘటిత రంగ కార్మిక సంఘం (ఏఎంటియు) రాష్ట్ర సదస్సుకు హాజరై ట్రేడ్ యూనియన్ ముద్రను వేసుకున్నారు. వారు అంతకు నాలుగు నెలల క్రితం అసంఘటిత కార్మికుల కోసం అటువంటి సంఘం ఒకటి ఉందని తెలుసుకుని దానిలో చేరారు. పని చేసే స్థలాలలో జరిగే అనేక రకాల మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల వ్యక్తిగతంగా వ్యక్తపరిచే వ్యతిరేకత ఎన్నడూ ఫలితం ఇవ్వలేదు. అట్లా చేసిన ప్రతిసారీ ఆ ఉద్యోగులను వెంటనే పని నుండి తీసివేయటం జరిగింది.

కళ్యాణ్ సారీస్‌లో చాలా కఠినమైన తనిఖీ ఉంటుంది. పురుష సెక్యూరిటి గార్డులు ఉద్యోగినులను తనిఖీ చేస్తారు. షోరూమ్ అంతటా ఆఖరికి మరుగుదొడ్డి ఎదుట కూడా సిసి కెమెరాలు ఉంటాయి. అయినప్పటికీ ఈ ఆరుగురు తమ తోటి ఉద్యోగులను ట్రేడ్ యూనియన్‌లో చేర్చటానికి చొరవ తీసుకున్నారు. అంతటి రక్షణ కవచం మధ్య ట్రేడ్ యూనియన్ కరపత్రాలను దరఖాస్తులను షోరూమ్ లోపలి తీసుకెళ్లటమే వారి జీవితాలలో అతి పెద్ద సాహసం. షో రూమ్‌లో పనిచేస్తున్న మొత్తం 210 మంది సేల్స్ ఉద్యోగులలో మరొక 31 మంది సేల్స్ గరల్స్‌ను ట్రేడ్ యూనియన్‌లో చేర్చగలిగారు. ఈ విషయం వేగంగా వ్యాపించింది, మేనేజిమెంట్ చెవులకు చేరేవరకు వ్యాపించింది.

ఫలితంగా బదిలీ ఉత్తరువులు వచ్చాయి. ఐదుగురిని తిరువనంతపురానికి, ఒకరిని కన్నూర్‌కూ బదిలీ చేసారు. "ఇది వారి పద్ధతిలో మమ్మల్ని బయటికి పొమ్మని చెప్పటమే" అని అంటుంది పద్మిని. రిటైల్ బట్టల షోరూమ్‌లో సేల్స్ గర్ల్ బదిలీలు సాధారణమే. ప్రత్యేకించి షోరూమ్ దగ్గరలో నివసించే సేల్స్ గరల్స్ విషయంలో. ఒక స్థలంలో కార్మికులు కేంద్రీకరించి నివసించటం మహిళా ఉద్యోగినుల పని సంస్కృతిలో భాగం.

బదిలీ ఉత్తర్వులపై సంతకం పెట్టటానికి పద్మిని నిరాకరించింది. జనరల్ మేనేజర్‌ను కలవాలని అడిగింది, కలసి తాను రాజీనామా చేస్తున్నట్లు నిర్ణయించుకున్నానని చెప్పాలని అనుకుంది, కాని అందుకు అనుమతించకుండా షోరూమ్ వదిలి వెళ్ళిపోవాలని చెప్పారు. మొదట తనను ఒక్కదాన్నే బదిలీ చేశారనుకుంది, బయటికి వచ్చిన తర్వాత తనొక్కతే కాదని తెలిసింది. మరుసటి రోజు ఆరుగురు ఉద్యోగినులను గేట్ లోనికి ప్రవేశించకుండా ఆపివేశారు.

ఒకటి రెండుసార్లు మేజేజిమెంట్‌తో చర్చలు జరపటానికి ప్రయత్నించి విఫలమైన తర్వాత ఒక సమ్మె కమిటీ ఏర్పడింది. ఈ ఆరుగురు ఉద్యోగినులతో పాటు వారి భర్తలు, కొడుకులు, ఇతర బంధువులు ఈ కమిటీలో ఉన్నారు. అసంఘటిత రంగ కార్మిక సంఘం (ఏఎంటియు) రాష్ట్ర అధ్యక్షుడు పి.కె.ఋజుకుమార్ కన్వీనర్‌గా, మానవ హక్కుల కార్యకర్త యామిని పరమేశ్వరన్ ఛైర్ పర్సన్‌గా సమ్మె సంఘీభావ కమిటి ఏర్పడింది. అందరూ అంగీకరించిన డిమాండ్ల జాబితాను తయారు చేసారు. రాజకీయంగా సంఘటితమయి తమ చట్టపరమైన హక్కులను సాధించుకోవాలనే రాజకీయ ఎజెండా ముందుకొచ్చింది.

జాతీయ రహదారులపై పెద్ద సంఖ్యలో కనిపించే హోర్డింగ్‌లు, మలయాళం టివి చానెళ్ళలో ప్రకటనలు అన్ని అమితాబ్‌బచ్చన్, మోహన్ లాల్, ఐశ్వర్య రాయ్, పృథ్వీ రాజ్, శ్రేయాఘోశాల్, మంజు వారియర్ వంటి అతి పెద్ద మలయాళం, హిందీ సినిమా ప్రముఖులతో నిండిపోయాయి. ఈ ప్రకటనలన్నీ భారతీయ సాంప్రదాయ జీవన విధానాన్ని వ్యక్తపరచే ముసుగులో అత్యంత ఆడంబరంతో కూడి ఉంటాయి. నిజానికి ఇవి ఉన్నత వర్గాల, బ్రాహ్మణీయ భావజాలానికి అద్దం పడతాయి.

మలయాళ టివి ఛానళ్లన్నిటికి జౌళి, నగల రంగానికి సంబంధించిన ప్రకటనలు కూడా అతి పెద్ద ఆదాయ వనరులు. అయితే ఈ బ్రాండ్ల ప్రకటనలు ప్రసారం చెయ్యటానికీ, వివిధ టెలివిజన్ ఛానళ్ళు తాము ఎటువంటి సైద్ధాంతిక విలువల కోసం నిలబడ్డామని చెప్పుకుంటాయో దానికీ సంబంధం లేదు. ఆ విలువలు వారి సంపాదకీయాలకు మాత్రమే పరిమితమవుతాయి. కార్పొరేట్లను, ప్రభుత్వాలను తీవ్రంగా వ్యతిరేకించే ఛానెళ్ళు కూడా వినియోగదారుల బలహీనతలతో ఆడుకుని లాభాలు సంపాదించే వ్యాపారం విషయంలో ఎక్కడా రాజీ పడవు, ఇరిక్కల్ సమరం వంటివి జరిగిన సందర్భాలలో వారు ఒక పక్షం తీసుకోవలసి వచ్చినప్పుడు వారికి ఎటువైపు నిలబడాలో ఎవరూ చెప్పనక్కరలేదు.

కళ్యాణ్ గ్రూప్‌లో భాగమైన కళ్యాణ్ సారీస్‌కి టి.ఎన్.రామచంద్రన్ యజమాని. కళ్యాణ్ సిల్క్స్, కళ్యాణి జువెలరీస్ యజమాని అయిన అతని సోదరుడు టి.ఎస్ కళ్యాణ్రామన్ ఈ గ్రూప్‌కు అత్యంత సంపన్నుడైన ప్రతినిధి. ఈ గ్రూప్ సంపద విలువ 50,000 కోట్ల వరకు ఉంటుందని ఫోర్బ్స్ అంచనా. కళ్యాణ్ సారీస్ తన వ్యాపారానికి ఉపయోగించే నినాదం "స్టోరీస్ క్రాఫ్టెడ్ ఇన్ సిల్క్" అంటే సిల్క్‌లో మలచిన కథలు. పద్మిని కూడా సేల్స్ గర్ల్‌గా తన జీవితాన్ని వర్ణించటానికి అదే నినాదాన్ని వాడుతుంది.

"నా పేరు ఎస్.కె.పద్మిని. నేను 2005లో సేల్స్ గర్ల్‌గా పని చెయటం మొదలుపెట్టాను అప్పట్లో అది నగరంలో అంత పెద్ద షోరూమ్ ఏమి కాదు. అప్పుడు నా నెల జీతం 500 రూపాయలు. నాకు అప్పుడు ఎక్కువ అవకాశాలు లేవు".

ఉద్యోగంలో చేరిన మొదటి రోజున ఉద్యోగ నియమాల గురించి చెప్పారు. అందులో మొదటిది: సేల్స్ గర్ల్స్ ఎప్పుడూ కూర్చోవటం గురించి ఆలోచించకూడదు, కస్టమర్లు లేనప్పుడు కూడా. ఎందుకు అని అడగకూడదు. సేల్స్ గర్ల్ పని ప్రారంభించినప్పటి నుండి అది అలాగే నడుస్తోంది. అంటే నేను ఉదయం 9.30 నుండి సాయంత్రం 7.30 వరకు నిలబడే ఉండాలి. మరుగుదొడ్లకు వెళ్ళటానికి కూడా విరామం ఉండదు. నేను పని చేసే షోరూమ్‌లో అసలు మరుగుదొడ్లు లేవు. ఎప్పుడైనా వెళ్ళాల్సి వస్తే నేను బయట హొటల్‌కో లేక కార్పొరేషన్ ఆఫీసుకో వెళ్ళేదాన్ని. అది కూడా రోజుకు ఒకసారి లేక ఎక్కువలో ఎక్కువ రెండుసార్లు. కొన్నిసార్లు అసలు వెళ్ళేదాన్ని కాదు.

కొన్ని పెద్ద బ్రాండ్ల షోరూమ్‌లలో పనిచేసిన తర్వాత నేను 2012లో కళ్యాణ్ సారీస్‌లో చేరాను. అప్పటికి నేను సేల్స్ మేనేజర్ స్థాయికి వచ్చాను. నేను కొంచెం అదృష్టవంతురాలిననే చెప్పాలి. ఎందుకంటే సేల్స్ ఉద్యోగులలో సాధారణంగా సూపర్ వైజర్లు, ఫ్లోర్ మేనేజర్లు మగవాళ్ళే ఉంటారు, స్త్రీలు కస్టమర్ల అవసరాలు చూస్తారు. ఇది మేనేజిమెంట్‌కు చాలా అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే మామూలుగా సేల్స్ గర్ల్స్ కొంత పిరికివాళ్ళుండి సూపర్వైజర్లను ఎదిరించటానికి భయపడతారు.

ఇంటర్వ్యూలో నాకు 8000 రూపాయలు జీతం ఇస్తామని చెప్పారు. కాని పనిలో చేరిన తర్వాత 10,12 ఏళ్ళు పని చేసిన వారికి కూడా 6500 కంటే ఎక్కువ రాదు అని చెప్పారు. నాకు జీతం విషయంలో అబద్ధం చెప్పారు. ఇక్కడ చాలా మందికి 4000, 5000 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. అనుభవం ఎక్కువ ఉన్న వారికి మాత్రమే 6000 రూపాయలు చెల్లిస్తున్నారు. కనీస వేతన

చట్టం అనేది ఒకటుందని కూడా మాలో ఎవరికీ తెలియదు.

ఒక సేల్స్ గర్ల్ పని ఉదయం 9.30కి మొదలవుతుంది. 11 గంటల పనికి 4000 రూపాయల జీతం. అందులో పి.ఎఫ్, వెల్ఫేర్ ఫండ్ మినహాయిస్తారు. వాటికి సంబంధించి ఎటువంటి రసీదులు ఉండేవి కాదు. సాలరి స్లిప్ ఇచ్చేవారు కాదు. చట్టం ప్రకారం మాకు 7200 రూపాయలు జీతం రావాలని కూడా మాకు తెలియదు, స్త్రీలు సాయంత్రం 7 గంటల తర్వాత పని చేయటం చట్టవిరుద్ధం అని కూడా మాకు తెలియదు. మాకు 20 నిమిషాల భోజన విరామం ఉండేది. భోజనం చేసే స్థలం ఐదవ అంతస్తులో ఉండేది, లిఫ్టులో వెళ్ళనిచ్చే వాళ్ళు కాదు. అక్కడ చాలా అపరిశుభ్రంగా ఉండి తినబుద్ధి అయ్యేది కాదు. వర్షం వస్తే పూర్తిగా తడిచిపోవటమే. అక్కడికి వెళ్లి తినటమే ఒక పెద్ద శిక్షగా అనిపించేది. అందుకే చాలాసార్లు భోజనం మానుకునే వాళ్ళం.

కస్టమర్లు లేనప్పుడు కూడా మేము కూర్చోవటానికి వీల్లేదు. అందుకని మేమేం చేసేవాళ్ళమంటె అప్పటికే మడత పెట్టిన బట్టలను మళ్ళీ నేలమీద పెట్టి వాటిని సరిచేస్తున్నట్లు నటించి మధ్యలో ఒక్క నిముషం కూర్చునే వాళ్ళం. ఇప్పుడు అన్ని చోట్లా సిసి కెమెరాలు ఉండటంతో అట్లా ఒక్క నిముషం కూర్చోవటానికి కూడా వీల్లేదు.

ఇంత జరుగుతున్నా మేము కస్టమర్లను నవ్వు ముఖాలతో ఆహ్వానించి వారికి ఏం కావాలో చూడాలి. అది మాకు సహజంగా వచ్చేసేది, అది ఒక వ్యసనంలాగా మారింది, దానిని వదులుకోలేము. ఇప్పుడు కూడా ఈ సమ్మె నుండి నేను షోరూమ్‌లోకి వెళ్ళాల్సి వస్తే నేను వెంటనే చిరునవ్వులు చిందించటం మొదలుపెడతాను.

మేము గంటల తరబడి నిలబడి, మరుగుదొడ్లకు కూడా వెళ్ళటానికి వీలు లేకపోవటం వల్ల మాలో చాలా మందికి గర్భసంచిలో సమస్యలు, మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లు, నడుము నొప్పి, వెరికోస్ వెయిన్స్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఒకసారి ఒక ఉద్యోగిని కాలుకి వేరికోస్ వెయిన్ (ముడిపడి వాచిపోయిన రక్తనాళం) పగిలి రక్తం కారింది, అయినా ఆమెకి తెలియలేదు. నేలమీద కారిన రక్తం ధారను ఒక కస్టమర్ చూసి స్పృహ కోల్పోయింది, అప్పుడు ఆ సేల్స్ గర్ల్‌కి తెలిసింది."

సమ్మె జరుగుతున్నంత కాలం ఔత్సాహికులైన సామాజిక మాధ్యమంలోని (సోషల్ మీడియా) ఒక సెక్షన్ నుండి బలమైన మద్దతు లభించింది. ఫేస్ బుక్‌లో ఒక సంఘీభావ కమిటీ ఏర్పడి కళ్యాణ్ గ్రూప్‌కు చెందిన వివిధ షోరూమ్‌లకు ఊరేగింపు జరపాలని ప్లాను చేసారు. ప్రధాన స్రవంతి మీడియాపై విమర్శలు వెల్లువెత్తాయి. మార్చ్ 8వ తేది మహిళా దినోత్సవం కార్యక్రమాలలో భాగంగా ఫేస్ బుక్ సంఘీభావ కమిటీ ఒక సంఘీభావ ఊరేగింపు నిర్వహించింది. ఇది సమ్మె చేస్తున్న స్త్రీలకు తమ నిరసనను కొనసాగించటానికి మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది.

"మీడియా మమ్మల్ని నిర్లక్ష్యం చేసి అగౌరవపరచిన తర్వాత ప్రజలకు మా సమ్మె పట్ల ఆసక్తి ఉంటుందని మేమెప్పుడు అనుకోలేదు. మాకు నైతిక సహాయంతో పాటు ఆర్థిక సహాయం కూడా లభించింది. అందుకే మేము చాలా కృతజ్ఞులం" అని అన్నది పద్మిని.

దీనిలో కొన్ని ఆసక్తికరమైన కోణాలు కూడా ఉన్నాయి. ఫేస్ బుక్‌లో ప్రముఖ మలయాళి సినీ నటి, కళ్యాణ్ జువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ అయిన మంజు వారియర్ 'డియర్ కళ్యాణి ఫ్యామిలీ' అని సంబోధిస్తూ ధన్యవాదాలు తెలిపిన తర్వాత ఆమెకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కోపాన్ని వ్యక్తం చేస్తూ అనేక మంది పోస్ట్ చేసారు. ఆమె తన సూపర్ స్టార్ భర్త నుండి విడిపోయి 15 ఏళ్ల తర్వాత సినిమా రంగానికి తిరిగి వచ్చినప్పటి నుండి ఆమె ఒక స్త్రీవాద ప్రతినిధిగా గుర్తింపు పొందింది.

గత రెండేళ్ళ నుండి సామాజిక మాధ్యమం ద్వారా నిరసన ఉద్యమాల కోసం ప్రజా సమీకరణను చేపట్టటం అనేది కేరళ రాజకీయ రంగంలో ఒక ప్రధాన లక్షణంగా ముందుకొచ్చింది. ఈ విధంగా జరిగిన ఉద్యమాలలో కొన్ని: ఆదివాసీ గోత్ర మహాసభ నిర్వహించిన నిల్పు సమరం; కోజికోడ్‌లోని ఒక రెస్టారెంట్‌లో యువ మోర్చా కార్యకర్తలు విధ్వంసం సృష్టించిన తర్వాత నైతిక పోలిసింగ్‌కు వ్యతిరేకంగా వరుసగా జరిగిన కిస్ ఆఫ్ లవ్ నిరసనలు; కొచ్చిలోని ఏఎస్ఎంఎ రబ్బర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ కంపెని మేనేజింగ్ డైరెక్టర్‌కు సానిటరి నాప్కిన్స్ పంపిన క్యాంపెయిన్ – ఇది ఆ కంపెని మరుగుదొడ్డిలో సానిటరీ నాప్కిన్ కనిపించిన తర్వాత 15 మంది ఉద్యోగినులను బట్టలు విప్పి తనిఖీ చేసారనే ఆరోపణల తర్వాత జరిగింది; శబరిమలకు వెళ్ళే కెఎస్ఆర్‌టిసి ప్రత్యేక బస్సులలో మహిళలు ఎక్కవచ్చు అనే పంపా రుతుస్రావ నిరసన – టివి నౌ అనే చానెల్ జర్నలిస్ట్ నసీరా అటువంటి బస్సులో ఎక్కినప్పుడు శబరిమల భక్తుల పవిత్రతకు భంగం కలిగిస్తుందన్న నెపంతో ఆమెను బస్సు నుండి దిగమని అడిగినందుకు నిరసనగా ఇది జరిగింది.

సమ్మెలు, బంద్‌లు వంటి సాంప్రదాయ మార్క్సిస్టు నిరసన పద్ధతులకు భిన్నంగా జరిగిన పై నిరసనలన్నిటిలోకి కిస్ ఆఫ్ లవ్ నిరసనను మాత్రమే ప్రధాన స్రవంతి మీడియా ప్రసారం చేసింది, నిజానికి ఇది ఒక పండుగలాగా సాగింది. నిరసన ఉద్యమాలను ప్రచారం చెయ్యటంలో సోషల్ మీడియా పాత్రను సమకాలీన రాజకీయ నిరసన ఉద్యమాల సంస్కృతిలో కీలకమైనదని గుర్తించబడినప్పటికీ ఈ నిరసనలకు రాజకీయ కేంద్రీకరణ లేదని దానిపై విమర్శ కూడా వచ్చింది.

''''''''

2015 ఏప్రిల్ 15వ తేదీన ప్రారంభమైన సమ్మె, 106వ రోజున నిరసనకారులకు, మేనేజిమెంట్‌కి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. నిరసనకారులు ముందుకు తెచ్చిన నాలుగు డిమాండ్లలో రెండు డిమాండ్లను పూర్తిగా ఆమోదించారు: అవి బదిలీ ఉత్తరువులను రద్దు చెయ్యటం, సాయంత్రం ఏడు గంటల తర్వాత స్త్రీలు పనిచేసే పద్ధతిని ఆపివేయటం. పని గంటలను మార్చటం, సేల్స్ గర్ల్స్ కూర్చోవటానికి వీలు కల్పించాలి అనే డిమాండును పాక్షికంగా గుర్తించారు. 8 గంటల పని దినం పద్ధతిని అమలు చేయాలనే డిమాండ్‌ను పరిగణించను కూడా లేదు.

అప్పటి నుండి సోషల్ మీడియా, సాంప్రదాయ మీడియా నిశ్శబ్దంగా ఉన్నాయి.

**అనువాదం: ఎస్.ఆశాలత**

సురేష్ థామస్ నవలా రచయిత, జర్నలిస్టు,
కొట్టాయం నివాసి



# ఒక పాత్రికేయురాలి కష్ట సుఖాలు

■ **ఆర్ అఖిలేశ్వరి**

స్త్రీలకు సంబంధిచిన విషయాలపై నాకున్న ఆసక్తి బహుశా ఓ పెద్దింటి కుటుంబంలో రెండవ భార్యగా ఉన్న మా అమ్మ నాతో పంచుకున్న తన అనుభవాల నుంచి వచ్చినట్లుంది. అందులో కొన్ని నిజాలు, కొన్ని కట్టు కథలు అయినప్పటికీ అవి స్త్రీ జీవితంలో అన్యాయం, అసమానతలు కలగలిసి ఉన్నాయన్న విషయాన్ని మాత్రం నాకు నేర్పాయి. ఫలితం నేను ఎదురు తిరిగాను: ప్రతీదానికి, అవి ఆచారాలు కావచ్చు, పూజ చేయడం, రోజూ స్నానం చేయడం, గుడికి వెళ్ళడం, పవిత్ర దినాల్లో ఉపవాసం ఉండడం, నగలు వేసుకోవడం, చీర కట్టుకోవడం, జడవేసుకోవడం ఇలా అన్నిటికీ.

**ఓ పాత్రికేయురాలి గమనం**

1974లో ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం చేసిన తరువాత మంచి జీతం వచ్చే బ్యాంకు ఉద్యోగం వదులుకుని బెంగుళూరులోని డెక్కన్ హెరాల్డ్ పత్రికలో ఉప సంపాదకురాలిగా చేరాను. మా బృందంలో నేనొక్కర్తినే మహిళను. పైగా ఇరవై ఏళ్ళ వయసు. నా మిగతా సహోద్యోగులంతా నలభై ఏళ్ళవారు. మేనేజ్‌మెంట్‌కి తెలిసిన దాన్ని కావడంలో అక్కడి వాతావరణం మరీ ప్రతీకూలంగా లేనప్పటికీ ఎవరితో స్నేహం చేసే పరిస్థితి లేదు. వయసులో పెద్దవాళ్ళైన మగవాళ్ళు ఏదైనా పని ఉన్నప్పుడు మాత్రం మాట్లాడేవారు. నేను మేనేజ్‌మెంట్‌కి దగ్గరి దాన్ననే అభిప్రాయం నా పనితనాన్ని గుర్తించనీయకుండా చేయడమే కాక నా వృత్తిని రెండింతలు కష్టతరం చేసింది. తరువాతెప్పటికో అలా ఈర్ష్యపడే నా సహోద్యోగులు నేను పని బానే చేస్తానని ఒప్పుకున్నారు.

నన్ను రిపోర్టింగ్‌కి మార్చమని సంపాదకుణ్ని అభ్యర్థించాను, కానీ ఆయన వద్దన్నాడు. స్త్రీలు ఆ కఠినమైన పని చేయలేరని అతని అభిప్రాయం. తరువాత, పాఠశాలల స్థితిగతులు, ఉపాధ్యాయుల పని తీరు, తల్లి దండ్రులను దోచుకునే విధానంపై పరిశోధనాత్మక కథనాలు తయారు చేసే పని ఇచ్చారు. ఈ కథనాలు కర్నాటక శాసన సభలో చర్చకు వచ్చి విద్యాశాఖ మంత్రి ఈ విషయంపై నిజానిజాలను వెతికి తీయమని ప్రెస్ పార్టీని ఆదేశించడం జరిగింది. మా టీమ్‌లోని మహిళా సహోద్యోగులను, నన్ను ఆహ్వానించారు. స్థానికేతరురాలైన నేను ప్రభుత్వాన్ని కుదిపేసానని, ఒక ఉప సంపాదకురాలికి ఈ పని అప్పజెప్పారని స్థానికులైన సహోద్యోగులు ఆగ్రహోదగ్రులై యువతులపై మా 'ముసలి సంపాదకునికి ఉన్న తీయని చూపులకి' దీన్ని ఆపాదించారు. అత్యయిక పరిస్థితి (emergency) తరువాతి రోజులు పరిశోధనాత్మక కథనాలకు బంగారు దశ అని చెప్పవచ్చు. మా పనిని గుర్తించడంతో పాటు అది అవార్డుని కూడా తెచ్చిపెట్టింది. పరిశోధనాత్మక కథనాలు తీసుకు వచ్చిన మొదటి మహిళను అయినప్పటికీ డెక్కన్ హెరాల్డ్ పత్రిక ప్రాంతీయ పత్రిక అవటం వల్ల జాతీయస్థాయిలో మాకు పెద్ద గుర్తింపు రాలేదు. తరువాత, ఓ సంవత్సరం బెస్ట్ ఫీచర్ విభాగంలో కర్నాటక జర్నలిస్ట్ సంఘం నా కథనాన్ని ఎంపిక చేసింది.

......

వివాహం అయిన మూడేళ్ళకి 1970ల చివరిలో హైదరాబాద్ తిరిగొచ్చాను. ఇక్కడ ఆంగ్ల భాషలో పాత్రికేయ వృత్తికి ఉన్న అవకాశాల గురించి ఆరా తీసినప్పుడు రెండు న్యూస్ ఏజెన్సీలు, రెండు దిన పత్రికలు కనిపించాయి. ఉప సంపాదకురాలిగా, రిపోర్టర్‌గా నాకు అప్పటికి ఉన్న అనుభవం నా జెండర్ ముందు దేనికీ పనికి రాలేదు. ఉన్న దిన పత్రికల్లోను, న్యూస్ ఏజెన్సీల్లోను కేవలం ఒకే ఒక్క మహిళా రిపోర్టరు ఉన్నప్పటికీ, ఇంకొక ఉప సంపాదకరాలిని తీసుకోవడం 'అనవసర భారం'గా భావించారు. ఈనాడులో దరఖాస్తు చేసాను. నన్ను ఇంటర్వ్యూకి పిలిచి ఈనాడు నియమాల ప్రకారం బైలైనులో నాపేరు రాదని, దానికి సిద్ధంగా ఉంటారా అని అడిగారు. డెక్కన్ హెరాల్డ్‌లో నాకు చాలానే బైలైన్స్ ఉన్నాయి కాబట్టి సరే అన్నాను. అయినప్పటికీ నాకా ఉద్యోగం రాలేదు.

అదృష్టవశాత్తు, ఆ సమయంలోనే ఒక సీనియర్ తెలుగు పాత్రికేయులు ఒక ఫీచర్స్ ఏజెన్సీని మొదలు పెట్టాడు. ఇలాంటిది ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటిది. ఈనాడులో పాత్రికేయుల తిరుగుబాటు తరువాత చాలా మందికి ఉద్యోగాల్లేకుండా పోయాయి. మూడేళ్ళ నా అనుభవం, అవార్డుల తరువాత తిరిగి ఎంత జీతానికైతే మొదలుపెట్టానో మళ్ళీ అదే 300/- రూపాయలకి మరియు 35 రూపాయల బస్ పాస్‌కి చేరాను. తరువాత జర్నలిస్టులకి ఉచిత బస్ పాస్ సౌకర్యం రావడంతో నాకు ఉద్యోగమిచ్చిన వారికి ఆ భారం కూడా పోయింది.

చాలీ చాలని బడ్జెట్‌తో ఇల్లు గడవడం కష్టంగా ఉన్న పరిస్థితులు నన్ను మరొక సారి ఆలోచించుకునేటట్లు చేసాయి. ఒక కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి పరిశోధనా సంస్థలో సహ సంపాదకురాలిగా అవకాశం వస్తే చేరాను. అక్కడి నా పై అధికారి చాలా కఠినమైనవాడు. ఇంత వరకు నా వృత్తిలో నేనెప్పుడూ అలాంటి వాడిని చూడలేదు. అక్కడున్న ఐదేళ్ళలోనే నా జుట్టు మొత్తం తెల్లబడి పోయింది. అదే డిపార్ట్‌మెంటులో ఉప సంపాదకురాలి ఉద్యోగానికి ప్రకటన వస్తే దరఖాస్తు చేయాలనుకున్నప్పుడు చాలా గొడవ చేసాడు (అతనికి ఆ ఉద్యోగం వచ్చినప్పుడు నలభయిల్లో ఉన్నాడు నాకేమో 35 ఏళ్ళు). నాలాంటి సీనియర్లు డిపార్ట్‌మెంట్‌కి అవసరం లేదని నేరుగా డైరెక్టర్



జనరల్‌కే లేఖ రాసాడు. దానితో ఆ ప్రకటనే విరమించుకున్నారు. ఆ ఉద్యోగం వదిలేద్దామని చెప్పి నేను చదువుకున్న చోట ఒక ఖాళీ ఉందని తెలిసి అప్లై చేసాను. ఉద్యోగం వచ్చింది. అలా ఉస్మానియా యూనివర్శిటిలో కమ్యూనికేషన్స్ అండ్ జర్నలిజంలో లెక్చరర్‌గా చేరాను. ఉద్యోగపరంగా నాకే మాత్రం తృప్తిలేదు.

మూడేళ్ళ తర్వాత రాజీనామా చేసి డెక్కన్ హెరాల్డ్‌లో ఆంధ్రప్రదేశ్ కరస్పాండెంట్‌గా చేరాను. హైదరాబాద్‌లోని ప్రాంతీయ పత్రికలో ఇది చాలా ప్రముఖమైన స్థానం. ఎందుకంటే ఇక్కడి రాజకీయ పరిస్థితులు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. 1980ల్లోనే ఎన్.టి.రామారావు అనే ఒక తెలుగు సినిమా హీరో తెలుగు దేశం పార్టీ పెట్టి ఎవరూ ఊహించని రీతిలో, తనదైన శైలిలో ముఖ్యమంత్రి అయ్యాడు. కాంగ్రెసును తుడిచి పెట్టాడు. అలా ఎనిమిదేళ్ళు రీసెర్చ్, టీచింగ్‌లాంటి పనులు చేసిన తరువాత నా మొదటి ప్రేమ అయిన జర్నలిజానికి తిరిగొచ్చాను. ఇంక వెనక్కి తిరిగి చూసుకోలేదు.

నా రిపోర్టింగ్ శైలి, నేను రాసిన వివిధ రకాల కథనాల గురించి తెలిసిన ఒక సహ సంపాదకుడు నన్ను నమీబియానికి పంపించమని సంపాదకునికి ప్రతిపాదన చేసాడు. నమీబియా దక్షిణ ఆఫ్రికాకి అప్పుడు ఒక కాలనీగా ఉండేది (ప్రపంచంలోనే చిట్ట చివరిది). అపార్థిడ్ నుండి బయటపడిన దక్షిణ ఆఫ్రికా వలస ప్రజల బాధలని అర్థం చేసుకుని స్వాతంత్ర్యం ఇవ్వాలని నిర్ణయించుకుంది. డెక్కన్ హెరాల్డ్ పత్రిక విస్తృతంగా ఈ విషయాన్ని కవర్ చెయ్యాలని నిర్ణయించుకుంది. అక్కడకు వేళ్ళే ముందు భూగోళాన్ని కదం తొక్కిస్తున్న ఆఫ్రికాపై ఒక అవగాహన రావడం కోసం ఢిల్లీలోని ఒక స్పెషలిస్టు దగ్గరకు నన్ను పంపారు. అయితే నాకు హోటల్ రిజర్వేషన్ లేదన్న సంగతి తెలిసి అతను అవాక్కయ్యాడు. ప్రపంచ మీడియా మొత్తం నమీబియా రాజధాని విండ్‌హోక్‌లో దిగుతుందని; ఆ చిన్న పట్టణంలోని హోటళ్ళ రూములన్నింటిని ఆ ప్రభుత్వం వివిధ దేశాధినేతల కోసం రిజర్వు చేస్తుందని; ఆ పరిస్థితుల్లో అక్కడికి హోటల్ రిజర్వేషన్ లేకుండా వెళ్ళటం తెలివి తక్కువ పనని అతడు చెప్పాడు. "దీనికి తోడు ఒక మహిళా రిపోర్టర్‌ని పంపిస్తున్నారా?" అని నా సహోద్యోగిపై అరిచాడు. "పైగా విదేశాలకు వెళ్ళడం ఆమెకు ఇదే మొదటి సారి" 'హైదరాబాద్ వెళ్ళిపో' అని కూడా అన్నాడు. నేను భయపడి పోయాను. నా వసతికి, నా జెండర్‌కి సంబంధం ఏమిటో నాకర్థం కాలేదు. ఇంకొక మూడు గంటల్లో ప్రయాణం ఉందనగా ఒక భయ భూతాన్ని తీసుకొచ్చి నా మనసులో కూర్చోబెట్టాడు. నాపై నాకున్న అకుంఠిత విశ్వాసం, నమ్మకం దెబ్బతిన్నాయి. ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళే దారిలో నా సహోద్యోగి నా భయాల్ని పోగొట్టే ప్రయత్నం చేసాడు. తన స్నేహితుడి వ్యాఖ్యాలను పట్టించుకోవద్దని, నాకు మంచి భవిష్యత్తు ఉందని "నువ్వెవరో నాకు తెలుసు కాని నా స్నేహితునికి తెలియదని" నచ్చ చెప్పాడు. అయితే నా ఆందోళన తగ్గలేదు. మొత్తానికి విండ్‌హోక్‌లో నాకు వసతి దొరికి నమీబియా స్వాతంత్ర్య దినాన్ని కవర్ చేయగలిగాను.

ఆ వెంటనే, వాషింగ్టన్ డి.సిలో రిపోర్టర్లు కలలుకనే విదేశీ కరస్పాండెంట్‌గా చేసే అవకాశం వచ్చింది. నా కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు, స్నేహితులు నన్ను నిరుత్సాహపరిచారు. మూడేళ్ళు, ఎనిమిదేళ్ళు ఉన్న కూతుళ్ళని వదిలి ఎలా వెళ్తావు; అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎవరూ ఉండరని; మాతృత్వాన్ని, భార్యగా బాధ్యతని పక్కన పెట్టి ఒక భారతీయురాలిగానో, ఒక స్త్రీగానో ఆలోచించకుండా వృత్తికి ప్రాముఖ్యత ఇస్తున్నానని పిల్లలు నేను లేకపోతే ఉండలేరని ఇలా చాలా చెప్పారు. కాని, నా భర్త నా నిర్ణయాన్ని చాలా గట్టిగా సమర్థించారు. కొత్త అనుభవాల్ని వెతుక్కుంటూ నేను ప్రయాణమయ్యాను. ఒక విదేశీ కరస్పాండెంట్‌గా బహుశా నేను మొట్ట మొదటి పాత్రికేయురాలి ననుకుంటా. అంతే కాకుండా ఒక ప్రాంతీయ పత్రిక ఇంత ధైర్యంగా ఒక మహిళను పూర్తికాల పరిశోధకురాలిగా వాషింగ్టన్ డి.సి.కి పంపించడం ఇంకా అసాధారణమైన సంఘటన.

నన్ను ఒక ఒంటరి మహిళగా భావించి ఏ పురుషుడు పైకి ఎగబడకుండా ఉండడానికి నా పెద్ద కూతుర్ని నాతో తీసుకు వెళ్ళాను. అయితే త్వరలోనే అలా ఆలోచించే మగవాళ్ళకి నా కూతురు ఏ విధమైన అడ్డంకి కాదని నాకర్థమయింది. అక్కడున్న నాలుగేళ్ళలో జార్జి బుష్ చివరి సంవత్సరాలు, బిల్ క్లింటన్ మొదటి ప్రెసిడెన్సీని కవర్ చేశాను. సోవియట్ రష్యా పతనాన్ని కవర్ చేయడానికి మాస్కో వెళ్ళడంతో నా కల సాకారమయింది. స్వాతంత్ర్య పూర్వ తరానికి చెందిన భారతీయురాలిగా నాకు రష్యా అంటే ప్రత్యేక అభిమానం ఉంది. నాలుగేళ్ళ తరువాత తిరిగి హైదరాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. ఇది నా కుటుంబ సభ్యులతో ఉండటానికి అవకాశం ఇచ్చింది. ప్రత్యేక కరెస్పాండెంట్‌గా డెక్కన్ హెరాల్డ్‌లో మరి కొన్నాళ్ళు పని చేసాక రిటైర్‌మెంట్ తీసుకుని తిరిగి అధ్యాపక వృత్తిలోకి వెళ్ళాను.

**ఒక పాత్రికేయురాలు ఎదుర్కొనే సవాళ్ళు**

మిగతా రంగాల్లో కన్నా ఒక మహిళా రిపోర్టర్ తన వృత్తిలో ఎక్కువ సవాళ్ళు ఎదుర్కొంటుందా? కాకపోవచ్చు. వృత్తి పరంగా మిగతా మహిళల్లాగానే ఒక మహిళా రిపోర్టర్, జర్నలిస్టు కూడా వివక్షని, పక్షపాతాన్ని, విరోధాన్ని ఎదుర్కొంటుంది. లైంగిక వేధింపులు పితృస్వామిక వ్యవస్థలో ఉండనే ఉంటాయి. రిపోర్టింగ్‌లో ఆమె నిబద్ధత, వృత్తి పట్ల నిజాయితీ, సవాళ్ళను ఎదుర్కొనే తత్వం, ఆమె సాహసం ఇవన్నీ కూడా ఆమె మానసిక శక్తిపై ఆధారపడి ఉంటాయి.

రెండవ తరం మహిళా జర్నలిస్టుగా, జాతీయ మహిళా కమీషన్ పై నా డాక్టరేటు కోసం నేను చేసిన పరిశోధనలో తేలిందేమిటంటే మీడియాలో నేనున్న ముప్పై ఏళ్ళలో పరిస్థితుల్లో ఏమీ మార్పు రాలేదని. మీడియా ఆవరణల్లో స్త్రీలెప్పుడూ రెండవ తరగతి పౌరులే. సహోద్యోగుల నుండి లైంగిక వేధింపులు ఎదుర్కొంటారు. వారు ఒక వేళ పురుష సహోద్యోగుల కన్నా బాగా పని చేస్తే వెంటనే వారి యోగ్యతని, నడవడికని అనుమానిస్తారు. వారి విజయం సంపాదకుడినో, ఛీఫ్ రిపోర్టర్‌నో ట్రాప్ చేయడం వల్ల వచ్చిందని ప్రచారం చేస్తారు. అంతే కాక వారు వార్తలు సేకరించడానికి వెళ్ళే మగవాళ్ళు, ముఖ్యంగా రాజకీయనాయకులలాంటి వారిని లొంగదీసుకోవడం వల్లకూడా మహిళా జర్నలిస్టులకి విజయం వరిస్తుందనుకుంటారు. టెలివిజన్ లాంటి మాధ్యమాల్లో ఈ మధ్య మహిళా జర్నలిస్టులు ఎక్కువగానే కనిపిస్తున్నప్పటికీ అవకాశాలు దొరకడంలోనూ, పదవులు పొందడంలో, బీట్లు రావడంలో ఇంకా వెనుకబడే ఉన్నారు.

ఒక మహిళ అయి ఉండి, విజయాలు సాధించడమంటే అది ఒక శాపం. మీ సహోద్యోగులు, మీపై స్థాయిలో ఉన్న వారు చాలా అవమానంగా భావిస్తారు. నాకు వాషింగ్టన్ డి.సిలో అవకాశం వచ్చినప్పుడు విదేశీ పేజీని చూస్తున్న మా సీనియరు ఒకరు తనకు రావలిసిన అవకాశం నాకు వచ్చిందనే కోపంతో కనీసం ఇరవై కథనాలను చంపేసాడు. అప్పట్లో ఇంటర్నెట్ లాంటి సౌకర్యాలు లేకపోవడం, ఫోన్ చేయడం అనేది ఖర్చుతో కూడుకున్నది కావడంతో కనీసం నా కథనాలు ప్రచురింపబడ్డాయో లేదో కూడా తెలుసుకునే అవకాశం ఉండేది కాదు. ఎప్పుడో పది, పన్నెండు రోజులకి భారతీయ ఎంబసీలో మన పత్రికలు చూసే అవకాశం దొరికేది. ఒక రోజు మా సంపాదకుడు ఫోన్ చేసి నేను కథనాలు పంపడం లేదని ఫిర్యాదు చేసాడు. నేను వెంటనే అప్పటి వరకు నేను పంపిన కథనాల లిస్టుని టెలీ ప్రింటర్ ద్వారా పంపిచాను. వెంటనే ఆ విదేశీ సంపాదకుని బదిలీ జరిగింది. సాధారణంగా ఎవరైనా మహిళా జర్నలిస్టులు ప్రత్యేక కథనాలు కాని, స్కూప్‌లు కానీ చేసే అవకాశం పొందినపుడు పురుష సహోద్యోగులు అసూయ పడడం మామూలే. కొంత మంది అసూయా పరులైన ఛీఫ్ రిపోర్టర్లు అకారణంగా తమ బీట్ల నుండి తొలగింపబతారు. కొన్ని సార్లు బైలైన్లో 'పొరపాటున' వారిపేరు ప్రచురింపక పోవడం లాంటివి కూడా జరుగుతాయి.

వాషింగ్టన్‌లోని భారతీయ ప్రెస్‌లో ఏడుగురు పురుషులు, ముగ్గురు స్త్రీలు పని చేసేవాళ్ళు. కొత్తగా వెలువడే ప్రతి వార్తకు సంబంధించిన ముఖ్య అంశాలని చర్చించడానికి మగవారంతా ఒక జట్టుగా కూర్చునేవారు. అందులో ఇద్దరం మహిళలం ఎప్పుడూ జట్టు బయటే ఉండాల్సి వచ్చేది. మూడవ ఆమె పురుషులలో ఒకరికి భార్య కావడంతో ఆమెకు కూడా ఆ జట్టులో భాగస్వామ్యం ఉండేది. ఏదైనా పత్రికా సమావేశంలో

మహిళలు ప్రశ్నిస్తే వారిని వెటకారంగా చూసేవారు. లేకపోతే గట్టిగా నవ్వడమో లేక చెత్త కామెంట్లు విసరడమో చేసేవారు. పత్రికా సమావేశం తరువాత మహిళా జర్నలిస్టులు ఏదైనా ప్రత్యేక వ్యాఖ్య కోసం అధికారుల వద్దకు వెళ్తే చాలా చెత్తగా మాట్లాడేవారు. అందులో ముగ్గురు మగవాళ్ళైతే ఒక న్యూస్ ఏజెన్సీలాగే ప్రవర్తించేవారు. ఒకతను తన భార్యను రిపోర్టింగ్‌కి పంపించి అతను మిగతా వారితో కూర్చుని కథనాలు తయారు చేసేవాడు. ఒకరు అసలు కథను వాడితే మిగిలిన వాళ్ళు దాన్నే రకరకాలుగా మార్చి రాసేవారు. అంత ఆహ్లాదకరమైన క్లబ్‌లోకి మమ్మల్నెప్పుడూ రానీయలేదని నేను వేరేగా చెప్పనక్కరలేదు.

మా కథనాలు ప్రచురింపబడిన తరువాత వాటిని చీల్చి చెండాడే వాళ్ళు. కొన్నిసార్లు "పరవాలేదే ఆమె అప్పుడప్పుడూ రాయగలదు" అని ఒప్పుకొనే వారు. కావాలని మమ్మల్ని తప్పుదారి పట్టించేవారు.

లైంగిక వేధింపులు అనేది ఒక మహమ్మారి వ్యాధిలాంటిది. మీడియాలో స్త్రీల పట్ల సంరక్షణా ధోరణిలో ప్రవర్తిస్తారు, లేదా కప్పిపెట్టేస్తారు. ఒక వేళ తప్పు చేసిన వారిపై ఏదైనా చర్య తీసుకున్నా అది మోచేయిపై చిన్న దెబ్బ వేసినట్లు ఉండేది. తన విధి నిర్వహణలో ఉన్నప్పుడు ప్రతి మహిళా జర్నలిస్టు లైంగిక వేధింపుల నెదుర్కొంటుంది. కాని పై అధికారులకు ఫిర్యాదు చేయడం, జరిగిందని చెప్పుకోవడం ఎప్పుడో తప్ప జరగదు. ఈ వేధింపులు పై అధికారుల నుండి కావచ్చు, సహోద్యోగుల నుండి కావచ్చు లేదా వార్తలు సేకరించడానికి వెళ్ళిన ప్రదేశంలోని వ్యక్తుల నుండి కావచ్చు. నాకు జరిగిన ఒక సంఘటన గురించి చెప్తాను. వంటరిగా, కూతురిని దగ్గర పెట్టుకుని వాషింగ్టన్‌లో ఉన్న నేను, అమెరికన్ సంస్కృతి ఆచార వ్యవహారాలు తెలియని నేను ఒక వార్త సేకరించే క్రమంలో ఓ డాక్టరుని ఇంటికి పిలిచాను. అతనికి అరవై ఏళ్ళుండవచ్చు. అతనిది మైసూరు. చీకటి పడిన తరువాత కూడా అతను కదలలేదు. నాకు కన్నడం తెలియదనుకుని తన కూతురి నుండి ఫోన్ వస్తే కన్నడంలో ఎక్కడో ఉన్నానని చెప్పాడు. (నాకతన్ని వెళ్ళిపొమ్మని చెప్పే ధైర్యం లేదు. నేనెప్పటికైనా దారికొస్తానని చాలాసేపు వేచిచూసాడు). ఇంకోసారి పాకిస్తాన్‌లో తన విధి నిర్వహణను ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన అమెరికన్ అంబాసిడర్‌ని ఇంటర్వ్యూ చేయడానికి వెళితే అతను నాతో "టామ్ టామ్" ఆడటం ప్రారంభించాడు. హడావిడిగా ఇంటర్వ్యూ ముగించుకుని అక్కడి నుండి బయట పడ్డాను.

ప్రపంచ బ్యాంకులోని భారతీయ కార్యాలయంలో పని చేస్తున్న ఓ కర్నాటక క్యాడర్‌కి చెందిన ఒక ఐ.ఏ.ఎస్ అధికారిని కలవడానికి వెళ్ళాను. ఆ బ్యాంకులో ఉన్న క్యాంటీన్లో భోజనం చేసిన తరువాత అతను నాతో పాటు మెట్రో వరకు వచ్చాడు. ఒక చోట రెడ్‌లైట్ పడితే ఆగాము. "సెక్స్ కోసం నువ్వేం చేస్తావు" అని అతను నన్ను అడిగాడు. నాకు నోటి నుంచి మాట రాలేదు.

"నేనున్నానని మర్చిపోకు" అని ప్రస్తావించాడు. ఈలోగా గ్రీన్ లైట్ పడింది. నేనక్కడి నుండి పారిపోయాను.

ఇక ఇక్కడి విషయానికి వస్తే బయట వార్తా పత్రికల కరస్పాండెంట్‌లతోనే చనువుగా ఉండాల్సి వచ్చేది. కాని అది వారికి అది ఆహ్వానంలా కన్పిస్తోందన్న సంగతి తెయడానికి నాకెక్కువ సమయం పట్టలేదు.

ఒక్కోసారి నేను వంటరిగా హోటల్ గదిలో ఉండాల్సి రావడం చాలా అనవసరమైన గుర్తింపునిచ్చేది. ఒక రోజు రాత్రి త్రివేంద్రంలో ఓ హోటల్ గదిలో పడుకోవడానికి సిద్ధపడుతుండగా నా ఫోన్ మోగింది. అవతలినుంచి ఒక మగ గొంతు "నేను రానా"? అని అడుగుతున్నాడు. హోటల్ మానేజిమెంట్‌ని నేను గట్టిగా నిలదీయటంతో వారు ఆ ఫోన్ ఎవరు చేసారో తెలుసుకుని ఆవెయిటర్ని విధుల నుండి తొలగించారు.

సాధారణంగా ఆడవాళ్ళు సుతిమెత్తనైన పనులే చేయగలరని నమ్ముతుంటారు. రాజకీయాలు, నేరాలులాంటి కఠినమైన విషయాల గురించి రాయటం వారివల్ల కాదని మగవాళ్ళు భావిస్తారు. మొదట్లో అందాల పోటీలు, పూల ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలులాంటివి రిపోర్టు చేయడానికి ఆడవాళ్ళని పంపేవారు ఈ రోజుల్లో కూడా మహిళా జర్నలిస్టులను కొన్ని అంశాలకే పరిమితం చేస్తున్నారు. రాజకీయ అంశాలు చాలా అరుదుగా లభిస్తాయి.

అవును, కొంత మంది మమ్మల్ని నిరాశ పరిస్తే, కొంత మంది మమ్మల్ని ప్రోత్సహించారు. కొంతమంది మగవాళ్ళు మమ్మల్ని కిందకు పడేయాలని చూస్తే, కొంత మంది మమ్మల్ని పైకి లేవడానికి సహకరించారు. కొంతమంది మా శక్తియుక్తుల్ని గుర్తించి ప్రోత్సహించారు. కొందరు మాకు సహకరించడానికి నిరాకరిస్తే, కొందరు మాకు సహాయం చేయడానికి ఎప్పుడూ ముందుండే వారు.

**ముగింపు:**

ఇలా ఒక మహిళా రిపోర్టరుగా నేను చూసిన ఎత్తు పల్లాలు, బాధల వల్ల ఏదైనా ఫలితం దక్కిందా? సందేహం లేదు! గంటల కొద్దీ పని చేసినప్పటికీ, రోజువారీ లక్ష్యాలు చేరుకోవలసినప్పటికీ, ఎంతో ఒత్తిడి ఉన్నప్పటికీ, ఆ రోజు కలవాల్సిన వాళ్ళ దగ్గరకి వెళ్ళేటప్పుడు ఎంతో ఆత్రుత ఉన్నప్పటికీ, ఎన్నో రకాల సవాళ్ళను ఎదుర్కో వలసి వచ్చినప్పటికీ, మా కథనాలకి అనుమతి లభించనప్పుడు మేము భంగపడినప్పటికీ, వివక్ష, ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ప్రతీక్షణమూ కూడా విలువైనదే!

**అనువాదం: డి.సుజాత**

రచయిత్రి పాత్రికేయురాలు, అధ్యాపకురాలు



# మసక బారుతున్న స్వప్నం: భారతదేశంలో అభివృద్ధిపరమైన సమాచార ప్రవంతి, కమ్యూనిటీ రేడియోలు

■ వినోద్ పావరాల

ప్రసార మాధ్యమాల ప్రపంచీకరణకు ప్రతిఘటన జాతి రాజ్యాలు, అంతర్జాతీయ వాణిజ్య కార్పొరేషన్లు సాంకేతిక అభివృద్ధిని నియంత్రించి, తమ స్వప్రయోజనాలకి వాడుకుంటాయనే నిర్ధారించబడిన పూనికపై ఆధారపడింది. 1990ల నుండి మనమొక విచిత్రమైన పరిస్థితిని చూస్తున్నాము: ఒక పక్క మీడియా దుకాణాలు తామర తంపరగా విస్తరించటం; ఇంకో పక్క అవి అందిస్తున్న సమాచార నాణ్యత తీవ్రంగా, వేగంగా పడిపోవటం.

భారతదేశంలోని అనేక పౌర సమాజ సంస్థలు, ప్రభుత్వ ఆధిపత్యంలో నడిచే మీడియా, వాణిజ్యపరమైన మీడియాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, జన సమ్మతం కల, కమ్యూనిటి ఆధారిత ప్రత్యామ్నాయ ప్రసార మాధ్యమాల ఆవశ్యకతని ప్రచారం చేస్తున్నాయి. అవి ప్రజా నాటక సంస్థలు, చిన్న, స్థానిక వార్తా పత్రికలు, కమ్యూనిటీ రేడియోలు, ప్రజా భాగస్వామ్యంతో నడిచే వీడియోగ్రఫీ, ప్రత్యామ్నాయ డాక్యుమెంటరీ వంటివి. వీటి ద్వారా అభివృద్ధి సమాచార ప్రవంతి ఏ ఉద్దేశంతో ప్రారంభమయిందో ఆ లక్ష్యాలని తిరిగి సాధించుకోవచ్చని సమాచార రంగంలోని అగ్రగామి మేధావుల అభిప్రాయం. కమ్యూనిటీ రేడియోలను ప్రారంభించి ప్రజల ఆస్తి అయిన ఆకాశ తరంగాలలో వాటాని సాధించటం ఈ ప్రజా ప్రతిఘటనలో కీలక భాగం.

పౌర సముదాయాలు, ప్రజా సంఘాలు, మీడియా ఆందోళనకారులు ప్రపంచ వ్యాప్తంగా రాజ్యం, కార్పొరేటు మీడియాల వల్ల క్షీణించిన పౌర సమాజాన్ని పునరుజ్జీవింప చేయటానికి తగిన వ్యవస్థలు అవసరమని వాదిస్తున్నారు. రేడియో ప్రసారాలని అల్లుకుని ఉన్న రాజకీయ వాస్తవాలని పరిశీలించిన మీదట కమ్యూనిటీ రేడియో ఉద్యమకారులు దశాబ్దం కిందటే దేశంలో రేడియో ప్రసారాలు, "ప్రజాస్వామిక ప్రవేశ సూత్రాలపై పని చేయాలని ప్రతిపాదించారు" (డి.డి.ఎస్.2000)

**అభివృద్ధి సమాచార ప్రవంతి : పెత్తందారీ ధోరణులు, వాటిని అధిగమించటం**

రెండవ ప్రపంచ యుద్ధం తరువాతి కాలంలో స్వాతంత్ర్యం సాధించిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు ప్రగతిశీల, స్వయం పోషక, పారిశ్రామికీకరణ మార్గం చేపట్టిన దశలో ఏర్పడిన ఈ పెత్తందారీ ధోరణులకి చాలా పెద్ద, ఎగుడు దిగుడు చరిత్ర ఉంది. అభివృద్ధి అన్న పదం కేంద్రీకృత ప్రణాళికా నిర్మాణం, భారీ పారిశ్రామికీకరణ, పై నుండి కిందకి విస్తరించాల్సిన సమాచార సదుపాయాల విస్తరణకు తోడ్పడే ఆధునికత, ఆర్థిక పురోగతి, సాంకేతిక విస్తరణ వంటి విషయాలతో ముడిపడి పోయింది. వీటి కవసరమయినట్లు ప్రజల నమ్మకాలు, వైఖరులు, ప్రవర్తనలలో మార్పుని తీసుకు రావటమే ప్రసార మాధ్యమాల పాత్ర.

వలసానంతర భారత దేశంలో రాజకీయ, పాలనా శ్రేణులలోని కులీన వర్గాలు సమాచార ప్రవంతి, ప్రసార మాధ్యమాల ద్వారా గ్రామీణ పేద ప్రజల వైఖరులు మార్చి కావాల్సిన సామాజిక మార్పులని సాధించవచ్చనే ఈ స్వప్నాన్ని అత్యుత్సాహంతో స్వీకరించారు. కుటుంబ నియంత్రణని, వ్యవసాయ విప్లవాన్ని ప్రోత్సహించటానికి చేపట్టిన ప్రచార కార్యక్రమాలు ఇప్పుడు భారతదేశ అభివృద్ధి కథనంలో పురాణ గాధల స్థాయికి చేరుకున్నాయి. 1950లలో మహారాష్ట్రలో మెరుగైన వ్యవసాయ పద్ధతులని ప్రోత్సహించటానికి నిర్వహించిన రేడియో ఫార్మ్ ఫోరంలు, 1970లలో అతి పెద్ద సాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్పెరిమెంట్ వీటికి మంచి ఉదాహరణలు.

1970లలో తమ తమ సామాజిక వాస్తవాలు, సాంస్కృతిక వాతావరణంతో పొంతన లేని ఆధునికత, ఆర్థికాభివృద్ధిపై అభివృద్ధి చెందుతున్న దేశాలలో భ్రమలు తొలగటం మొదలయింది. విస్తరణ కార్యక్రమాలపై జరిగిన సమీక్షలు గ్రామాలలోని సామాజిక నిర్మాణాలు పేదలకి ఏవీ అందకుండా చూసాయని, కాబట్టి పైనుండి కిందికి అభివృద్ధి చేరుతుందనే సిద్ధాంతానికి ఆధారాలు లేవని నిరూపించాయి. సమాచార సదుపాయాల విస్తరణ ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి, పట్టణ మధ్య తరగతి ప్రజలకి నిరర్థక వినోద కార్యక్రమాలు అందించే స్థాయికి దిగజారాయి. సమాచార వ్యవస్థని అభివృద్ధి కోసం ఉపయోగించే ప్రయత్నాలని కులీన అధికార వ్యవస్థ, సామాజిక నిచ్చెనమెట్ల వ్యవస్థ కలిసి నిర్వీర్యం చేసాయి. భారత దేశంలో 1975లో విధించిన అత్యవసర పరిస్థితి సమయంలో రాజ్యం సాధికారత కోల్పోవటం, పార్టీ రాజకీయాలపై అసంతృప్తి పెరగటం, 1980ల నుండి సామాజిక ఉద్యమాలు, ప్రభుత్వేతర సంస్థలు పర్యావరణం, జండర్ సమానత్వం, రైతుల ఆదివాసీల హక్కుల గురించి పోరాడటం వలన అప్పటికి ప్రబలంగా ఉన్న అభివృద్ధి చట్రం తీవ్ర విమర్శకి గురయ్యింది. ఒక ప్రత్యామ్నాయ, ప్రజా భాగస్వామ్యంతో కూడిన అభివృద్ధి నమూనాపై చర్చ ప్రారంభమయింది.

సమాచార ప్రవంతికి సంబంధించిన కొత్త దృక్పథాలు వికేంద్రీకరించిన ప్రసార మాధ్యమాలు ఉండాలని, అవి సమాచారాన్ని అందించే వారిపై కాక, అందుకునే వారిపై దృష్టి పెట్టాలని; అలాగే సమాచారం ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకునే రీతిలో ఉండాలి తప్ప ఎవరినీ ఏ విషయం గురించి ఒప్పించే రీతిలో ఉండకూడదనీ ప్రతిపాదించాయి. గ్రామీణ ప్రజలకి తమ అభివృద్ధిని నియంత్రించుకోవటానికి కమ్యూనిటీ రేడియో, భాగస్వామ్యమున్న వీడియో, నాటక సంస్థల వంటి స్వతంత్ర కమ్యూనిటీ ప్రసార మాధ్యమాలు అవసరమని మీడియా ఉద్యమకారులే కాక, అట్టడుగు స్థాయి సంస్థలు ప్రతిపాదిస్తున్నాయి.

**భారత దేశంలో ప్రసార రంగ విధానం :**

ప్రసార రంగ చరిత్రని పరిశీలిస్తే, అది మారకుండా ఉండటానికి ప్రధాన కారణం రాజ్యం దానిపై నియంత్రణ కావాలని అనుకోవటమే అని అర్థమవుతుంది. డెబ్బై ఏళ్ళ తర్వాత కూడా ప్రభుత్వాల ధోరణులలో ఈ దేశంలో మొదట ప్రసార రంగాన్ని ఏర్పాటు చేసిన బ్రిటిష వారి విలువల బలమైన ఆనవాళ్ళు కనిపిస్తాయి. 1933లో అమలులోకి వచ్చిన భారతీయ వైర్‌లెస్ టెలిగ్రాఫి చట్టం ప్రకారం లైసెన్స్ లేకుండా రేడియో రిసీవర్స్‌ని లేదా వైర్లెస్ పరికరాలని కలిగి ఉండటం నేరం. ప్రస్తుతం భారత ప్రభుత్వానికి రేడియో, టెలివిజన్ ప్రసారాలపై ఉన్న గుత్తాధిపత్యం ఈ చట్టం నుండి, 1885లో చెయ్యబడిన ఇండియన్ టెలిగ్రాఫీ చట్టం నుండి వచ్చిందే. ఇది కేంద్ర ప్రభుత్వానికి వైర్లెస్ పరికరాల స్థాపన, నిర్వహణ, పని చేయటంపై ప్రత్యేక అధికారాన్ని ఇస్తుంది.

అత్యవసర పరిస్థితి సమయంలో ప్రభుత్వ ఆధిపత్యంలో నడిచే ప్రసార రంగ వ్యవస్థ యొక్క విశ్వసనీయత పూర్తిగా దెబ్బ తిన్నది. తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రేసేతర ప్రభుత్వం కేవలం ప్రభుత్వ ప్రచారాలకి మాత్రమే పరిమితం కాకుండా ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలకి నిజమైన స్వయం ప్రతిపత్తినిస్తామని వాగ్దానం చేసింది. రెండు దశాబ్దాల పాటు ఢిల్లీ ప్రభుత్వాలు ఈ స్వయం ప్రతిపత్తిని గురించి వివిధ ప్రతిపాదనల ద్వారా మిశ్రమ సంకేతాలు ఇస్తూ వచ్చాయి. ఈ ప్రక్రియ చివరికి 1997లో పార్లమెంటులో ప్రసార భారతి చట్టం ప్రవేశపెట్టటానికి దారి తీసింది.

ఇక 1990లలో కేబుల్ ద్వారా ప్రసారమయ్యే ఉపగ్రహ టెలివిజన్ ఛానెళ్ళు దేశం మొత్తం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో స్వయంప్రతిపత్తి వాదనలు, పోటీతత్వం, వ్యాపార సమర్థత రూపంలో బయటికొచ్చాయి. ప్రసార రంగ పరిస్థితులు 1990లలో 'సాటిలైట్ ఆక్రమణ' (గా పిలవబడే) పరిణామం వల్ల చాలా మారాయి (పావరాల మరియు కుమార్ 2001). ఫిబ్రవరి 1995లో ప్రసార మంత్రిత్వ శాఖ మరియు బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ కేసులో సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు నిచ్చింది. ఆ తీర్పులో "ఆకాశ తరంగాలు ఒక ప్రజా సొత్తు. వాటిని ప్రజావసరాల కోసం వాడాలి" అని పేర్కొంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుని ఊతగా తీసుకుని అనేక పౌర సమాజ సంస్థలు రాజ్య

నియంత్రణలో గాని లేదా మార్కెట్ నియంత్రణలోని గాని లేని ప్రత్యామ్నాయ ప్రసార వ్యవస్థని స్థాపించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయా సంస్థలు కమ్యూనిటీ రేడియోని సాధికారతకి, అట్టడుగు స్థాయి అభివృద్ధిలో కమ్యూనిటీలు భాగస్వాములు కావాలంటే వారిని చైతన్యపరచటానికి, వారు తమ సామర్థ్యం పెంచుకోవటానికి పనికొచ్చే సాధనంగా పరిగణించాయి.

**భారత దేశంలో కమ్యూనిటి రేడియో : ప్రజారంగ పరిధి పునర్నిర్వచన**

ఎఫ్ ఎం స్టేషన్ల స్థాపన ద్వారా రేడియో వ్యాపారీకరించబడినప్పటికీ ఎప్పటినుండో అడుగుతున్న మూడవ శ్రేణి, లాభాపేక్ష లేని, కమ్యూనిటి రేడియోకి 2003లో కేవలం కాంపస్‌లకి పరిమితమయిన అనుమతులు లభించాయి. ప్రముఖ విద్యా సంస్థలకు తమ ప్రాంగణాల్లో ఎఫ్ ఎం ట్రాన్స్‌మిటర్లు పెట్టుకుని రేడియో స్టేషన్లను నడపటానికి అవకాశం లభించింది. రేడియోపై ప్రభుత్వం, మార్కెట్ ఆధిపత్యాన్ని ఇది కొంతమేరకు తగ్గించింది కానీ వేర్పాటువాదులు, విద్రోహ శక్తులు, మిలిటెంట్లు వీటిని వాడుకుంటారనే నెపంతో ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రజాస్వామీకరించటానికి ఒక పట్టాన ఒప్పుకోలేదు. ఒక దశాబ్దం పాటు ప్రభుత్వేతర సంస్థలు, మీడియా ఉద్యమకారులు జరిపిన ప్రచారం ఫలితంగా కేంద్ర కేబినెట్ నవంబర్ 2006లో కొత్త కమ్యూనిటీ రేడియో విధానాన్ని రూపొందించింది. ఈ విస్తృత విధానంలో ఎన్జీవోలకి, కమ్యూనిటీలతో అభివృద్ధి కార్యక్రమాలపై పనిచేసే సంఘాలకి కమ్యూనిటీ రేడియో స్టేషన్లను స్థాపించే అనుమతినిచ్చింది. భారత ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రకటించిన తరువాత గడిచిన 10 సంవత్సరాలలో 180 స్టేషన్లు స్థాపించబడ్డాయి. వీటిలో మూడవ వంతు ఎన్జీఓల ద్వారా నడపబడుతున్నాయి.

**ఒక దశాబ్దం తరువాత : మసక బారిన అభివృద్ధి స్వప్నం ?**

ఆకాశ తరంగాలను అందరికీ అందుబాటులో తేవాలని ఉద్యమించిన పౌర సమాజ సంస్థలు, మీడియా ఉద్యమకారులు కూడా సమాచార హక్కు వంటి విప్లవాత్మక దృక్పథం కంటే, కమ్యూనిటి రేడియోని అభివృద్ధి కోసం మెరుగ్గా ఎలా వాడుకోవచ్చనే అంశంపై దృష్టి పెట్టారు. అత్యవసర పరిస్థితి తరువాత జరిగిన సామాజిక మధనం నుండి వచ్చిన ఆయా వ్యక్తులు, సంస్థలు రాజ్యానికి ఎడంగా ప్రత్యామ్నాయ అభివృద్ధి స్వప్నాన్ని అభివ్యక్తీకరించటంలో ప్రభుత్వేతర సంస్థలు ప్రధాన పాత్ర పోషిస్తాయని బలంగా నమ్మినవారు.

యునెస్కో కమ్యూనిటి మీడియా ద్వారా గత దశాబ్ద కాలంలో మా బృందం జరిపిన పరిశోధన కమ్యూనిటీ రేడియో అభివృద్ధిలో పౌరసమాజ సంస్థల పాత్రని విమర్శనాత్మకంగా చూడాల్సిన అవసరాన్ని ఎత్తి చెప్పింది (పావరాల మరియు మాలిక్ 2007; పావరాల, మాలిక్ మరియు బేలవాడి 2010). భారత దేశంలో ఎన్జీవోలని అనుమతించిన విధానం, వాటి ఆర్థిక వనరులు మొత్తంగా ఎన్జీవోల ద్వారా కమ్యూనిటీ రేడియో అభివృద్ధికి దారితీసాయి. అట్టడుగు స్థాయి ఎన్జీవోలు ప్రజల భాగస్వామ్యంతో నిజాయితీగా కమ్యూనిటీ రేడియోలు నిర్వహించిన ఉదాహరణలు ఉన్నప్పటికీ రాను రాను దాతల నుండి వచ్చిత ఒత్తిడి వల్ల 'ప్రభావం చూపగలిగే ప్రవర్తనలని' తెస్తున్నామని చూపించటానికి ప్రజల భాగస్వామ్యం లేని కమ్యూనిటీ రేడియోలు పెరగటం మొదలైంది. నిస్సారమైన ఎన్జీవో సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న రేడియోలు ఈ రంగమంతా పెల్లుబికటం వల్ల కలిగే పర్యవసానాలు ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తున్నాయి.

తూర్పు భారతంలోని ఒక కమ్యూనిటీ రేడియో ప్రాజెక్టు 'హక్కుల' దృక్పథం అంటే ప్రభుత్వ ఉద్యోగులచే నిరంతరాయంగా గ్రామీణ ప్రజానీకానికి ప్రభుత్వ పథకాల గురించి సమాచారాన్ని అందింప చేయటంగా అర్థం చేసుకుంది. అయితే ఆ పథకాల అమలులోని లోపాల గురించి ఆ ప్రజల అభిప్రాయాలు గాని, చర్చలు గానీ లేకుండా కేవలం నిపుణుల సలహాలతో మాత్రమే నడిచే ఆ రేడియో ప్రసారాలు ప్రభుత్వ రేడియో ప్రసారాల నకలుగా తయారయ్యాయి. ఇదే ఎన్జీవో తమ దాతల వత్తిడితో తమ ప్రసారాలని మరిన్ని ప్రదేశాలకి వ్యాపింప చేసి విస్తృత పరచాలనుకుంది. దీని పర్యవసానంగా గ్రామీణ ప్రజల భాగస్వామ్యం – అంశాల ఎంపికలో, ప్రణాళికలు వేయటంలో, ప్రసారాల ఉత్పత్తిలో బాగా తగ్గటమే కాక, సరైన భద్రత, రవాణా సౌకర్యాలు లేకుండా దూర ప్రాంతాలకు వెళ్ళలేని మహిళా పాత్రికేయులందరూ పక్కకి తప్పుకున్నారు. కొద్ది మంది ద్వారా అందరికీ సమాచారం అందించవచ్చనే ధోరణితో రూపుదిద్దుకున్న ప్రసారాలు పెరిగాయి. క్రమంగా ఆ కమ్యూనిటీ రేడియో ఆ ప్రజల సమాచార ప్రసార సామర్థ్యాన్ని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని బలపరిచే శక్తిని కోల్పోయింది.

బుందేల్ ఖండ్‌లోని మూడు కమ్యూనిటీ రేడియో స్టేషన్ల గురించి మా బృందం ఈ మధ్యనే జరిపిన మరొక సమగ్ర అధ్యయనంలో (పావరాల మొ.2013) మూడింటిలో రెండు రేడియో స్టేషన్లు తమ, తమ దాతల సామాజిక, అభివృద్ధి ఎజెండాల గురించి చెప్పటమే తమ కార్యక్రమాల్లో ప్రధాన భాగంగా చేసుకున్నాయి. కమ్యూనిటీకి అవసరమైన సమాచార అవసరాలని తామనుకున్నట్లు తీర్చే ధోరణితో, అదీ ఆదేశాలు, నిర్దేశాల రూపంలో అందించే ధోరణితో పనిచేస్తున్నాయీ రేడియోలు. పెద్ద అంతర్జాతీయ దాతల నుండి నిరంతరాయంగా డబ్బు వస్తుండటంతో అనేక మందికి జీతాలిచ్చి పనికి పెట్టుకున్నారు. ఒక కమ్యూనిటీ రేడియోను దీర్ఘకాలంలో ఇలా నడపటం అసాధ్యం. హఠాత్తుగా ఆ దాతలు మేమిక డబ్బులివ్వలేమని చెప్పినప్పుడు ఆయా స్టేషన్లకి దాతల ఆధ్వర్యంలో నడిచే కమ్యూనిటీ స్టేషన్ల నమూనాలోని సవాళ్లు అనుభవంలోకి వచ్చాయి.

తెలిసో తెలియకో కొన్ని ఎన్జీవోలు కమ్యూనిటీ రేడియోని వినియోగిస్తున్న పద్ధతులు పాత తరహా ప్రభుత్వ ధోరణులని తలపిస్తుంటే, ఇంకో పక్క ఈ రంగంలో కమ్యూనిటీ రేడియో స్వయం ప్రతిపత్తిని సవాలు చేసే పరిణామాలు కూడా తలెత్తాయి. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ మధ్యనే రేడియో స్టేషన్లకు సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవటానికి సబ్సిడీ ఇవ్వాలనే పథకం ప్రారంభించింది. కమ్యూనిటీ రేడియోలకి ఇటువంటి ఆర్థిక సహాయం ఇవ్వటం ఆహ్వానించదగిన పరిణామం. అయితే మంత్రిత్వ శాఖ నియంత్రణలో కాకుండా వేరే దేశాలలో చేసినట్టు ఈ సహాయాన్ని ఒక స్వతంత్ర నిధిని ఏర్పరచటం ద్వారా చెయ్యాల్సి ఉండింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం కమ్యూనిటీ రేడియోలని స్వచ్ఛ భారత్, బేటీ బచావో, జన ధన యోజన వంటి ప్రభుత్వ పథకాల గురించిన సమాచారాన్ని తక్కువ ఖర్చుతో, మారుమూల ప్రాంతాలలో అందరికీ చేరవేసే పరికరంగా చూస్తోంది. ఆల్ ఇండియా రేడియో లాగా కమ్యూనిటీ రేడియోని కూడా సమాచారాన్ని చేరవేయటం ద్వారా ప్రజలని జాతీయ అభివృద్ధి లక్ష్యాల వైపు ఆకర్షితులని చేయటానికి, పైనుండి నిపుణులిచ్చే జ్ఞానంతో వారిని 'మంచి' పౌరులుగా తీర్చిదిద్దటానికి వాడుకునే స్థాయికి దిగజారిస్తే, స్వతంత్రత, స్వయం ప్రతిపత్తి కోసం ఇన్ని సంవత్సరాలు చేసిన శ్రమ పూర్తిగా వృధా అయినట్లే. వారి పథకాల గురించి ప్రచారం చెయ్యాలని లేదా వారికి కావాల్సిన ప్రసారాలను రూపొందించాలనే నిబంధనలతో ఇచ్చే ప్రభుత్వ ఆర్థిక నిధులతో పెద్ద సమస్య ఏమంటే, అది కమ్యూనిటీ రేడియోని దాతలకి, ఉపయోక్తలకి మధ్య ఏర్పడే సంక్లిష్ట సంబంధాల్లోకి లాగి దాన్ని ఒక సేవకుని పాత్రలోనికి కుదిస్తుంది.

ఎన్జీవోల ఆధ్వర్యంలో మాత్రమే నడవటమనే సమస్యతో పాటు ప్రభుత్వంతో అంగీకారయోగ్య సంబంధాన్ని ఏర్పరుచుకోవటమనేది కమ్యూనిటీ రేడియో రంగం మొత్తానికి ఒక పెద్ద సవాలుగా పరిణమించింది.

**ముగింపు**

పైన పేర్కొన్న ధోరణులు పౌర సమాజ సంస్థలు, ఆందోళనకారులు కమ్యూనిటీ రేడియో అజెండాని ముందుకు తీసుకెళ్ళటానికి ఎంచుకున్న అభివృద్ధి దృక్పథం గురించి పునరాలోచించాల్సిన అవసరాన్ని తెలుపుతున్నాయి. కమ్యూనిటీ రేడియో సబాల్టర్న్ ప్రజా రంగ నిర్మాణానికి తోడ్పడాలంటే విప్లవాత్మక సమాచార హక్కుల దృక్కోణానికి మరలవలసిన సమయం ఆసన్నమయింది.

కమ్యూనిటీ రేడియో ద్వారా అందరికీ సంబంధించిన అంశాలు, సంఘటనల గురించి ప్రజలకి చర్చించే అవకాశం ఏర్పడి తద్వారా ఆధిపత్య వ్యతిరేక అజెండా ముందుకొస్తుందనే ఆశ ఉండింది. వివిధ ఆధిపత్య వ్యతిరేక ప్రజా రంగాలు కలగలిసి చర్చా రంగం విస్తృతం అయ్యి, సంఘటిత చర్యలకి అనువైన వాతావరణం ఏర్పడి నిజమైన విమోచనకి మార్గాలు ఏర్పడతాయని ఆశించటం జరిగింది.

కమ్యూనిటీ రేడియో విధానం ప్రకటించిన దశాబ్ద కాలంలో భారత దేశంలో కమ్యూనిటీ రేడియో రంగంలో అనేక అపశృతులు దొర్లాయి. మన ముందున్న సాక్ష్యాధారాలను బట్టి చూస్తే ఎన్జీవోలు, ప్రభుత్వం, అంతర్జాతీయ దాతలు, ఇతర శక్తుల నియంత్రణలో ఉన్న ఈ రంగం, మసకబారిన దృష్టితో పాత తరహా అభివృద్ధిపరమైన సమాచార ధోరణులనే పునరుత్పాదన చేస్తోందని అర్థమవుతుంది.

**అనువాదం : డి.సుజాత, ఏ.సునీత**

రచయిత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు

# నలుపు పత్రిక: ప్రయాణం

■ కె సజయ

జూన్ 17, 1985 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) కారంచేడు గ్రామంలో కమ్మ ఆధిపత్య అహంకారం రాజ్యాధికారం అండగా వెయ్యితలల విషనాగై పట్టపగలు కత్తులతో, బరిసెలతో వెంటాడి వేటాడి 17 మంది దళితులని నిస్సిగ్గుగా చంపినరోజు. అప్పుడు అధికారంలో ఉంది తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు.

ఆగస్టు 6, 1991 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా, చుండూరు గ్రామంలో అగ్రకులరెడ్లు పోలీసుల సాక్షిగా అక్కడి దళిత సమూహం మీద పైశాచికంగా దాడిచేసి 11 మందిని కత్తులతో, గొడ్డళ్ళతో చంపి గోనెపట్టాల్లో కుక్కి తుంగభద్ర కాలువలోకి విసిరేసిన రోజు. అప్పుడు అధికారంలో వుంది కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎన్.జనార్ధన్‌రెడ్డి.

ఈ రెండు మారణకాండల మధ్య కాలం ఎలాంటిది? ఒకపక్క దేశ ఆర్థిక వ్యవస్థలో సరళీకృత విధానాలకోసం చోటుచేసుకుంటున్న పెనుమార్పులు. మరోపక్క మతమౌఢ్యంతో సమాజాన్ని హిందూత్వీకరిస్తున్న బ్రాహ్మణ భావజాలం. ఇంకోపక్క, దళితులపై, మైనారిటీ మతస్థులపై పెరుగుతున్న దాడులు. కారంచేడు సంఘటన జరిగిన నాలుగు సంవత్సరాల తర్వాత 'నలుపు' ప్రజాపక్షపత్రిక అట్టడుగువర్గాల గొంతుగా ప్రారంభమయింది. "సమాజంలో ఒక ముఖ్యమైన సామాజిక విషయం చర్చకు వచ్చినపుడు దాని గురించి చర్చించటానికి, ప్రచారం చేయటానికి చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆ ప్రయత్నంలో కొంత సఫలీకృతమౌవచ్చు, కొంత నిరాశ కూడా వస్తుంది. ఒక్కోసారి విఫలమౌతుంది కూడా. ఇదంతా జరిగేటపుడు దానిని నమోదు చేయగలిగితే చాలా ఉపయోగముంటుంది. అలా ఈ సమస్యల పరిష్కారం కోసం వెతుకుతున్నప్పుడు దాన్ని వెంటనే అక్షరరూపంలోకి తీసుకురాగలిగిన వేదిక, మీ తరపున మేమున్నాం అనే బలమైన గొంతు అవసరం అవుతుంది. అలాంటప్పుడే సమస్యకు అవసరమైన సిద్ధాంతాలు వస్తాయి. అది మార్క్సిజమైనా, అంబేద్కరిజమైనా, దళితవాదమైనా, స్త్రీవాదమైనా అయితే ఒక సమస్య తర్వాత మరోటి వస్తూనే ఉంటాయి. అలా సమస్య వచ్చినపుడే పరిష్కారమార్గం వెతుక్కోవడం, పరిష్కారాన్ని చూపించడం కాకుండా, ప్రజల సమస్యలన్నింటికీ పరిష్కార మార్గాలను సూచించే విధంగా, సైద్ధాంతిక దిశనందిస్తూ చర్చించే విధంగా ఆ వేదిక పనిచేయాలి. ఆ సమాచారం పదిమంది దగ్గరికీ వెళ్ళాలి. సమస్య తీవ్రతను బట్టి పరిష్కారమార్గం వుంటుంది. అలాంటి ఒక స్పష్టమైన చర్చ కోసం పత్రికను ప్రారంభించాం" అని 'నలుపు' సంపాదకులు బొజ్జా తారకం దాని ప్రారంభాన్ని వివరించారు.

కారంచేడు సంఘటన జరిగి ఐదు సంవత్సరాలైన సందర్భంగా 1990లో ఆయన "కారంచేడు అనేది ఇప్పుడు ఒక ఊరుకాదు, ఒక ఊరికి పేరూ కాదు. అది ఒక్కొక్కరికి ఒకోలా వినిపిస్తుంటుంది. ఒకోలా అనిపిస్తుంటుంది. కొంతమందికి అది ఒక విల్లు అయితే, కొంతమందికి అది ఒక డాలు అయింది. కొంతమందికి అది ఆయుధం అయితే మరికొంతమందికి ఆది కవచం అయింది. ఇతరులను భయపెట్టడానికి అది కొందరికి పనికి వస్తే, మరికొంతమందికి అది ధైర్యాన్నిచ్చేది అయింది. సమాజంలోని వ్యక్తులు రెండురకాలుగా చీలిపోయినట్లే కారంచేడూ రెండుగా చీలిపోయింది. ధనికులు–పేదలు; భూస్వాములు–కూలీలు; 'పెద్ద'కులాలు–'చిన్న'కులాలు; దెబ్బలు కొట్టేవాళ్ళూ–దెబ్బలు తినేవాళ్ళూగా చీలిపోయినట్లే కారంచేడు బెదిరించడానికి–ధైర్యం తెచ్చుకోవడానకే అన్నట్టు చీలిపోయింది. కారంచేడు దారుణ మారణహోమం జరిగి సరిగ్గా అయిదేళ్ళు అయింది. తర్వాత ఆంధ్రదేశంలో వచ్చిన అనేక సాంఘిక రాజకీయ మార్పులకు కారంచేడు కారణమయింది. పదునెక్కుతున్న ప్రజా ఉద్యమాలకు కారంచేడు సానబెట్టింది. దళిత ప్రజల జీవితాలలో ప్రతిఘటనను, ప్రతిస్పందనను ప్రతిష్ఠించింది. ఉత్తచేతులతో విస్తుబోతూ మధ్యదారిలో నిలిచిపోయిన దళితుల చేతికి ఒక కట్టెలా దొరికింది. కారంచేడు ఈనాడు ఒక నిరసన. ఒక ప్రతిఘటన, ఒక ఊపు, ఒక మలుపు" అని 'నలుపు' లో రాసిన తన వ్యాసంలో ప్రస్తావించారు.

### ప్రారంభం

'నలుపు–ప్రజాపక్షపత్రిక' అనేపేరుతో ఒక పత్రిక హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాబోతోందని విన్నప్పుడు "అదేం పేరు ఇంకేం పేరు దొరకలేదా" అన్నవాళ్ళు చాలామంది వున్నారని చెబుతూ మొదట్లో తాను కూడా ఆ పేరు గురించి కొంత సంశయించినా, తర్వాత ఇదే పేరుని నిర్ణయించామన్నారు తారకం". ప్రజాపక్షపత్రిక అని చెబుతూ కేవలం ఒక దళిత సమూహానికనే అర్థం వచ్చేట్లు ఎట్లా పెడతారు అని అన్నవాళ్ళు కూడా వున్నారు. బహుశా ప్రజలంటే అన్ని సమూహాల వారూ ఇమిడి ఉంటారనే స్పృహ చాలామందికి వుండకపోవడమే కారణం. ప్రజలతో సంబంధం లేనివాళ్ళు దళితులు అనే అవగాహనలోంచి వచ్చిన ఆలోచన అది. అంటే వారి దృష్టిలో ప్రజలు వేరు, దళితులు వేరు. కానీ, దళితులు ప్రజల్లో భాగం, ప్రజల్లో దళితులున్నారు. ప్రజా ఉద్యమాలు పోరాటం చేసేవారందరినీ కలుపుకోవాలి. కానీ అది జరగలేదు. ప్రజల్లో సాధారణంగా అందరూ వుంటారు. దోపిడీ చేసేవారూ ప్రజల్లో ఉంటారు, దోపిడీకి గురయ్యేవాళ్ళూ ప్రజల్లో వుంటారు. కానీ, సాధారణంగా ప్రజలు అనేసరికి దోపిడీకి గురవుతున్నవారు, బాధలు పడుతున్నవారు, హింసను అనుభవిస్తున్నవారు–ఈ వ్యత్యాసాలను అనుభవిస్తున్న వారందరినీ ప్రజలుగా ప్రస్తావిస్తూ, దోపిడీ చేసేవారూ ప్రజల్లో భాగమయినప్పటికీ, వాళ్ళని ప్రజలు అనటానికి వీల్లేదనేది మా 'నలుపు' సంపాదకవర్గం ఉద్దేశం. ప్రత్యేకంగా దళితుల కోసం ఒక పత్రిక పెట్టటం కానీ, వ్యాసం రాయటం గానీ దానిని మార్చే క్రమంలో భాగంగా వచ్చిందే. అణగారిన ప్రజల కోసం, దోపిడీకి గురవుతున్న సమూహాలను వివిధకోణాల నుంచీ చైతన్యవంతం చేసేదిగా ఒక ప్రత్యేకత కల్గినదిగా రూపొందించటమే 'నలుపు' ఉద్దేశమని పత్రికను ఎవరు పరిశీలించినా గానీ అర్థమవుతుంది. ఎక్కువశాతం బాధలకు గురవుతున్న వాళ్ళు, దోపిడీకి గురవుతున్న వాళ్ళు, హింసకు గురవుతున్నవాళ్ళు, హక్కులు కోల్పోతున్న వారందరూ ప్రజలనే ఉద్దేశాన్ని స్పష్టంగా ప్రకటించింది 'నలుపు'. మా సంపాదకవర్గమంతా కూడా ప్రజా
ఉద్యమాల్లో వున్నవాళ్ళు, ప్రజాసమస్యల గురించి పోరాటం చేస్తున్న వాళ్ళు, వాటి పరిష్కారం గురించి పలుకోణాల్లో వెతుకుతున్నవాళ్ళు. వారి ప్రభావం పత్రిక గమనంలో స్పష్టంగానే వుంది."

తారకం గారికి అనేక ప్రజాఉద్యమాలతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం. హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన స్వయాన ఒక మంచి ఉపన్యాసకారుడు, కవి, రచయిత. ఇన్ని వ్యాపకాల మధ్య ఒక పత్రిక సంపాదకత్వం తీసుకోవటమంటే కత్తి మీద సామే. ఈ పనులన్నిటినీ సమన్వయ పరుచుకుంటూనే పత్రిక సంపాదక బాధ్యతను భుజం మీద వేసుకున్నారు. ఈ విషయం గురించి వివరిస్తూ, "నిజానికి ఒక పత్రికను తేవాలని నాకెప్పటినుంచో వుండేది. నేను చిన్నప్పుడు హైస్కూల్‌లో వున్నప్పుడు ఒక లిఖితపత్రికను తెచ్చేవాడిని. దానిని చేతితోనే కార్బన్‌పేపర్లు పెట్టి రాసేవాడిని.

ఒక్కోసారి రెండు, మూడు, నాలుగు రావులు కూడా వచ్చేది. నేనే రాసి మావూర్లో అమ్మేవాణ్ణి. అలా నాకు చిన్నప్పటినుంచీ ఒక పత్రిక నడపటం అనే ఆలోచన బలంగా ఉండేది. మా నాన్న కూడా ఒక మాసపత్రిక నడిపేవారు. దానిపేరు జ్యోతి. అప్పుడు ఆయన ఎమ్మెల్యేగా వుండేవారు. రాజకీయాల్లో బాగా నిమగ్నమయి వుండేవారు. సమయం వుండేదికాదు. ఎవర్నో పత్రిక చూడమని చెప్పారు కానీ, వాళ్ళు చూడకపోవడంతో అది ఆగిపోయింది. అలాగ పత్రిక గురించి ఆలోచించేవాడిని. ఆర్థిక వనరులు లేకపోవడంతో అది సాధ్యంకాలేదు. ఆ కోరిక అప్పటినుంచి అలాగే ఉండిపోయింది. నాకు స్ఫూర్తి బ్లాక్ మూవ్‌మెంట్. 1964లో మార్టిన్ లూథర్‌కింగ్ బ్రహ్మాండమైన ఉద్యమం నడిపారు. మన భారత సమాజంలో అంటరాని సమాజంగా ఉన్నవారికీ ఈ ఉద్యమానికీ చాలా దగ్గర పోలికలున్నాయి. ఆ తర్వాత నేను మమేకమయిన ఉద్యమాలలో, మిత్రులతో ఒక పత్రిక తేవడం గురించి ఎక్కువగా చర్చించలేదు గానీ, ఆ కోరిక మాత్రం అలానే ఉండిపోయింది. 85లో దళితులపై అమానుషమైన కారంచేడు మారణకాండ జరిగింది. కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండ ప్రజాజీవితాన్ని కుదిపేసింది. అప్పటివరకూ కులాన్ని, దాని మూలాల్ని పట్టించుకోనివాళ్ళు కూడా అగ్రకుల వికృతరూపాన్ని చూసి ఒక విచక్షణలోకి వెళ్ళారు. కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాపితంగా చాలా ప్రభావాన్ని చూపించింది. ఒక సంఘటిత దళిత ఉద్యమానికి నాంది పలికింది. సభలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు, పోరాటాలు ఇవన్నీ పెద్ద సంచలనాన్ని కలిగించాయి. అవన్నీ కూడా ఎప్పటికప్పుడు అయిపోతూ ఉండేవి. అప్పటికప్పుడు రికార్డు చేయలేకపోతే ఇంక వాటిగురించి మనకు ఎక్కడా దొరికేది కాదు. మిగిలిన పత్రికలు మా ఆలోచనలను రికార్డు చేయలేదు. ఈ ఉద్యమాలను రికార్డు చేయలేదు, దళిత ప్రజల ఆలోచనలను, సంఘర్షణలను, వాస్తవాలను రికార్డు చేయలేదు. మాలాంటివాళ్ళం ఎంతోమందిమి పూర్తిగా కారంచేడు మారణకాండ వ్యతిరేక ఉద్యమంలో మునిగిపోయాం. ఇంకోపని లేదు మాకు. మీటింగులు పెట్టడం, సభలు పెట్టడం, కేసులు నడిపించటం, కోర్టులకు వెళ్ళటం, సాక్ష్యాలను సేకరించడం, సాక్షులను నిలబెట్టటం, వాళ్ళకి ధైర్యం చెప్పడం ఇలా ఈ పనులే ఉండేవి."

"దీనివల్ల పత్రిక ప్రారంభించడం అనేది ఆ తర్వాత నాలుగు సంవత్సరాలకు గానీ మాకు సాధ్యం కాలేదు. నిజానికి ఆ సంఘటన తర్వాతే ఈ ఆలోచన మరింత బలపడింది. 80ల ప్రారంభంలో ప్రత్యామ్నాయ అభ్యుదయ, రాజకీయ సాహిత్యం అందించాలనే లక్ష్యంతో సికె, గీతారామస్వామి, సిరిల్‌రెడ్డి ఇంకొంతమంది మిత్రుల ఆధ్వర్యంలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఏర్పడింది. ఈ క్రమంలో సిరిల్‌తో పరిచయమయిన తర్వాత, నేనూ తనూ ఇద్దరం కలిసి నడుస్తున్న రాజకీయాల మీద ముఖ్యంగా దళిత రాజకీయాలు, ఉద్యమాలు వాటికి సంబంధించిన అంశాల గురించి చర్చించుకునేవాళ్ళం. అలానే కంచ ఐలయ్య, బాలగోపాల్ లాంటి మిత్రులతో చర్చిస్తున్నపుడు మా ఆలోచనలకు అనుగుణంగా పత్రిక తీసుకురావాలని ఒక నిర్ణయానికి వచ్చాం. అప్పటికే ఒక ప్రత్యామ్నాయ ప్రజాఉద్యమాల ప్రచురణకర్తలుగా హైదరాబాద్ బుక్‌ట్రస్ట్‌కి ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. 89 నాటికి మాకు కొంత సమయం దొరికింది. ఈ ఉద్యమాలను, ఆలోచనలను పంచుకోవటానికి కచ్చితంగా పత్రిక ఒక వేదికగా వుండాలని భావించాం అందరం. నిజానికి ఈ ఆలోచనకు మూలప్రేరణ సిరిల్. మీరు ముందుండండి, నేను మిగతా పనులన్నీ ప్రచురణకర్తగా చూసుకుంటానని చెప్పాడు. ఆయన ప్రోత్సాహం, చొరవతోనే పత్రిక ప్రారంభమైంది. ఆ తర్వాత నేను సంపాదకునిగా, సిరిల్ ప్రచురణకర్తగా, సంపాదకవర్గంగా పౌరహక్కుల ఉద్యమ నాయకుడు బాలగోపాల్, కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా వున్న డి.నరసింహారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం ప్రొఫెసర్ పి.యల్.విశ్వేశ్వరరావు, జర్నలిస్ట్ ఆర్.అఖిలేశ్వరిలతో 'నలుపు' ని ప్రారంభించాం."

**నలుపు ప్రత్యేకత**

"నేను ముందే ప్రస్తావించినట్లు పత్రిక ప్రారంభించాలనుకున్న తర్వాత పేరు గురించి చాలా తర్జన భర్జనలు జరిగాయి. 'నలుపు' అనే పేరుని దాదాపు అందరూ అంగీకరించారు. నలుపు అప్రెషన్‌కి సింబాలిక్‌గా ఉంది. నలుపు అంటే అప్రెషన్, డిస్‌క్రిమినేషన్. నలుపు అంటరానితనానికి కూడా సింబల్‌గా మారింది. అత్యాచారాలకు, హింసకు గురయ్యేదంతా నలుపుకి సంబంధించిన వాళ్ళే. నలుపు పేరుపెట్టటం సమంజసం కాదేమో అని మొదట్లో నేను కొద్దిగా సంశయించాను. పత్రిక అన్ని వర్గాల వారికీ చేరువలోకి వెళ్ళలేదేమో అనిపించింది. ఉద్యమం వేరు, పత్రిక వేరు. ఇది ప్రజల పత్రికగా తీసుకురావాలని అనుకున్నాం. ప్రజల్లో అందరూ వుంటారు. అప్రెషన్‌కి అన్ని కులాలవారూ, వర్గాల వారూ గురవుతారు. వాళ్ళందరినీ దూరం చేసుకుంటామేమోననే సంశయం ఎక్కడో నాకుండేది. రెండు, 'నలుపు' అంటే వెంటనే ఆదరించరేమో అనిపించింది. అయితే ఈ విషయంలో సిరిల్ అదే పేరు వుండాలని చాలా గట్టిగా వాదించాడు. ఐలయ్య కూడా. మనం ఏ అంశాలనయితే పత్రికా ముఖంగా చర్చించాలనుకుంటున్నామో వాటికి సింబాలిక్‌గా 'నలుపు' అని వుంటేనే బాగుంటుందని వాదించి ఒప్పించారు. మన పత్రికకు ఈ పేరు లీడ్ ఇస్తుందని చెప్పారు. అయితే పత్రిక ప్రారంభమయిన తర్వాత అంతకుముందు నేను పడిన సంశయాలు, అనుమానాలన్నీ పోయాయి. మొదటి సంచికతోనే అద్భుతమైన ఆదరణ వచ్చింది. ఎంతోమంది పత్రికను స్వంతం చేసుకున్నారు. అప్పటికే కొన్ని పత్రికలు ప్రజా ఉద్యమాలలో వున్న సంఘాలద్వారా నడుస్తున్నాయి. మరో పత్రిక ఎందుకు మా పత్రికలనే వేదికలుగా చేసుకోవచ్చు కదా, మళ్ళీ వేరే పత్రిక ఎందుకు అని కొంతమంది అభిప్రాయపడ్డారు. వాటి పాత్రను తక్కువ చేయలేము కానీ, మా ఆలోచనలకు వేదికగా, అట్టడుగు వర్గ సమూహాల అభివ్యక్తి వేదికగా పత్రిక తీసుకురావాలనుకున్నాం.

నలుపు పత్రిక ఐదేళ్ళపాటు 1989 నుంచీ దాదాపు 1995 వరకూ చాలా సక్సెస్‌ఫుల్‌గా నడిచింది. దళిత సెక్షన్స్ బాగా రిసీవ్ చేసుకున్నాయి. ఇంకా ఇతర అస్తిత్వ ఉద్యమాలు కూడా పత్రికతో ఐడెంటిఫై అయ్యాయి. అప్పుడప్పుడే దళిత, అస్తిత్వ ఉద్యమాలు పుంజు కుంటున్నాయి. అయితే లెఫ్ట్ ఉద్యమాలు ఈ వర్గాలకి ఒక భరోసా అందించలేకపోయాయి. దళిత సమూహాల్లో లెఫ్ట్ పట్ల చాలా అనుమానాలుండేవి. అయితే మేము కాస్ట్‌ని, క్లాస్‌ని సమన్వయపరిచే పని ఒకటి చేశాము. వీటికి సంబంధించిన చర్చలను విస్తృతంగా ప్రచురించేవాళ్ళం. మేమనుకున్న ఉద్యమాల నుంచీ చాలా ప్రోత్సాహం వుంది. రాయడంలో, సమాచారం అందించడంలో మేము చాలావరకు విజయవంతం అయ్యామనే అనుకుంటున్నాను."

హెచ్‌బిటి తరపున పంపిణీ బాధ్యతలు చూసిన గీతారామస్వామి మాట్లాడుతూ "తెలంగాణ ప్రాంతంలో విప్లవ పార్టీల ప్రాబల్యం వున్నచోట పత్రిక మీద ఒక అప్రకటిత నిర్బంధం ఉండేది. పుస్తకాల దుకాణాల్లో పత్రికను అమ్మనివ్వకపోయేవారు. పెట్టిన పుస్తకాలను పోలీసులు తీసుకెళ్ళిపోయారు. మాకు తర్వాత సమాచారం వచ్చేది. ఒక్కోసారి వెనక్కి ఇచ్చేసేవారు, ఒక్కోసారి ఇవ్వకపోయేది. గద్వాల, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఇలా చాలా ప్రాంతాల్లో పత్రికను అందజేయడం కత్తి మీద సాములాగా వుండేది. నలుపు చందాదారుల మీద ఒక నిఘా వుండేది. విప్లవ రాజకీయాల మీద ప్రత్యక్ష నిర్బంధం అమలయితే, ప్రజా సమస్యలపట్ల గళమెత్తుతున్న వ్యక్తులు, సమూహాలు, వేదికల మీద ఈ విధమైన అప్రకటిత నిర్బంధం అమలయ్యేది. నిజానికి 'నలుపు' ప్రచురణ కోసం ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన అన్నిరకాల అనుమతులు వున్నప్పటికీ పంపిణీలో ఈ సమస్యలు ఎదుర్కొన్నాం. ప్రత్యక్షంగా ఎప్పుడూ మా సంపాదకవర్గంతో పోలీసులు మాట్లాడలేదు. ప్రశ్నించే కలాలను, గళాలను రాజ్యం ఎప్పుడూ ఒక అనుమానంతోనే చూస్తుంది. వీలయితే అణిచివేయాలనే చూస్తుందని" అని చెప్పారు

**అంబేద్కరిజం-నలుపు**

'నలుపు' తో తన అనుబంధాన్ని తెలిపిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ, "కారంచేడు సంఘటన మా

లాంటివారి జీవితాల్లో, ఆలోచనల్లో చాలా పెద్దమార్పునే తీసుకువచ్చింది. ఆనాటికి మేమంతా మార్క్సిస్ట్ లెనినిస్టు గ్రూపులతో పనిచేస్తున్నాం. కులసమస్య మౌలిక స్వభావం మీద చర్చలు పెడుతున్నవాళ్ళం. అక్కడ మాకు ఒక విభేదం నడుస్తోంది. భారతదేశంలో కులసమస్యను ఎలా విశ్లేషించాలని ఆలోచిస్తున్నపుడు 'బ్లాక్ ఈజ్ బ్యూటిఫుల్' అంటూ నల్లజాతీయవాదులు, బ్లాక్ ఫెమినిస్టుల ఆలోచనా స్రవంతి మమ్మల్ని బాగా ఇన్‌స్పైర్ చేసిందని చెప్పాలి. ఇక్కడ విప్లవ రాజకీయాల్లో, వామపక్ష రాజకీయాల్లో నలుపు పట్ల ఒక గౌరవం లేదు. అందుకే మేము పత్రిక ఆలోచన ముందుకు వచ్చినపుడు దానిపేరు 'నలుపు' అనే వుండాలని నిర్ణయించాము."

"కులవ్యవస్థ మీద ఆనాడు మాకర్థమైన కోణంలో చర్చించటం" ఒక విషయం. జరుగుతున్న దోపిడి దౌర్జన్యాలను బలంగా రికార్డు చేయటం. సిద్ధాంతపరంగా ఒక ఆర్గ్యుమెంట్‌ని రికార్డు చేయడం. పూలే, అంబేద్కర్‌ల రచనలను, దళిత ప్రశ్నతో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని జోడించి ఉద్యమకారులకే కాకుండా, విస్తృతంగా ప్రజాబాహుళ్యంలోకి తీసుకువెళ్ళడం కోసం రచనలు ప్రారంభించాం. నిజానికి అప్పటికి డాక్టర్ విజయభారతి గారు రాసిన ఒకటి రెండు పుస్తకాలు తప్పించి వీరి గురించి రచనలే తెలుగులో అందుబాటులో లేవు. ఆ తర్వాత పూలే రచనలను తెలుగులో విస్తృతంగా పరిచయం చేసిన పత్రిక 'నలుపే'."

"మండల్ పోరాటకాలంలో ఒక బలమైన పాత్ర 'నలుపు'ది. ఆనాడు అరుణ్‌శౌరి లాంటివాళ్ళు రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ, రాస్తుంటే, 'పరాన్నభుక్కులకు ప్రతిభెక్కడుంది' అనే పేరుతో నేను నలుపులో ఒక పెద్దవ్యాసం రాశాను. అలా అనేక విషయాల గురించి చర్చించటానికి పత్రిక ఒక వాహికగా మారింది. ఒక ఉద్యమ పత్రికగా రైల్వేస్టేషన్లలో, బస్‌స్టాండుల్లో చాలా కాపీలు అమ్ముడుపోయేవి. అంతకుముందు అలాంటి పత్రికలు అక్కడ దొరికేవి కావు. అప్పుడు ప్రజాఉద్యమాల మీద, పౌరహక్కుల మీద చాలా నిర్బంధం వుండేది. ఎన్‌కౌంటర్లు జరిగిన సందర్భాలలో చనిపోయిన నక్సలైట్ల దగ్గర నలుపు పత్రికలు వుండటంతో పత్రిక పంపిణీని అడ్డుకోవడానికి పోలీసులు చాలా ప్రయత్నాలు చేశారు. నాకు అర్థం అయినదేమంటే పత్రిక అన్ని రాజకీయవర్గాల దగ్గరికీ చేరింది. అందరూ చదువుతున్నారని. కారంచేడు ముందువరకు అంబేద్కర్‌వాదం ఒక సంక్షేమవాదంగానే వుండిపోయింది. ఎస్‌సి, ఎస్‌టి వెల్‌ఫేర్ సంఘాలుగానే వుండేవి. కారంచేడు వాటి స్వభావాన్ని మార్చివేసింది. మార్క్సిజాన్ని, అంబేద్కరిజాన్ని జోడించి, క్షేత్రరంగంలో ఏం జరుగుతోంది పరిశోధించి వాటికి చర్చలు చేసినవాళ్ళు ఉన్నారు. పిండరూపంలో అయినాగానీ మార్క్సిజం, అంబేద్కరిజం, స్త్రీవాదం వీటి జోడింపుని 'నలుపు' చేసింది. కుల, వర్గపోరాటాల మధ్య మిత్రత్వం ఎలా సాధ్యమవుతుంది అని కమ్యూనిస్టు అనువర్తించేటట్లుగా నలుపులో అనేక వ్యాసాలను రాయటం జరిగింది."

"పార్టీల్లో ఈ అంశాలపై చర్చలకు 'నలుపు' ఫీల్డ్ రిపోర్టులు చాలా ఉపయోగపడ్డాయి. నిజానికి 'నలుపు' బలం ఫీల్డ్ నుంచి వచ్చే కథనాలే. అంబేద్కరిజం, మార్క్సిజానికి సంధి కుదర్చడానికి, బ్రాహ్మణిజం మీద చేయాల్సిన దాడికి ఒక వేదికను ఏర్పాటు చేయటంలో చాలా కీలకమైన పాత్రను పోషించింది. అందరితో చదివించగల ఒక ఉమ్మడి వేదిక ఈ పత్రిక. పదవ తరగతి వరకూ చదువుకున్నవారు కూడా సులభంగా అర్థం చేసుకునే విధంగా భాష చాలా తేలికగా వుండాలని, కొరుకుడు పడని పదజాలాన్ని వదిలించుకోవాలని చాలా గట్టి ప్రయత్నమే చేశాం".

"వివిధ సమూహాల ప్రజలు తమ స్థానిక సమస్యలతో ఐడెంటిపై అయ్యి ఉద్యమాల బాట పట్టడానికి పత్రిక చాలా ముఖ్యపాత్ర వహించింది. అప్పుడు ఫెమినిజం మీద చాలా ఎక్కువ చర్చలు నడుస్తుండేవి. బహుశా ఫెమినిస్టు తాత్విక సిద్ధాంతం పట్ల సానుకూలంగా వున్న టీమ్ మా నలుపు. స్త్రీశక్తి సంఘటనతో మాకు మంచి స్నేహం ఉండేది. వారినుంచి అనేక వ్యాసాలను సేకరించి ప్రచురించాం. ఆ రకంగా ఈ పత్రిక పాత్రను అన్ని కోణాల్లో చాలా ముఖ్యమైనదిగా గుర్తించాలి. పాఠకులవైపు నుంచీ, ఉద్యమాల నుంచీ ఆదరణ బావుండేది కానీ, ఆర్థికవనరులు తగ్గిపోవటంతో పత్రికను ఆపివేయాల్సి రావడం చాలా బాధాకరం. పత్రికను నిలబెట్టడానికి సిరిల్ చాలా కష్టపడ్డాడు. బాధ్యత మొత్తం తనదే."

"పత్రికకు మొదటి బలం ఆపేరు. దానితో చాలామంది తమను తాము గుర్తించుకున్నారు. ఈ పేరు స్ఫూర్తే నా పుస్తకానికి 'నేనెట్ల హిందువునయితా' అని పెట్టాను. నిజానికి నలుపులో వచ్చే ఫీల్డ్ రిపోర్టులను పరిశీలించడం ద్వారా నేను ఈ పుస్తకాన్ని రాయగలిగాను. ఆదే స్ఫూర్తితో 'బఫెలో నేషనలిజం' అనేపేరుని కూడా ఇంకో పుస్తకానికి పెట్టాను. దేశరాజకీయాల్లో ఒక కీలకదశలో పత్రిక ఆగిపోవటం, అదికూడా ఆర్థికవనరుల కారణంగా చాలా బాధాకరం. నలుపు ఆగిపోయిన తర్వాతే నేను ఇంగ్లీషులో ఎక్కువగా రాయటం ప్రారంభించాను. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో వెర్రితలలు వేస్తున్న హిందూత్వవాదాన్ని, ఆ రాజకీయాలను ఎదుర్కోవటం కోసం 'నలుపు' లాంటి పత్రికలు వుండటం చాలా అవసరం. మనదంటూ గొంతు లేకపోవటం చాలా నష్టం. ఈ పత్రికను మళ్ళీ ప్రారంభించగలిగితే, ఎవరైనా దానికి పూనుకోగలిగితే చాలా బాగుంటుంది."

**నిష్క్రమణ:**

ప్రచురణకర్త సిరిల్ మాట్లాడుతూ, "ఆర్థికపరమైన నిర్వహణ ఇంక సాధ్యం కాదనుకున్నప్పుడు అప్పటివరకూ పత్రిక నిర్వహణలో పాలుపంచుకున్న రచయితలను, మిత్రులను పిలిచి ఎందుకు పత్రిక ఆపేయాలనుకుంటున్నామో కూడా వివరించాము. పత్రిక నిర్వహణలో రచనలు సేకరించడం ఒక ముఖ్యమైన అంశమయితే, ఆర్థిక వనరులు మరో ప్రధానమైన అంశం. కొంతకాలం ప్రభుత్వ ప్రకటనలు తీసుకున్నాం. దానికి అప్పుడు పనిచేస్తున్న కొంతమంది ఐఏయస్ మిత్రుల సహకారం ఉండేది. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ నుంచి 'వైద్యుడు లేని చోట' పుస్తకాన్ని రీప్రింట్స్ వేశాం. దాని అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుని ఈ పత్రిక నిర్వహణలో ఖర్చుపెట్టాం. ప్రతి సంచిక మూడువేలు వేసేవాళ్ళం. వాటిని పంపిణీ చేయడం, జిల్లాల్లో డిస్ట్రిబ్యూటర్లను వెతుక్కోవడం, వాళ్ళు అమ్మిన సంచికల డబ్బుని తిరిగి తెచ్చుకోవడం, ఇదంతా చాలా శ్రమ అయ్యేది. మధ్యలో పోలీసుల నిర్బంధం. పత్రికలను అమ్మనిచ్చేవారు కాదు. దానితో బయటకు కనిపించేటట్లు పెట్టాలంటే పుస్తకాల దుకాణాల వాళ్ళు భయపడేవారు. అది అమ్మకాల మీద ప్రభావాన్ని చూపించేది. డబ్బులు వెంటనే వచ్చేవి కాదు. నడిపించాలని బలంగానే అనుకున్నాం గానీ ఆర్థికంగా ఇబ్బంది అయింది. నిజానికి చాలాకాలం మాకు ఆర్థిక వనరులు ట్రస్ట్ నుంచి ఉండేవి. తర్వాత ఇంక సాధ్యం కాదనిపించింది. పత్రిక సకాలంలో రావాలంటే పూర్తికాలం పనిచేసే సిబ్బంది నలుగురైదుగురు ఉండాలి. వారితో సమన్వయం ఉండాలి. కొనసాగించమని చాలామంది అడిగారు కానీ, సాధ్యం కాలేదు."

ఒక చారిత్రక సందర్భంలో అస్తిత్వ ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచి ఐదేళ్ళపాటు అద్భుతమైన పాత్ర పోషించిన పత్రిక 'నలుపు'. 1989 ఏప్రిల్ నుంచి 1993 జూన్ వరకూ ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులకు లోనైనప్పటికీ ఒక నిబద్ధతతో పత్రికను నడిపించారు ప్రచురణకర్తలు. పత్రిక ఆగిపోవటంతో సంపాదకవర్గమే కాక, వ్యాసరచయితగా మొదటి అడుగులు వేయడానికి దోహదపడిన నాలాంటి వారిమెందరిమో బాధపడ్డాం. ఐలయ్య చెప్పినట్లు ఇప్పుడు నడుస్తున్న కాలం 'నలుపు' లాంటి పత్రికల ఆవశ్యకతని మరింత ముందుకి తెచ్చిన రాజకీయ సందర్భం. కారంచేడు సంఘటన నుంచీ చూస్తే ఇప్పటివరకు నడిచిన సుదీర్ఘ పోరాటాలు, మరింత విస్తృతమయిన రాజకీయ సందర్భాలు అన్నీ విశ్లేషించుకుని ఒక ప్రజాస్వామ్యయుత గొంతుకగా పత్రికలు రావాల్సిన అవసరం వుంది. 'నలుపు' ని మళ్ళీ పునరుద్ధరించ గలుగుతామా లేక మరో రూపంలో ఆవిష్కృమవుతుందా వేచిచూడాల్సిందే.

రచయిత్రి జర్నలిస్టు, సామాజిక కార్యకర్త

# రౌండ్ టేబుల్ ఇండియా: కుఫిర్‌తో ఇంటర్వ్యూ

■ పంతుకాల శ్రీనివాస్, పృథ్వి రాజ్ దుడ్డు

**శ్రీనివాస్, పృథ్వి :** మీ గురించి, మీ నేపథ్యం గురించి. రౌండ్ టేబుల్ ఇండియా గురించి క్లుప్తంగా పరిచయం ఇవ్వగలరా? దాన్ని ఎలా ప్రారంభించారు? ప్రధాన స్రవంతిలో వినిపించని గొంతుల గురించి వెబ్‌సైట్ ప్రారంభించాలనే ఆలోచన మీకు ఎందుకొచ్చింది?

**కుఫిర్ :** రౌండ్ టేబుల్ ఇండియా నేపథ్యం గురించి మొదలుపెడతాను. అది మీకు మొదట దీన్ని ప్రారంభించిన వ్యవస్థాపక సభ్యుల గురించి ఒక అవగాహన నిస్తుంది. 2008లో దీని గురించిన ఆలోచన ప్రారంభమయింది. ఆ సంవత్సరమంతా దీని గురించి చర్చ, ప్రణాళికలు జరిగాయి. దళిత, బహుజనులు బ్లాగ్ చేసే వాతావరణం అప్పటికే పెరుగుతోంది. బ్లాగింగ్ 2000 సంవత్సరం నుండి ప్రారంభమయింది కానీ 2003-04 ప్రాంతాలలో భారత దేశానికి వచ్చింది. నేను మొదటి నుండి కుల సంబంధిత విషయాల గురించి బ్లాగ్ చేస్తూ వచ్చాను. నేను అనేక గ్రూపు బ్లాగ్‌లలో కూడా భాగస్వామిని, నా స్వంత బ్లాగ్ ఇప్పుడు 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. కులానికి వ్యతిరేకంగా రాసే దళిత, బహుజన, ఆదివాసి బ్లాగర్లు చాల తక్కువగా ఉండేవారు. ఇటువంటి వారిని చేరుకొని అసలు ఎంతమంది ఉన్నారో తెలుసుకోవటానికి నేను ప్రయత్నించాను. బ్లాగ్ భారతి అనే ఒక బ్లాగ్ కూడలి ఉంది. మేము బ్లాగులలో వచ్చే ప్రతి పోస్టు చదివి, 7 లేదా 8 బ్లాగులని తీసుకుని వాటిని బ్లాగ్ కూడలిలో పెట్టేవాళ్ళం. దాన్ని మనమే చెయ్యాలి, దానంతట అది జరిగేది కాదు. నేనే ఈ పని మొదలుపెట్టాను. నాకు కుల వ్యతిరేక రాజకీయాల పట్ల ఆసక్తి ఉంది కాబట్టి, గంటలు గంటలు దళిత బ్లాగర్లు ఎవరున్నారు అని వెతికేవాడిని.

గూగుల్ బ్లాగుల్లో వెతికేటప్పుడు (అది ఒక బ్లాగులు వెతికే సాధనం), గూగుల్, 'అసలు నువ్వు ఒక మనిషివేనా?' అనే ప్రశ్నలు వేసేది, జె.ఎన్.యులో కొద్ది మంది దళిత విద్యార్థులతోపాటు, రిజర్వేషన్లను సమర్థించిన కొద్ది మంది కుల వ్యతిరేక బ్లాగర్లలో నేనూ ఒకడిని. సమత అని అంబేద్కర్. ఆర్గ్ అని ఇంకొక రెండు బృందాలు కూడా ఉండేవి. ఆ రెండవది మాకు పెద్ద వనరుల గ్రంథాలయం. ఇటువంటి కొద్ది సైట్లే ఉండేవి; చాలా సైట్లు మొదలయినా భయం వల్లా, వ్యతిరేక వ్యాఖ్యలు, దాడుల వల్లా (ఈ సమస్య ఇప్పటికీ ఉంది) ఆగిపోయాయి. దళిత సమస్యలు, కులం గురించి ఫేస్ బుక్, ట్విట్టర్ (ఇప్పటికీ ట్విట్టర్ దళిత బహుజనులకి ఒక మహారణ్యం) వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్‌లలో రాసే వాళ్ళు రెండు, మూడుసార్లు రాసిన తరువాత మాయమయిపోయేవాళ్ళు. ఇది లెక్కలేనన్నిసార్లు జరిగింది. ఇదే సమయంలో డా॥అనురామ్ దాస్ నడిపే ఇంకొక బ్లాగ్ గురించి తెలుసుకున్నాను. ఆయన అప్పట్లో బెంగుళూరులో ఉండేవారు. ఇప్పుడు అమెరికాలో ఉన్నారు.

మేము ఒకరి బ్లాగ్‌పై ఒకరు వ్యాఖ్యానించుకునే వాళ్ళం దళితులు, ఆదివాసీలు, బి.సిలు ఎదుర్కొనే కులపరమైన దోపిడీ గురించి, తామందరూ గురయ్యే వ్యవస్థీకృత అణచివేతకు వ్యతిరేకంగా వారికి పోరాడాల్సిన అవసరం గురించీ, అమలులో ఉన్న విధానాల గురించీ. జాతీయ మీడియాతో పోలిస్తే స్థానిక మీడియా ప్రగతిశీలమయిందని మాకు తెలుసు. అంటే ప్రాంతీయ భాషా మీడియా ఇంగ్లీష్ భాషా మీడియా కంటే అభ్యుదయకరంగా ఉండే అవకాశాలు (అభేద్యంగా ఉన్నప్పటికీ) ఎక్కువ. ఇది మండల్ కమిషన్ అప్పుడే అర్థమయింది. అనురామ్ దాస్, నేను, మిగిలిన బ్లాగర్లు ఈ విషయాన్ని చర్చించే వాళ్ళం. అనూప్, మరి కొంత మంది కలిసి నడిపే ఇన్సైట్ అనే ఒక గ్రూప్ ఉండేది. అనూప్ అంతకు ముందు, నలుగురు జె.ఎన్.యు విద్యార్థులతో కలిసి ఇన్సైట్ అనే యువతరం పత్రిక నడిపాడు. అతను మూడు సంవత్సరాలలో ఎనిమిది సంచికలకు పైగా తీసుకొచ్చాడు. అది వివిధ కాంపస్‌లలో అనేక మంది విద్యార్థులని చేరింది. ఆ యూనివర్శిటి లోపలా, బయటా బ్లాగింగ్‌కు అనువైన వాతావరణం ఏర్పడింది. దళిత ఉద్యమం, బహుజన ఉద్యమాల ఫలితమే ఇది. ముఖ్యంగా ఇది విద్యార్థుల నుండే వచ్చింది. ఇన్సైట్ పత్రిక వివిధ కారణాల వల్ల ఆగిపోయింది.

బ్లాగ్ మాత్రమే కాక, ఒక సమగ్ర పోర్టల్ గురించి ఆలోచించాం; వెబ్‌సైట్ కాకుండా దళిత చరిత్ర, కుల వ్యతిరేక చరిత్ర, అంబేద్కర్ రచనలు, తాత్వికత, దళిత కవిత్వం, అన్ని మతాలలో ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, రాసిన కుల వ్యతిరేక కవిత్వం అన్నీ కలిపి ఉండే పోర్టల్ ఉండాలని మా ఉద్దేశం. రౌండ్ టేబుల్ ఇండియా బ్లాగ్‌లో మీకు ఎక్కడా దొరకనంత కుల వ్యతిరేక కవిత్వం దొరుకుతుంది.

అంతేకాక దళితులూ, ఆదివాసీల గురించి ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాలలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు క్రోడీకరించి అందరికీ అందివ్వాలనుకున్నాను. రిజర్వేషన్ విధానంపై, దళితులు, ఓ.బి.సిలు, ఆదివాసీల జీవితాలపై ప్రభావం చూపే విధానాలపై కూడా ఒక సెక్షన్ ఉండాలని అనుకున్నాం. వివిధ అంశాలపై సెక్షన్లతో న్యూస్ సైట్‌లా సమగ్ర పోర్టల్‌ని, సూక్ష్మ స్థాయిలో తయారు చెయ్యాలని అనుకున్నాం కేవలం బ్లాగ్‌లా కాకుండా. అదీ మా ఆలోచన. సమకాలీన అంశాలపై వ్యాఖ్యల కోసం ఒక సెక్షన్, పంతుకాల శ్రీనివాస్, డైట్, వంటి సామాజిక కార్యకర్తల గురించి ఫీచర్స్ అందిద్దాం అనుకున్నాం. ఆయా కార్యకర్తలు ఏ కార్యక్రమాలు చేపట్టారు; ఏ పుస్తకాలు విడుదల అయ్యాయి; వాటి సమీక్ష ఇలా అన్ని ప్రాంతాల నుండి అనేక మందిని అడిగి భారతదేశంలోనూ, బయటా కూడా సాధ్యమయినంత ఎక్కువ వర్గాలకు, వర్ణాలకు చెందిన పాఠకులకి నచ్చేలా రూపొందిద్దాం అనుకున్నాం.

వీరందరినీ చేరుకున్నట్లయితే మేము అనుకున్న సమూహాన్ని చేరుకున్నట్లే. ఒకసారి మేము వెబ్‌సైట్ ప్రారంభించగానే దానికి ప్రాణమొచ్చింది. ఇన్సైట్ బ్లాగ్ వచ్చినట్లే, రౌండ్ టేబుల్ బ్లాగ్ కూడా సమచైతన్యం ఉన్న ఇద్దరు దళితులు, ఒక బి.సి కలవటం వల్ల రూపుదిద్దుకున్నదే. మేమందరం పట్టణాల్లో పెరిగిన వాళ్ళమవటం కూడా మేము దగ్గరికి రావటానికి ఒక కారణం అయి ఉండొచ్చు. అందువల్లే మేము ఇంగ్లీషుని ఎంచుకున్నాం. దేశీయ భాషలు సాధారణంగా కులాల వారీగా భిన్నంగా ఉండటం కూడా ఒక కారణం. ఇట్లా 2008లో ఈ ఆలోచన రూపుదిద్దుకుంది.

**శ్రీనివాస్, పృథ్వి :** ఒక కొత్త సోషల్ మీడియా సైట్ నడపటంలో కులం ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? ఎట్లా నడిపారు? ఫీచర్స్, ఇంటర్వ్యూలు, రచనలు చేయటంలో, కథనాలు తయారు చేయటంలో ఎంత మంది కలిసి పనిచెయ్యాల్సి ఉంటుంది? పాఠకుల నుండి ఏమయినా ప్రతిస్పందనలు, సలహాలు వచ్చాయా?

**కుఫిర్ :** మాకు దాదాపు ప్రతి యూనివర్శిటి నుండి స్పందన వస్తుంది. ఎవరి దగ్గరికైనా వెళ్ళినప్పుడు 'మేము రౌండ్ టేబుల్ ఇండియా' చదువుతాం అని చెప్తారు. అగ్ర కులాల వారు మమ్మల్ని ఎక్కువ పొగుడుతారు. అయితే మేమా ఉచ్చులో పడము. వారికి మేము అధ్యయానికి ఉపయోగపడే సరుకేనని మాకు తెలుసు; మా రచనలను వారు దొంగిలిస్తారు తప్ప వాటిని ఉదహరించరు; వాటికి మర్యాదనివ్వరు. అగ్రకుల అకాడమీలు, మీడియా మానుండి దొంగిలించటానికి చూస్తోందని మాకు బాగా తెలుసు; ప్రతి వారమూ వాళ్ళు మా రచనల నుండి దొంగతనాలు చేస్తున్న సంగతి మావాళ్ళు మాకు చెప్తూనే ఉంటారు. అయితే మొదటి నుండి మా దృష్టి పాఠకులని ప్రభావితం చెయ్యటంపైనే ఉంది. మా లక్ష్యం చదువుకున్న దళిత బహుజన ప్రజలకి ప్రజాస్వామ్య చర్చలని అందించే ఒక వేదికని నిర్మించటమే. ఈ సముదాయాల నుండి బాగా చదువుకుని, మాట్లాడగలిగిన వాళ్ళు; పోరాడి పైస్థాయికి వచ్చిన వాళ్ళు - ఒక శ్రేష్ట శ్రేణి పైకి వచ్చిందని మాకు అర్థమయింది. ఉద్యమంలో లోతుగా అంతర్భాగమయిన వీరు ఎటువంటి చెత్త రచనలనీ ఆమోదించరు.

వారి ప్రభావం ఎలాంటిదంటే మా ప్రజలు ఒకరితో ఒకరు మాట్లాడుకుని, అభినందించుకునే భూమికని వారు స్థాపించారు. అయితే కుల వ్యవస్థకున్న దీర్ఘకాలిక చరిత్రతో పోలిస్తే ఈ పరిణామం ఇటీవలి. అంటరానితనం నాలుగవ



శతాబ్దంలో పుట్టి, దక్షిణ భారత దేశానికి పదవ శతాబ్దానికి చేరుకుంది. అంటే ఇది వ్యాపించటానికి చాలా కాలం పట్టింది. ప్రతి సామాజిక, రాజకీయ సమ్మతితో బలపడుతూ వచ్చింది. వలసపాలనా కాలంలో కూడా అదే జరిగింది. మనం తలపడుతున్న వ్యవస్థ దీర్ఘకాలిక శక్తి ఉన్న వ్యవస్థ. ఈ విమర్శనాత్మక దృష్టికోణం అన్ని రకాల సవాళ్ళను, అన్ని పరిస్థితులని తట్టుకుని నిలబడాలన్నదే మా ధ్యేయం. దీని ప్రభావం గురించి మీ వంటి సామాజిక పరిశోధకులు అధ్యయనం చేసి మాకు చెప్పాలి.

కాని నాకిది ఒక ఉజ్జ్వలమైన అనుభవం. ఇప్పుడు నాకు 51 ఏళ్ళు. ఈ ఏడేళ్ళు పని చేసినట్లే నా జీవితాంతం పని చెయ్యాలని నా ఆశ. ఆదాయాన్ని బట్టి, పెట్టుబడిని బట్టి, అవార్డుల బట్టి మా ప్రభావాన్ని అంచనా వెయ్యటం కష్టం. ప్రతి గ్రామంలో, పట్టణంలో, యూనివర్శిటీలో జరిగే హింస, పాలక వర్గాలు విసిరే సవాళ్ళని మేము మేధోపరంగా, జ్ఞానపరంగా ఎదుర్కోవటమే మాకు లభించే అవార్డు.

ఇటువంటి వేదిక హింసని అన్ని చోట్లా ఎదుర్కోగలదు. అయితే ప్రస్తుతం ఇది కేవలం సూక్ష్మస్థాయిలో మాత్రమే జరుగుతోంది. ఇది పెద్ద స్థాయిలో జరగాలి. ఈ వేదిక ఏడేళ్ళు నడవటమే ఒక పెద్ద విజయం. ఈ వేదికపై నమ్మకం పెరిగింది. ఢిల్లీ నుండి కేరళ వరకు, అస్సాం నుండి గుజరాత్ వరకు, పంజాబ్ నుండి ఒరిస్సా వరకు, ఇంగ్లాండ్ నుండి జర్మనీ వరకు, అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకు – దాదాపు రెండు నుండి మూడు వందల మంది రచయితలు ఈ వెబ్‌సైట్‌కు సమయం కేటాయిస్తున్నారు. పలుమార్లు కొంత మంది రాసిన వారున్నారు.

రచయితలు, పాఠకులు ఈ వెబ్‌సైట్‌ని తమదిగా భావిస్తారు. వారికి మాలో నమ్మకం ఉంది. మమ్మల్ని విశ్వసిస్తారు. మాపై భరోసా పెట్టుకున్నారు. వారీ సైట్ ద్వారా అర్థాన్ని వెతుక్కుంటున్న తీరు చాలా ముఖ్యమైంది. ఇదే వెబ్‌సైట్ ప్రభావానికి అన్నిటికన్నా మంచి సూచిక. మమ్మల్ని నిబద్ధులుగా ఉంచి, మా ఆసక్తిని నిలబెట్టి, మాకు శక్తిని ఇచ్చేదిదే. నేనే 20 ఏళ్ళు చిన్న వాడినైతే ఇంకా ఎక్కువ చేసి ఉండేవాడిని. ఈ వయస్సులో కూడా నాకింత శక్తి నిచ్చేదిదే. వేరే ఉద్యోగాలున్నప్పటికీ, అనూప్, భాను తమ శక్తినంతా దీనికే పెడతారు. అదే మా పెట్టుబడి. ఇది మా కమ్యూనిటీని నిలబెట్టిన వేదిక. అయితే కమ్యూనిటీ అన్నది ఒక వాగ్దానం; అది ఏకసదృశంగా ఉండదు; తేడాలుంటాయి. ఒకరితో ఒకరు బలంగా విభేదించే అభిప్రాయ బేధాలు ఉంటాయి; ఇవన్నీ ఉన్నాకూడా ప్రపంచం మొత్తం మీద ఈ వెబ్‌సైట్‌ని తమది అనుకునే వారు అనేకం. వారి సుహృద్భావాన్ని కొలవటం అసాధ్యం.

అందరు ఇటుక, ఇటుక ఇచ్చి దీన్ని నిర్మించటానికి తోడ్పడ్డారు. నేను మాన్యవార్ కాన్షీరాం సర్ అనుచరుడిని. బహుజన సమాజ నిర్మాణం ఆయన ధ్యేయం. ఆయన ఒక మీటింగ్‌లో ఏమన్నారంటే – నేను రెండు జాతుల సిద్ధాంతాన్ని నమ్ముతాను – ఒక జాతి అణగదొక్కే వారిది; ఒకటి అణగారిన వారిది. దళిత, బహుజనులలో చదువుకున్న వారికి గురుతర బాధ్యత ఉంది. వాళ్ళు ఒకరికొకరు దన్నుగా ఉండి ఒకరి నొకరు అర్థం చేసుకోవాలి; దీన్ని నిలబెట్టి వేరే కోణాల్లో విస్తృత పరచాలి. అగ్రకుల మీడియాకి, ప్రచురణ సంస్థలకి ఖాతాదారులుగా ఉండొద్దనే ఉద్దేశంతో ఇప్పుడు మేము ప్రచురణా రంగంలోకి ప్రవేశిస్తున్నాం. మా నమూనా వేరే వాళ్లకి కూడా పనికొస్తుంది. అంబేద్కర్ రచనలు, బామ్సెఫ్‌లాగే మనం కూడా అకాడమీ, మీడియా వంటి బ్రాహ్మణీయ వ్యవస్థల మధ్యవర్తిత్వం లేకుండా స్వతంత్ర పరిశోధన, జ్ఞానాన్ని నిర్మించుకోవచ్చు. బహుజన పౌర సమాజం పెరగటం ఇప్పుడు చాలా అవసరం. బ్రాహ్మణీయ పౌర సమాజం ఇప్పుడు ముసలిదయి పోయింది; కుళ్ళిపోయి చావుకి దగ్గరలో ఉంది. కానీ దాని 2000 సంవత్సరాల చరిత్ర వల్ల తన ఉనికి కోసం కొట్లాడటం ఆపదు.

మనం మన శక్తిని తక్కువ అంచనా వేసుకున్నాము. బహుజన పౌర సమాజం ఏర్పరచుకోవాలి; దానికి దళితులే నాయకులు, దళిత ఉద్యమం అవసరమైన జ్ఞానాన్ని స్వతంత్రంగా ఉత్పన్నం చేసుకుని తనని తాను బలపరచుకోవాలి. తెల్లవారి మధ్యవర్తిత్వం గానీ, అగ్రకులాల మధ్యవర్తిత్వం గానీ మనకు అవసరం లేదు. భవిష్యత్తులో బహుశా నిర్దిష్ట సంస్థలని కూడా నిర్మిస్తామేమో గానీ, ఇప్పుడే కాదు; కానీ ఏం చేసినా స్వతంత్రంగా నిర్మించగలమనేదే మా సందేశం. ఏ రకమైన అగ్ర కుల సహాయం, బ్రాహ్మణుల సహాయం మాకు అవసరం లేదు. ఎందుకంటే మేమే దీన్ని నిర్మిస్తాం. కాన్షీరామ్ సర్‌ని ఒకసారి ఎవరో 'ఎన్నికలలో పోటీ చేయటానికి మీకు డబ్బులు ఎక్కడి నుండి వస్తాయి?' అని అడిగితే ఆయన ఇలా సమాధానం చెప్పారు. 'అది చాలా సులభమైన విషయం. బహుజన సమాజం ఈ దేశంలోని సంపదనంతా ఉత్పత్తి చేస్తుంది. మాకు డబ్బు దొరక్కపోవట మేమిటి?. వనరులు లేవని ఆయన ఎప్పుడూ భయపడలేదు. మన మీద మనకి నమ్మకం లేకపోవటమే పెద్ద సమస్య.

**అనువాదం: ఏ.సునీత**

పంతుకాల శ్రీనివాస్ ఇఫ్లూ యూనివర్శిటీలో అధ్యాపకులు
పృథ్విరాజ్ దుడ్డు హైదరాబాదులో కాలేజీ విద్యార్థులకి ఇంగ్లీష్ నేర్పుతారు.




# ఆర్కైవ్ మ్యూజింగ్స్

■ **కుష్ బధ్వార్**

మీడియా మన జీవితాల్లోకి ఏ స్థాయిల్లో అడుగుపెడుతుంది? ఒకసారి ప్రవేశించిన తర్వాత మన ఉనికిని ఎట్లా ప్రభావితం చేస్తుంది? ఒక సృష్టి, ఒక ప్రదర్శన, ఒక ప్రచురణ రూపు తీసుకున్న తర్వాత మీడియా ఎట్లా జీవిస్తుంది? మన జీవితాల్లో 'గతం' పాత్ర ఏమిటి? అది ఎట్లా దర్శనమిస్తుంది? గత ఘటనల ప్రభావం వర్తమానం మీద ఎట్లా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తూ అన్వేషి బ్రాడ్‌షీట్ ఇప్పటివరకూ పునర్ముద్రితాల్ని కూడా చేపట్టింది. అట్లాగే ఈ సంచికలో కూడా "ది అప్రెస్డ్ ఇండియన్" (1979)లో కాన్షీరామ్ రాసిన సంపాదకీయం, ఎడ్వర్డ్ సయీద్ పుస్తకం "కవరింగ్ ఇస్లాం"(1981) నుంచి కొన్ని చిన్న భాగాలూ; బి.ఎన్.ఉనియాల్ రాసిన "ఇన్ సెర్చ్ ఆఫ్ ఎ దళిత్ జర్నలిస్ట్"(1996) పునర్ముద్రితం కావటం మనం చూస్తాం. బ్రాడ్‌షీట్‌లోని ఈ విభాగం మీడియా జీవించే విధానానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను ఎత్తి చూపుతూ, గతాన్ని గుర్తు చేసుకొని, పదిల పరిచి తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. తెలుగు విశ్వవిద్యాలయం జానపద-గిరిజన కళల శాఖ తెలుగు రాష్ట్ర అస్తిత్వాన్ని రూపొందించే క్రమంలో మీడియా పాత్ర గురించి శుభాంగి సింగ్ పరిశీలిస్తారు. వారి సినిమాలలో మీడియాని ప్రయోగించిన తీరు గురించి హైద్రాబాద్‌కు చెందిన ఇద్దరు చలనచిత్ర నిర్మాతలతో నేను మాట్లాడినది రెండవ అంశం. చివరిగా కింది పేరాలలో, మన గతానికి సంబంధించిన గుర్తులు, చిహ్నాలు, ప్రస్తుతం మనం పెద్ద ఎత్తున నిర్మిస్తున్న మీడియా విభాగాలూ; అన్నీ పదిలంగా ఉంచగలిగే' ఆర్కైవ్స్ చుట్టూ మన ఆలోచనలు తిరుగుతాయి.

కొంత మందికి 'గతం' రోజువారీ జీవితాలలో ఏమాత్రం చోటు లేనిదిగా కన్పిస్తుంది. మనసుకి బాధ కలిగించేదిగా, మర్చిపోతగినదిగా కన్పిస్తుంది మరి కొందరికి. ఇతరులు తెల్సుకోవాల్సిన ప్రాముఖ్యత కలిగి ఉండీ, అందరి నిర్లక్ష్యానికి గురయినదిగా గతాన్ని భావించేవారు ఇంకొందరు. కొంత మందికి 'గతం' అద్భుతమైనది. కొందరికి పెనుతుఫానుల తాకిడికి నాశనం కాకుండా రక్షించుకోవాల్సినది 'గతం'. చేయటానికేమీ లేనప్పుడు గతాన్ని నెమరేసుకునే వాళ్ళు కొందరు. చేసిన తప్పుల్ని మళ్ళీ చేయకుండా గతం నుంచి నేర్చుకునేవాళ్ళు మరి కొందరు. గతాన్ని సమకూర్చుకోవటానికి అధికారం ఉండాలి. తిరిగి ఆకూర్పే అధికారాన్ని కూడా సృష్టిస్తుంది.

దాటాలనుకున్నా సాహసించలేని నగర మార్గాల నెత్తిన ఆకాశంతో చూపు కలుపుతూ మెట్రోరైలు దూసుకెళ్తోంది. అది పరిగెడుతున్న లైనుకు ఆధారంగా నిర్మించిన పైపుల సమాహారమే ఈ నగరం. ఎక్కడ చూసినా ఆ పైపులే.

ఊహాత్మకమైన నగర సరిహద్దుల్ని మాత్రం ఇంకా అవి చేరుకున్నట్టులేదు. మెట్రో ఒకటే కాదు. నగరానికి అవసరమైన నీళ్లకీ; కరెంటుకీ; ప్రయాణీకుల చెవుల్లో సంగీతం మోగించే అంతర్జాలం (ఇంటర్నెట్) అందించటానికీ, అన్నింటికీ అత్యవసరమైనవి ఈ పైపులే. ఇన్ని రకాల పైపులన్నీ ఒకే సమయంలో సక్రమంగా పని చేస్తున్నాయంటే మనం స్వర్గంలో ఉన్నట్టే! కనీసం అందులో ఏ ఒక్క పైపు పనిచేస్తున్నా ఫరవాలేదు. కానీ నిరంతరం సాగే హైస్పీడు కనెక్షన్ల గురించి ఎన్నో వాగ్దానాలు ఉన్నా, ఉన్నట్టుండి, హెడ్ ఫోన్లలో సంగీతం ఒక్కసారి ఆగి పోతుంది. ఇక ఆ కనెక్షన్ అవసరం లేకుండా, ఫోన్‌లో నిక్షేపంగా దాచుకున్న 'ఆర్కైవ్' సంభాషణల్లోకి దిగిపోవచ్చు. ఇంకా వెనక్కి, ఇంకా వెనక్కి పోతూ (సెల్‌ఫోన్లో) మన ప్రయాణీకురాలు ఒక సంభాషణ, ఒక ధ్వని, ఒక చిత్రం, ఒక భావం - ఇలా గతంలోని ఊహాలోకాల్లోకి జారిపోవచ్చు. మనం ఇప్పుడెక్కడున్నాం? కిటికీలోంచి బయటికి చూస్తే ఎర్రటి ఎండ వెక్కిరిస్తుంది. ఇప్పటి వరకు చూసినవన్నీ కనుమరుగై ఒక్కసారి వేరే దృశ్యాలన్నీ కళ్ళముందుంటై! అందులో ఒకటి ఈ 'స్టేట్ ఆర్కైవ్' భవనం; ఒకపాత ఊదా రంగు నిర్మాణం! అందులో ఏం ఉంది?

'ఆర్కైవ్'ను నిర్వచించాలంటే, మొదట ఈ కుంకుమ రంగు బౌండు గ్రంథం చూడాలి. రచయిత ఎవరు, గ్రంథం పేరు ఏమిటి? ప్రచురణ కర్త ఎవరు? ఇవన్నీ చెప్పటానికి ఆ పేజీలే ఉండవు. నిజానికి పాత పేపర్లు కొనే కబాడీ వాలా నుంచి కాపాడి తెచ్చిన గ్రంథం ఇది. ముందు మాటలో "ప్రభుత్వ యంత్రాంగానికి, ఎక్జిక్యూటివ్ నిర్ణయాలకి సంబంధించిన అంశాలున్న (పబ్లిక్‌వైనా, ప్రైవేటువైనా) డాక్యుమెంట్లు ఆయా విభాగాలకి సంబంధించిన వ్యక్తుల అవసరాలకై, వారి తర్వాత వారసుల అవసరాలకై ఈ భాండాగారంలో పొందుపరుస్తున్నాం" అని రాసి ఉంటుంది. అదే పేజీ కింద భాగంలో "స్టేట్ ఆర్కైవ్స్ హైద్రాబాద్" అని ముద్ర వేసి ఉంటుంది. ఒకప్పుడు భవనంలో ఉన్న గ్రంథం అసలు కబాడివాలా దగ్గరకు ఎట్లా వెళ్ళింది? గ్రంథంలో ఉన్న నిర్వచనానికి ఇప్పుడున్న అర్థం ఏమిటి? (ఇప్పుడు అది కబాడీ వాలా దగ్గర దొరికింది కదా!) ఆర్కైవ్స్‌లో కెళితే మనకి సమాధానం దొరుకుతుందేమో!

మ్యూజియంలో లాగా ఇక్కడ టికెట్ కొనే అవసరం లేదు. అక్కడ ప్రవేశానికి యోగ్యత కావాలంటే మనం ఉన్న సంస్థ పేరున అధికార పత్రం, కింద సంతకంతో మన ఉద్దేశాన్ని వివరించే లేఖ ఉండాలి! ఆర్కైవ్స్ రూల్సును మనం పాటించినంత వరకు ఈ పత్రం 'అసలు'దా 'నకలు'దా ఎవరూ పట్టించుకోరు. సరే మనకు ప్రవేశం దొరికింది. ఇక్కడ మన ప్రవర్తన ఎట్లా ఉండాలో తెలియజేసే నిబంధనలు కొన్ని లిఖితపూర్వం అయితే, కొన్ని చెప్పీ చెప్పనట్టుంటాయి. ఒక గుర్తింపు నంబరు/పత్రం మనకు దొరుకుతుంది. దానితో మన ప్రవేశం




ధృవపడుతుంది. ఇప్పుడు ఆర్కైవ్స్‌లో ఏది అందుబాటులో ఉంటుంది, ఏది ఉండదు అనే అంశం - అక్కడి ఉద్యోగస్థులతో, అధికారులతో మన బాంధవ్యం ఏ స్థాయిలో ఉన్నదన్న అంశంపై ఆధారపడి ఉంటుంది. ఏదేమైనా మనని ఒక 'రిసెర్చ్ స్కాలర్'గా గుర్తిస్తారు. దీనికి కారణం, ఉద్యోగస్థులు కాకుండా అక్కడ ఉండగలిగే అర్హత కలిగినది రిసెర్చ్ స్కాలర్లు మాత్రమే. ఇట్లా అకస్మాత్తుగా ఉన్నత స్థాయికి ఎదిగిన మనకి మన 'పబ్లిక్‌నెస్' ని నిలబెట్టుకోవటం ఎట్లా?

అంటే, సాధారణ పౌరుడెవరూ 'ఒక ప్రత్యేకమైన' హోదా లేకుండా ఈ ఆర్కైవ్స్‌లో అడుగుపెట్టలేడు. దానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. సాధారణ జనం బయటి ప్రపంచంలో మునిగిపోయి ఉండవచ్చు. ఈ భవనంలో నిక్షేపాలు వాళ్ళకి రుచించకపోవచ్చు. వాళ్ళతో కార్యక్రమాలు నిర్వహించగలిగే శక్తి ఆర్కైవ్స్‌లో లోపించవచ్చు. భాండాగారంలోని నిక్షేపాలు 'పబ్లిక్' చేతుల్లోకి వెళ్తే ఉండే ప్రమాదం గురించిన భయం కావచ్చు. అక్కడి డాక్యుమెంట్లకున్న శత్రు శక్తులు కూడా ఆ ఆర్కైవ్స్ నాలుగు గోడల మధ్య ఉండి ఉండవచ్చు. పరస్పరం ఘర్షించే రికార్డులు ఉండవచ్చు. ఏ పక్షాన్ని సమర్థించినా, ఇంకొక పక్షం శత్రువైఖరి తీసుకోవచ్చు. డాక్యుమెంట్లపై నిర్లక్ష్య వైఖరి నుంచి, ఎలుకల్ని వేటాడటం దగ్గర్నుంచి. సూక్ష్మ స్థాయిలో సమస్యల వరకూ, అందులో కారణాలు ఏవైనా కావచ్చు. ఇటువంటి భిన్న ప్రమాదాల నుంచి రక్షణకు భవన సదుపాయాలను నిర్వహించేటందుకు నిధులు అవసరం. ఈ ఆర్కైవ్స్ వినియోగించే పద్ధతిని గమనిస్తే, దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా 'ఆర్కైవ్స్' వినియోగించే పద్ధతులలో తేడాలు అర్థమవుతాయి. అదే సందర్భంలో వాటి ప్రాముఖ్యత, స్థాయిలో భేదాలు కూడా అవగతమవుతాయి. దీనితో ఇక్కడి నిక్షేపాల విలువను లెక్కకట్టే ఇబ్బంది లేకపోతే, వాటిని విలువైనవిగా గుర్తించగలిగితే, పేరు పొందిన ఇంకొక 'ఆర్కైవ్' తన నిధులను కొంత ఈ 'ఆర్కైవ్'కు అందించగలిగే అవకాశం ఉంది.

ఆర్కైవ్స్ అంటే చరిత్రే! కాని 'ఆర్కైవ్స్' చరిత్ర మాటేమిటి? ఇది ఇంకొక ఆర్కైవ్స్ నుంచి విడిపోయిన ఒక ముక్క కావచ్చు. అటువంటి క్రమంలో భాగంగా ఇంక కొన్ని చరిత్ర భాండాగారాలు ప్రత్యక్షం కావచ్చు. ఆ విభజన సమయంలో 'పబ్లిక్' (ప్రజల) నుంచి ఆందోళన వ్యక్తం కావచ్చు. ఏ అంశాలు, ఏ 'రాష్ట్రం'లో చేరతాయి? 60 సంవత్సరాలకు పైగా జనం చూడని, అందుబాటులో లేని ఈ డాక్యుమెంట్లు ఒక్కసారిగా గుర్తింపుకు రావచ్చు. ఇదే కాలంలో ఇతర డాక్యుమెంట్లు కొన్ని మరుగై, దొరక్కుండా పోయి, శిథిలమై, పనికిరానంతగా ఛిద్రమైపోయి ఉండవచ్చు. ఏమైనా మిగిలి ఉన్నయ్యంటే అవి రచయితలు, ప్రచురణ కర్తలు లేదా ఆసక్తి కలిగిన కొద్ది మంది వ్యక్తుల దగ్గర దొరికే అవకాశం ఉంది. అవి మనకు దొరికితే? వాటిని పదిలంగా దాచి ఉంచిన ఆయా వ్యక్తులు ముందుచూపుకు మనం గర్వించవచ్చు. ఆ నిక్షేపాలకు ఆర్కైవ్స్‌లో ఇప్పుడు స్థానం దొరికే అవకాశం లభిస్తున్నది. ఈసరికి వారు అధికారంలో ఉండి ఉండవచ్చు. ప్రస్తుతం ఆర్కైవ్స్ అల్మారీలలో వాళ్ళ 'ప్రైవేటు' లేదా 'పబ్లిక్' సెంటిమెంట్లు కొత్త రికార్డుల రూపంలో ప్రత్యక్షమవుతయి. కాని ఈ విషయం గుర్తింపు మీదే మనం దృష్టి పెట్టాల్సిన అవసరం లేదు. ఆర్కైవ్స్ గేట్లు తెరిచి చూస్తే బయట ఏం కనిపిస్తుందో చూద్దాం.

బయట పడ్డాం కదా, ఇక మనం ఏం చేయాలి?

**అనువాదం: కె.లలిత**

రచయిత ఇండియన్ ఫౌండేషన్ ఫర్ ద ఆర్ట్స్‌లో ఆర్కైవల్ ఫెలో 2014-15

# అస్తిత్వ పరిరక్షణ: ఎవరికి ఎవరు?

■ శుభాంగి సింగ్

తెలుగు నాట పరిఢవిల్లుతున్న దేశీయ జానపద కళలనూ, సంస్కృతినీ ఒక పద్ధతి ప్రకారం అధ్యయనం చేసి వర్గీకరించటం అవసరమన్న బృహత్ లక్ష్యంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1995లో ప్రత్యేకంగా జానపద, గిరిజన విజ్ఞాన అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీన్ని స్థాపించటానికి రెండు అంశాలు బలంగా పనిచేశాయని చెప్పుకోవచ్చు. ఒకటి అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు, ఆయన సాంస్కృతిక సలహాదారులంతా కూడా కళల పట్ల ప్రత్యేకమైన ఆసక్తి ప్రదర్శిస్తూ తెలుగు ప్రజలకు సంబంధించిన సాంస్కృతిక కళారూపాలన్నింటినీ సంరక్షించుకోవటం, మరుగునపడిపోతున్న వాటిని పున:దర్శించటం చాలా అవసరమని భావించారు. రెండోది పల్లెల నుంచి వలసలు పెరిగి, పట్టణీకరణ విస్తృతమవుతున్న నేపథ్యంలో ఒకప్పటి గ్రామీణ కళారూపాలన్నీ ఆదరణ కరవై అంతరించిపోతుండటంతో వీటిని ఎంతో కొంత భద్రపరచాలన్న రాజ్యపరమైన కాంక్ష కూడా ఈ కేంద్రం ఏర్పాటుకు కొంత ప్రోద్బలం చేసిందని చెప్పుకోవచ్చు.

విశ్వవిద్యాలయం కొత్తగా నాలుగు విభాగాలను ప్రారంభించగా వీటిలో ఈ జానపద, గిరిజన విజ్ఞాన అధ్యయన కేంద్రాన్ని మాత్రం వరంగల్లులో ఏర్పాటు చేశారు. ఇందుకు వివిధ ఆదివాసీ తెగలు, జాతులు, షెడ్యూల్డు కులాల వారు ఈ జిల్లాల్లోనూ, ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ అధిక సంఖ్యలో ఉండటమే మూల కారణం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న జానపద కళలన్నింటినీ అధ్యయనం చేసి, వాటిని వివిధ రూపాల్లో భద్రపరచటం, ఈ అధ్యయన సమాచారాన్నంతటినీ భాండాగారాల (ఆర్కైవ్స్) రూపంలో ఒకచోట నిక్షిప్తం చెయ్యటం, మ్యూజియం ఏర్పాటు చేసి ప్రదర్శించటం, అలాగే తమ దగ్గరున్న అధ్యయన సమాచారంతో ప్రచురణలను వెలువరించటం..ఇవీ ఈ కేంద్రం ప్రధాన లక్ష్యాలు. ఈ కేంద్రం లక్షిత వర్గాలను చేరుకునే కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలోనూ, ప్రాంతీయంగానూ జానపద కళాజాతలు నిర్వహించటం, వాటిలో పాలుపంచుకోవటం వంటి భిన్న ప్రక్రియలను చేపడుతుంది. దీనిలో భాగంగా 1997లో వరంగల్‌లో నిర్వహించిన కళాజాతను ఒక భారీ ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. దీన్లో దాదాపు 400 మంది జానపద కళాకారులు పాల్గొన్నారు.

ఇటువంటి కళాజాతలు, కార్యక్రమాల వల్ల క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలుంటాయన్నది నిర్వాహకుల అనుభవం. దీని గురించి అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ భట్టు రమేష్ మాట్లాడుతూ ఒకప్పుడు ఈ జానపద కళాకారుల పట్ల, వీరి జాతుల పట్ల ఎంతో వివక్ష ఉండేది. సమాజంలో వీరన్నా, వీరి కళలన్నా గౌరవమర్యాదలుండేవి కాదు. సామాజికంగా వీరి పరిస్థితి అట్టడుగున దయనీయంగా ఉండేది. చిందు, కునపుల్లి, పద్మసాలి తదితర సంప్రదాయ జాతులకు చెందిన జానపద కళాకారులను, అంతర్గతంగా తమతమ జాతుల్లో కూడా తరచుగా బిచ్చగాళ్లలా చూస్తూ, కించపరుస్తుండే వారు. కానీ 1997 జానపద ఉత్సవం తరువాత, ముఖ్యంగా మా విభాగం ఆయా జాతులతో, సమూహాలతో కలిసి పనిచేయటం ఆరంభించిన తర్వాత ఈ పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చింది అని వివరించారు. మా కేంద్రం వారి ఆచారాలను, సంప్రదాయాలను అధ్యయనం చెయ్యటం మొదలుపెట్టిన తర్వాత వారి జానపద కళలకు కొత్త గౌరవం లభిస్తోంది. ఈ కళాకారుల పట్ల, వాళ్లను చూసే తీరులో కూడా గణనీయమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు వీరిని ఉద్దేశించి ఆ బిచ్చపోళ్ళు ఏడున్నారో చూడండ్రీ అన్నవాళ్లే ఇప్పుడు ఆ చిందు కళాకారులు ఏడున్నారు లేదా జంగం కతలు చెప్పేటోళ్లు ఏరి అంటూ వారి వారి కళా రూపాల పేరుతో వీరికి ప్రత్యేక గుర్తింపు, గౌరవాలనివ్వటం ఆరంభించారు అని చెప్పుకొచ్చారు.

తమ సాంగత్యంతో వారి వారి గుర్తింపుల్లో ఔన్నత్యం పెరిగిందన్న ఈ పురాసంరక్షకుడి మాటల్లో ధ్వనించేది విశ్వవిద్యాలయాల తాలూకు అకడెమిక్ ఆభిజాత్యమే కావచ్చు గానీ ఈ వైఖరిని ఎలా అర్థం చేసుకోవాలి, దీనిలో ప్రత్యేక ఉద్దేశాలేమైనా వ్యక్తీకరింపబడుతున్నాయా? అన్నది తరచి చూడటం అవసరం. జానపద కళాకారులకు ఇటువంటి సంసారపరమైన జోక్యంతో, వీటి చేర్పుతో గౌరవప్రపత్తులు పెరిగాయన్న ప్రొఫెసర్ రమేష్ భావాలతో తెలుగు రచయిత, మహిళా ఉద్యమకారిణి, మాదిగ వర్గానికి చెందిన గోగు శ్యామల విభేదించారు. ఈ అధ్యయన విభాగం పుట్టుకురాక ముందు జానపద కళాకారులు తమతమ కళలకుండే గౌరవాన్ని గుర్తించలేకపోయారని గానీ, వాటిని గర్వకారణంగా భావించలేదనటం గానీ సరికాదన్నది ఆమె భావన. అక్కడక్కడ ఎవరో కొందరు జానపద కళాకారులను బిచ్చగాళ్లలా పిలవటమన్నది ఎన్నడూ వినని కొత్త విషయమేం కాదుగానీ ఇటువంటి దురభిప్రాయాలన్నీ కూడా చాలావరకూ సరైన సాంస్కృతిక సందర్భం, ఆ ప్రాసంగికత తెలియకపోవటం నుంచి పుట్టుకొచ్చినవేననీ. ముఖ్యంగా బయటివాళ్లు, ఇంకా చెప్పాలంటే ఆయా జాతి సమూహాలకు వెలుపల ఉండేవారి నుంచే ఇటువంటి ప్రస్తావనలు వినిపిస్తుంటాయని ఆమె వ్యాఖ్యానించారు. జానపద కళాకారుల వృత్తి ఏమిటో వారి వారి సమూహాల్లోనూ, వారికి సన్నిహితంగా జాతుల వారందరికీ తెలుసు, వాటికి చాలా స్పష్టమైన గుర్తింపు కూడా ఉంది. ఆదివాసీ లేదా ఉపకులాలకు చెందిన జానపద కళాకారులంతా కూడా ప్రదర్శనలు ఇచ్చే సమయంలో తమ ప్రధాన కులం వారి నుంచి తిండి, బస వంటివి ఆశిస్తుంటారు. దీన్ని తమ హక్కుగా పొందుతుంటారు కూడా. ఇది తరాలుగా వస్తున్న ఆదారమే. చిందు కళాకారులతో సహా ఎంతో మందిని దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వీరు వాళ్ల కోసం ప్రదర్శనలిస్తుంటారు, వాళ్లు వీరి బాగోగులు చూసుకుంటుంటారు. కొన్నిసార్లైతే అసలు ఊళ్ళో ప్రదర్శన ఇస్తుండాల్సిన అవసరం కూడా ఉండదు. అయినా ప్రధాన కులమే వారికి కావాల్సినవన్నీ సమకూరుస్తుంటుంది. తమ కళల ద్వారా జానపద కళాకారులు తమ తమ జాతులకు సంబంధించిన మూల చరిత్రలను, కుల పురాణాలను జాంబవ పురాణం మౌఖిక పరంపరాగతంగా పరిరక్షించుకుంటూ వస్తున్నారన్నది వారందరి విశ్వాసం. అందుకే ఈ కులాలలో వీరికి ఎంతో ప్రాధాన్యం, వీరు పోషించే పాత్రకు ఎంతో ప్రాముఖ్యం ఉంటాయి. ఆయా కులాల సాంస్కృతిక వారసత్వంలో జానపద కళాకారులకు



ఇంతటి కీలక భూమిక ఉంటుంది కాబట్టే తిండి, బస వంటివి ప్రధాన కులాల నుంచి డిమాండు చేసి మరీ పొందటమన్నది వీరికున్న సహజమైన, సర్వసమ్మతమైన హక్కుగా కూడా భావించటం జరుగుతుంది. ఇదో రకమైన మార్పిడి పద్ధతి కానీ ఇది తెలియని చాలా మంది దీన్నే బిక్షాటనగా పొరపాటుగా అర్థం చేసుకుంటుంటారు. జానపద కళాకారులను బిచ్చగాళ్ళుగా పిలుస్తుండటమన్నది ఈ అపోహలు, అవగాహనా రాహిత్యాల నుంచి పుట్టిందే. అంతేకానీ జానపద కళాకారుల వృత్తి ఏమిటి, వాళ్లేం చేస్తారన్నది వాళ్ల కులాల్లోనూ, వారితో నిత్యం సంబంధాల్లో ఉండే జాతులన్నింటిలోనూ కూడా స్పష్టంగా తెలుసు అని వివరిస్తారు శ్యామల.

ఆర్కైవ్స్ అనేవి మన సామూహిక చారిత్రక గళాన్ని భద్రపరిచే విలువైన భాండాగారాలు. ఒక సమూహంగా మనం చారిత్రకంగా ప్రోది చేసుకున్న ఆ ఉమ్మడి స్వరాన్ని, ఆ ఉమ్మడి వ్యక్తీకరణలను రికార్డు చేయటం, భద్రపరచటం, మళ్లీ అవసరమైనప్పుడు వాటిని తిరిగి మన ముందు జవజీవాలతో నిలబెట్టగల ప్రాముఖ్యమున్న సంస్థలివి. అందుకే ఇంతటి కీలకమైన ఆర్కైవ్స్ వేటిని సేకరిస్తాయి? ఈ సేకరణను ప్రభావితం చేసే అంశాలేమిటి? దేన్నైనా సేకరించటం లేక సేకరించక పోవటమన్నది ఆయా కాలానికి లేదా ఆయా సందర్భానికి సంబంధించిన మన స్మృతి చైతన్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందన్నది అర్థం చేసుకోవటం చాలా అవసరం. ఆర్కైవ్స్ అనేవి ఎప్పుడైనా కూడా ఏదో ఒక కులానికి లేదా సందర్భానికి సంబంధించిన ఖచ్చితమైన, సంపూర్ణమైన చిత్రాన్ని ఇవ్వలేకపోవచ్చు. తమ తమ సంస్థలకున్న సేకరణ విధానాలను బట్టి వేటిని భద్రపరచాలి. అందుకు అర్హమైనవేమిటన్నది పురాసంరక్షకులే జాగ్రత్తగా ఎంచుకుంటారు. సేకరణ విధానాలకు తోడు ఆయా సంస్థల ప్రధాన లక్ష్యాలు, నమోదు చేసే సమయానికి ఆయా సమాచార లభ్యత కూడా కీలకమే. ఇక్కడ భట్టు రమేష్, గోగు శ్యామల వ్యక్తం చేసిన వైఖరుల్లో పరస్పర వైరుధ్యం, ఆ భిన్నత్వం స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఇదే తీరులో పురాసంరక్షకులు ఆర్కైవిస్టులు కూడా ఏయే అంశాలను సేకరిస్తారు? వేటిని ఎంచుకుంటారన్నది వారివారి సాంస్కృతిక వైఖరుల మీద, ఆ రంగం మీద వారికున్న అవగాహన మీద కూడా ఆధారపడి ఉంటాయి. కాబట్టి ఆర్కైవ్స్‌లో నిక్షిప్తం చేయబడిన ఏ ప్రధాన సమాచారమైనా కూడా సేకరిస్తున్న ఆయా సంస్థల లేదా వ్యక్తుల ప్రభావం నుంచి తప్పించుకోలేదని, దానికి లోబడే ఉంటుందని స్పష్టంగా చెప్పొచ్చు. మరి ఈ నేపథ్యంలో ఆర్కైవ్స్‌లో లభించే సమాచారమంతా కూడా సత్యమేనని నమ్మేదెలా? దాని ప్రామాణికతను విశ్వసించేదెలా?



అలా నమ్మటానికి లేదన్నదే సమాధానం! కాబట్టి ఆర్కైవ్స్‌లోని ఆ సమాచారాన్ని అధ్యయనం చేసేవారెవరైనా సరే, దాన్నో మార్గదర్శక నమూనాగా, మరింత లోతుగా పరిశోధించటానికి మనలో ఆసక్తిని రేకెత్తించగల ఒకానొక చారిత్రక సూచనంగా మాత్రమే తీసుకోవాలి. ఇలా లోతుగా పరిశోధించటం వల్ల రెండు రకాల ప్రయోజనాలు సిద్ధిస్తాయి. ఒకటి ఆర్కైవ్స్‌లోనూ, ప్రధాన స్రవంతి చర్చల్లోనూ చోటు దక్కకుండా మరుగున ఉండిపోతున్న రూపాలను పరిశోధించి, ఆ వెలుగులో వాటిని మిగతా రూపాల సరసన చేర్చే అవకాశం ఉంటుంది. రెండోది వారి సేకరణ విధానాలు ఎలా ఉన్నాయి? అలాగే సేకరింపబడుతున్న, నిక్షిప్తం చేయబడుతున్న సాంస్కృతిక రూపాలు ఎవరికి చెందినవి? అవే ఎందుకు సేకరింప బడుతున్నాయి? దీని వెనకున్న రాజకీయ భావజాలంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి, ఆ దిశగా అధ్యయనం చెయ్యటం ద్వారా కొత్త కోణాలను వెలుగులోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. నిర్దేశిత లక్ష్యాలేమిటి, వాస్తవంగా భద్రపరచబడుతున్న సంస్కృతి ఏమిటి? వీటి మధ్య అంతరం నెలకొనటానికి కారణమవుతున్న రాజకీయాలేమిటన్నది అర్థం చేసుకునే వీలు చిక్కుతుంది.

సాంస్కృతిక రూపాలను ఎంపిక చేసి సేకరించే సమయంలోగానీ, వీటిని భద్రపరిచే విషయంలో గానీ పురాసంరక్షకులను ఎప్పుడూ కూడా ఒక నైతిక సందిగ్ధత వెంటాడుతూనే ఉంటుంది. కళా రూపాలను భద్రపరిచే క్రమంలో ప్రజలనూ, వారి కళలనూ, వారి సంస్కృతినీ ప్రతిబింబించేదెలా? వారికి ఎలాంటి ప్రాతినిధ్యం ఇవ్వాలి. వారిని ఎలా చూపించాలి? ఎలా రిప్రజెంట్ చెయ్యాలి? సంరక్షణ, కంజర్వేషన్‌కు సంబంధించిన చర్చలన్నింటి లోనూ కూడా తప్పనిసరిగా ప్రస్తావనకు వస్తున్న ప్రశ్నలివి. కళా చరిత్రకారుడు జితాల్ గాంధీ ఈ సంరక్షకుడికి, అతడు చేసే పనికీ ఉండే ప్రామాణికత ఏమిటన్న ప్రశ్నను బలంగా లేవనెత్తారు. ముఖ్యంగా ఈ సమాచార సేకర్తకుండే దృక్కోణాన్నీ, అతడి చూపునూ ఆయన విమర్శనాత్మకంగా పరామర్శిస్తూ దాన్ని శీలపరీక్షకు నిలబెట్టారు. సంరక్షణ కోసం సమాచారాన్ని సేకరించే క్రమంలో ఆ సంస్కృతికి వెలుపలి వ్యక్తులుగా వీరు తాము గమనించిన దాన్ని నమోదు చెయ్యటంతోపాటు, అసంకల్పితంగానే అయినా తమ తమ వ్యక్తిగత అనుభూతులనూ, సానుభూతులనూ జోడించి, వాటిని రికార్డుల్లోకి జొప్పించే అవకాశం ఉంటుంది. సంరక్షణ కోసం సేకరించి ప్రామాణికంగా చెప్పుకొనే సమాచారంలోకి ఈ జోడింపులూ, వింగడింపులు కూడా వచ్చి చేరిపోయి, కలగలిసి పోతుంటాయి. అందుకే పరిశోధకులూ, అధ్యయనవేత్తలూ, క్రియాశీల కార్యకర్తలందరూ కూడా ఈ సేకరించిన సమాచారానికి ఉండే ప్రామాణికత గురించి తరచూ చర్చిస్తూ, రకరకాల ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉంటారు. ఈ చర్చల్లో తరచుగా ఉత్పన్నమయ్యే ప్రశ్నల్లో మచ్చుకు కొన్ని, అసలు అవగాహనాపరులెవ్వరు? సమాచార సేకర్తలెవరు? సమాచార సేకరణ క్రమంలో వీరికి ఆయా సమూహాల్లోకి ఎంత వరకూ ఆమోదం/ప్రవేశం లభిస్తుంది? సేకరించి నిక్షిప్తం చేయబడుతున్నదేమిటి? వీటినే ఎందుకు ఎవరి కోసం సేకరిస్తున్నారు? బయటి నుంచి ఇతరుల జీవితాల్లోకి చూడటానికీ (లుక్ ఇన్ టు). అలాగే ఒక సమూహంలోని వ్యక్తులే తమలోకి తాము (లుకింగ్ వితిన్) దృష్టి సారించుకోవటానికీ మధ్యనుండే తేడా ఏమిటి? ఈ ప్రశ్నల పరంపర పెద్దదే.

ఈ సందర్భంగా అర్జున్ అప్పాదురై 1988లో అదే వర్గానికి, అదే సమూహానికి చెందిన వ్యక్తి స్థానికుడన్న భావనపై చేసిన చర్చ ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. పూర్తి స్థానికులైన వారైతే ఎటువంటి వక్రభాష్యాలూ,

అవశేషాలూ లేకుండా తమనూ, తమ చరిత్రనూ ప్రామాణికంగా ప్రతిబింబించుకోగలుగుతారన్న భావన బలంగా ఉంది. అదే ఆ స్థానికులను బయటి నుంచి పరిశీలించి, పరామర్శించే వారి విషయంలో ఈ ప్రామాణికతకు ఎన్నో మినహాయింపులుండటమే కాదు. ఈ క్రమంలో వాళ్లు మెల్లగా సంక్లిష్టత, భిన్నత్వం, అస్పష్టతల వంటి వాటివైపు జరుగుతారు. ఈ స్థానికుడు నేటివ్ అన్న భావనపై అప్పదొరై చేసిన విమర్శను ఆంత్రోపాలజిస్టు కిరిన్ నారాయణ మరికాస్త ముందుకు విస్తరిస్తూ నేటివ్ ఆంత్రోపాలజిస్ట్ అన్న భావనను చర్చకు పెట్టారు. ఆ సమూహంలో అంతర్భాగంగా, లోపలి వ్యక్తిగా ఉండే స్థానికుడే ఆ మానవ సమూహానికి సరైన ఆంత్రొపాలజిస్టు కమ్యూనిటీకి సంబంధించిన అధీకృతమైన ప్రామాణికమైన దృక్కోణాన్ని ఇవ్వగలడన్నది ఈయన ప్రతిపాదనల్లోని ప్రధానాంశం. ఈ నేటివ్ ఆంత్రొపాలజిస్ట్; అన్న భావనలో వృత్తిపరమైన ప్రభావం కూడా ఉంటుందన్నది సుస్పష్టం. దానివల్లే కావచ్చు. వీరి కృషికి ప్రామాణికత కూడా అదనంగా వచ్చి సమకూరుతుంది. పాశ్చాత్యేతర, మైనారిటీ లేదా జాతి సంకర ఆంత్రోపాలజిస్టుల చేతుల్లో అస్తిత్వాలు ప్రతిఫలించిన తీరులో ఇది మరింతగా స్పష్టంగా కనబడుతూ ఉంటుందని నారాయణన్ వాదిస్తారు. అందుకే వీరి కృషిలో ఉమ్మడితనం, సంక్లిష్టతల కన్నా ఆయా జాతులకు సంబంధించిన ప్రత్యేకతలు, విలక్షణతలు మరింత కొట్టొచ్చినట్టుగా కనబడుతుంటాయి. కళారూపాల ఎంపిక, సమాచార సేకరణ ప్రక్రియలో ఈ బయటి/లోపలి వ్యక్తులన్న రాజకీయం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు ఆర్కైవ్స్‌కు ఉండే ప్రామాణికత, అధికారికత అన్నది మరింత ప్రశ్నార్థకంగా తయారవుతుంది.

జానపద, గిరిజన విజ్ఞాన అధ్యయన కేంద్రం విషయంలో కూడా ఈ లోపలి, బయటి వ్యక్తుల రాజకీయమన్నది కొంత సంక్లిష్టతలకు, గందరగోళాలకు తావిచ్చే అవకాశం లేకపోలేదు. తాము కూడా అదే ప్రాంతానికి చెందిన వారు కావటం, తామూ తెలుగు మాట్లాడే వాళ్లే కావటం వల్ల అధ్యయన కేంద్రంలోని పరిశోధకులు గత పరిశోధకుల కంటే తమ కృషిని మరింత సాధికారికమైనదిగా చెప్పుకోవచ్చు. గత అధ్యయన వేత్తలంతా వలసపాలనా కాలపు ఛాయల్లో పనిచేసిన వారు కావటం వల్ల వారి కంటే తమ కృషి మరింత ప్రామాణికమైనదనీ వాదించొచ్చు. ఒక సమూహం యొక్క అస్తిత్వం, వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలను సాధ్యమైనంత సాధికారికంగా, వాస్తవానికి దగ్గరగా ఒడిసిపట్టాలని ఆశిస్తాం కాబట్టి పరిశోధకులకూ, అస్తిత్వ సమూహాలకూ మధ్య సన్నిహితమైన సాంస్కృతిక పరిచయాలుండటం పనిని సుగమం చేసే మాట వాస్తవమే. దీనివల్ల పరిశోధకులు ఆయా సమూహాలతో కలిసిపోవటానికి, తేలికగా వారిలోకి చొచ్చుకుపోవటానికి ఉపకరిస్తుంది. అయితే విస్తృత ప్రాతిపదికన కొద్దిపాటి ఉమ్మడి సాంస్కృతిక నేపథ్యం ఉన్నా కూడా ఈ క్షేత్రస్థాయి పరిశోధకులు ఎప్పటికీ బయటి వారిగానే మిగులుతారని చెప్పుకోక తప్పదు. ఎందుకంటే సాంస్కృతికంగా ఎంత ఉమ్మడిదనం ఉందనిపించినా ఆయా సమూహం మొత్తం పరిశోధకులను సంపూర్ణంగా ఆమోదించి, తమలోకి తీసుకుని, తమకు సంబంధించిన అంశాలన్నింటిలోకి వారిని ఆహ్వానించలేకపోవచ్చు. దీనివల్ల ఆ సమూహం పట్ల పరిశోధకుల అభిప్రాయాలు, తెలివిడి, జ్ఞానం, గణాంకాల వంటివన్నీ ప్రభావితమై ఎప్పటికీ అరకొరగానే ఉండొచ్చు. అంతిమంగా మొత్తం సమాచారమే అస్తవ్యస్తాలు, దురన్వయాల పుట్టగా తయారవ్వచ్చు. దీనికి తోడు పరిశోధకులకూ, స్థానిక సమూహాలకూ మధ్య నెలకొనే సంబంధంలో అధికార, ఆధిపత్య భావనలకూ చోటుంటుందన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. ప్రస్తుత సందర్భంలో కుల వ్యవస్థలోని ఆధిపత్య ధోరణుల కారణంగా కూడా పరిశోధకుల అభిప్రాయాల్లో, విశ్లేషణల్లో తరచుగా క్షేత్రస్థాయి వాస్తవాలకూ, అంతిమంగా నమోదు కాబడుతున్న విషయాలకూ మధ్య పెద్ద అంతరమే ఉండే అవకాశం ఉంది. చివరికి అవే ఆర్కైవ్స్‌లో చేరి, సత్యాలుగా మిగిలిపోయే ప్రమాదముంది.




వ్యవస్థాగతంగా కావచ్చు. ఇతరత్రా కావచ్చు. ఎలా చేస్తున్నా కూడా మొత్తానికి ఆర్కైవ్స్ రూపొందించటంలో ఉన్న ఉద్దేశాన్ని ఆ సంరక్షణ విధానాన్ని తరచి చూస్తూ, దాన్ని ప్రశ్నించి పరీక్షకు నిలబెట్టటం ద్వారా ఈ ప్రక్రియను మరింత మెరుగ్గా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అంతిమంగా బీరువాల్లోకి, షెల్ఫుల్లోకి, కంప్యూటర్లలోకి చేరి పోతున్నదేమిటి? భవిష్యత్తరాలు సత్యాలుగా చూడబోతున్నదేమిటన్న దాన్ని ఇక్కడ మనం చర్చించుకున్న చాలా అంశాలు నిర్ధారించబోతున్నాయన్నది వాస్తవం. కాబట్టి వీటి ప్రామాణికతను, విశ్వసనీయతను సందేహించటం, వీరు సేకరించే సమాచారంపై ప్రభావం చూపుతున్న అంశాలను ప్రశ్నకు నిలబెట్టటం చాలా అవసరం. సంరక్షణ విధానాలు, ప్రక్రియలన్నవి (ఆర్కైవల్ ప్రాక్టీసెస్) సంక్లిష్టమైన రాజకీయాలతో ముడిపడి ఉన్నాయన్నది స్పష్టమవుతూనే ఉంది. దేశీయమైన సంస్కృతులను సంరక్షించేందుకు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జానపద, గిరిజన విజ్ఞాన అధ్యయన కేంద్రం వంటివి చేస్తున్న సంస్థాగత ప్రయత్నాలను, వీరు అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించటం.. ఎవరు ఎవరి కోసం, ఎవరు ఎవరి తరఫున మాట్లాడుతున్నారు, ఎందుకు, ఏ తీరులో మాట్లాడుతున్నారన్నది పొరలు పొరలుగా ఒలిచి చూడటం వల్ల ఈ సంక్లిష్ట రాజకీయాల్లో తదుపరి అడుగులు ఎటువైపు వెయ్యాలో బోధపడొచ్చు!




**అనువాదం: ఏ.వెంకట్**

రచయిత్రి ఒక స్వతంత్ర ఫిలింమేకర్, కళాకారిణి






# సమకాలీన మీడియా: సినిమా దృక్కోణం
# రెండు డాక్యుమెంటరీ అనుభవాలు

■ **కుష్ బధ్వార్**

చలన చిత్రాలకు కూర్పరిగా పనిచేస్తుండే శ్రవణ్ కటికనేని ఇటీవలే 'క్రానికల్స్ ఆఫ్ ఎ టెంపుల్ పెయింటర్' (2014) పేరుతో స్వీయ దర్శకత్వంలో ఒక డాక్యుమెంటరీని నిర్మించారు. హిందువుల గుడుల మీద బొమ్మలు వేస్తూ జీవిక సాగించే పాపాలాల్ అనే చిత్రకారుడు 2007లో హైదరాబాద్‌లోని గోకుల్ ఛాట్ బాంబు పేలుళ్ల ఘటన అనంతరం ఒక ముస్లిం బాలికను దత్తత తీసుకున్నాడు. ఆ తర్వాత అతని జీవితంలో ఎదురైన ఆటుపోటులు, వాటిని ఎదుర్కొనేందుకు కోర్టుల్లోనూ, బయటా అతను సాగించిన అసాధారణ పోరాట క్రమాన్ని శక్తివంతమైన డాక్యుమెంటరీగా మలిచారు శ్రవణ్.

అలాగే కాళోజీ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కాళోజీ ఫౌండేషన్ ఎస్.అమర్‌నాథ్ దర్శకత్వంలో 'మన కాళోజీ' (2013) పేరుతో ఆయన జీవిత చరిత్రాత్మక డాక్యుమెంటరీని నిర్మించింది.

ఈ డాక్యుమెంటరీలను రూపొందించిన దర్శకులిద్దరితో సంభాషిస్తూ...సమకాలీన ప్రసార మాధ్యమాలన్నవి...నేటి సినిమాల్లోనూ, వాటి రూపకర్తల ఆలోచనల్లోనూ ఎలా ప్రతిఫలిస్తున్నాయి? సినిమాల రూపకల్పనలోనూ, నిర్మాణంలోనూ ఆ మాధ్యమాల పాత్ర ఏ మేరకు, ఏ తీరులో ఉంటోంది? సినిమా నిర్మాణం కోసం వాటిని చేరుకోవటంలోనూ, వాటిని ఉపయోగించుకోవటంలోనూ ఎదురవుతున్న అనుభవాలేమిటో ఒడిసిపట్టే ప్రయత్నమే ఈ రెండు ఇంటర్వ్యూలు.

పాపాలాల్ కథ మీ దృష్టికి ఎలా వచ్చింది?

**శ్రవణ్ కటికనేని :** పాపాలాల్ గురించి మొదటిసారి నేను ఈనాడు దినపత్రికలో చదివా. తను ఎన్నో క్రిమినల్ కేసులను ఎదుర్కొంటూ, ఆ పోరాటంలో సతమతమవు తున్నాడని రాశారు. అతని కథ నన్ను ఆకట్టుకోవటమే కాదు, అదంతా చదివిన తర్వాత మనసు వికలమై పోయింది. చాలా ఆగ్రహం కూడా పొంగుకొచ్చింది. అతణ్ణి గురించి మరికాస్త తెలుసుకుందామని ఇంటర్నెట్‌లో వెతికితే అక్కడక్కడ కొన్ని బ్లాగుల్లో అతని గురించి రాశారు, ముఖ్యంగా రెండు, మూడు వీడియోలు కూడా కనపడ్డాయి. ఒక దానిలో అతడు జైలు నుంచి విడుదల అవుతుంటే తీసుకువెళ్లేందుకు వచ్చిన భార్య, జైలు బయటే నిలబడి ఎదురుచూస్తున్న వీడియో నా దృష్టి కొచ్చింది. నేను అతడిని తొలిగా చూసింది. ఈ వీడియోలోనే పాపాలాల్ తన స్థితి గురించి ఆవేదనగా చెబుతూ కన్నీరు పెట్టుకోవటం నన్ను బాగా కదిలించింది. నిజం చెప్పాలంటే నాకూ ఏడుపొచ్చినంత పనైంది. ఇదొక రకమైన సినిమాటిక్ అనుభూతి. ఎందుకంటే అప్పటి వరకూ నేను అతణ్ని కలవలేదు. కనీసం చూడను కూడా లేదు. కానీ అతడికి ఎదురవుతున్న ఆ అనుభవాలన్నీ చూసినప్పుడు ఉన్నట్టుండి నా మనసు కూడా చాలా భారంగా అయిపోయింది.

పాపాలాల్‌నూ, అతని కుటుంబాన్నీ కలిసినప్పుడు రెండు పూర్తి భిన్నమైన భావాలు నా అనుభవంలోకి వచ్చాయి. మొదటిది – నేను డాక్యుమెంటరీలు తీస్తుంటాననీ, అతనికి సాయం చెయ్యాలని ఉందని చెప్పటంతో నా పట్ల వాళ్లు చాలా గౌరవమర్యాదలు చూపించారు. అతను తన కథనంతా చెబుతుంటే.. ఆ అనుభవాలు విని బాధతో నా హృదయం ద్రవించి పోయింది. ఆ కథ చెప్పేటప్పుడే మధ్య మధ్యలో అతను దీన్ని ఫలానా ఛానల్ వాళ్లు చూపించారనో, ఫలానా ఛానల్ వాళ్లు దీనిపై ప్రత్యేక కథనం చేశారనో ప్రత్యేకంగా చాలాసార్లు ప్రస్తావించాడు. నాకు అప్పుడు అర్థమైంది – అతని గురించి నేను పేపర్లో చదివింది అతనికి సాయం చేసే ఉద్దేశంతో పత్రికల్లో మళ్లీ రాసిన కథనమని! వాస్తవానికి 2007లోనే గోకుల్ ఛాట్ బాంబు పేలుళ్ల తర్వాత హైదరాబాద్ పత్రికలు పాపాలాల్ గురించి చాలా విస్తృతంగా రాశాయి. టి.వి ఛానెళ్ళు కూడా దీనిపై చాలా కథనాలు ప్రసారం చేశాయి. అప్పట్లో అవెందుకో నా దృష్టికి రాలేదు.

మరోవైపు ఈ విషయంలో నేను జోక్యం చేసుకోవటం పట్ల పాపాలాల్, అతని కుటుంబం కొంత భయపడ్డారు కూడా. ఎందుకంటే మీడియాలో వచ్చే కథనాల వల్ల

సాయం జరగటం మాట అటుంచి, అప్పటికే అవి అతడిని చాలా ఇబ్బందుల్లోకి నెట్టాయి. పాపం, పాపాలాల్ కూడా మొదట్లో తన కథనం మీడియాలో ఎంత ఎక్కువగా వస్తే తన కేసులు అంత తేలికగా పరిష్కారమవుతాయని భావించాడు. కానీ జరిగిన వాస్తవం మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఆ వార్తా కథనాలు చాలాసార్లు తను మత పెద్దలను నిందిస్తున్నట్టుగానో, తనకే మాత్రం సాయం చెయ్యటం లేదని ప్రభుత్వ అధికారులను విమర్శిస్తున్నట్టుగానో, నిలదీస్తున్నట్టుగానో వచ్చేవి. దాంతో మేలు కంటే నష్టమే ఎక్కువ జరిగింది. ఈ కథనాల వల్ల అతనికేమీ ఉపయోగం ఉండదని తెలిసి కూడా మీడియా వర్గాలు దీన్ని తరచూ ప్రచురిస్తుండేవి. ప్రసారం చేస్తుండేవి. దీంతో హిందూ, ముస్లిం రెండు మతాలకు చెందిన పెద్దల నుంచీ పాపాలాల్‌కు ఫోన్లు, బెదిరింపులు వస్తుండేవి. దాడులూ జరిగాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పాపాలాల్ కుటుంబం మొదట్లో నన్ను కూడా కొంత అనుమానంగానే చూసింది. కానీ అతని పరిస్థితి రెండేళ్లకు పూర్వం ఎలాగుందో అప్పుడూ అలాగే ఉండటంతో కలిసి కూర్చుని మాట్లాడేందుకు, చర్చించేందుకు కొంత అవకాశం చిక్కింది.

పాపాలాల్ చెప్పేది వింటున్నప్పుడూ ఆ సంఘటలన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటిగా నా కళ్ల ముందు ఊహించుకుంటూ, ఆ సమయంలో అతని మానసిక స్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాను. అతడినీ, అతని కుటుంబాన్నీ దగ్గర నుంచి చూశాను కాబట్టి వాళ్లంతా ఎంతటి ఆవేదనకు గురయ్యారో, ఎన్ని కష్టాలు అనుభవించారో అర్థం చేసుకోవటం తేలికైంది. కోర్టు కేసులకు ప్రాధాన్యం ఇచ్చిన కొద్దీ మనం అతని వ్యక్తిగత జీవితం, వాళ్లు ఎదుర్కొన్న అనుభవాలకు దూరమైపోతామని నేను మొదట్లోనే అర్థం చేసుకున్నాను. అతను ఎప్పుడూ కోర్టుల్లో ఉండిపోతున్నాడు, అతనికి ఆర్థికంగా సాయం చెయ్యాలన్నా అసలు అతని గురించి ప్రజలకు తెలియాలి గదా. అప్పటికే అతడు ఏడేళ్ల నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎన్నో కష్టాలు పడి ఉన్నాడు. ఆ పోరాటం ఇంకా సాగుతూనే ఉంది. అతని గురించి సినిమా తీస్తే ఈ నిజజీవిత కథ అందరికీ తెలిసి, ప్రజల్లో ఎంతో కొంత చైతన్యానికి దోహదం చేస్తుందని భావించాను. మొదట్లో దీన్ని పరిశోధనాత్మక చిత్రంగా తీద్దామనుకున్నా. పాపాలాల్ చెబుతున్న ఆ టివి ఇంటర్వ్యూలన్నీ సేకరించి, వాటిని పాపాలాల్ కథనంతో కలగలిపి చూపిస్తూ, డాక్యుమెంటరీని నడిపితే బాగుంటుందని భావించాను. నేను మొదలు పెట్టింది అలాగే అయినా చివరికి అలా జరగలేదు.

పాపాలాల్ ప్రస్తావించిన టి.వి ఛానెళ్ల వివరాలన్నీ తీసుకుని, ఆ క్లిప్పింగుల కోసం టి.వి ఆఫీసులన్నింటికీ వెళ్లా. చాలా శ్రమపడాల్సి వచ్చింది గానీ చివరికి ఆ వీడియోలను సాధించటం అంత తేలిక కాదని అర్థమైంది. కొందరికేమో ఇవ్వటానికి ఇష్టం లేదు. కొందరేమో అతని కథనాన్ని ప్రసారం చేసీ చేసీ విసిగిపోయి, ఆ ఫైళ్లు ఎక్కువైపోయి హార్డ్‌డిస్కుల్లో చోటు లేక వాటిని తొలగించేశారు. కొందరేమో తమ దగ్గర సంచలనాత్మక సమాచారం, వీడియోలున్నాయని చెబుతూనే దాన్నుంచి చాలా లబ్ధి పొందాలని చూశారు. ఇంకొందరేమో అసలు దీని మీద నేనెందుకు ఆసక్తి చూపిస్తున్నానన్నది కూపీ లాగటం మొదలు పెట్టారు. నేను జర్నలిస్టును కాదు కాబట్టి వాళ్లను ఒప్పించటం చాలా కష్టమైంది. తిరగ్గా తిరగ్గా చివరికి చాలా కొద్ది వీడియో క్లిప్పింగులే నా చేతికొచ్చాయి. ఏవేవో చెయ్యాలని కలలున్న నాకు... నా మనసులో ఉన్న ఆలోచనలూ, నేనూహించుకున్న దృశ్యాలన్నీ క్రమేపీ కరిగిపోయి...చివరికి నా ముందు పాపాలాల్, అతని కుటుంబం, అతను వేసిన బొమ్మలే మిగిలాయి! దీంతో నేను తియ్యాలనుకున్న పరిశోధనాత్మక చిత్రం వెనక్కిపోయి..మరో సినిమా రూపుకట్టటం మొదలైంది. ఇక వారి వ్యక్తిగత, కుటుంబ జీవితాల మీదే ఎక్కువగా దృష్టిపెట్టి, వారి మధ్యన పెనవేసుకున్న కుటుంబ బంధాల విశ్లేషణకు ప్రాధాన్యం ఇద్దామనుకున్నాను. ఇదే కీలకమైన మలుపు. వాళ్లు పెంచుకుంటున్న కూతురితో తనకున్న అనుబంధం తనకెంతో ప్రత్యేకమైనదనీ, పాపాలాల్ తాను సాగిస్తున్న అసాధారణ పోరాటానికి కావాల్సినంతటి శక్తిని అతను ఈ అనుబంధం నుంచే ప్రోదిచేసుకుంటున్నాడని అర్థమైంది. అతని పోరాటం చిన్నదేం కాదు – హిందువులు, ముస్లింలు, మొత్తం చుట్టుపక్కల వాళ్లందరితోనూ సాగుతున్న యుద్ధానికి కావాల్సినంతటి శక్తి ఈ బంధం నుంచే ప్రవహిస్తోంది. ఈ గ్రహింపు తర్వాతే రూపుకట్టిందే ఆ సినిమా! దీనివల్ల అది చివరికి ఆత్మీయానుబంధాల సినిమాగా రూపుదిద్దుకుంది.

మీకు లభించిన సమాచారాన్ని ఎలా ఉపయోగించుకో గలిగారు?

**శ్రవణ్ కటికనేని :** పాపాలాల్ ఇంటికి వెళ్లినప్పుడు చూస్తే వాళ్లింట్లో టి.వి చాలా చిత్రమైన ప్రదేశంలో పెట్టి ఉండటం నన్ను ఆకట్టుకుంది. సాధారణంగా ఎవరింట్లోనైనా టి.విని కంటికి సౌకర్యవంతంగా ఉండేలా ఒక ఎత్తులోనో, కొద్దిగా పైనో పెడతారుగానీ...వాళ్లింట్లో మాత్రం చాలా పై ఎత్తున పెట్టారు. ఒకరోజు పాపాలాల్ ఇంట్లో బెడ్ మీద పడుకుని టి.విలో తన ఇంటర్వ్యూ తాను చూసుకుంటుంటే ఏమనిపించిందో చెబుతున్నాడు. ఆ చెప్పే తీరు చూస్తే. తానొక హీరో అయినట్లుగా, తనలో తాను ఒక హీరోను చూసుకున్నాడన్న భావన కలిగింది నాకు. దీనికి మీడియా మొత్తం తనను అలాగే చూపిస్తుండటం ఒక కారణమైతే రెండోది – ఇంట్లో టి.విని ఇలా ఎత్తున పెట్టుకుని, తనూ, తన కుటుంబం, తమ చుట్టుపక్కల వాళ్లంతా తనను టి.విలో మొట్టమొదటి సారిగా చూడటం, ఆ అనుభూతి కూడా కీలకమని చెప్పుకోవాలి. టి.వి అనేది (ముఖ్యంగా టి.వి వార్తలు) అతని జీవితంలో అంతటి ప్రబలమైన పాత్ర పోషించింది. కాబట్టి దీన్ని సినిమాలో కూడా ఉపయోగించుకోవాలని నిర్ణయానికి వచ్చా. అందుకే ఈ సినిమాలోకి టెలివిజన్ అన్నది ఒక కీలకమైన అంశంగా ప్రవేశించింది. తరచుగా కనబడటమే కాదు, అతని కథని అదే చెబుతుండటంతో పాటు అతను చెబుతున్న స్వీయ కథనానికి బలాన్ని కూడా జోడించింది. అతను తన అనుభవాల గురించి వివరిస్తున్న ప్రతిసారీ, కథనాన్ని ముందుకు నడిపించేందుకు నేను టివిని సాయంగా తీసుకుని, దాన్ని బలంగా వాడుకున్నాను. అది తరచూ తెర మీదికి వస్తూ, పోతుంటుంది.. కథనం ముందుకు సాగుతుంది!

ఒక కథనం కోసం నేను ప్రత్యేకంగా 'హైదరాబాద్ దెక్కన్' అనే ఛానెల్‌నే సృష్టించాను. ఎందుకంటే ఒరిజినల్ వీడియోలను వాడుకునేందుకు చాలా ఛానెల్లు నాకు అనుమతి ఇవ్వలేదు. అందుకని కొంత నాటకీకరించాల్సి వచ్చింది. వాస్తవంగా వార్తా కథనాల్లో ఏముందో అదే విషయాన్ని నేను నటులతో చెప్పించాను. ఇలా దాన్ని 'రిక్రియేట్' చెయ్యటం వల్ల సినిమాను వార్తా కథన పద్ధతిలో నడిపించే వెసులుబాటు లభించింది. తెరవెనక ఉండి సినిమా తీస్తుండటంతో పాటు నేను సినిమాలో కూడా జర్నలిస్టుగా, న్యూస్ రిపోర్టర్‌గా నటించాను. అతని ఇంట్లో నేను తీసుకున్న వీడియోలను నేపథ్యంలో చూపిస్తూ, కథనాన్ని ముందుకు నడిపించాను. అలాగే మానవ హక్కుల కమిషన్ ప్రతినిధులుగా సినిమాలో కనిపించిన వాళ్లు కూడా నిజంగా వచ్చిన వాళ్లు కాదు. అందుకే తెర మీద వాళ్ల పేర్లు ఇవ్వలేదు. కానీ మీరు ఆన్‌లైన్లో ఉన్న ఒరిజినల్ వీడియోలను చూస్తే ఆ వివరాలూ స్పష్టంగా ఉంటాయి. సమాచారాన్ని ప్రేక్షకులకు చెప్పేందుకు నేను వాళ్లను ఉపయోగించుకున్నాను. ఇలా చెయ్యటం మంచి ఫలితాన్నిచ్చిందనే అనుకుంటున్నా. ఎందుకంటే సినిమా చూస్తున్నప్పుడు మీరు ఆ మాట్లాడుతున్నది నిజంగా ఆ వ్యక్తేనా? కాదా? అన్నదేం పట్టించుకోరు. అసలా విషయానికి ప్రాధాన్యమే ఇవ్వరు. న్యూస్‌లో కనబడుతోంది కాబట్టి దాన్ని నమ్మేస్తారు!

– – –

కాళోజీ మీద మీ సినిమా ఎప్పుడు, ఎలా మొదలైంది?

**ఎస్.అమర్‌నాథ్ :** కాళోజీ శతజయంతి సందర్భంగా టివీ ఛానెళ్లకు ఇచ్చేందుకు మనకు అందుబాటులో ఉన్న వీడియోలతో ఏదైనా చేస్తావా? అంటూ కాళోజీ ఫౌండేషన్ తరఫున ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు నన్ను సంప్రదించారు. ఫౌండేషన్ అప్పటికే కాళోజీ గురించి దాదాపు పదేళ్లుగా రకరకాల సమాచారాన్ని సేకరిస్తోంది. కానీ వాస్తవంలో కాళోజీకి సంబంధించిన ఆడియో–వీడియో సమాచారమేదీ పెద్దగా ఎవరికీ అందుబాటులో (పబ్లిక్ డొమైన్‌లో) లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా కాళోజీ ఎలా ఉండేవారు, ఆయన మాట్లాడేవి, ఉపన్యాసం ఇచ్చేవి, నడిచేవి.. ఇలాంటివన్నీ తీసుకుని,

ఆసక్తికరంగా ఉండేలా 30 సెకన్లు లేదా ఒక నిమిషం బిట్స్ రూపొందించాలనీ, దాన్ని వివిధ ప్రోగ్రాముల మధ్యలో ప్రసారం చేసేందుకు ఛానల్స్‌కు ఇవ్వాలన్నది మా తొలి ఆలోచన. కానీ ఆ సమాచారాన్నంతా చూసిన తర్వాత నా ఆలోచన మారిపోయింది. కాళోజీ మీద ఒక ఆసక్తికరమైన చిత్రమే రూపొందిద్దామని, దాన్ని కేవలం కాళోజీ జీవితాన్ని ఘనంగా చూపించటానికే మొత్తం పూర్తయిన తర్వాత నిడివి చూస్తే గంటకు పైగానే వచ్చింది.

దీని రూపకల్పన కోసం మీకు అందుబాటులో ఉన్న, మీరు ఉపయోగించుకున్న ముడి సమాచారం, మెటీరియల్స్ ఏమిటి?

**ఎస్.అమర్‌నాథ్ :** ప్రధానంగా నాకు నాలుగు రకాల మెటీరియల్స్ దొరికాయి. మొదటిది కాళోజీని రచయిత, పరిశోధకుడు, జల సంరక్షణ ఉద్యమకారుడు డా॥గుజ్జా భిక్షం చేసిన ఇంటర్వ్యూ. ఇది 1993 నాటిది. సాధారణంగా కాళోజీ స్థాయి వ్యక్తులను ఆకాశానికి ఎత్తుతూ దేవుడిలానో, దైవాంశగల వారిగానో చూపించే ప్రయత్నం చేస్తుంటారు. కానీ దీన్లో భిక్షం ఆ పని ఎక్కడా చెయ్యలేదు. చాలా కష్టపడి, ఇబ్బందికరమైన, కాస్త ఇరుకునబెట్టే ప్రశ్నలు కూడా అడిగి–కాళోజీని ఒక 'మనిషి'గా, సమగ్ర వ్యక్తిగా మన ముందు నిలబెడతాడు. ఇలా ఎందుకు చేసిందీ ఫౌండేషన్ ప్రచురించిన ఒక పుస్తకంలోనే వివరంగా ప్రస్తావించాడు భిక్షం. ఆయనకి లేనిపోని అంశాలూ ఆపాదించకుండా – ఆయనతో సూటిగా, స్వేచ్ఛగా మాట్లాడుతూ, ఒక వ్యక్తిగా అసలుసిసలైన కాళోజీ ఎవరో, ఆయనేమిటో ప్రేక్షకులకు రూపుకట్టించటమే తన లక్ష్యమని వివరించాడు. ఇది నన్నెంతగా హత్తుకుందంటే నేను దాదాపుగా ఈ ఇంటర్వ్యూతో మమేకమైపోయాను. ఈ డాక్యుమెంటరీని రూపొందించే క్రమంలో ఈ ఇంటర్వ్యూతో గాఢమైన అనుబంధాన్ని పెంచుకున్నాను.

ఇక రెండోది – కాళోజీ సతీమణి రుక్మిణీ బాయి, మనుమడు సంతోష్‌లను పాత్రికేయుడు పున్నా కృష్ణమూర్తి చేసిన ఇంటర్వ్యూ. కాళోజీ జీవితం ఎలా సాగిందో, ఆయన జీవనశైలి ఏమిటో అవగాహన కోసం – కాళోజీ మరణానంతరం 2003 ప్రాంతంలో ఫౌండేషన్ ఈ ఇంటర్వ్యూలు చేసే బాధ్యతను పున్నా కృష్ణమూర్తికి అప్పగించింది. రుక్మిణీబాయి ద్వారా, ఆమె సాన్నిహిత్య దృక్కోణం నుంచి కాళోజీ వ్యక్తిత్వాన్నీ, జీవిత విశేషాలనూ రాబట్టే లక్ష్యంతో సాగందీ ఇంటర్వ్యూ. దీన్నే నేను రెండు ఇంటర్వ్యూల మధ్యా అనుసంధానంగా, వాటిని కలిపే అంతస్సూత్ర సంభాషణంగా వాడుకున్నాను.

మూడోది – కాళోజీ జీవిత విశేషాలను సందేశాత్మకంగా చూపిస్తూ 'ప్రజాకవి కాళోజీ' పేరుతో ప్రేమ్‌జీ రూపొందించిన సినిమా. నాకు తెలిసినంత వరకూ ఇది 1990ల నాటి దూరదర్శన్ చిత్రం అయ్యుండొచ్చు. ఇక నాలుగోది కాళోజీ ప్రతిష్ఠాత్మక రచన 'నా గొడవ' ఆవిష్కరణ సందర్భంగా తీసిన వీహెచ్‌ఎస్ వీడియో టేపు. ఆ పుస్తకావిష్కరణ చేసింది మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు. ఇందులో ఆయన ప్రసంగాన్ని వింటుంటే కాళోజీ ముందర ఆయనో విద్యార్థిలా, శిష్యుడిలా ఒద్దికగా కనబడతాడు. నా దగ్గర ప్రధానంగా ఉన్నవి రెండూ ఇంటర్వ్యూలే కాబట్టి ఎప్పుడూ ఆ మాట్లాడే ముఖాలనే చూపించకుండా వైవిధ్యం కోసం మధ్యమధ్యలో వీటిని ఒదుపుగా అల్లుకున్నాను. అలాగే చిత్రం ఆరంభంలో కాళోజీని ప్రముఖుడిగా, గొప్ప పేరున్న మేధావిగా పై ఎత్తున చూపించేందుకు కూడా ఇవి సాయపడ్డాయి. అయితే సినిమా ముందుకు పోతున్న కొద్దీ క్రమేపీ ఈ భావనను తనకు తానే వినిర్మాణం చేసుకుంటూ, ఈ ముద్రలకు దూరం జరుగుతూ, నిండైన కాళోజీని ఆవిష్కరిస్తూ పోతుంది.

మీకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని, మెటీరియల్‌ను ఎలా వాడుకున్నారు?

**ఎస్.అమర్‌నాథ్ :** నాకు లభించినది అందంగా, అద్భుతంగా చిత్రీకరించిన మెటీరియల్ కాదు. నేనే గనక వాటిని తీసి ఉంటే అలా తీసేవాడిని కాదు. కానీ అది నేను తీసింది కాకపోవటం, అయినా దాన్ని నేను వాడుతుండటంలో నాకు కొంత సౌలభ్యం, వెసులుబాటు కూడా దక్కాయి. మామూలుగా అయితే ఒక కాన్సెప్ట్ అనుకున్న దగ్గరి నుంచీ దానికి తగ్గట్టుగా దేన్నెలా చూపించాలో నిర్ణయించుకోవటం, ఆ ఎంపికకు తగ్గట్టుగానే స్క్రిప్టు రాసుకోవటం, దీనికి కావల్సినవన్నీ సేకరించుకోవటం, చిత్రీకరించటం, చివరికి అవన్నీ ఎడిటింగ్ టేబుల్ దగ్గర తీసుకురావటం.. ఈ ప్రయాణమంతా కూడా కొంత బరువు బాధ్యతలతో సాగుతుంటుంది. కానీ దీని విషయానికి వచ్చేసరికి, మనకు మరో మార్గమేదీ లేదు, ఉన్నవే వాడుకోవాలి. ఈ రూపేణా ఎంచుకోవటమనే భారం తప్పింది కాబట్టి దీనిలో కొంత స్వేచ్ఛ కూడా ఉంది.

అందుబాటులో ఉన్నవన్నీ వేర్వేరు ఫార్మాట్‌లలో చిత్రీకరించిన వీడియోలు. వీటి తర్వాత చాలా చాలా మార్పులొచ్చేశాయి. వీటన్నింటిలో రుక్మిణీబాయి ఇంటర్వ్యూ కాస్త మెరుగ్గా ఉంది. మినీ–డీవీలో తీసింది కాబట్టి స్పష్టత కూడా బాగుంది. భిక్షం తీసిందేమో హెచ్‌ఐ–8లో. ఒక ప్రేమ్‌జీ సినిమా, పి.వి.నరసింహారావు ఉపన్యాసాలు రెండూ వీహెచ్‌ఎస్‌లో ఉన్నాయి. కాబట్టి నేను మూడు రకాల మెటీరియల్స్‌ను వాడుకోవాల్సి ఉంది, ఇవన్నీ వేర్వేరు సమయాల్లో తీసినవి. వీటి మధ్య కాలంలో చాలా అంతరం ఉంది. నా దృష్టిలో నేను చేస్తున్నది వేర్వేరు సమయాల్లో, భిన్న సందర్భాల్లోని వ్యక్తుల మధ్య ఒక సంభాషణను సృష్టించటం! కాలావధులను కనుమరుగుచేసి, వారిని ఒక వేదిక మీదకు తెచ్చే అనుసంధానంగా నిలవటం! ఎందుకంటే కాళోజీ 20 ఏళ్ల కిందట, రుక్మిణి దాదాపు పదేళ్ల క్రితం వాళ్లు. ఇక మూడోది మనం. ఇప్పుడు, ఈ సమయంలో ఇక్కడ కూర్చుని చూస్తుండటమే కాదు, వారితో ఆ సంభాషణలో మనమూ అంతర్భాగమవుతున్నాం. ఈ భిన్నకాలాల మధ్య దూరాలను చెరపటం, ముగ్గురినీ ఒక దగ్గర చేర్చటం.. ఇదే నా పనిగా, నా ముందున్న సవాల్‌గా భావించాను.

చాలా మంది పాతకాలపు ఫార్మాట్‌లలో ఉండేవేవీ అంత బాగుండవనీ, నాణ్యత విషయంలో కాలం చెల్లిపోయిన వాటిని ఇంకే మాత్రం వాడలేమని భావిస్తుంటారు. అందుకే డిజిటైజ్ చెయ్యటం, దృశ్యాల క్లీనింగ్ వంటివన్నీ జరుగుతున్నాయి. కానీ నేను మాత్రం దీనికి పూర్తి భిన్నమైన బాట ఎంచుకున్నాను. ఆ ఫార్మాట్‌లలో, ఆ దృశ్యాలు.. చూడటానికి కొంత నాసిరకంగా అనిపించొచ్చు గానీ వాటిలో ఉండే ఆ పాతదనపు సౌందర్యాన్నీ, గడిచిన కాలం తాలూకూ కళాత్మకతనూ, ఆ అవకాశాన్నీ గుర్తించటం అవసరమని భావించాను. భిక్షం చిత్రీకరించినది టీవీ–సినిమా కెమేరా సిబ్బంది తీసినంతటి నైపుణ్యంగా అనిపించకపోవచ్చు. కానీ దాన్ని కాళోజీకి అత్యంత సన్నిహితంగా వెళ్లి, ఆత్మీయంగా చేసిన కృషిగా చూడటానికి ఇష్టపడతాను. అదొక వ్యక్తిగతమైన కృషి. ఆ స్థానంలో మీరు, నేను..ఎవరైనా ఉండొచ్చు. వేరే వాళ్ళతో మాట్లాడుతూ మాట్లాడుతూనే మనం జేబులోంచి సెల్‌ఫోన్ తీసి దాన్ని రికార్డు చేసినంతటి సహజంగా ఉంటుందది. అందుకే భిక్షంను నేను చిత్రంలో కూడా కనబడేలా చూశాను. మీరు సినిమా చూస్తే ఒకచోట తను కెమేరా సర్దుకుంటూ బ్లూ ఫ్రేమ్‌లో కనబడతాడు, దాన్ని మా సినిమాలో అలాగే ఉంచేశాను. నిజానికి ఈ బ్లూ ఫ్రేమ్ గురించి మా ఎడిటర్‌తోనూ, నిర్మాతతోనూ కూడా కొంత కొట్లాడాల్సి వచ్చింది. ప్రేక్షకులు అది పొరపాటున వచ్చేసిందనుకునే ప్రమాదం ఉందనీ, దాన్ని తొలగించాల్సిందేననీ వాళ్లిద్దరూ పట్టుబట్టారు. అయినా నేను మాత్రం చాలా స్పష్టంగా ఉన్నాను. భిక్షం ఇంటర్వ్యూకున్న విస్తృతి, విలువ ఏమిటో ప్రేక్షకులకు తెలియజెయ్యటంతో పాటు పాతకాలపు ఫార్మాట్‌కు నాదైన చిన్న ప్రశంసాపూర్వక నివాళిగా కూడా దాన్నలా ఉంచేశాను!

**అనువాదం :ఏ.వెంకట్**

రచయిత ఇండియన్ ఫౌండేషన్ ఫర్ ద ఆర్ట్స్‌లో ఆర్కైవల్ ఫెలో 2014–15





# ANVESHI

Contemporary
Politics
Broadsheet

# the media


Khel Khata
typical caption
local advertising
flowing hair, flaming eyes,
self-congratulatory
women have a secret weapon
open and vocal
on the same page
inspired neo-literate women
first and foremost
flowing hair, flaming eyes.
may indeed be
films
so called w
and abroad too
difficult to trace
not until mid-day
Chronicle
occasional reader
slay the demon
may indeed be true
largest circulating
back to power
free of cost
district tabloid
lovers gone insane
sister concerns
page make-up
sugar factory
well-known fact
FILM ARCHIVES
Anveshi
No signal
PRESS
Anveshi
LIBRARY AND ARCHIVES